UNIVERSAL LIBRARY
OU_204605
UNIVERSAL LIBRARY

# మధుర

శ్రీ వేంకట కాళిదాస కవులు
(ఆంధ్రగీర్వాణ సాహిత్య సమ్మేళనము)
విజయనగరము.

పబ్లిషర్సు
కొండుపల్లి వీరవెంకయ్యా అండ్ సన్సు,
శ్రీ సత్యనారాయణ బుక్ డిపో,
రాజమండ్రి.
1948

సర్వస్వామ్యసంకలితము] [వెల రు ౧—౮—౦

Dedicated to

Mr V. V Sangameswara Rao B A B Ed

As a Token of

Respect and Love

By

The Authors

# ఉపక్రమణిక

అది పూర్ణిమా నిశీథము. చంద్రుఁడు నడియాకసమున బూర్ణముగ వెలుగొందుచుండెను. చుక్కలు తమ మనోహరునకు మెల్లఁగ కనుసైగల జేయుచుండెను. నిర్మలాకాశంబున నొకమబ్బుతునుకయైనఁ గానరాలేదు. మందమరుత్కిశోరములు చల్లఁగ నెల్లెడ వీవఁదొడఁగెను. ప్రకృతికాంతాతిలకంబు నాఁడు తన వైభవం బంతయుఁ గనఁబఱచుచున్నట్లు లా వెన్నెలరాత్రి చెన్నుమీఱెను.

అట్టియెడ గోపాలపురమునుండి యానందపురమునకు బోవు రాచబాట ననుసరించి యొక యువకుఁడు పోవుచుండెను. అతఁడు మెల్ల మెల్లన నడుగులు వైచుచు, నడుమ నడుమ నేయెండుటాకు పాటునకో కలిగిన చిన్నగలగల మనుశబ్దంబున కించుక త్రుళ్ళిపడి చూచుచు నంతలో ధైర్య మవలంబించుచు, నేఁగుచుండెను. అట్లతఁడు కొంతదూర మరుగుసరికి క్రైస్తవప్రార్థనా మందిరమున(Church) గంటలు కొట్టిన చప్పుడు వినఁబడియె. అతఁడు కొంచెపడుగు నిలువబడి గంటల లెక్కించి పండ్రెండని తెలిసికొనియెను. అటుపై నాతఁడు త్వరగా నడుగులు వైవ మొదలిడియెను. రమారమి నూఱుగజముల దూర మరిగిన పై నతఁడు తన యెడమచేతివైపుగా మరలవలసివచ్చినది. అచ్చట దారి కిరువంకల దట్టముగఁ బెరిగినవృక్షములు కలవు. అట్టిచోట నెట్టివానికైనను బెదరు పుట్టకమానదు. మన బాటసారి గుండెనిబ్బరము గల్గినవాఁడు కావున—మఱియు నాతఁ డేదియో కార్యమును నిర్విఘ్నముగఁ గొనసాగింపఁ బోవుచున్న వానివలె నుండెను కావున నెటులైన పదములను సాహసముతో ముందు

నకు వైచుచుండెగాని యంతలోననే యాతఁడు త్రుళ్ళిపడుచుండెను. దేహమున గగుర్పాటు స్పష్టముగ గానవచ్చుచుండెను.

యువకునకు రమారమి యిర్వది గజములదూరములో నొక శుద్ధశ్వేతవస్త్ర సమాచ్ఛాదితవ్యక్తి గోచరించెను. ఆవ్యక్తియు నీతనివైపునకే వచ్చుచున్నట్లులుండెను. నిమిషమాత్రము నిస్తబ్ధుఁడై యువకుఁడు నిలిచిపోయెను, కాని మరల నడుగుల నాగింప మొదలిడెను. అంతకంతకు నావ్యక్తియు నీతఁడు నొకరినొకరు సమీపించిరి. ఒకరినొకరు కన్నెత్తి చూచుటయైన జరుగలేదు. యువకుఁడు బితుకు బితుకులాడుచున్న ప్రాణముల బిగఁబట్టినవానివలె నిశ్శబ్దముగ నడచుచుండెను. అతనినీడనే యాతడు చూచి రెండుమూఁడుమారులు భయపడెను. మరల నెక్కడలేని ధైర్యమును దెచ్చిపెట్టుకొని, తనవలెనే యెవరో మార్గస్థులకునైన వెఱచితినని తాబోలు సిగ్గుపడినవానివలె, తలవంచి నడువ మొదలిడియెను.

యువకుఁడు వెనుకకొకపరియైనఁ దలత్రిప్పుటకునైన సాహసింపలేదు. తలఁపుదొంతరలు తరంగములవలె వానిపై గుంపుగుంపులై చనుదెంచుచుండ నతఁ డూహాప్రపంచమున హాయిగ గంతులు వైచుచు బూర్వపుసంగతి నంతయు మఱచియుండెను. ఒక్కనిముసములో నాతఁడు యథాస్థితిలోనుండెను పదినిమేషములు మెల్లగఁ గడచిపోయినవి. అంతలో నాతని భుజముపై మృదువగునొకకరముంచబడెనని యాతడు తెలిసికొనియెను. యువకుడు నిలువున నీరయిపోయినట్లుండెను. మొండిధైర్యముతో నాతఁడు వెనుదిరిగి చూచెను.

తన కొకపావుగంట ముం దెదురైన యాశ్వేతవస్త్ర సమాచ్ఛాదితవ్యక్తి నాత డట్టయెదుట గన్గొనెను.

ఆవ్యక్తి పూర్ణముగా ముసుగు వైచికొని యున్నది. పైకి గనఁబడుచునున్నకరపల్లవ మవలోకించిన నామె బంగారుబొమ్మ

యని యంగీకరింపక తప్పదు. ఆమెముఖ మించుకయో కనఁబడునట్లు లామెముసుఁగు చేతఁ బట్టికొని యుండెను. కొంతవఱకు భయముచేఁ గొట్టుకొనుచున్నట్టుల ఘూర్ణిల్లుగా నొకనిముసము గడచెను.

"అయ్యా! నేనొకయనాథను. నన్నుఁ గొందఱు దుర్మార్గులు బంధింపఁ బ్రయత్నించుచుండిరి. నేను వారిచేఁ జిక్కకుండ నియర్ధరాత్రంబునం బాఱివచ్చితిని. నన్నెట్లైన వారినుండి రక్షించి పుణ్యముఁ గట్టుకొను" అని యామె దీనముగా నతనిపై శోకదీర్ఘదృష్టి మాలిక విసరి పల్కెను.

ఇప్పటికి యువకునకుభారము తీరినట్లైనది. ఎట్లైన నామెను దొంగలబారినుండి రక్షింప నాతని కొకవిధమగు నాసక్తి కల్గెను.

"నేనేమి చేయవలయును?"

"ఏమియు నక్కఱలేదు? గోపాలపురమునకుఁ బోవు బాటలో విడిచినఁ జాలును. అక్కడనుండి నాస్నేహితురాలగృహమునకేఁగెదను"

"ఎవరు వారు?"

"క్షమింపవలయును. చెప్పవీలు లేదు—మనము త్వరగాఁ బోవలయును. లేకున్న నాప్రాణములు సున్న."

ఆక్షణము యువకుఁడు ముందునకు నడువఁబూనెను. ఆయువతియు వాని ననుసరించి, మాటిమాటికి వెనుదిరిగిచూచుచు, నేదైన శబ్దమైన దిక్కులఁ గలయఁబరికించుచు, యువకుని మరలమరల హెచ్చరించుచు నడచుచుండెను. యువకుఁడు నామెకు ధైర్యముఁ జెప్పుచు, తనప్రాణ మొసఁగియైన నామెప్రాణములఁ గాపాడుదు ననియు నామెకుఁ జెప్పుచుఁ బోవుచుండెను.

వారుదారి మరలుసరికి వారియదృష్టవశమున నాదారి నొక బండి పోవుచుండెను. తత్క్షణము యువకుఁడు బండి నాపుమని యామె నందుఁ దొలుత నెక్కించి తా నెక్కి రాచబాటకుఁ దోలుకొని పొమ్మ

నియెను. క్షణములో బండి శరవేగమున దొరలి పోవుచుండెను. అప్పటి కాయువతికిఁ బ్రాణములు కుదుట బడియెను. పదినిముసములలో బండి రాదారినడుమ నాఁగెను. ఇద్దఱును క్రిందికి దిగిపోయిరి బండివానిచేతిలో టంగున రూపాయి పడెను. వాఁడు సంతసము వెలిఁబుచ్చుచు దండ మొకటిపెట్టి మరలెను.

"మీమే లెన్నటికిని మఱవజాలను. నే నిఁకఁ ద్వరగాఁ బోవలయును." అనుచు నామె యువకునిపై సోగ కగాడ్కి నిగుడ్చి మరలెను. అతఁడట నొక్కనిముస మాఁగి యామె యొకసందులోనికిఁ బోవుట చూచి తనదారినిఁ బట్టి పోయెను.

ఆతఁ డిదివఱ కా శ్వేతవస్త్రధారిణినిఁ గాంచినచోటున కేతెంచుసరి కొంటిగంట యైనది. ఇంకను వానిమనస్సున నాయువతి యెవ్వతెయో కనుఁగొనఁదలంపు లెక్కువ యగుచుండెను. అట్టిచో వాని కెదురుగ నిద్దరు భీకరాకారు లగుపురుషులు పరుగు లిడుచు వచ్చుచుండిరి. వారతనిని సమీపించి యాఁగి "మీకెవ్వరైన యువతి, తెల్లనిబట్టలఁ గట్టకొన్నది యెదురైనదా?" యని ప్రశ్నించిరి. అతఁడు లేదనినంతనె వారు "తమ రెక్కడనుండి వచ్చుచుంటిరి." యనిరి. "గోపాలపురమునుండి" యని యాతఁడు జవాబిడియె. తోడనే వారు పరుగుపరుగునఁబోయి రామచంద్రపురమునకుఁ బోవు మార్గమునఁ బడిరి.

యువకుఁడు విజయసూచకముగఁ జిఱునవ్వు నవ్వి మరలఁ దనమార్గము ననుసరించెను.

# మధుర

## ప్రథమ ఖండము

### [ధవళాంబరి]

౧

వినయుఁడు బాలుఁడై యున్నప్పుడే జనకుని గోల్పోయెను. సతీశుని మరణానంతరమున వాని కుటుంబము జరుపుట చాల వఱకుఁ గష్టముగానే యుండెను. కుటుంబ మంతయు ముగ్గురు, సతీశుని భార్య సుగుణ, కొమరుఁడు వినయుఁడు, కూఁతురు ప్రమద. ఇంటఁ బంటి వెంట లేనందున నెట్లో కాలక్షేపము జరుగుచుండెను.

ఐదుసంవత్సరము లెట్లో గడచినవి. ఇప్పుడు వినయున కిరువది సంవత్సరములు నిండినవి. జననీసోదరీసంరక్షణాభార మంతయు వానిపైఁ బడినది. అతఁడు చిత్రలేఖనమందుఁ దక్క మఱిదేనియందును కృషి సల్పుటలేదు. వానివలె గోపాలపురమున మఱెవ్వరును చిత్రముల వ్రాయలేరు. నానాఁటికి వానియాసక్తితోఁ గూడ రచనాకౌశలము హెచ్చుచుండెను. కావున వానికి సాధారణముగా నిల్లు విడిచి పోవునలవాటు లేకుండెను. కాని యిప్పుడు సంసారచక్ర మెట్లు త్రిప్పవలయునో వానికిఁ దెలియదయ్యెను. ఉద్యోగమునకై యందునందుఁ బ్రయత్నముల నప్పుడప్పుడు చేయుచుండెఁ గాని విఫలమనోరథుఁ డగుచుండెను.

అన్నిప్రయత్నములు వ్యర్థమగుచుండుటఁ జూచి వినయుఁడు విసిగిపోవుచుండెను. ఎట్టకేల కాయూరిజమీందారగు నాగేంద్రుని

సమాజమున కితఁడు పోసమకట్టెను. జమీందారు మంచివాఁడు కాఁ డనియుఁ గ్రూరుఁ డనియు నతఁడు దొలుదొల్త మనసున జంకెఁగాని పోక తప్పినది కాదు. నాఁడు వినయుని యదృష్టవశమున జమీందారుఁడు మందిరముననే యుండెను. మందిరద్వారపాలకుఁడు కొంత లంచము పుచ్చుకొననిది విడువఁడని వానిని సంతోషపెట్టి మరి వినయుఁడు లోనికేఁగెను. జమీందారుఁ డున్నగదిఁ బ్రవేశించి, యాతఁ డన్యాలోచనాపరుఁడై యుండుట నెఱిఁగి ప్రక్కగా నిలువఁబడియుండెను. అంతలో నాగేంద్రుఁ డితనివైపు తనకర్కశతీక్ష్ణదృష్టిఁ బరపి యితఁడెవఁడు నమస్కరించెనఁ దిన్నఁగ నందికొనకయే వినయుని నఖశిఖపర్యంతముఁ దిలకింప మొదలిడెను. వినయుఁడును నట్లు తెప్పవాల్పక వానినిఁ జూచుచుఁ బెద్దవారికడఁ దిరిగియుండనివాఁ డగుటచే దా నేమి మాటలాడవలయునో యని యాలోచించుచు విగ్రహము పోల్కె నుండెను,

నాగేంద్రుఁడు చామనచాయవాఁడు. కోరమీసములు వాని ముఖమును మరింత భయంకరముగఁ జేయుచున్నట్లున్నవి. కన్నులెఱుపు. దృష్టి నిశితము. ఆతఁడు పొట్టిగ నుండును. వయసిరువది యైదుసంవత్సరములకు మించి యుండదు. మొత్తముమీఁద నతఁ డంత సుందరుఁడు కాఁడని వినయుఁడు గ్రహింపఁగలిగెను,

నాలుగైదునిమిషములవఱ కెవ్వరును మాటలాడుట లేదు. వినయుఁ డేదియో చెప్పుటకు ధైర్యము చిక్కఁబట్టునరికి జమీందారుఁడే సంభాషణ మారంభించెను.

"నీవేనా ఉద్యోగమునకై ప్రయత్నించుచుంటివి?"

"చిత్తము! నేనే"

"నీపే రేమి?"

"వినయుఁడు"

"సరే! నీదస్తూరీ యెటులుండునో చూడనిమ్ము!"

వినయుఁడు వెంటనే యొక కాగితముపై వ్రాసి వానిచేతి కందిచ్చెను. ఒకనిమేష మూరకుండి జమీందారుడు "ఆఁ! బాగుగనే యున్నది. నీవు మాయుత్తరముల వ్రాయుచుండవలయును. మధ్యాహ్నసమయములఁ బుస్తకరణ మొనర్పవలెను. నెలకుఁ బాతిక రూప్యము లొసంగెదము" అని యిష్టమేనా యనుప్రశ్నాసూచకముగ వినయునివైపు దృష్టి నారించెను.

"చిత్తము" అని వినయుఁడు నమస్కార మొనర్చెను.

"రేపుప్రొద్దుటినుండి పనిలోఁ బ్రవేశింపు" మని నాగేంద్రుఁడు వల్కినంతనే వినయుఁడు గృహోన్ముఖుఁ డయ్యెను.

వినయునిహృదయము సంతోషాతిశయమునఁ దక్కటక్కు మని కొట్టుకొనుచుండెను. ఎంత వేగముగ నింటికిఁ జేరి యీశుభవర్తమానము జనని కెఱిఁగింతునా యను నాతఁడు తొందరతొందరగా నడుగులు వేయుచుండెను. ఎండతీక్ష్ణముగఁ గాయుచుండెను. ఇంటి కింకను దాను చాలదూరమున నుంటచే గమనము నెక్కువచేయుచుండెను. అతఁ డొకకోనేటియొడ్డున నడచుచుండ నక్కడ చల్లని గాలి వీచుచుటచేఁ గొంతవడి తగ్గించి యాకోనేటినీరుఁ గాంచుచుఁ జిత్రకారుఁ డగుటచే నది చిత్రించిన బాగుగ నుండునని కాఁబోలు మనమున నూహఁ జేయుచుండెను. కాని యంతలోనే వానిదృష్టుల కెవ్వరో యువకుఁడగు నొకపురుషుఁడు మునుఁగుచుఁ దేలుచున్నట్లు కన్పించెను. వాఁడు మధ్యమధ్యఁ గొట్టుకొనుచుండెను.

పాప మాయువకుఁడు నీటఁబడి మరణించుచుండె నని వాని నెట్లయిన రక్షింపవలయు నని వినయుఁడు తలంచెను. దారివెంబడి నెవ్వరు నప్పటికిఁ బోలేదు. అన్యసహాయము దొరకుట దుర్లభ మని వెంటనే వినయుఁడు నీటఁబడి యీఁదుకొనుచు నాయువకునికడకుఁ

బోయెను. తత్క్షణము వానిచేయి నొకటి తనచేతఁ బట్టుకొని యొడ్డునకుఁ లాగ మొదలిడెఁ గాని రెండుమూఁడుసారు లాతఁడు వీనిఁ బట్టుకొనఁ బ్రయత్నించుటచేఁ జేయి జారవిడిచి నదుముపై గాలువైచి యొడ్డునకు నెట్టివైచెను. ఎట్టులైన నేమి యువకుని నొడ్డునకుఁ దోడ్తెచ్చెను. కొంతవఱకు నాయువకుఁ డట్లు యుండి కొంతసేపునకుఁ దెప్పిరిలి లేచెను. ఇద్దఱును దడిబట్టలఁ దీసివైచి పిడిచికొనిరి. ఆయువకుని బలవంతపఱచి వినయుఁడు వానినిఁ దనగృహమునకుఁ దీసికొని పోయెను.

దారిలో, నాయువకుని నామధేయము విజయుఁ డని మన వినయుం డెఱిఁగెను. విజయునిగృహ మావీధిమొదటనే యుండెఁ గావునఁ దొలుత నాతఁడు వినయునిఁ దనగృహమునకుఁ దీసికొనిపోయి పొడిబట్టఁ గట్టనిచ్చెను. విజయుఁడు జననీజనకవిహీనుఁడు, కాని వానికి మంచి యాస్తికలదు. వానిసంరక్షణకుఁ బినతల్లి—భర్తృహీన—యుండెను. ఆమె విజయునివలన సంగతి నంతయుఁ దెలిసికొని వినయుని గౌరవించెను. అటుపై నాస్నేహితు లిద్దఱు వినయుని గృహమునకై చనిరి.

ఈక్రొత్తమిత్రునిఁ గూర్చి తనసోదరికి, జననికిఁ దెలియఁబఱచి నంతనే వారు విజయుని సగౌరవముగా నాసీనుఁ గావించిరి. తనయుఁడు దెచ్చినశుభవర్తమానము వినినంతనె సుగుణాప్రమదలసంతసమునకు మేర లేదు. ఆరోజున నానూత్నమిత్రు లిద్దఱుఁ గలిసి ఫలహారముఁ జేసిరి. అబలాసహజప్రశ్నల నెన్నియో సుగుణ తనయు నడిగినది. వాఁడును విసుఁగులేకుండ నన్నిటికిని జవాబిడి జననిని సంతోషపరచెను.

ప్రతిదినమున వినయవిజయులు ప్రకృతివైచిత్ర్య మరయ సాయంతనసమయముల నూరివెలుపలకుఁ బోవుచుండెడివారు. విన

యుఁడు ప్రొద్దుట ఎనిమిదిగంటలయపుడు జమీందారునిసముఖము నకుఁ బోయి మరలఁ బదిగంటలు కాకుండఁ దిరిగి వచ్చును. మధ్యాహ్న సమయమునమాత్రము మూఁడుగంటలకుఁ బోయి నైదు వేయుటకు మున్నే తిరిగి వచ్చును. వినయునకు పటములు వ్రాయుటకుఁ గూడఁ జాలవఱకవకాశముండెడిది.

మూఁడు వారములు గడచినవి. నాఁటిమధ్యాహ్నము వినయుఁడు కొంతవఱకు కాలస్యము చేసియుంటచేఁ బదముల వడివడి వైచుచుఁ బోవుచుండెను. అతడు జమీందారునిమందిరముఁ బ్రవేశించెను. నాల్గుగంటలు వినఁబడియెను. నాఁగేఁడ్రము డేనునునో యని వినయుఁడు జంకుచుండెను. జమీందారుఁ డేమియుఁ గోపపడలేదు.

“నాకీరోజునఁ గొంచెము చికాకుగా నున్నది. మరినేమియుఁ జదువవలదు. రాత్రికి నామిత్రు లొకరు విందునకు రమ్మని కబురంపిరి. నీవును నేనునుఁ బోవుదము. సరిగా నేనుసరయగుసరికి రమ్ము” అని జమీందారుఁడు వినయు నవలోకించి సహజకర్కశస్వరమునఁ బల్కెను.

“చిత్తము, అలాగుననే”

అని వినయుఁడు వినయపూర్వకముగ నమస్కారమిడి గృహాభిముఖుఁ డయ్యె. దారిలో విజయుఁ డెదురుపడెను. సంగతి దెలిసికొనిన తరువాత వినయునిఁగూడఁ దనతో రమ్మని విజయుఁడు బజారునకుఁ దిరిగెను. ఏవియో వింతవింతవస్తువుల నన్నిటిని విజయుఁడు కొనినపైనవారు మరల నింటివైపు దిరిగిరి. విజయుఁడు వినయుని గృహమున కంపకము బెట్టి పోయెను. వినయుఁడు తనజననితో దానారాత్రి యింటికడ భోజనము చేయనని చెప్పి, యింటికివచ్చుసరికి రాత్రియగుననియు జెప్పెను. సుగుణమాత్రము వానినిరాత్రి

కింటికి రావలదనియు జమీందారుని మందిరముననే పండుకొనుమని యు జాగ్రత్త చెప్పెను.

ఏడునరగంట లగునప్పటికి వినయుడు నాగేంద్రుని మందిరములో నికి బోయెను. పావుగంటవఱ కచ్చటనే యతడు కూరుచుండియుం డెను. అంతలో నాగేంద్రుడు వస్త్రధారణమొనర్చి ప్రవేశించెను. ఇద్దఱును గలిసి బండిపై నెక్కి విందునకు బోయిరి.

మరల వారు తిరిగి వచ్చునప్పటికి బదిగంటలైపోయినది. జమీం దారునిగదివఱకు దిగబెట్టుటకై వినయుడు కూడ వెనుకనేపోయెను. ఇంతలో నొకసేవకుడు దేతెంచి యొకకవరు జమీందారున కర్పించెను.

“ఇక నీవు పోవచ్చు” నని జమీందారుడు పల్కుచు దన గదిలోనికి బోయెను.

కారుచీకటి జగతినిండ గ్రమ్ముకొని యుండెను. అట్టిచో నేక తము గృహమునకు బోగూడదని వినయుడు భావించి నాటికక్కడ నే పండుకొనుట మంచిదని, యింతలో జననిమాటలు జ్ఞాపకమురా దప్పకుండ నచ్చటనే పండుకొన నిశ్చయించుకొనెను. వెంటనే యా తడు పోయి పుస్తకపఠనాగారము తెఱచియుంట గనుగొని యచ్చట గోడవారనున్న యొకబెంచీపై శయనించెను. ఏవియో ఆలోచన లపై నాలోచనలు వానిని గలతపెట్టుచుండ నాత డచ్చోట నేమా త్రము నిద్రబొందజాలకుండెను. పదునొకండునరగంటలు దాటిపోయి నవి. వినయు డింకను నావులించుచుండెను. అట్టియెడ నాగదితలు పెవ్వరో తెఱచినట్లయ్యెను. వినయునిగుండె గతుక్కుమనియెను.

నాగేంద్రుఁడు తొలుత నాగది ప్రవేశించెను. అతనివెన్కనే మరియొకస్త్రీ యేతెంచెను. వినయున కంతయునగమ్యగోచరముగ నుండెను. అంతకుముందొక క్రొవ్వువత్తిదీప మచట వెల్గుచుండెడిది,

కాని వీరు తలుపు తెఱచి లోనఁ బ్రవేశించినంతనే యదియునారిపోయె. అంతయు గాఢాంధకారమయము. వినయుఁడు కక్కుకిక్కుమనకుండ నూపిరినైన విడుచుటకు జంకుచుఁ జెవుల రిక్కించుకొని వినుచుండె. కొంతసేపటికి వారాసీనులయిరని యాతఁడు ధ్వనిఁబట్టి తెలిసికొనియెను, వినయుఁడు కుతూహలముతో నింకను వినుచుండఁగ దొలుత నాగేంద్రుని కర్కశస్వరము వినఁబడినది.

"ఏమలా! ఇంతరాత్రి వేళఁగాని నీకు రాఁదలఁపు లేదా? అంత యవసర మేమి కలిగినది?"

"నీయన్యాయప్రవర్తనముఁ దెలియఁబఱచుటకు! నీదుర్నీతి కార్యముల నింకనైన మానుమని చెప్పుటకు! నీదుర్మార్గపుఁబనుల కొక యంతమింకనైన బెట్టవా యని యడుగుటకు!"

అనుసన్ననికరినస్వరము వినయుని చెవులఁ బడియెను. అతని కేమియుఁ దెలిసినది కాదు. ఇయ్యాఁడుది ఎవర్తు? ఆమెకు నాగేంద్రునకుఁ గలసంబంధ మేమి? ఇప్పటియీనిశీథసంభాషణలోఁ గలయర్థ మేమియని వినయుఁడు దనలోఁ దావితర్కించుచుండ మరల సంభాషణ మారంభమైనది.

"నేను నీకేమి హాని యొనర్చితిని?"

"ఏమియా? ఏమియా? మరల సిగ్గులేక యడుగుచుంటివి. నాకుమాత్రైను నిష్కారణముగ నేడిపించుచుంటివి. ఆపెను పెండ్లియాడి యిప్పుడిల్లుచేయుదువా? పోనిమ్ము! నాకది యవసరము లేదు. కాని యామె నిపుడు చిక్కులువెట్ట నేమిటికి? నీరహస్య మామెకు గూడ నేనెఱుకపఱచితి నని నీకుఁ దెలియదు కాఁబోలు!—"

"ఆఁ! నినుఁగూడ హతమార్చెదను, మీరిద్దఱు నాకుగర్భశత్రువులు," అనుచు జమీందారుఁడు గప్పున లేచెను దీని నంతయు వినయుఁడు కనుఁగొనుచునే యుండెను, నాగేంద్రుఁ డేమియొనర్చునో

యని యాతఁ డాకారుచీకటిలోఁ గన్నులు కుట్టుకొని కనిపెట్టుచుండె, తనయెదుటి వారియాకారములు వానికి నీడలపోలిక గానుపించుచు నుండెను.

అటుల జమిందారుఁడు లేచి దేనినో వెదకుచున్నట్టు లుండి యుండి యామెమీఁదకు బోవుట వినయుఁడు కన్గొనెను, అంతలో నాస్త్రీనోటినుండి యొకచిన్న కేక వెల్వడుటయు వినయుఁడు మెఱపు వోలెపోయి తనయజమానుని రెండుచేతులఁ బట్టుకొనియె. ఆతఁడు నొక నిముసము తెల్లపోయిచూచి,

“ఎవరది?” యని గద్దించెను.

“నేను వినయుఁడ!” అనుజవాబు వినినంతనే నాగేంద్రుఁడు స్తంభాకృతిని నిలిచిపోయెను. వినయుఁ డాక్షణము దీపము వెలిగించెను. ఆస్త్రీ యక్కడ లేదు.

నాగేంద్రుఁడు తనగదిలోనికిఁ బోయి తలుపు గడివేసికొనెను. మరల వినయుడు శయనస్థానమునకు బోయెను. యజమానిప్రవర్తన మతని కింతయును గోచరము కాకుండెను, రాత్రిమెల్లగ గడచి పోయెను.

తెల్లవారుసరికి వినయుడు లేచి గృహమునకు బోనెంచెను. దారిలో జమీందారు గదిదగ్గఱ నిలువబడి వినయుని బిలిచి

“నీవిక నాయొద్ద బనిచేయ నక్కఱలేదు.”

అనుచు వినయునిచేతి కిర్వదియైదురూప్యముల నందిచ్చి

“ఇదిగో! నీకు నెలజీత మిచ్చుచుంటిని” అని తన గదితలుపు మూసివైచెను.

వినయుడు నిశ్చలుడై యొక్కింతసేపుండి తనవల్ల నేరము లేదని భావమున దలఁచుచు నింటికిఁ బోఁదొడగెను.

జగతి యంతయు గలకలారావములతో నిండియుండెను. ఇంకను బూర్తిగాఁ దెల్లవారలేదు, పురవీథులలో సందడులు దిరుగులాడుచుండిరి.

వినయుఁడట్లు యజమానియగు నాగేంద్రునిచే బంపివేయబడి, యానుభవార్తిఁ దల్లి దెల్లబోయెనా యని మనంబునఁ గలఁతఁ జెందుచు నొప్పుము పేరు రాత్రి జరిగిన సంగతి జననికి దెల్పవలయునా? లేక యూరకుండవలయునా? యని యనేక పరిపరివిధములఁ దలపోయఁదొడఁగె. కాని వాని యాలోచనా సాగరమున హస్త, అంతము గానరాదాయె. ఏమిచేయుటకు వానికిఁ దోచలేదు. ఏదియెట్లున్నను విజయుని యభిప్రాయము దీసికొని దానికి నిశ్చయించికొని యాతనిగృహమునకుఁ బోయెను.

విజయుఁడప్పుడే నిద్రలేచెను. ఇట్టియెడ వినయుఁడేతెంచుట కాతఁడు కారణ మూహింపలేక యేదియో విశేషముండవలయునని తలఁచెను.

"ఏమి? ఇంతప్రొద్దుననే వచ్చితివి!" అని సాశ్చర్యముగఁ బ్రశ్నించెను.

"ఒక విశేషము దెలియఁబఱచుటకు."

"అది నేను దొలుతనే యనుకొంటిని. లేకున్న నీవింతప్రొద్దుననే వచ్చుటకుఁ గారణమేమి యుండును? సరే! ఆవిశేష మేదియో నాకుఁగూడ దెలియఁబఱపుము. ఆనందించెదను"

"అది యేకాంతమునఁ జెప్పవలయును. పైవారికిఁ దెలియఁజేయుట నాకెంతమాత్ర మిష్టము లేదు"

వినయుని విజయుఁడు తనగదిలోనికిఁ దీసికొనిపోయి గూర్చుండఁ జేసి తానుకూడ వానిప్రక్కనే కూరుచుండె.

"చెప్పుము" అనియెను.

"నన్నుద్యోగమునుండి నాగేంద్రుఁడు తొలఁగఁజేసెను" అని వినయుఁడు చెప్పిన విజయుఁడు నిర్ఘాంతపడి,

"ఇదియా రహస్యము. నిన్నెందులకుఁ దొలఁగించెను?"

ఈ ప్రశ్న వచ్చునని వినయుఁడు తలచుచునే యుండెను. కొంత వఱకూరకుండి, రాత్రి జరిగిన దంతయుఁ బూసగ్రుచ్చినట్లులు వినయుఁడు మిత్రునకుఁ దెలియఁబఱచెను. విజయున కేమియునుగూడ నర్థము కాలేదు

"మీరాజసుతతోఁ జెప్పితివా యేమి?"

"ఏమో! నే నిప్పుడే మందిరమునుండి మరలి వచ్చుచుంటిని. నీయభిప్రాయముఁ దీసికొని యేమి చేయుటయో యాలోచింప నీకడకుఁ దొలుత వచ్చితిని. కాని నన్నుద్యోగమునుండి యాతఁ డేటికిఁ దప్పించెనో నాకింతయుఁ దెలియలేదు."

"నీవింకను నుద్యోగమున నున్నయెడల నీవాతనిరహస్యము లన్నియు నెట్లైనను నెఱుఁగుటకుఁ బ్రయత్నింతువు. ఇఁక నీమాటలంత ముంతయు నుండదుగదా! వాని యిచ్ఛానుసారముగ నతఁ డిటుపైఁ బ్రవర్తించును. కాని పరులకంటఁ బడఁడు—దానికేమిగాని యాస్త్రీ యెవ్వతె?"

"అది యేమోయాని కెంత తెలియునో నాకును సందియమే. ఆమెను నేఁ దిన్నఁగఁ జూడనైనలేదు. ఇంతలో నామె పాఱిపోయినది."

"హూఁ! ఏపోయిన దేదో పోయినది. దీనిని మఱెవ్వరికిఁ దెలియఁబఱుపకుము. సంగతి మనమే కనుఁగొనుటకుఁ బ్రయత్నములఁ గావింతము. మీ జననితో మఱి వానికి నాయవసరము లేదఁట. నాకు పూర్తిగా నెలజీత మిచ్చి పంపినాఁడని చెప్పుము. చాలును—అన్నింటను మెలఁచితిని. ఈరోజున నామిత్రుల కందఱకు విందొసఁగుచుంటిని. నీవుకూడ రావలయునుసుమా!"

"ఆలాగుననే వచ్చెదనులే! నే నింక గృహమునకుఁ బోయెదను. పిలుచుట కొకపరి మాయింటికి రమ్ము."

"నాకు మఱివచ్చుట కవకాశముండదు. నేను కొందఱుస్నేహితులకడకుఁ బోయి యింకను పిలువవలయును. నీవుమాత్రము సాయంతనము మూఁడుగంటలకు మాయింటికి రమ్ము."

సరే యని వినయుఁడు త్వరితగమనుఁడై తన గృహంబునకుఁ బోయెను. వినయుని రాకకై తల్లి, చెల్లెలు నెదురుచూచుచుండిరి.

"వినయా! ఇంత యాలస్య మేల చేసితివి? రాత్రి తిన్నగ నిద్ర పట్టినదా?" యను ప్రేమసూచకప్రశ్నములు సుశీల, వినయుఁ డేమనుచు కనుఁగొని, యెదురేగెను.

"ఏమియు లేదు! నాగేశ్వర విజయుని యింటికిఁ బోయి మాటలాడుచుంటిని. ఆలస్యమైనది."

అని తల్లికి దగ్గఱఁబడి పొట్లము నామె చేతికి, జమీందారుఁ డొసఁగిన పత్రము నందిచ్చెను.

"ఈసొమ్మెక్కడిది?"

"నాజీతపుసొమ్ము!"

"అప్పుడే జీతమేమి? ఇంకను నెల పండలేదే? ఇంతవేగ మిచ్చినవాఁడు. నీ వడిగితివా యేమి?"

"లేదు! కాని, యాతనికి మఱినాయవసరము లేదఁట! జీత మిచ్చివైచి పొమ్మనినాఁడు."

"మఱి యవసరమే లేదా?" యని పాప మాజనని నిరాశాపూరితయై వచించుచు గృహకృత్యములఁ దీర్చుటకునై లోనికి నడలెను. ఆ వెంటఁ బ్రమదకూడ చిన్నఁబుచ్చుకొన్న మొగముఁ బోయెను.

వినయునకు మరలఁ బెద్దభారము నెత్తిపైఁ బడినట్లయ్యెను

కాని వాని మనస్సులో నెవ్వరో గూఢముగ "నీవలన నేరములేదు. అధైర్య మూనకుము" అని చెప్పిన ట్లయ్యెను.

వినయున క్షేమియు బాలుపోక యుంటచ్చే నిక్క ముందు తానేమి చేయుట ? యని మాటిమాటికి దన్నుదానే ప్రశ్నించు కొనుచుండెను. చిన్నవాడే తన కింతటి చిక్కులు వచ్చిపడినవికదా యని యతడు [illegible] యెదలో చింతింపసాగెను. కాని యేమి చేయగలడు? మరల బనికై ప్రయత్నము లొనర్పవలయునుగదా! ఇదివరకు విశ్వప్రయత్నము జేయగా దొరకిన యుద్యోగ మీరీతిగా బరిణమించినది. ఛీ! యని యతడు విసుగుకొనుచు బల్కెను.

దివాకరుడు మెల్లమెల్లగ దన వేడిమి నంతయు దగ్గించు కొనుచుండెను. అప్పుడే మూడుగంటలు కొట్టిరి. వినయుడు విజయు నింటికి బో బయలుదేరెను. దారిలో గల జనులను, వారి యానం దాతిరేకమును గనుగొనిన యంత వినయునకు నూతనప్రపంచమున బడినట్లుల కనబడినది. క్షణములో వానిచింత తగ్గినది. మొగము కలకలలాడ మొదలిడెను.

వినయుడు విజయునిగృహమునకు బోవునప్పటికి నెవ్వరును రాలేదు. అప్పటికి సర్వప్రయత్నములు చేసికొనిన విజయుడు మిత్రుల నాహ్వానింప సిద్ధముగ నుండుచుండెను. విజయుడు చూపిన యాసనముపై నాసీనుడై వినయుడు,

"ఏమి యింకను దక్కుంగలవారు రాలేదా ? వారి నెప్పటికి రమ్మని చెప్పితివి?" యని ప్రశ్నించెను.

"వారును మూడున్నర యగుసరికి వచ్చెదరు. ఏదీ యందరు [illegible] సుతీము [illegible] రేణుకా [illegible]"

"ఎవరెవ్వరు?"

"హుం, నాకును బాగుగ దెలియదు. అందులో [illegible] మిత్రము తెలియును. ఆతడు [illegible] వచ్చెదనన్నాడు," [illegible]

"ఆఁ అపరాధపరిశోధకుఁడా! వాని పేరేమి?" యని వినయుఁ డాశ్చర్యసూచకస్వరమున నడిగెను.

"వాని పేరా? నరేంద్రుఁడు. ఆ వెంటఁ గలిసిన వారిద్దఱు వానిస్నేహితులని నే ననుకొనుచుంటిని. వారి నామములు నాకు దెలియవు."

"అయిన నీకును నరేంద్రునకును మైత్రి యెట్లు సంభవించినది? ఆతనిగృహ మెక్కడ?"

"నా మైత్రికి బెద్దకారణ మున్నది. ఆకథ యొకరియెడ జాల పెద్దది టూకీగాఁ జెప్పెదను. నా జనకుఁడు నరేంద్రునకుఁ జిన్నప్పుడు విద్యఁ గఱపుచుండెడివాఁడట. అప్పుడు నా తండ్రి ప్రస్తుతమువలెఁ బత్తేదారుగాఁ జేరి సంపాదించుచు జీవించెను. నా రాధనునితో చిన్నతన మందే గతించినది. జనకునకు మరణకాలము సమీపించునప్పుడు నన్ను నరేంద్రునకు నప్పగించి జాగ్రత్తగఁ జూడుమని కోరెను. అది మొదలు నన్నతఁడు సోదరునివలె జూచుచుండెను."

"సరేకాని యింతకుమును నీతనిగుఱించి నాకెప్పుడును నీవు చెప్పలేదేమి?"

"అతఁ డిన్నిదినములనుండి యూరిలో లేఁడు. కావున నేను నీ స్నేహమైన నాఁటినుండియు వానిమాటయే మఱచితిని. మొన్న కనబడినాఁడు, విందునకు బిలిచితిని."

ఇట్లు వారు మాటలాడుకొనుచుండఁగ నొక్క యడుగులచప్పుడు వినఁబడియెను. తమమిత్రు లేతెంచుచుండిరని వారాహ్లాదమున నే గ్రహించి స్వాగతం బిడ నిలువఁబడి యెదురుగఁ బోయి యమ్మిత్రులను గలిసికొనిరి. విజయుఁడు వారిని సగౌరవముగ లోనికి రావించి యాసీనులఁ గావించెను. అంత వారిలో మొదటివాని జూపుచు విజయుఁడు,

"ఇతఁడే నరేంద్రుఁడు" అని వినయునికిఁ జూపెను.

శచీంద్రుడు గంభీరవర్చస్సు గలిగినవాఁడు. మేనిచాయ బంగరురంగు. గడ్డము మీసమును తీయించివేసెను. సుందరమైన ముఖము కన్నులకాంతి చక్కనిది. ఒకచేతఁ బెత్తమును మఱొకచేత నానాటివార్తాపత్రికను ధరించియుండెను.

వినయునకుఁ దన్ను విజయుఁడు చూపఁగ శచీంద్రుఁడు

“ఇతఁడేనా వినయుఁడు” అని యడిగెను.

విజయ వినయు లిద్దఱు నాశ్చర్యముఁ జూపిరి. శచీంద్రునకు వినయుం డీతఁడని యెట్లు తెలిసినది? యని వారిలో వారనుకొనిరి. అంత విజయుఁడు,

“మీ కెట్లు తెలియును?” అని ప్రశ్నించెను

“ఆహా! నీ వావేళ బజారులో గనఁబడినప్పుడు నీ జేబులో నేదియో పుస్తకమున్నది దానిమీఁద నక్కడక్కడ వినయుఁడు అని వ్రాసియున్నట్లు కనబడినది. ఆపుస్తకము నన్ను వ్రాయువారు నీమిత్రులలో నెవ్వరో యైయుందురని నే తలచితిని. నేననుకొన్నది నిజమే” యని శచీంద్రుఁడు జవాబిడి విజయుని యాశ్చర్యము బోఁగొట్టెను.

“ఓహో! యిక్కడకుఁ జూపరిశోధకాగ్రేసరు లంతయు గనఁబడితిరి కాబోలు.” అని విజయుఁడు పక్కున జెప్పి పకపక నవ్వ మొదలిడెను.

మిత్రులందఱు ఫక్కున నవ్వుకొనిరి.

తరువాత మిత్రులందఱు విందు లారగింప దరికొనిరి. ఒక యరగంటలో భోజనము పూర్తియైనది మఱియొక పావుగంటవఱకు వారేదియో మాటలాడుకొనిరి. శచీంద్రు డింతలో నాసనము నుండి లేచి,

“మరల రేపు వచ్చెదములే” యని చెప్పి, వినయునివైపు చూచి యొక చిఱునవ్వు నవ్వి వీథిలోనికిఁ బోయెను. వాని వెంటఁ

దక్కుంగలవారుకూడ బోయిరి. మఱికొంతవఱ కచ్చట నేపియో ముచ్చటలాడికొనిరి.

మరల వినయుఁడు విజయుఁడు స్వగృహము నింటిలోనికి బోయి కూర్చుండిరి, శచీంద్రుఁడు వార్తాపత్రిక నచ్చట మఱచిపోయెనని తెలిసికొనిరి

"పాపము. నేను వానిని పిలిచి యిచ్చివేయుదు" నని విజయుఁడు పత్రిక దీసెను.

"ఉండుముండుము నాకు కొంచెము పనియున్న" దని వినయుఁ డద్దాని నందికొని పుటలు తిరుగవేయుట పూనెను. ఒకనిముసములో నాతఁడు చిఱునవ్వు నవ్వుచు విజయున కొకటి చూపించెను. అం దిట్లుండెను.

"ఒక మంచి చిత్రకారుఁడు (ఇరువురు యువకులకు చిత్రరచనాభ్యాసము చెప్పుటకు) కావలయును. ఇదివఱ కెవ్వరైనను నిట్టిదైన బని చేసియుండిన, వారినదనుండి వాని మంచిచెడువడినిగూర్చి యొకపత్రముఁ దేవలయును."

సురేంద్రనాథుఁడు. (ఆనందపురము)

"ఓహో! ఇంతులకాపత్రికనుంచుమంటివి. సరే! బాగుగనే యున్నది." అని విజయుఁడు పల్కెను.

"కానుకాని పత్రము నట్టుల తేగలను."

"గట్టిచిక్కే" యని విజయుఁడు కుర్చీలో జేరఁబడి యేదియో యాలోచించుచున్నట్లుండెను.

ఇంతలో శచీంద్రుఁడు ప్రవేశించి.

"వార్తాపత్రిక మఱచితిని. అందులకై తిరిగిరావలసివచ్చినది" యనుచు బత్రిక తీసుకొని మరల వినయవిజయు లాలోచనా సాగరమున గొట్టుకొన బడిపోయెను. కొంతవఱ కెవ్వరును మాటలాడుట లేదు. అంత విజయుఁడు.

''అది నేను చెప్పెదను ఉపాయము. ఈ భయంకర దురాలోచన లేకుండ పోవుటకు నాగేంద్రునే యడుగుము.'' అనియెను.

''అతడు చెప్పునా?''

''ఈ యుక్తిని నేనే చెప్పెదను — ఇప్పుడే పోయి యుద్ధము పానిమందిరమునకు బోదము పద. వాని రహస్యమును వెలడిచేసెద వని నైన నాతడు భయపడి తప్పక యిచ్చును'' అని విజయుడు నవ్వుచు లేచెను. వినయుడు కూడ లేచి,

''అతడిట్లు చేయునని పల్కెనా?'' యని

''సరే యిప్పటిమాట యేల? చింతమానుము! తరువాతకథ నడిపించు వాడు చూచినాడు. తొందర పడకు'' యని విజయుడు వినయుని హెచ్చరించెను.

వారిట్లు మాటలాడుకొనుచు మిద్దెమెట్లు దిగి బయటికి పోవుచుండిరి. ఇర్వది నిమిషములలో వారు నాగేంద్రుని మందిర ద్వారముకడ నిలువబడి యాతడుంట తెలిసికొని లోనికి ప్రవేశించుచుండిరి.

---

## 13

తొలినాటి సభయందు జరిగిన సంగతుల నన్నిటిని దలచు కొనుచు నాగేంద్రుడు కుర్చీలో జేరగిలబడి యుండెను. వాని ముఖము కళావిహీనమై యుండెను. వాని కన్నులలో గలిగిన యెఱ్ఱని రక్త కాంతియే వాని కానాటిరాత్రి నిద్దుర యన్నమాటయైనను లేదని చాటి చెప్పుచున్నది. అతడే కాంతపు టాలోచనలలో నుండగా నుండగ వినయ విజయులు గదిలో ప్రవేశించిరి.

నాగేంద్రుడు నిమిషమాత్రమున తెల్లబోయి నోటమాట లేక నిశ్చబ్ధుడై యుండిపోయెను. వాని కాలుసేతులు తల్లడిల్లెను,

వారికి [illegible] స్వప్నంబుగ [illegible]
బడుచునుండెను [illegible]
వినయుఁడు మరల రా గారణమేమి? [illegible] జీవము? పిల్లలు
గలిసి [illegible] అను [illegible] లోకు
[illegible]
దేమియు [illegible]
[illegible] తన [illegible]
[illegible]
వారు శాసనములలో పేరు.

[illegible] చేయలేదు. నాగేంద్రుఁ డేమియు నడుగక [illegible] చింతచు [illegible] డెను. ఎట్లు సంభాషణ మారంభింపవలెనో వానికి తోచుట లేదు. ఎట్టకేలకు [illegible] ధైర్యము చేసి, [illegible] మర్యాదగా ప్రశ్నించెను:

“మీ రాఘవయ్య గారిక మరణించినారా!”

“తమతో గొంచెము పనియున్నది.” అని వినయుఁడు జమీందారునకు [illegible] తమతో వాని క్షేమము, పనియుండుట యేమి? యని [illegible] అప్పుడు, వినయుఁడు [illegible] నన్నుద్యోగమునుండి తప్పించివేయుటచే నేను మరియొకచో ప్రయత్నములు చేయవలసివచ్చినది. కాన నా [illegible] నా కొక [illegible] దయచేయవలెను.” అనియెను.

[illegible] లేదు, రేపు [illegible]
[illegible]

విజయుఁడు [illegible]

గ్రహింపఁగ, "ఇప్పుడు చేయ వీలులేదు! నేడే యాతఁడు దానిని దీసికొని పోవలయును. కావున నిప్పుడేయది దయచేసిన చాల సంతోషింతును" అని నిర్బంధముగ బల్కెను

వారిస్థితి నమాంతముగ నున్నపాటున మ్రింగివేయవలెనన్నంతకోపము రాఘవేంద్రునకు వచ్చెనుగాని యేమిచేయఁగలఁడు? ఒక్క నిముసమువఱకు నతఁడేమియు మాటలాడక యూరకుండెను. ఇంక నేమియు లాభములేదని యతఁడెదలో భావించి సూక్ష్మముగ నేరొక కాగితముపై వినయుని బాకీకుచు నాల్గుముక్కలు—తన కిష్టములేకపోయినను, తప్పదు కావున—వ్రాసి యాతని కిచ్చెను. మరియైదు నిముసములలో నామిత్రు లిద్దరును దమలోఁ దాము తమ విజయమునకై హర్షసూచకముగ చిఱునవ్వులొలయించుచు నడువసాగిరి

"కాంచితివా! తొలుత నెట్లైనను దప్పించుకొనుటకుఁ బ్రయత్నములఁ జేసినాఁడు. వానికి నీయందు చాల కోపము. లేకున్న నట్లనఁడు. పోనిమ్ము! మన యవసరము తీఱిపోయినది కదా" యనుచు వినయుఁడు బిగ్గరగా నవ్వఁదొడఁగెను.

తరువాత వారిద్దరు షికారుగఁ దిరుగుటకునై యూరివెలుపలకుఁ బోయిరి. అమరునాఁడే యానందపురమునకు తానుత్తరము వ్రాయ వినయుఁడు నిశ్చయించుకొనెను

ఇంటికి మరలివచ్చినపై వినయుఁడు జనని కీసంగతి నేదియు నెఱుకపఱుప నిష్టపడలేదు. ఆమె మరియెక్కడనైన నుద్యోగమునకుఁ బ్రయత్నించుచుంటివా యన నింకను లేదని పలుకుచుండెను. తన ప్రయత్నము సఫలమగునో కాదో యని వానిభయము. ఇంతకు ముం దెందఱికిట్టియుత్తరములు వ్రాయలేదు. ఎందఱు తమ కవసరము లేదని తిరిగి వ్రాయలేదు! అని యాతఁ డిదియు నట్లయగు

నేమోయని యనుమానించుచుండెను. నాలుగు దినములావిధముగ నే గడచిపోయినవి.

వినయుఁడు నిరాశాపూరితుఁడై నట్టుల వాఁడినవాని ముఖమే దానిని చెప్పుచుండెను. ఇట్లుండ నాతనికి జవాబొసఁగఁబడెను. సంశయముతో నాతఁ డాయుత్తరముఁ జింప నారంభించెను. వాని హృదయము కుదుటఁబడెను. ఇంతలో జననిగూడ నక్కడ కేతెంచెను.

"అమ్మా! ఉద్యోగము దొరకినది."

"ఎవరి దగ్గఱ?"

"మానవయారునఁ గాదు ఆనందపురమున"

"అబ్బ! పదిక్రోసులదూరమున నున్నదే! వినయా! వారు జీత మెంత నొసఁగెదరు?"

"ముప్పదిరూప్యములు!"

జనని కొంత యుత్సాహవంతురాలైనట్లు వినయుఁడు తెలిసికొనఁ గలిగెను.

"ఎప్పుడు ప్రవేశింపవలయును?"

"పదిదినములలో నెప్పుడైన సరే, ముందు వారికిఁ దెలియఁ జేసి ప్రవేశింపవలెనఁట."

"సరే! ఈపదిరోజులు నింటివద్దనే యుండుము. ఆవుతరువాత ప్రవేశింతువు గాని లెమ్ము" అనుచు నిపాత్ర లోనున్న ప్రమిద వెలిగింప నామె లోనికిఁ బోయెను.

వినయుఁడు తత్క్షణము పోయి విజయునకదియంతయుఁ దెలియఁబఱచెను. మిత్రునకుద్యోగము వచ్చెనని యాతఁడు సంతసించెఁ గాని వానిని విడువవలయుఁగదా యని విచారించెను.

ఎనిమిదిరోజులును త్వరలో గడచిపోయిన తొమ్మిదవనాఁడు వినయుఁడు ప్రయాణము చేయవలసినదినము. వెన్నెలలు పచ్చపూవువలె

గాయురాత్రులు కావున నాటి నాటకరాత్రి బయల్వెడల నిశ్చయించెను. జనని రాత్రి పయనము మంచిదికాదని బోధించెను గాని వాడు వినలేదు. ఎట్టకేల కామెయు నంగీకరింపవలసివచ్చినది

పదిగంటలు కాలించి వినయుడు జననితోడను, సోదరితోడను "పోయివచ్చెద"నని చెప్పి బయలుదేఱెను. జనని జాగ్రత్తగా నెడలుమనియు నుత్తరములు వ్రాయుచుండు మనియు పదిసారులు చెప్పి మరిపంపినది. అప్పుడు చెల్లెలు విజయునితోగూడ చెప్పుటకు బోయెను.

పదునొకండుగంటలుకూడ కొట్టెరి నెంటనే వినయుడు బయలుదేఱెను. విజయుడు మిత్రుని సాపకము పట్టుకొని కొంతదూరముపఱకు బోయెను. కొంతదూరముపోయినపై వారిద్దఱు సాగనంపులాడుకొని యింక నాలస్యమగుచున్నదని యనితలచి ఎవరిదారిని వారు పోదమనుకొనిరి,

"అప్పుడప్పుడు నుత్తరములు వ్రాయుచుండవలయునుసుమీ! మఱవవద్దు" అని విజయుడు వినయునకు దసకరమందించెను. వినయుడు దానిని నందుకొని తనరెండుచేతులతో దానిబట్టి "తప్పకుండ వ్రాయుచుండెదను మాసోదరి జననులయోగక్షేమ మరయుచుండుము. సరే. నేను నాదారినిపోయెదను" అనియెను.

---

౪

అది సముద్రతీరము. శీతకాంత్యాయులతో నింగినుట్టుచు లేచి తరంగపఙ్క్తులు, ప్రేమరసప్రపూరిత యగుప్రణయినిని యువకుడు తనవిదీర కౌంగిలించునట్లు, దీవిని నాని ముద్దుల గురియించుచుండెను, పరుల పెన్కపెన్కకు నెగయుచు నేమఱిపాటున నుండగ

నే తెంచివోవుచుండెను. ఆనందమును ప్రణయ ప్రపంచమును నిలువెల్ల గరగినరుద్రై యనంతకల్లోలములతో సంతరించి మరికనబడక యుండెను. ఒక్క నిముసమునకు [illegible] కాలీక మంతయు నిశ్శబ్దముగ నిద్రించుచున్నట్లుండెను.

ఆ సముద్రతీరమునందే మూడుపురమను నొక పట్టణము సర్వజనానందదాయకమై యెంతయు నేకముగ నిండుచుండెను. ఆపట్టణము చాల చిన్నది వీధులు చాల విశాలముగ నుండును. అందు మేడ లన్నియును సముద్రతీరము నానుకొనియే యున్నవి. ఆమందిరము లన్నిటిలోను సురేంద్రనాథుని భవనము సుప్రసిద్ధమై మిన్నయై చూచుట కెంతయు సరసముగ నుండెను. భవనమునకు ముందుగ నొంత కాళీప్రదేశము కలదు. దానికి మధ్యమున నొకచక్కని యురవు కట్టబడి యున్నది. ఆప్రదేశమునందు నక్కడక్కడ బాలమొక్కలు, పరులతో నలువారుచుండెను. ముందు మన మాప్రదేశము దాటి లోన బ్రవేశింతము. ఆమందిరమున రెండుమేడలు కలవు. ముందున నున్నమేడపై రెండుగదులు, నారెండుగదులకు నడుమ నొక పెద్దహాలును గలవు. దిగువభాగమున గూడ నారీతినే గదులు కట్టబడినవి. రెండవమేడ దీనికి వెనుక గలదు. ఆమేడయును దొలిమేడవలెనే యున్నదని చూచినంతనే పోల్చుకొనవచ్చును. ఆరెండుమేడల చుట్టు నొక పెద్దప్రహరీ నిర్మింపబడి యుండెను. ఆ మందిరములు చాలకాలముక్రిందటనే నిర్మింపబడినవి. సముద్రపు జల్లగాలి యామందిరములో నివసించువారికి సంతతమునుండి మొసగుచుండును. పూర్వనిర్మితం బగు నాభవనము దృఢమై రాతిమేడవోలె నుండెను. ఆమందిరమునకు బ్రతివత్సరము సున్నముకొట్టించుచుండుటచే నది యెల్లప్పుడును స్ఫటికాకారంబున నుండి యెంతయు బాగుగనుండెను. ఆభవనమున గల గదులకు కిటికీలు విశాలమైనవి యమర్పబడి

యుండెను. సౌధములోనుండి భవనములోనికిఁ బోవుటకు ముందుగా బది మెట్లెక్కి మరిపోవలయును. ఆభవనముచుట్టు గట్టబడిన ప్రహరీ గోడయొక్క చోటనే సుద్దన్నమైన విశాలమైన ద్వార మొండుగలదు. ఆద్వారమునకు రెక్క తలుపు, నానావర్ణములలో జేయబడిన కిట్టి ణనదియు సమర్పబడి యున్నది

ఆ భవనమునకు బ్రహ్మాధికారి సురేంద్రనాథుడు కాని తత్పూర్వాధికారి యమరేంద్రనాథుడు. అమరేంద్రనాథుడు మరణించి పదిసంవత్సరములు పైగా దాటినది. అతడును వాని సతీమణి యగు లీలయు ప్రేమవతిస్వీకార మొనర్చి దేశదేశముల నతి సుప్రసిద్ధ ఖ్యాతిని వడసి తను నామమును శాశ్వతముగ నెలకొల్పెను. అమరేంద్రుడు మరణించిన మరియొక సంవత్సరమునకు గ్రహించి లీలయు బహు పరిణామములను దర్శింప బోయినది. ఆదంపతులలో గాంచబడిన యొక ముసలిసేవకు డిప్పటికిని సురేంద్రనాథుని సేవించుచు కాలము పుచ్చుచుండెను.

లీలామరేంద్రులు తమ నామములోపాటు, ఈ యునలోకమున, స్మృతిచిహ్నముగ విడిచిరి, తమపుత్రియగు మధుర నో మధుర యనకను ఏడెన్మిదేండ్ల ప్రాయమునందు నున్న యప్పుడే జననీజనకుల గోల్పోయెను. అది మొదలామె తనపినతండ్రి యగు సురేంద్రనాథుని యొద్దనే వసించుచుండెను.

సురేంద్రనాథునకు భ్రమర యను నొక్క కూతురు తక్క మరి బిడ్డలు లేరు. భ్రమర శిశువై యున్నప్పుడే జననిని గోలుపోవుటచే జనకుడే జనని యయ్యెను. మధురా భ్రమర లిద్దఱు నేకప్రాయ లగుటచే జోడు కుదిరి శైశవమునుండియు నక్క చెల్లెండ్ర రీతి నాడుకొనుచు సురేంద్రునకు ముదము గూర్చుచుండిరి. మధురయు జననీ జనక మరణానంతరమున గొన్ని దినములవఱకు నది యొక విధముగ

నుండెగాని క్రమక్రమముగ భయముతో నామెకు మైత్రి కుదుర
బాంధవ్యదుఃఖము నంతయును మఱచి నూతనోత్సాహప్రపూరితాంత్రస్థై
హాయిగ నుండెను. ప్రథమానురాగ సంభావనమును జేయు. రాకే
పోటు పెరిగియున్న వారిగురించె వారియొక్క వారికి గ్రామస్థులు ఒకరి
విడిచి మరొకరి రెప్పపాటును సాధారణముగ నుండరు. సురేంద్రనాథు
డీయాడుబిడ్డతో తన సర్వస్వమును నమ్ముకొని కలక్షేపము జేయు
చుండెను. వారు హాయిగ నుండిన యతనికి హాయియగు నట యని
యాతడు తలచుచుండెను

ఇట్లు సురేంద్రనాథుడు చాలసొమ్ము సంపాదించి తన కొమార్తె
యనుభవించుటకు విడిచెను. ఇప్పుడు శాయమ్మ వంతయు సురేంద్ర
నాథుడే సరిగాచూచుచుండెను. అతనికి కూడ ధనము నుండెను. కాని
యన్నయ్య గారి ఆస్తిని సంపాదించిన ఋణమునకు బాలకుండెను. సురేంద్రనాథు
డిప్పుడు పక్షవాతముచే చాల బాధ ననుభవించుచుండెను. అతడి
డిప్పుడు కదలుటకు కూడ నవకాశము లేకుండెను. అతని దేహము
స్వాధీనత దప్పిపోయినది. నడవజాలడు, కదలలేడు. వానిని
సేవించుచున్న ముసలిసేవకుడే యతనికి కావలసిన పనులన్నియు జేయుచు
నెల్లవేళల నాతనినే కనిపెట్టుకొని యుండెను.

సురేంద్రనాథుడు తన రోగము సంభవించినది మొదలు
లోపలి యొక వెనుక మేడలోనే నివసించుచుండెను. అగదులలో మరి
యితరు లెవ్వరు నుండుటకు వీలులేదు. సేవకుడగు రామ్‌తప్ప
దానిలో నెవ్వరు ప్రవేశింపరు. ప్రాతమున కొక్కసారి మాత్రము
మధురాభ్రమరలు పోయి సురేంద్రనాథునికడ నొక్కయరగంట
వఱకు మాటలాడి తిరిగివత్తురు. ముందున్న మేడగదులలో నొక
దానిలో భ్రమరయు, మరియొకదానిలో మధురయు నివసించుచుం
దురు. వారు సాధారణముగ మధ్యనున్న హాలులో గూర్చుండి

కాలక్షేపము సేయుచుందురు. రాత్రులు బందుకొనునప్పు డెవరిగదికి వారు పోదురు.

మధుర మధురస్వరూపిణి, ఉన్నత రసతరంగదివ్య మాధురీ మూర్తి, నవీనసూనదళ రమణీయకోమల విలాసమూర్తి, చంద్ర చంద్రికా మనోహరమూర్తి. ఆమెలేజెక్కిళ్ల యందలి చక్కని గులాబీరంగు నవ నవానంద సంధాయకమై, సుధాకాంతులఁ జిల్కు చున్నట్లు లుండును. ఆమెయుంగరాల ముంగురు లామెయాస్యసీమ నృత్యము జేయుచుండగ నొకవింతయంద మా ముఖమునఁ జూపట్టు చుండును. తదీయ ముఖచంద్రబింబ సమాగత విమల సౌందర్య లహరీ తరంగ మాలికలయందు దేలియాడగ నేయువకునకు మనసు పుట్టకుండును? తన్నంజులను స్నిగ్ధ విమలదేహకాంచన దీప్తుల దేలి యాడుట కెవ్వడిచ్ఛగింపడు? ఆమె కోమల కరుణారసార్ద్ర హృదయ వినిర్మల రమణీయభావ స్వచ్ఛతర మహానురాగ ప్రపూరితచి[illegible]

మధురకును భ్రమరకును రూపమునం దప్ప మరియెందును వ్యత్యాస మిసుమంతయు లేదు. భ్రమర దేహమురంగు కొంతవఱకు నల్లగా నుండును. కాని యది వినీలాకాశమువలె నిర్మలము. నిరుప మానము, అనిర్వచనీయము అందు దళతళలనీను నొకచక్కని వన్నె మిసిమిడియుంటచే నామె కారంగు మరియొకవింత యందము గొసంగు చుండెను. అప్పుడప్పుడామె దేహమందు సౌందర్యలత యల్లిబిల్లిగ నల్లుకొని నామెకొక నూతన వికాసంబు నొసంగెను. ఆమె నయనంబుల నుండి వెలువడు తళతళవినూత్న కాంతులయం దాకసంపు నీలంపునీటు [illegible] నామెముఖాంభోజము వింతవింత యందంపు సరసి జోమయనఁ [illegible]చుండెను. ఆచక్కదనంబునంగు, చంద్రసందర్శ[illegible]న నుప్పొంగి పొరలుసముద్రంపు చెలువము పూర్తిగ లీనమై యుండెను. అందమ్మృతశీకరముల వెదచల్లు చక్కని కాంతులు ప్రజ్వ

రిల్లుచుండును. మొత్తముపై భ్రమర మధురయంతటి సుందరీమణి కాదని చెప్పవచ్చును. ఇద్దరును సుకుమారహృదయులే, యిద్దరును కరుణారసప్రపూరిత చిత్తలే, యిద్దరును సకలసుగుణఖనులే, యిద్దరును మహోన్నత భావతరంగ సంక్షుభిత భావలే. వారిద్దఱికిని సోదరీ సహజమగు ప్రేమకలదు. ఇద్దరు నొకరి నొకరు విడిచియుండక సంత సమున జరించుదురు.

మధురాభ్రమరలు ప్రొద్దున లేచినదాది మరల బండుకొనుటకు బోవుదాక నొక్కచోటుననే యుందురు. సాయంతనసమయము లందు సముద్రతీరమునకు బోయి కడలితరగల దొప్పదోగి వీచుచు రుదంకురంబుల బీల్చుచు హాయిగ దిరుగుచుందురు. వారప్పు డప్పుడు దూరము వెడల నిచ్చకలిగిన దమగుఱ్ఱపుబండిపై బోవుదురు. వారు సాధారణముగ బైకి వెడలు నలవాటు లేకుండుటచే నాగుఱ్ఱపు బండి తోలువాడే పైపని చేయుచుండును వంట మొదలగునవి యొనర్చుటకు మరియొకసేవకుడు కలడు. వారిద్దరు దిగువనున్న రెండుగదుల లోను బండుకొనుదురు.

వీరెవ్వరును వెనుక మేడలోనికి బోవ ననుజ్ఞ లేదు. దీనికి గారణము కలదు. సురేంద్రనాథు డేమాత్రముధ్వని యాలకించినను వాని చెవులు తాళములు వైచిపోయి మరియొకగంటదనుక కాతడు మాట లాడ శక్తి లేక పడిపోవును. ఒకమారొకసేవకుడు ప్రమాదవశమున, నాతని గదిలో దుడుచుచుండగ వానిచేయి తగిలి బల్లపై నున్నగాజు పాత్రము దిగువ బడియెను. తోడనే యది [illegible]బ్దము జేయుట యును దానితోడ సురేంద్రనాథునికి జెవులు [illegible]పోయి [illegible] మరియేపాటి శబ్దము వినబడినను ప్రమాదము వాటిల్లుటయును [illegible] భవించుచుండెను. నాటినుండియు నాముసలిసేవకు డగురాము [illegible] నితరు లందు ప్రవేశించుటకు వీలులేదు. తక్కినయుద్యోగు [illegible]

ముందున్న మేడను దాటి,—పిలువబడిన దప్ప, అప్పుడైనను జాల జాగరూకత వహించి కాని పోవుటకు వీలు లేదు,—ఎంతమాత్రమును బోవరు.

సురేంద్రనాథుడు కదలుటకైన నవకాశము లేకయుండుటచే నాముసలిసేవకుని ముసలికబురుల నేవియో యాలకించుచు దినముల బుచ్చుచుండెను అంతియ కాని యాత డెప్పుడును దనసుతల రావించునలవాటుపడ లేదు, వారెప్పుడో కాని రారు కూడను. వచ్చినయెడ బ్రమాద మేమి వాటిల్లునో, తనకు జాలవఱకును సహాయము నర్పకుండినను, పెద్ద యగుటచే గౌరవనీయుండగు వానికిట్టియాపద సంభవించునో, దానివలన నింట గలపరిస్థితులలో నెట్టివింతమార్పులు కల్గునో, వారికి ముఖ్యాధారంబుగ నున్నయామగపురు గేమి యగునో, యని వారు సురేంద్రనాథునికడకు దఱచుగ బోవుట కనుమానింతురు.

---

౫

బాలభానుని కరుణాకిరణంబులు తారుణ్యమున దాండవించుచు ననంతవర్ణంబుల దరంగమధ్యమునందుయ్యెల లూగుచునుండెను. నిశాసమయంబున విద్యుల్లతచే వినీలాంబరము తళుక్కుమని పెళుకుల జూపునట్లు క్షీరరాగార్ద్రమై కడలి యనంతభంగమాలికాచిత్రనృత్యసంపదల బొదలుచు గడుంగడు సొంపువింపుచుండెను. తీరంబున నురుగు రంగులనీనుచు వెన్నవలె గరగిపోవుచుండె.

సురేంద్రనాథునిభవన మట్టియెడ నవీనవర్ణసమన్వితంబై తరంగములతో రంగులు మాటిమాటికి జక్కగ మారుచు నుండును గాన రమణీయముగ నుండెను. ముందున్న శాలీప్రదేశమున గలపూల

మొక్కలు నాటియుదయమున జాల నందముగ నుండెను. పుష్పదళ మధ్యమున గలమంచుచుక్కలు తళతళమని మెఱయుచు వాని కొక వింతసౌందర్య మొసంగుచుండెను. అపుష్పులమొక్కల నన్నింటిని పరిచూచుచు, నందునందు గలయెండుటాకుల దీసివేయుచు మధుర నిలువఁబడి యుండెను. ఆప్రదేశమునఁ గలయరుఁగుపై భ్రమర కూరుచుండి యుండెను. ఇంతలో మధుర బాగుగ విరిసినపుష్పములఁ గొన్ని కోసి తెచ్చి యందుఁ గొన్ని భ్రమర కందిచ్చి యామెప్రక్కనే తానును గూరుచుండెను. వారిద్దఱును నప్పుడే కోయఁబడినవికసితపుష్పములవలె నుండిరి.

మధుర తనచేతినున్న పుష్పముల వాసనఁ జూచుచు వానినే యేకాగ్రదృష్టితోఁ దిలకించుచు నేదియో జ్ఞాపకము వచ్చినదాని వలె తల యెత్తి, దిగ్గున భ్రమరహస్తమును దనకరంబునందుఁ బట్టి కొని యిట్లుపలికెను.

"భ్రమరా! నిన్న నేను సుమను జూచితిని సుమీ!"

'ఆఁ'యని మహాదాశ్చర్యంబున భ్రమర చకితయైనట్లు మధుర ముఖమును సాభిలాషముగ జూచెను

"నిజమేనా మధురా? అనా డామె యెవరికి దెలియకుండనే యంతరించి పోవుట యేమి, మరల నిపుడు కన్పించుట యేమి! నాకు చాల వింతగా నున్నది."

"లేదు! నేను కనులార జూచి యుంటిని. ఆమెయే యని నేను నిశ్చయముగ జెప్పగలను. చూచినంతనే నిమేషములో నామెయే సుమ యని నేను గ్రహింపగల్గితిని."

"ఎప్పుడు చూచితివి?"

"నిన్న సాయంతనమున!"

"ఆహా!"

“నేను నీవు సాయాహ్నమున నిక్కడ కూర్చుండగా నీవెందు లకో లోనికి బోయితివి. అప్పుడు నేని పువ్వుల మొక్కలను చూచుచు దిరుగుచుంటిని. ఇంతలో నేనా గోడయొద్దనకు బోయి చూచుచుండగా నల్లంతదూరమున నామెను కనుగొంటిని. ఆమె త్వరితగమనయై యిటు వెలుపలకు బోవుచుండెను. నేనొక్కపరి యిక్కడ నుండి నీకొఱకు లోనికి వచ్చితిని. నీవు నాకు గానరానందున మఱచిపోయితిని. లేకున్న చెప్పియే యుందును.”

ఒక్కనిముస మంతటను మౌనమే!

“కాని యామె యిక్కడికి వచ్చుటకు గారణ మేమియై యుండునో, నాకామె యగునో కాదో యనుమానమే. ఏమో! నే చెప్పలేను కాని—”యని భ్రమర కొంతవఱ కనుమానసూచకమగు స్వరమున బల్కి యూరకపోయెను.

“నాకది తెలియదు. కాని నేనామెను నిన్న చూచితి నని నిశ్చయముగా జెప్పగలను. అందు నాకు సందేహము లేదు.”అని మధురయు దీర్ఘాలోచనానిమగ్నమానసయై యుండెను.

వారల్లొక యరగంటవఱకు మాటలాడకుండ గూర్చుండి యుండిరి. వారి నప్పు డెవ్వరైన గాంచిన వో వారెందును గుఱించియో తెలిసికొనుటకు జాల ప్రయత్నము చేయుచు నాలోచన మొనర్చుచుండిరని సులువుగ గ్రహింపగల్గుదురు.

మధుర మరల లేచి పూవుల మొక్కలయొద్దకు బోయి తిరుగుట మొదలిడియెను. ఆముగ్ధ మంత్రముచే గట్టువడినదానివోలె తదేకధ్యానపరవశయై తదీయరామణీయకభావమును గ్రహింప నూహించుచున్నదానివలె గన్పట్టుచుండెను.

భ్రమర యింకను ముందు జరిగిన సంభాషణమునుగూర్చి పల పలువిధముల దలపోయుచుండెను. ఆమె యోచనాంబర మధ్యభాగ

మందు విహంగము విధమున సంచరించుచు, మరల రివ్వున దన ప్రపంచమున కేతెంచుచు నుండెను.

"ఆమె మనల వీడి యెన్ని సంవత్సరము లైనదో నీకు జ్ఞాపక మున్నదా?" యని మరల నామె ప్రశ్నించెను. కాని మధుర దూరం బుగ నుండుటచే నామె తిన్నగ నీమె మాటలను వినజాలక "ఆ! ఏమంటివి?" యనియెను. భ్రమర మరల దన ప్రశ్న నామె కెఱుక పఱచెను.

"ఐదుసంవత్సరములు దాటిపోయినది." అని మృభావంబుగ మధుర జవాబొసగి యెప్పటియట్లులు పూవులమొక్కలతో జిన్న పిల్లపోలిక నాడుచు దనలో దానే యమితానంద మొందుచు మధ్య మధ్య చిరున వ్వొలయించుచు నుండెను.

"ఆమె యదియేమో కాని నాకు జాల వింతగా గనబడుచు నుండుమనుమీ! ఆ చిన్న తనపు చేష్టలు, ఆ యేకాంతభావము అవి యన్నియు సాధారణముగా నెవ్వరియొద్దను జూడ లేము. అనుచు భ్రమర సోదరీ యేమి యనునో యని యామెవైపు కన్నుల మరల్చెను.

మధుర తనపనిని విడువకుండనే "ఔనౌను! నాకు బాగుగ జ్ఞాపకమున్నది ఆమె యెప్పుడును ఎవ్వరితోడను మాటలాడుటకైన నిచ్ఛగించెడిది కాదు. తనలోకమేమో తనది. పరులయెడ సక్కఱ లేదు. ఒకానొకప్పు డెవ్వరైన నామెగదికి బోయిన తిన్నగ గౌరవ మైన జేసి యెఱుగదు. అదేమోకాని యామెదంతయు నదియొక విధ మగు ప్రకృతి. కాని పాపము! చాలమంచిది. ఏమిబుద్ధిపుట్టినదో యెందుచేతనో కాని మనతో జెప్పనైన జెప్పకుండ పోయినది. అనుచు మధుర మరల నరుగుచెంత కేతెంచి భ్రమర, ప్రక్కనే యాసీన యయ్యెను.

"హూ! పోనిమ్ము. మన కెందుల కామెయుబుసు. ఆమె కేదియో బుద్ధిపుట్టి యట్లుచేసినది. పాప, మామెపేటిక యింకను మన గృహమందే యుండిపోయినది. దానిని దీసికొని పోవుటకైన నామెయేటికో గాని మరి మన గృహమునకు రాలేదు. అని భ్రమర యా సంభాషణ నంతటితో ముగించి యేవియో స్వవిషయములు నవియు మాటలాడ మొదలిడెను. మధురయు నుల్లాసముతో గూర్చుండి మాటలాడ బ్రారంభించెను. అట్లు మరియొక యరగంట దాటిపోయినది.

"మధూ! ఏడున్నర కావచ్చినది కాదూ?"

"ఊఁ, ఇప్పుడే మేడమీద గడియారము గంటకొట్టినది. అది ఏడున్నరయే యైయుండును."

ఐనచో నీపాటికి రావలసినదే, ఇక మరి పది పదునేను నిముసములలో నే తెంచు ననుకొందును.

స్వల్పాహారమునకుఁ బ్రయత్నములు చేయబడినవికదూ, అవి సిద్ధమై యుండునో లేదో అప్పటికి.

అఁహా! అప్పుడే తయారై యుండు నంకొందును. ఏడున్నరకే సిద్ధము చేయవలెనని చెప్పితిని.

సరే! ఐన మరి బాధలేదు.

వారట్లు మాటలాడుకొనుచుండగ నెండ వేడిమి హెచ్చగుచుండెను. "అబ్బా! చేడీలోనికి బోయి కూరుచుందము రమ్ము ఇచట సూర్యుని వేడి జాస్తీగానున్నది." యనుచు మధుర లేచెను. భ్రమర కూడ లేచి నిలువబడెను. ఇద్దరును లేచి మేడదిగువ చేడిలోనున్న రౌండుబెంచీపై నాసీనలైరి.

"ఏమిచెప్పుమా! ఇంకను రాలేదు. ఆటంక మేమియైన గలిగి యుండదుకదా. అట్లైనచో నుత్తరమైన రావలయునే ఎనిమిదిగంటల

వఱకుఁ జూచుచుందము." అని భ్రమరవీధివైపు దృష్టిసాగించి పల్కెను. వీధికన్న భవనమెత్తుగా నుండుటచే నందున్న వారికి వీధిలోని వారందఱు గన్పడుచుందురు.

ఐదు నిముసములవఱకు మధుర యచ్చోట గూర్చుండి దిగ్గున లేచి లోనికిఁ బోవుచుండెను.

"మధూ! ఎక్కడకు బోవుచుంటివి? ఒక్క నిముసముమాత్ర మాగుము. ఎనిమిది దగ్గర కానున్నదిలే. అంత తొందర యెందులకు ఒక్కపరి యోర్చుకొనుము."

"లేదు. లోనికిబోయి వంటకములు చల్లారకుండ జాగ్రత్తగా నుంచుమని చెప్పిరావలయు. నీవిక్కడనే కూరుచుండుము. నేను వంటవానితో జెప్పి తిరిగి వచ్చెదనులే!" అనుచు బాలికవలె మధుర భ్రమర నొకతె నక్కడ విడిచి, రివ్వున లోనికి బరుగిడుచుఁబోయెను.

భ్రమర యేదియో యాలోచించుచుండగనే మధురలోనుండి మరలివచ్చి, "బజారునుండి సామాను లిప్పుడే వచ్చినవి. వంటను నిప్పుడే యారంభించినాడు." అని చిఱునవ్వు నవ్వుచు బల్కెను.

"ఏమి! వానికి బుద్ధిలేనట్లున్నదే నేను మరిమరి చెప్పి తప్పక యేడున్నర యెన్మిదిగంటల కన్నియు సిద్ధము కావలెనని చెప్పితినే. పోనిమ్ము త్వరలో సిద్ధముచేయుమని చెప్పుము మధూ! ఆలస్యము చేయవలదని చెప్పుమీ" అని భ్రమరనోటినుండి మాటలు వెల్వడుటయే తడవుగా మరల మధుర బాలికవోలె లోనికిఁ బోయెను.

భ్రమర మాటిమాటికి వీధిలోనికి దన విసీలదృష్టి కాంతులఁ బ్రసరింపఁజేయుచుండెను. వారెవరికొఱకో నిరీక్షించుచున్నట్లుండెను. ఇంతలో టంగుటంగున నెనిమిదిగంటలు వినఁబడియెను. ఆమె లేచి నిలువఁబడి యొక్కనిముసమువఱ కచ్చటనేయుండి లోనికిఁ బోదొడగెను. ఇంతలో మధుర యామె కెదురుగ నేతెంచి భ్రమరా! తిరిగి

వచ్చుచుంటి వేమి? ఉత్తరమేదైన దపాలాబంట్రోతు తెచ్చియిచ్చెనా యేమి?" యని యడిగెను.

"ఆఁహా! ఏమియును రాలేదు. రేపటివఱకు నుత్తరముకూడ రాదనుకొందును. ఏదియో యాటంకము కలుగుటచే రాకపోయి యుండునని నేననుకొందును."

వారంత లోనికి బోయిరి. భ్రమర మేడపైకి బోవుటకు మెట్లెక్కుచుండెను.

"రమ్ము! మనము పోయి స్వల్పాహారము దీసికొనుటకుఁ బోదము. ఇప్పుడు మేడపై కెందులకు? భోజనానంతరమునఁ బోవచ్చునులే. రమ్ము!" అని మధుర పల్కెను.

సగము మెట్లెక్కుచున్న భ్రమర యాఁగి వెనుదిరిగి మధురను వీక్షించుచు, మెల్లగా "మధూ! ఆలాగున గాదు, మన యింటిలో నొందర నెందులకుఁ జెందవలయును! ఏమో మరల వచ్చునేమో. అందువలనఁ దొమ్మిదిగంటలవఱకు నాఁగియుందము. అప్పటికిఁగూడ రాకయుండినయెడ మనము లేతము." అని పల్కి మరల తిరిగిపోయి మెట్లమీదికి ఎరచర పోదొడగెను.

"సరే! అలాగేచేయుదము."

అని మధుర పల్కుచు నామె వెంటనే తానుకూడ మేడపై కెక్కిపోయెను. మధుర మేడపైకెక్కుసరికి భ్రమర మధ్యహాలులో లేదు. మధుర. భ్రమర గదిలోనికి బోయి,

"ఏమిటి చూచుచుంటివి?" యని, యామె యేదియో యొక కాగితమును జదువుచుండుటఁ జూచి ప్రశ్నించెను.

"ఆఁహా! ఏమియు లేదు. మన కానాఁడతఁడు వ్రాసినయుత్తరము బరీక్షించుచుంటిని. ఈరోజువనే యాతఁడు వచ్చెదననియో, లేక రేపువచ్చెదననియో వ్రాసియుండునని చూచుచుంటిని."

"ఏమని వ్రాసియున్నది."

"ఈరోజుననే యేడున్నరకుఁ దప్పకుండ వచ్చెదనని యతఁడు వ్రాసినాడు. ఇదిగో! చూడుము?"

మధురయు నాయుత్తర మందికొని చదివి మరల నది భ్రమర కొసంగెను. వారిద్దఱు నంత నా పెద్దహాలులోఁగల కుర్చీలలోఁ గూర్చుండి మాటాడుకొనఁ దొడఁగిరి.

"అతఁ డీరోజున రాఁడనుకొందును" అనిమధుర పల్కెను.

"ఏమియో యింకను జెప్పఁజాలను. బహుశః ఈరోజుననే తప్పకుండ వచ్చును. లేకున్న నటుల వ్రాయునా?" యని భ్రమర పల్కుచుండఁగ గడియార మరగంట కొట్టెను. భ్రమర మేడచీడీ పైకిఁ బోయి విధిపరీక్షించుచునుండెను. ఒకరెండునిమిషములలో నామె గబగబమని తిరిగివచ్చి

"అదిగో వచ్చుచుండెను. రమ్ము పోదము" అని పల్కెను. మధుర కుర్చీనుండి దిగ్గున లేచి భ్రమరను వెన్నంటెను. వారు మేడ మెట్లుదిగిపోయిరి.

"మధురా! వంటవానిఁ ద్వరపెట్టు" మని భ్రమర వచించి తానుత్వరగాఁ బోయెను. మధుర లోనికిఁ బోయెను.

భ్రమర ద్వారము దాటునంతనే యువకుం డెదురుగనే వచ్చుచుండెను. అతఁ డీమెను గాంచినంతనే గమనవేగమును దగ్గించి "క్షమింపవలయును. ఆలస్య మైనదనుకొందును" అని యువకఁ డానమ్రుఁడై మెల్లఁగా బల్కెను.

"దానికేమి—లోనికిఁ బోదము" అనుచు భ్రమర యాయువకుని మేడమీఁదికి దీసికొనిపోయెను.

వినయుఁడు భ్రమరివెనుకనే మేడమెట్లెక్కెను. అవి కఱ్ఱచేఁ జేయఁబడినవి. అందుచే నామేడమీఁదికి వచ్చుటకు మరియొకచోఁగూడ మెట్లు కట్టఁబడి యుండునని యతఁ డూహించెను.

గదిలో వారిరువురు నాసీనులైరి. ఆగదిలో నైదారుకుర్చీలును, మధ్య నొక టేబిలును ఉన్నవి. గోడలకు నల్వంకలఁ జక్కనివి రవివర్మపటములు అమర్పఁబడి యున్నవి. అందు రెండుమూఁడు వ్రాసినచిత్రములు కావచ్చునని వినయుఁ డనుకొనెను. అవియుఁ జక్కగనే యున్నవి అందుచేఁ దనశిష్యురాండ్రు కొంతవఱకుఁ గళాప్రవీణ లని యాతఁడు సంతసించెను. ఇదివఱకు వారి కెవ్వరు విద్యనేర్పిరో కనుఁగొనవలె ననియాతనియుద్దేశము. కాని సాహసించి యడుగలేకపోయెను.

వినయుఁడు గదినిమాత్రము పరిశీలించుచుండెను. అందనవసరమగు వస్తువొక్కటియు గోచరింపలేదు. ఉన్నవన్నియు నాకర్షణకరములు. పరిశుభ్రములు. ప్రతిదినము నవి యెవ్వరో దులుపుచు నుందురని యాతఁడు గ్రహింపఁగలిగెను. గదిలో గోడకు సగమువఱకు నీలివర్ణము వేయఁబడియెను. అది గదికి మరింతయందము నిచ్చుచుండెను. నేలపై నొకచాప యున్నది. దానిమీఁదకూడ ధూళి యేమాత్రమును లేదు.

విశాలవాతాయనములనుండి సముద్రమందమరుదంకురంబులు వీచి యాయువకున కమందానందంబు సంఘటించెను. సేవకుఁడు పంకా లాగుచునే యుండెను కాని యాగాలికన్న నిది మంచిది కదా! వారు గౌరవమగు కుటుంబమునకు చెందియుందురని యతడు మనమ్మున జాల సంతసించెను.

అతడు ధైర్యముచేసి మాటలాడబూనెను.

'నాయుత్తరము నిన్న నందియుండె ననుకొందును.'

'ఔను. సరిగ నిన్ననే యందినది. మీరాకకు మేమిప్పుడందు లకే వేచియుంటిమి.'

'కాని యాలస్యమైనది.'

'ఐన నేమి'యని యామె కించిల్లజ్జతో డగు నతని ననునయింప బ్రయత్నించెను.

వినయుడు రెండవయామె యెక్కడనున్నదో యెఱుగలేక పోయెను. ఆమె మఱియొకరి బిడ్డయై యుండనోపుననికూడ నాత డను మానించెను. ఆమెయు వచ్చుననుకొనెను.

ఇంతలో నెవ్వరో వచ్చుచున్నట్లయ్యెను. మధుర మెల్లన నవ నతాననయై గదిలో బ్రవేశించి యాసీన యయ్యెను.

అప్పుడు భ్రమర యిట్లని వచించెను.

'ఈమెను మధుర యందురు ఈమె నాజనకుని సహోదరుని పుత్త్రిక. నాపేరు భ్రమర '

మధుర!—ఎంతటి మధురమైన నామము. ఆనామమే తదీయ సౌందర్యసంప్రత్ప్రభావమెల్ల వెలువరించుచున్నదే!—అని వినయుడు తన యంతరంగాంతరాళంబున ననుకొనియెను. ముగ్ధుడైపోయినవాడు వోలె అతడు తదేక ధ్యానపరవశుడై, యామె ముఖాబ్జమునుండి తన కన్నుదేటుల మరల్పలేకుండెను.

అట్లు మఱికొన్ని నిమిషములు దాటిపోయినవి. భ్రమర సంభాషణమునకు బ్రోవతీసెను.

''ఇంతకుముం దెవరెవ్వరియొద్ద బనిచేసి యుంటిరి?''

''ఒక్క గోపాలపురపు జమీందారునియొద్దనే.''

''అంతకుముందు మరిమెవ్వరియొద్దను పనిచేయలేదా?''

"ఊహు! లేదు. ప్రప్రథమ మదియే. అది మైపోయిన పది దినములలోనే యిచ్చటకు వచ్చుట."

"మీయూరు జమీందారుడు సుస్వభావుడేనా? వానికేపాటి ధనము వత్సరమునకు రాబడియో?"

"సుమారైదారువేలకు మించియుండు ననుకొందును."

"అతడు వివాహితుడా?"

"కాడనుకొందు"నని వినయుడు విసుగుదలతో బ్రత్యుత్తరం బొసగెను.

భ్రమర యింకను మరేమియో ప్రశ్నింపబోవుచుండగ నొక సేవకుడు స్వల్పాహారముల దీసికొనివచ్చెను.

స్వల్పాహారము లారగించుచుండగ మరి సంభాషణ మేమియుం గాలేదు. అప్పుడప్పు డొకరిని కన్నెత్తి మరొకరు చూచుచుండు టయు మరల ముఖము వాల్చుచుంటయు జరుగుచుండెను. తదనంతరము సేవకుండు గది నంతను శుభ్రపఱచి దిగువకు బోయెను.

"ఈయూరున జమీందారు డున్నాడా?"యని వినయుడు మెల్లగా బ్రశ్నించెను.

"అహా! లేదు! ఈసముద్రతీరమున వరుసదీర్చియున్న మేడలలో మాత్రము గొప్పవారు వసించుచున్నారు. అంతియకాని జమీందారు డని యెవ్వడును లేదు"అని భ్రమర జవా బొసగెను.

వినయు డపుడు తనకట్టెదుట నున్న వారి ప్రకృతి యంతయు దెలిసికొనగల్గెను.

భ్రమర మర్యాద లెఱిగినది. మధురకన్న స్థూలదృష్టి కల్గినది మధుర యిఁతవఱకు మాటాడనైన మాటాడలేదు. రెండు మూడు మారులు మాటలాడుటకునైన ప్రయత్నించినట్లు వినయుడు గ్రహింపగల్గెను. కాని మోమోటమిచే మిన్నకుండెను. భ్రమరయో! అట్లు

గాదు. వినయునితో మాటలాడుటకు సంశయింప లేదు.

వినయుడే యింకను భ్రమరతో మాటలాడుటకునై సంశయ మూనుచుండె ననుట యాతడు ముఖము వాల్చి జవాబులిడుచుండు టయే చెప్పుచున్నది.

ఈతీరున వినయు డేమేమో యాలోచించుకొనుచుండెను. మధ్యమధ్య భ్రమర ప్రశ్నించుట, యాతడు జవాబొసగుట, యగు చుండెగాని మధుర స్వర మిదివఱ కాతఁడాలించియుండ లేదు. స్వల్పా హారానంతరమున సేవకుఁడు బల్లను శుభ్రపఱచి పోయెను. అప్పుడే వేడిటీ త్రాగుటచే వారికి జల్లగానుండెను.

భ్రమరా మధురలు వినయునకు గదిని చూపుటకు లేచిరి వినయుడును వారివెన్కనే లేచెను. మధుర నివసించుచున్నగదిలోనికి వారలు మున్ముందు పోయిరి.

ఆగది స్వచ్ఛముగను, నిర్మలముగను, ప్రశాంతముగను చక్కగనున్నది. గోడలపై తైలవర్ణచిత్రములు కొన్నియుఁ, బెన్సిలు చిత్రములు కొన్నియు వ్రేలాడదీయబడి యున్నవి. అందు గొన్ని రవి వర్మ చిత్రపటముల జూచి వ్రాయబడినవి, కొన్ని ఫోటోలను చూచి వ్రాయబడినవి, కొన్ని ప్రకృతిచిత్రములు.

'ఇది నాజనకుఁడగు సురేంద్రనాథుని పటము. ఈతడిప్పుడు పక్షవాతముచే బాధపడుచున్నాడు. అతని నొకపరి మధ్యాహ్నము చూచుటకుఁ బోదము. ఆ వెనుక నున్న మందిరములో నాతడు నివ సించుచుండును' అని భ్రమర మెల్లన వచించెను.

''ఇది నాజనకుని చిత్రపటము. అని మధురి కూడ వినయుని దెసచూడ్కి నిల్పివచించెను.

''ఆపటముక్రింద నమరేంద్రనాథుఁడని యుంటచే నాతని పేరు వినయుడు గ్రహించెను.

"ఈతఁడు మరణించి పది సంవత్సరములు కావచ్చినది. ఇతడు మరణించుసరికి మేము చిన్నవారము. అనగా నేడెన్మిది వత్సరములుం డును." అని భ్రమర విశదపఱచినది.

వినయుఁడు మధురనై పోకమారు, చిత్రపటమునై పోకమారు తీక్ష్ణముగ బరిశీలించి.

"మధుర జనకునివలెనే యుండును." అని పరిశీలనాదృష్టితోఁ బల్కెను.

మధుర ముఖము వాంచి యూరకుండెను.

"ఇది మధురజనని పటము, ఇది నాజనని పటము. నీరును మరణించి చాలదినములైనది."

అంతటను నిశ్శబ్ద మావరించినది. ఆరెండు నిముసములు సముద్రఘోషముకూడ విన్పింపలేదు. అనంతలోకమునకుఁ బోయియున్న వారిపటములపై వారి కన్నులు నిశ్చలములై నిలిచిపోయినవి. అప్పుడే సూర్యుని మేఘ మొండు కప్పుటచే నెండపోయినది. ఆగదియు నప్పుడు కాంతిమంతముగ లేకుండెను.

ఆపవిత్ర సమయమున వారొక్కమారుగఁ దమహృదయాంత రాళముల భగవన్నామస్మరణ మొనరించిరి.

"ఇవి యెవ్వరు వ్రాసిరి?"

'ఇవన్నియు మామధురయే వ్రాసినది—నాకు బొమ్మలు గీయుటయం దాసక్తి యున్నది కాని నాకావిద్య యలవడలేదు. నాప్రయత్నములతో నేనే విసిఁగిపోయితిని. కాని మామధుర చక్కగా వ్రాయఁగలదు.'

'ఇది మధుర వ్రాసినపటమేనా' యని వినయుఁ డొకపటము జూపించెను.

అది యొక త్రివర్ణచిత్రము. ఒకస్త్రీ ప్రకృతిసౌందర్యము ముగ్ధయై పరిశీలించుచున్నట్లు చిత్రింపఁబడి యున్నది.

'ఆఁ! అది నేవ్రాసినదే కాని యందలిభావము నాదికాదు. ఒకప్పు డొకపత్రికలోఁ బెన్సిలుచిత్ర మిట్టిదే చిత్రింపఁబడి యుంట చూచితిని, దానిని మనసునం దుంచుకొని వ్రాసితిని. దాని కేదో ప్రదర్శనములో బహుమానము దొరకినదని ప్రకటింపఁబడినది. నాకది యున్న సరదా యయి త్రివర్ణచిత్రముగఁ జిత్రించితిని . . కాని . . . . . యది యెవరు వ్రాసిరో యని నేనిప్పుడు కనుఁగొనవలెనని ప్రయత్నించుచుంటిని. నాకాపత్రిక యిప్పుడు లభింపలేదు. వినయ బాబూ! నీ వెఱుఁగుదువా!'

'ఎఱుఁగ కేమి! తెలియును.'

'ఎవరు?'

'అది నేనే వ్రాసితి' నని వినయుఁడు మధురవైపు దృష్టిమరల్చి మందహాస మొనరించెను.

'ఏమి? నీవేనా?' యని మధుర యాశ్చర్యసూచకస్వరముతోఁ బల్కెను.

---

౨

వినయుఁడు భోజనానంతరమున మూఁడుగంటలవఱకు నిద్రించుచునే యుండెను. అతనికి మధ్యాహ్నముల నిద్రపోవుట యనునది యలవాటు కాదు, కాని నేఁడు ప్రయాణపుబడలికచే నాతడు గాఢనిద్రకు లోనయ్యెను. నాఁడాతడు కన్నులు విచ్చుటకుఁ బూర్వము మధురమగుకంఠస్వర మొండాలకించెను. మధుర చక్కనిగీతము నొం డుసన్ననికంఠమునఁ బాడుకొనుచుండెను. వినయుం డప్పుడే మేల్కాం

చెనని యూమె యెఱుఁగదు. వినయుఁడు మెల్లనఁ గన్నులు విప్పియా మెవంక కన్నిడియెను. ఆమె యొకకిటికీపై హస్తము నానుకొని వీథి లోనికిఁ దిలకించుచు నవ్యక్తమధురస్వరంబునఁ బాడుకొనుచుండెను, వినయుఁడు చిఱునవ్వు నవ్వుచు నామెను తదేకదీక్షతోఁ జూచుచుఁ బాట వినుచుండెను,

మధుర వెనుకకుఁ దిరిగి వినయుఁడు మేల్కొనెనని యెఱిఁగి చప్పునఁ బాట నాపి, యూతఁడు తనపాట నాలించి యుండునని, వినమ్రయయ్యెను. వినయుఁడు చిఱునవ్వాఁపుకొనలేకపోయెను. మధుర ముఖము వాంచి చిఱునవ్వు నవ్వుకొనెను.

'వినయబాబూ! మాచిన్నన్నగారిని చూచుటకు వేళ కావచ్చినది. త్వరలో లెండు. ఇంతలో భ్రమరకూడ నేతెంచును. ఆమె యిప్పుడే దిగువ కేదియో పనిమీఁదఁ బోయినది.' అని మధుర వినయుని హెచ్చరించినది.

వినయుఁడు గత్వాన ప్రక్కనుండి లేచెను. త్వరలో నాతఁడు కంఠస్నాన మాచరించి దుస్తుల ధరించి సురేంద్రనాథునికడకు బోవుటకు సిద్ధమై యుండెను.

ఇంతలో మధురాభ్రమరలుకూడ వస్త్రధారణ మొనరించి వచ్చిరి. వారిర్వురు రెండురకముల పక్షులవలె నుండిరి. మధుర నీలాంబర మొండు ధరించినది. గుత్తులు గుత్తులుగ నామె భుజముపై పినీలకుంతల సముదాయము విడివడి యుండెను. సన్నని సిల్కుబట్టతో నవి వెనుకకు బంధింపబడి యున్నవి. ఆమె భ్రూమధ్యంబున నెఱ్ఱనగు బొట్టు మిలమిల మెరయుచుండెను. కనుగొలుకుల నల్లని కాటుక దిద్దబడి యున్నది. ఆమె పైటపై నొక చక్కని గిల్టుపిన్ను తగిలింప బడియున్నది. ఆమె హస్తయుగంబును సన్నని బంగరుగాజులుమాత్ర మలంకరించి యున్నవి. చరణంబులవఱకు జీరాడుకుచ్చెళ్ళప్రక్కనే

కాళ్ళ నొక విధమగు పట్టీ లుండెను. మెడలో నొక్క సన్నని గొలుసే యుండెను. భ్రమరకూడ మధురవలెనే యలంకరించుకొనెను. కాని యామె పరిశుభ్రమగు తెల్లనివస్త్రము ధరించియుండెను. ఆమె హస్తమున మరిరెండు రకముల యాభరణములుకూడ గలవు అవి క్రొత్తగా దయారుచేయబడిన వన్నవి యని వినయుడు గ్రహింపగలైను.

భ్రమర—వినయ బాబూ! సిద్ధముగ నుంటివా? కంఠస్నానము చేయబోయితివని మధుర యిప్పుడే చెప్పినదే!

మధుర—నేనట్లు లే యనుకొంటిని.

వినయుడు—మధుర చూచునప్పటికి కంఠస్నాన మొనర్ప బోయితిని. ఆలస్య మగునని యన్నియు ద్వరలోనే ముగించుకొని వస్త్రధారణ మొనర్చితిని

భ్రమ—కాని, నీవొక్క పెట్టెయైన దెచ్చుకొని రాలేదేమి?

విన—అన్నియు నిచ్చటనే కొనవలెనని నాయూహ. అందుచే నేమియు దేలేను. ఒక్క చిత్రలేఖ నాపరికరములమాత్రము లోలు సంచిలో వేసి తెచ్చితిని.

అంతట వారు ముప్వురు మేడ దిగిపోయిరి. ముసలిసేవకుడు రామ్ వారికి దారి చూపుచు ముందు నడచెను. వారు వెనుక మేడ కడకు బోయిరి.

"నేను తొలుత పోయి యంతయు జెప్పివత్తును. మీరిచ్చట నే నిల్చి యుండుడు' అని చెప్పుచు భ్రమర మెల్లగ నడుగులిడుచు మేడమెట్లెక్కెను. రామ్ ముందు నడచుచునే యుండెను. మధుర, వినయులుమాత్ర మచ్చట నిల్వబడి యుండిరి.

'అంత మెల్లగా బోవుచున్నదేమి భ్రమర?'

"ఔను. మా చిన్ననాన్నగారి కింతయైన శబ్దము వినబడరాదు. ప్రమాదముచే నట్టిది జరిగినయెడల నాతనికి చాల బాధగానుండును. చెవులు తాళములు వేయును. మరి నాలుగైదు దినములవఱకు లేవన శక్తిలే యుండును.

'అతనికి పక్షవాత మంకురించి యెన్నిదినము లైనది?'

'నాల్గుసంవత్సరములు దాటినది.'

'నాటినుండియు నిట్లే యుండెనా?'

'లేదు. రెండవమారు మరల నారోగము పొడచూపినది. నాటినుండియు నాత డిట్లయున్నాడు.'

'రెండవమారు మరల పొడచూపినదా?'

"ఔను రెండుసంవత్సరములకు పూర్వము నాటినుండియు నాతడు లేవనైన లేవలేడు. రామ్ ఆతని కన్నివిధములను సంరక్షణము చేయుచుండును."

ఇంతలో భ్రమర దిగి పోయినది.

"వినయబాబూ! నీవు త్వరగా బొమ్ము అప్పుడే నాల్గుగంటలు నర కావచ్చినది. ఐదు దాటిన నాతడు మరెవ్వరితోడను మాట లాడడు" అని భ్రమర పల్కుటయు వినయుడు మేడమీదికి మెల్లన బోయెను.

సురేంద్రనాథు డొకమంచముపై బరుండియుండెను. ఆమంచమున రెండు పరుపులు పరుపఁబడినవి. తెల్లనిదుప్పటియు బరుపబడినది. ఆమంచమున కిరుగెలంకుల ముక్కాలిపీటలు కొన్ని యమర్పబడి యున్నవి. వానిపై బువ్వులగుత్తులు, ద్రాక్షఫలములు, మంచినీరము లున్నవి. రెండుమూడు కుర్చీలుమాత్రము గదిలోనున్నవి. గోడల కనేక త్రివర్ణపటము లమర్పఁబడియున్నవి. అందుకొన్ని వ్రాయబడినవే. కొన్నిమాత్ర ముచ్చువి.

వినయుఁడు, సేవకునిచే జూపఁబడిన కుర్చీలో నాసీనుడయ్యెను. సేవకుఁడు పైకి వెడలెను.

తొలుత సురేంద్రనాథుడే సంభాషణ ప్రారంభించెను. అతని గొంతు సన్నముగ నున్నది. అతఁ డాయాసముతో మాటలాడుచు న్నట్లు వినయుడు గ్రహింపగలైను.

"చిత్రలేఖనమున నీకెన్ని దినములనుండి ప్రవేశ మున్నది?"

"నా చిన్నతనమునుండియు."

"ఏవైన పరీక్షలకు పోయితిరా?'

"లేదు. కాని చిత్రప్రదర్శనములలో గొన్ని బహుమానముల బడసితిని."

"నీజనకుఁడు .

"అతనిని నా చిన్నతనమందే కోల్పోతిని."

"పాపము . . . . . అప్పటినుండి తల్లియేనా పోషించు చున్నది."

"ఔను."

"మీరెందఱు పుత్రులు?"

"నేనొక్కడనే . నాకొక్కసోదరి కలదు."

"సరే! .. .....ఈ తైలచిత్రములు కొన్ని పాతైనవి కదా వానిని మరల బాగుచేయు వీలున్నదా?"

"ఆఁ! సులభముగ బాగుచేయవచ్చును. నేను వీని నన్నిటిని బాగుచేసెదను. కొలదిదినములలో బని పూర్తియగును."

"ఐన నేనవి యన్నియు నావకాశముగఁ బంపించెదను. రెండు మూడు రోజులలోనే పంపెదను. వానినెప్పుడైన చేయవచ్చును. విద్య నెప్పటినుండి నేర్పుటకు నిశ్చయించితిరి?"

"రేపటినుండియు మొదలిడెదను."

"ఏమి! రెండుమూడుదినములవఱకు ప్రయాణపు బడలికఁ దీర్చుకొనరాదా?"

"ఎందులకు అవసరము లేదు."

ఒక యరగంట దాటినది. సురేంద్రనాథుడు మెల్లన వినయుని చేతి కొకపువ్వులగుత్తి యందించెను. వినయుడది యందుకొనియెను. ఇంతలో సురేంద్రనాథుడు గంట వాయించుటయు సేవకుడు ప్రవేశించెను. వినయుడంతయు నాశ్చర్యముతో దిలకించుచుండెను.

"సరేమరొకమారు వత్తుగాని" యని సురేంద్రనాథుడు పల్కెను. వినయుడు మేడదిగెను.

మధురాభ్రమరలుకూడ నదేసమయమున కేతెంచిరి.

"వినయ బాబూ!—చెప్పుమఱచితిని. మీకీ పువ్వులగుత్తి నెందు కాతఁ డొసఁగెనో తెలియునా?"

'లేదు'

భ్రమర నవ్వుచు "అతడు మరి మాటలాడలేనప్పుడు పువ్వుల గుత్తి నొసగును. అప్పుడు మనము రావలయును."

"ఓహో! అందులకా? నేనింకను కూరుచుండియే యుండగా నాయనయే మరియొకమారు రండనిరి. నాకు తెలిసినది"అని వినయుడు నవ్వెను.

మధురాభ్రమరలుకూడ బకపకమని నవ్విరి.

'షికారుపోదము'అని మధుర పల్కుటయు వారు బయలుదేఱి సముద్రతీరమునకు బోయిరి.

---

౮

ఇరువది దినములు కాలప్రవాహములో గొట్టుకొని పోయినవి. వినయుడు ప్రతిదినము మధురాభ్రమరులకు చిత్రలేఖనము నేర్ప

చుండెను. భ్రమరకు చిత్రలేఖనముపై నాసక్తి కలదు కాని యామె చక్కగా బొమ్మలు గీయజాలకుండెను. మధురమాత్ర మట్లుకాదు. ఆమె బొమ్మలు వ్రాయుటలో నారితేరినదని చెప్పవచ్చును. ఆమె వ్రాయుచుండ వినయుడు పరిశీలించి రంగులు కలుపుట మొదలగునవి సరిగ నున్నవో లేవో చూచుచు దప్పుల దిద్దుచుండెను. ఒక్కొక్కప్పు డాతడు బొమ్మ కొంత వ్రాసి యామెచే దక్కినది పూర్తి చేయించుచుండెడివాడు. మధుర కెప్పుడు నదే లోకము. తెల్లవారినది మొదలు బొమ్మలు వ్రాయుటయే పని. రంగులారువర కామె యోర్పులేక రోజున కొకబొమ్మ మొదలిడెడిది. ఒకటి వ్రాసి మరియొక యారినదానిని వ్రాయవచ్చునని వినయు డట్లు మొదలిడుమని నాడు.

అప్పటికి మూడువర్ణ చిత్రములు పూర్తియైనవి. మరి రెండు కానున్నవి. అందొకటి ప్రకృతిచిత్రము. మేఘసమన్వితంబగు నంబరము, మెరుపులు నందు చిత్రింపబడినవి. అది కొంత వినయుడే వ్రాసినాడు. నేడామె యాబొమ్మను జాగ్రత్తగా వ్రాయవలయునని తలచి యదేపనిగా గూర్చుండి యున్నది. వినయు డామె ప్రక్కనే కూర్చుండెను. భ్రమర యచ్చట లేదు. ఏదోపనిమీద దిగువనున్నది. ఆమె సాధారణముగా గృహకృత్యములలోనే మునిగి తేలుచుండెను. మధుర కాయుబుసే యక్కర లేదు.

మధుర నిర్మలప్రేమస్వరూపిణి యగుమధుర ప్రక్కనెన్నో మారులు కూరుచుండియున్న వినయుని భావములు నేటిరీతి నెప్పుడును చలింపలేదు. అత డేయేకాంతభావమార్గములనో విహరించుచున్న తనహృదయవిహంగమును పట్టి యాపలేకపోయెను. జాలి యూగుచున్న యామెనీలాలకములలో గట్టబడిన పువ్వులవాసన వానిహృదయ కుహరములోనికి పోయి పరిమళించినది. అతనికొక్క

మూఱుగ దలతిరిగినట్లైనది. బాహ్యప్రపంచమునంతను నాత డొక నిముసమువఱకు మాత్రము మఱచిపోయినాడు, ఆపవిత్రనిమిషమున నత డతినిర్మల ప్రణయలోకవిలీనమానసు డైపోయినాడు. వేయి రేకులతో వాని హృదయము విరిసిపోయినది. నిగనిగలాడు నామె చెక్కుటద్దములకాంతులు వానిమోముపై బడుచున్నట్లైనది. ఆమె యప్పుడప్పుడు వినయునిచూచి చిఱునవ్వు నవ్వుచుండ నాచిఱునవ్వులోనే యాతడు మనసు మఱచుచుండెను.

నిర్మలాకాశమున దళుక్కుమని బంగరుకాంతులు మెఱసి పోవునట్లు వానియెదలో బ్రణయప్రభావము మాటిమాటికి మెఱయు చుండెను. తెలియరాని భావమార్గములలో నాతడు పరుగులిడ మొదలిడెను. కవితారసముచే వెల్లివిరియు కవిహృదయమువలె వానిమనను ఊహామాత్రమున విరిసినది. దానికి శాంతిలేదు.

అతిలోకసుందరమగు నాముఖము, నిగనిగలాడు నీలాలక గుచ్ఛములు. పీనోన్నత సుస్నిగ్ధవిశాలవక్షఃప్రదేశము. మెఱపుతీగ వలె నిలువున బులకింపజేయు మేనిబంగరుకాంతులు,— ఇవన్నియు నేకమై యొక్కుమ్మడి — తదీయహృదయాంతర్భాగమున శాశ్వత స్థాన మేర్పరచుకొనియెను. మధుర తనకొఱకే సృజింపబడినదని యాతనిభావము.

వినయునిభావము లనేకవిధముల గొట్టుకొనుచుండెను. వానికి తుది మొదలులేదు. అత డేమిచేయుచుండెనో వానికే తెలియదు. స్వప్నమునుండి మేల్కొనినట్లాతఁ డొక్కొక్క మాఱు బాహ్యజ్ఞానము కలిగియుండెను. అట్టిసమయములందైనను మధుర దెస నాతఁడు తదేకదృష్టితోఁ జూచుచుండెను.

మధుర తనదీక్ష విడువలేదు. ఏకాగ్రచిత్తముతోఁ జిత్తరువు లిఖించుచు సరిచేయుచుండెను. అంతయుఁ బూర్తియైనది. అచ్చట

చ్చుటమాత్రము కొన్నిదిద్దుబాటులున్నవి. అవియే యామిజాగ్రత్త జేయుచుండెను. ఐదునిమేషములు దాటిపోయినవి.

"వినయబాబూ! బొమ్మ సరిగా నున్నదా?"

"ఆఁ! బాగుగనే యున్నది."

"తొలుత నీవు చిత్రించితివనియా యేమి యట్లు చెప్పుచున్నావు? మరి యేమియు సరిచేయవలసినయవసరము లేదా ఏమి?"

"లేకేమి?"

"ఇప్పు డంతయు బాగుగనే యున్నదంటివి?"

"ఎప్పుడు?"

"ఇప్పుడే!"

"లేదు. బాగుగనే యున్నదనిన దిద్ద నవసరము లేదా?"

"ఐనఁ ద్వరలోఁ గానిండు!"

"ఇప్పు డాపని కాదు..."

"మరెప్పుడు?"

"అంతతొందర యేమిటికి? బొమ్మ యూరనిమ్ము. రేపటిదినమున నంతయు నేను సరిచూచెదను లే!"

"సరే కాని మరి యిఁక నిప్పు డేమిచేయుదము? పైరుపోవుట కింకను వేళ కాలేదు."

"ఎన్నిగంటలైనది?",

"అదిగో వాచీ......రెండుగంటల పదినిముసములైనది. అబ్బ! ఇంక మూఁడుగంటలు వెళ్ళ బుచ్చవలయును."

'ఈదినమున నాల్గుగంటలకే పైరుపోదము.'

'ఐన నీరెండుగంటలు నెట్లు గడుపుట.'

'నీవే చెప్పుము!'

'చతురంగ మాడుకొందము.'

'ఆఁ! ఔను బాగున్నది.'

'అలాగుననే' యని మధుర చతురంగపుబరిణ తెచ్చుటకు పోయినది. వినయుడు యథారీతిని ఆలోచనావిలీనుడయ్యెను.

వినయుడు చతురంగమాడుట క్రొత్తగా నేర్చుకొనినాడు. మధురయే యందాతనికి గురువైనది. మధురాభ్రమరలు చతురంగము బాగుగ నాడగలరు. అందు భ్రమర చేయి గట్టిది. సంసారచక్రమామె యెంత నేర్పుగా ద్రిప్పునో అట్లే చతురంగమున జంతువుల కూడ ద్రిప్పగలదు. ఇప్పుడామెకు చతురంగమనిన విసువెత్తిపోయినది. మధురావినయులుమాత్ర మప్పుడప్పు డాడుకొనుచుందురు. లేఖనము లేదా చతురంగము. అంతకుమించి వారేమియుఁ జేయరు.

'వినయబాబూ! ఇదిగో చతురంగముబల్లబరిణ' యను మధుర కోయిలపల్కులు వినయునికి తెలివి తెప్పించెను. ఇద్దరును కూర్చుండి యాట ప్రారంభించిరి. ఆటలో సాధారణముగా వినయ యోడిపోవుచుంట కలదు. అట్టిసమయములలో నామె వానిని హాస్యము చేయుచుండును. అతని కట్లామె యనుట యొకసరదా!

అరగంట దాఁటిపోయినది. కాని యీమారాట తెగుట లేదు. ఇద్దరును సమముగనే యాడుచుండిరి. వినయుడాట నెట్లయినను గెల్వవలయునని యుద్రేకముతో నాడ మొదలిడెను. కొంతవఱకు నాడిరి. ఆట సమమైపోయినది. వినయున కదియే మహావిజయమైనట్లుండెను.

మరియొక యెత్తు వేసిరి. ఈ మారోడిపోదునని వినయుఁడు మధురతో బలికెను.

'ఓడుదువని నిశ్చయమేమి!'

'నేను నీయంత బాగుగ నాడలేదు.'

'భయములేదు.' అని మధుర యెత్తువేయుచుండెను.

ఇంతలో ఎవరికి యను భ్రమరకంఠస్వరము వినవచ్చినది. ఆమెయు నిముసములో నాటలో ప్రవేశించెను. భ్రమర వినయుని కెత్తులు చెప్పుచుండెను.

'ఏమియోకాని నేడు వినయుడు సరిగ నెత్తువేయుటలేదు' అని భ్రమరమందహాస మొనర్చెను.

'అని నీకెవరు చెప్పిరి. ఇదివఱ కాట సమమైనది.' అని వినయుఁడు విజయసూచక స్వరమునఁ బల్కెను.

మరల నాటలో వారు నిమగ్నులైరి. నాలుగైదు ఎత్తులు వేసినతర్వాత, భ్రమర లేచి 'వినయబాబూ! ఆటకట్టు చెప్పుము' అనుచు దిగువకు వెడలిపోయినది.

వినయుఁ డొక్కపరి యాలోచించి 'వేసిరాజు ఆటకట్టు.' అనియెను.

'నీవాట గెల్చితివి. త్వరలో నీకు బాగుగ రాఁగలదు.' అని మధుర పల్కెను.

'భ్రమర సహాయమున గెల్చితిని. అంతియకాని నిన్ను గెల్చుట నాసాధ్య మెన్నటికిని కానేరదని నేశంకించుచుంటిని.'

మధుర యందులకు మందహాస మొనర్చినది. అతని పెదవులపై నొక చిఱునవ్వదే సమయమున దాండవించినది. ఆమందహాసకాంతు లొక్కమారుగ బ్రణయలోకమున నేకమై యొకదానిలో మరి యొకటి లీనమైపోయినది.

'మధురా! ఇక నాడవలదు.'

'ఏమీ?'

'అబ్బ! నాకు చీకాకు వేయుచున్నది.'

'పోనిమ్ము. మరియొక్కయాట.'

'అబ్బ! మరి వలదు. నాకు తలనొప్పిగా నున్నది.'

'అమృతాంజనము రుద్దనా?'

'అవసరము లేదు' అనుచున్నను మధుర యామాట విన్పించుకొనక అమృతాంజనము దెచ్చి యాతనికి వ్రాయ మొదలిడెను. వినయునకు నిజముగ దలనొప్పి లేదు. కాని యాటమాటకట్లని నాడు. మధుర యది నిజమే యనుకొనినది.

మధుర తన మృదులహస్తమును మెల్లన వానిఫాలభాగమున నైచి మందు రుద్దుచుండెను. అందాతఁ డమందానంద మనుభవించుచుండెను. అతఁడు మఱి వలదని చెప్పుదమని మఱచిపోవుచుండెను. అతఁ డామె హస్తము బట్టుకొని ఈగాజు లెచట జేయించితి వని ప్రశ్నించెను.

'ఈయూరనే'

'చాల బాగుగ నున్నవి' అనుచు నతఁ డామె హస్తమును తన రెండుచేతులను బట్టుకొనియెను. ఆమెయు నిశ్చలమై యుండెను. ఇరువురు నేమిచేయుచున్నది మఱచియేయుండురు.

'మధురా! నీరవర్ణము లున్నవా?'

'ఓ! ఉన్నవి.'

'నీవు వానితో నెప్పుడైన వ్రాసితివా?'

'మున్ను వ్రాసియుంటిని, ఇప్పుడు మానివైచితిని.'

'ఏవీ యొకమారు తెమ్ము.'

మధుర రంగులు తెచ్చియిచ్చెను. అతఁ డొక చిన్నకాగితము దీసెను.

'అంత చిన్నకాగిత మెందులకు?' అని ఆశ్చర్యముతో మధుర ప్రశ్నవైచెను.

'బొమ్మ వ్రాయుటకు.'

'ఏమి వ్రాసెదవు.'

'నీవేది చెప్పిన నది.'

'బాగుగనే యున్నది. సముద్రము వ్రాయుము.'

'నీరవర్ణములనియా?'

'కాదు! నాకట్టుల బుద్ధి పుట్టినది.'

'సరే యట్లే వ్రాయుదును.'

అని వినయుడు మెల్లన సముద్రచిత్రము వేయుచుండెను. మధుర యాతనిప్రక్కనే కూరుచుండి యంతయు దిలకించుచుండెను. ఆమె చూచుచు నప్రయత్నముగ వినయుని భుజముపై జేయి వైచెను. ఆమె యెంతమాత్రము దానట్లు చేసిన ట్లెఱుగదు. వినయుడు మధుర చేయి వైచినంతనే నిలువున గగురించెను. అతడు బాహ్యజ్ఞానశూన్యుడై పోయెను. అతడేమి చేయుచుండెనో మఱచెను. ఏయేవర్ణముల గలుపుచుండెనో మఱచెను. అంతయు నాతనికి స్వప్నావస్థవలె గడచెను. అట్లొక యరగంట—మధురము లగు ముప్పదినిముసములు—ఎవ్వరికిని తెలియకుండ మెఱపువలె గతించినవి.

ఒక్కమారుగ మధుర పకపక నవ్వుచు—

'ఏమి వినయా! మతి పోయినదేమి?' అనియెను.

'ఏమి?'

'నీవేమి చేయుచుంటివో తెలియునా?'

వినయుడు బాహ్యజ్ఞానశూన్యుడై యొకరంగునకు మరియొక రంగు కాగితముపై బులుముచుండెను.

'నేనేమి చేసితిని?'

మధుర మరియు గట్టిగా నవ్వుచు—

'సముద్ర మెట్టుగా నుండునా?' అనియెను.

'అది యూ' అని వినయుడుడు సందహాస మొనర్చుచు పొరపాటు గ్రహించుకొనినాడు. మధుర యింకను నవ్వుచునే యున్నది. వినయుడుకూడ గట్టిగా నవ్వ మొదలిడినాడు. ఇంతలో [illegible] య నచ్చట కరుదెంచి నవ్వుకొనుచు 'ఎందు కానవ్వు' అని ప్రశ్నించెను.

మధుర లేచి 'వినయబాబు సముద్రపుబొమ్మ వ్రాసినాఁడు చూచితివా?' అనెను.

'లేదు. ఏదీ?'

'దానితో నేమి! అన్నియు నబద్ధములే' యని వినయుఁడు మోము చిన్నబుచ్చుకొన్నాఁడు.

'కాదు. ఇదిగో చూడుము' అనుచు భ్రమరచేతికి మధుర చిత్రము నందించెను.

భ్రమరకూడ 'ఇందులకా' యని తానుకూడ వినయుని చూచినవ్వ మొదలిడెను. వినయుఁ డాకొంటెపిల్లల హేళనమునకు నొచ్చుకొనక తానుకూడ నవ్వివేసినాఁడు.

అప్పుడే టంగుటంగున నైదుగంటలు కొట్టిరి.

'ఇఁక షైరు పోదము' అని వినయుఁడు లేచెను.

వారుకూడ వాని ననుసరించిరి. వారు సాధారణముగ బండి పైఁబోయెడివారు. కాని నేఁడు నడచియే వెడలిరి. మార్గమధ్యమున వారు ప్రకృతివైచిత్ర్యముఁ గూర్చి యనేకవిధములఁ జర్చించిరి. నాఁడు వారు చాలదూరము నడచి పోయిరి. అంతదూరము వారిదివఱకు పోయి యుండలేదు. వారు సముద్రతీరమునఁ గూరుచుండి వాయు సేవన మొనర్చుచుండఁగనే సంధ్యారాగములు నేలకు జారిపోయినవి. అయ్యరుణారుణాంధకారచిన్నెలలో సముద్రము చక్కఁగాఁ జూచుటకు వింతైనది.

వారు గృహాభిముఖు లగుచుండఁగ గ్రుడ్డివెన్నెల యచ్చటచ్చట పడుచుండెను. వారు క్రైస్తవశ్మశానవాటిక దాఁటుచుండఁగ వినయుఁడు నీరవుఁడై నిశ్చలుఁడై నిల్చిపోయెను. ఆప్రక్కసందులోనికి మరలిపోవుచున్నయొకవ్యక్తిపై నాతనిదృష్టి పడి యాతఁ డట్లైనాఁడు. 'చకితుఁడై యూరక యొక్కనిమిషముమాత్రె మాఁగినాఁడు. మధుర భ్రమరలు గ్రహించియుండరని యాతఁడు భావించుకొనుచు నావ్యక్తినే తలఁచుకొనుచు వ్యగ్రభావమునఁ బోయెను.

# మధుర

## ద్వితీయ ఖండము

### (ప్రణయాంజలి)

౧

షైరు పోయి తిరిగి వచ్చుచుండఁ గాంచినవ్యక్తిని గూర్చియే వినయుని భావము నాఁటిరాత్రి పరిపరివిధములఁ బరుగులిడ మొదలిడినది. అతని మనసు మనసువలె లేదు. రాత్రి కలలోఁగూడ నావ్యక్తియే కన్నులఁ గట్టుచుండెను. మధురాభ్రమరలతో నాఁటిరాత్రి భోజనానంతరమున నాతఁడు యథారీతిని సంభాషించెనే కాని యతఁడు మునుపటిరీతిగ లేఁడని భ్రమర సులువుగ గ్రహించినది.

ఆమరునాఁడు మధురావినయులు చిత్రలేఖనమునకు కూర్చుండిరి. మధురతోకూడ నాతఁడు సరిగ మాటలాడుట లేదు. ఆమెతో మాటలాడుట యనిన వాని కిదివఱ కొకయానందముగ నుండెడిది. అట్టిది నాఁడాతఁడు క్రొత్తవానివలె నయ్యెను. మధుర కిది యిసుమంతయుఁ దెలియదు. ఆమె యథాప్రకారంబుగఁ దనబొమ్మల దీసికొనుచుండెను. వినయుఁడు దిద్దుట మానినాఁడనికూడ నామె కనుఁగొనలేదు. అతఁ డాలోచనాపరంపరలలో నంతరించి యుండెనే కాని మరి యేమియు నెఱుఁగఁడు. అట్టిసమయంబున నచ్చటికి భ్రమర యేతెంచి 'వినయబాబూ!' అని పల్కరించెను. కాని యాతఁ డది తిన్నఁగ వినిపించుకొనలేదు.

భ్రమర నవ్వుచు మరల 'వినయబాబూ!' అనెను. 'ఆఁ' అని వినయుఁడు త్రుళ్ళిపడెను. 'వినయబాబూ! నీతోఁ గొలఁదిగ

మాటలాడవలయు నొక్కపరి యిటువచ్చెదవా? అని భ్రమర ముందు నడచెను.

వినయున కిది యేమియు నర్థము కాలేదు. తనతో నామె యేమి మాటలాడునో యని యాతఁ డూహించుటకైన నవకాశము లేకపోయినది. అతఁడు మారుమాటాడకుండ మెల్లన లేచి భ్రమర వెనుకనే యామెగదిలోనికిఁ బోయినాఁడు. ఆమె వాని నొకకుర్చీ కూర్చుండుటకుఁ జూపి తానాప్రక్కనున్న కుర్చీపై నాసీనయయ్యెను. వినయుని గుండెలు దడదడ కొట్టుకొనియెను.

భ్రమర యాతనితో మెల్లన నిట్లనియెను. 'వినయబాబూ! నిన్నొక రహస్యవిషయముఁ గూర్చి యడుగవలయును. నీవు నాకడ దాఁపక నీవెఱింగినంతవఱకుఁ దెలియఁజేయుదువని నమ్మెదను. నేను దేనిగూర్చి యడిగెదనో నీకీసరి కవగతమై యుండుననుకొందును.''

వినయున కంతయు నగమ్యగోచరంబుగ నుండెను. ఆమె వాక్యంబు లొక్కటియు నాతనికి సరిగ నర్థము కాలేదు. ''అంతటి రహస్యవిషయ మేది? తనకుఁ దెలియునని యామె యెట్లెఱిఁగినది? తనకే యెఱుకరానిరహస్య మెద్ది!'' యని యాతఁ డూహామాత్రము లో హృదయంబునఁ దలఁచుకొనెను. అతని కేమిచెప్పుటకును తోఁచి నది కాదు.

'ఊఁ' యని యెట్టకేల కాతఁడు వెఱ్ఱివానివలె, తానేమి యనెనో తానే యెఱుఁగక యనియెను.

'ఏవిషయముఁ గూర్చి యనుకొంటివి?'

'నాకేమియు బోధపడుట లేదు. నీయభిప్రాయ మేమో స్పష్టీకరించినచోఁ జెప్పెదను.'

'అది నీకు తెలిసినవిషయమే'

'ఏది!'

'నేనిప్పుడు నిన్ను ప్రశ్నింపఁబోవునది ?'

వినయుఁడోర్చుకొనలేకపోయినాడు. 'ఏవిషయము? నీమాటలు నాకేమియు నర్థము కాలేదు. నీవేదియో చెప్పినచోఁగాని నాకు తెలియదు.' అనియెను.

భ్రమర గట్టిగా నవ్వుచు 'నీవు గ్రహింపలేవా?' యని ప్రశ్నించెను.

'అదేమో నాకు తెలియదు '

'తెలియదా!'

'ఉహుఁ! తెలియదు'

'అదే యిప్పుడు నీహృదయములోఁ గొట్లాడుచున్నది.'

'ఏది?'

'నే నిప్పుడడుగబోవునది.'

'ఏదో త్వరగా జెప్పుము?'

'చెప్పుమనెదవా?'

'ఆఁ'

'నీకు తెలిసిన దంతయు నీవు చెప్పెదవా?'

'అలాగే'

'అట్లైనఁ జెప్పెదను.'

'అబ్బ! చెప్పుము.'

'ఆ పరిశుభ్రధవళ వస్త్రసమాచ్ఛాదిత వ్యక్తి .....'

వినయుడు త్రుళ్ళిపడెను. ఆమె తన హృదయభావంబుల నెట్లు గ్రహించెనా యని యతఁడు విస్మయావిష్టుఁ డయ్యెను. కాని నిముసములో నాతఁడు ప్రకృతస్థితు డయ్యెను.

భ్రమర మందహాసమొనర్చుచు 'వినయబాబూ! ఆవ్యక్తి, నీకు పరిచితయా?' యనెను.

'ఏవ్యక్తి?'

'నిన్న సాయాహ్నమున మనము షైరునుండి తిరిగి వచ్చుచుండఁగ నాప్రక్కసందులోనికి పోయిన యాశుద్ధధవళాంబరాచ్ఛాదిత వ్యక్తి. ఇఁకనైనఁ దెలిసినదా దానికి?'

'ఆ! తెలిసినది. ఆమె నాకపరిచితా?'

'ఏమి! నిజమేనా?'

'ఔను.'

'అట్లయిన నిన్న నీవామెను చూచి యట్లాలే యచట నొక్క నిమిసము మాగిపోయితి వేటికి?'

'ఆమెను నేనొక్కపరి చూచితిని.'

'ఎప్పుడు?'

'ఇరువదిదినములక్రిందట.'

'ఎచ్చట?'

'గోపాలపురమునుండి యానందపురమునకు పోవుబాటలో. నేనప్పు డాదారిని పోవుచుంటిని.' అనగా నీయూరు వచ్చుచుంటిని. అప్పుడామె నాకెదురైనది.'

'ఐన మామధుర కానా డీమె యగపడుట నిశ్చయమే యన్న మాట! కాని ఎట్టిసమయమున నెదురైనది. రాత్రియా?'

'ఔను. పదునొకండు గంటలకు.'

భ్రమరావినయు లొక్కనిమిసము దీర్ఘాలోచనానిమగ్నులైరి.

'ఆనాడు మామధుర కామె సాయాహ్నమునఁ గానవచ్చినదఁట. మొట్టమొదట నేనామాట నమ్మలేదు. కాని యిపుడు నీమాటలఁ బట్టి యామె యప్పుడే యీయూరు విడిచిపోవుచుండె ననుకొందును' అని భ్రమర పలికెను.

మధురా భ్రమరలా ధవళాంబరి నెఱుఁగుదురని వినయుఁడు తెలిసికొనియెను. కాని వారెట్లామె నెఱుఁగుదురో తెలిసికొనుటకాతఁడు కుతూహలుఁడయ్యెను. ఆమెకు వీరికి నేమి సంబంధమో యాతఁడూహింపలేకపోయెను.

భ్రమర—వినయ బాబూ! ఆమె తొందరతోఁ బోవుచుండెనా యేమి?

వినయుఁడు—ఆ! ఆమె వేగముగనే నడచుచున్నట్లు నేను గ్రహించితిని.

భ్రమర—ఆమెను నీవు నాఁడు పరిశీలించితివా?

వినయుఁడు—లేదు. ఐనను ఆమె యెప్పుడు ధవళవస్త్రములే ధరించుచుండు నని నిన్న నే గ్రహించితిని.

భ్రమర—ఔను. ఆమె యెప్పుడు నట్టిబట్టలే కట్టుకొనును. కాని నిన్నామెచూచినదో లేదో తెలియదు.

వినయుఁడు—తొలుతఁ జూడలేదు కాని తరువాత జూచినది.

భ్రమర—నీవామెకు మరలఁ గనఁబడిన నిన్నామె గుర్తింపగలదా?

వినయుఁడు—గుర్తించు ననుకొందును.

భ్రమర—అట్లైన నామె నీతో మాటలాడినదా?

వినయుఁడు—ఆ! మాటలాడినది.

భ్రమర—ఏమిమాట లాడినది?

వినయుఁడు—తన్ను రక్షింపుమనినది.

భ్రమర నీరస మైనది. రెండునిముసములు దాఁటినతర్వాత, అప్పుడు నీ వేమి చేసితివి?' అని ప్రశ్నించెను.

''ఆమె నానందపురమునుండి యెవ్వరో వెన్నాడుచున్నట్లుగా నామె యనినది......నేనామెను గోపాలపుర రాజమార్గమున విడిచి

తిని, అందుచేత నేనానాఁడీయూరువచ్చుట కాలస్య మైనది. ఆమె కెవ్వరో మిత్రులటఁ గలరని యామె చెప్పినది!''

'వారెవ్వరు?'

'ఆమె చెప్పినదికాదు'

'నీవడిగితివా?'

'ఆ! కాని చెప్పలేదు'

'ఆమె యేవీధిలోనికి పోయినదో చూచితివా?'

'చూచితిని. అటుతర్వాతఁ దిరిగి వచ్చితిని.'

'ఆమెంగూర్చి మరేమియు నీవెఱుఁగవా?'

'ఎఱుఁగను. కాని యెవ్వరో కొందఱు దుర్మార్గు లామెను వెన్నాడుచున్నారు. వారుకూడ నాకెదురైరి. నన్నామెనుగూర్చి వారు ప్రశ్నించిరి. కాని యామె నాకగపడలేదని నేనసత్యమాడితిని. వారంతట మఱియొక మార్గము వెంబడి మాయమైరి' అంతకుమించి నాకు తెలియదు.

భ్రమర ఆశ్చర్యచకితయై యంతయు నాలించుచుండెను.

---

౨

మధుర యొక్కతెయుఁ గూర్చుండలేక భ్రమరగదిలోఁ జొరఁబడెను. భ్రమరావినయులు మధుర వచ్చినదని సంభాషణమాపలేదు. దానఁబట్టి మధురయు వారిసంభాషణ మేకాగ్రచిత్తయై యాలింప మొదలిడెను.

'ఐన భ్రమరా! అధవళాంబరి మీకు బాగుగ దెలియునన్న మాట?'

'తెలియు నన్నమాట యేమి. ఆమె మాకుఁ జిరపరిచిత.'

'ఆమె నామధేయ మెఱుఁగుదురా?'

'ఆమె పేరు సుమ.'

'సుమ '

'ఔను. పేరు విన్నట్లు జ్ఞాపక మున్నదా యేమి?'

'లేదు . ... కాని యామెకు మీకు నెట్లు పరిచయము కల్గినది, ఎప్పుడు కల్గినది?'

'ఆమె మాయింట నైదువత్సరము లున్నది.'

'ఏమి?—మీగృహముననా?'

'ఔను మాయింటనే . . . . ఈప్రక్క గదిలోనే!'

'మిమ్ము విడిచి యామె యెప్పుడు పోయినది?'

'ఐదుసంవత్సరములు కావచ్చినది. కాని యామె మాతో నెవ్వరితోడను చెప్పకుండనే నాఁడు పోయినది. ఎందులకు పోయినదో, ఎట్లు పోయినదో మాకు తెలియదు.'

'రాత్రిసమయమునఁ బోయినదా.'

'నాయాహ్నమున నైదు పోయినది. మరి గృహమునకుఁ దిరిగి రాలేదు. అందుచేతనే యామె వస్తువులుకూడ నిచ్చటనే యుండి పోయినవి.'

'మరి వాని నామె తీసికొనిపోలేదా?'

'లేదు.'

'ఇప్పటికిని అవి యిచ్చటనే యున్నవా?'

'ఆఁ! ఉన్నవి.'

'అవి యేవి?'

'ఒక్క పేటికమాత్రమే. అది తరువాత నీకు చూపెదను.'

మధుర కీసంభాషణ మంతయుఁ జాల చీకాకుగా నుండెను. ఆమెయొక్క నిముసమైన దాని నిఁక నాలింపలేక లేచెను. 'అబ్బా!

ఎందుల కీయక్కఱలేని గోల యిప్పుడు. ఆమెసంగతి మన కెందుకు? చాలును. వినయా! నాబొమ్మ యెట్లున్నదో చూతువురమ్ము! అది పూర్తియైనది.' అనియెను.

'ఆలాగుననే' అని వినయుఁడు చెప్పి 'మధూ! బాగుగనే యున్నది. ఆమె విషయమై యెట్లయిన నాకు కనుఁగొనఁ గుతూహల మగుచున్నది' అనియెను.

'ఊహూ!—అట్లైన నేఁబోయెదను. నాకెందుల కీయక్కఱలేని గోల. నాబొమ్మ నింకను అలంకరింతును—వినయబాబూ! నీకన్న బొమ్మ చక్కఁగా వ్రాయుదునులే. చూడుము' అని నవ్వుకొనుచు మధుర వెడలిపోయినది. పాప మామెకు పరులఁగూర్చి మాటలాడుటే చీకాకు. ఆమె అమాయిక ముగ్ధ. ఎప్పుడును తనబొమ్మలు తప్ప మఱేమియు నామె కక్కఱలేదు.

ఆ యమృతహాసినిని చూచుచుఁ బాపము వినయుఁడు భ్రమర ప్రక్కనెయున్నదనుమాటయె మఱచెను. భ్రమర మరల మాటలాడినంతనే యాతఁడు ప్రస్తుతవిషయముఁగూర్చి యామెను ప్రశ్నింప మొదలిడెను.

'మొదటినుండియు నాకామెఁగూర్చి తెలిసికొనవలయుననియే యున్నది. కాని నాకప్పుడవకాశము లభింపలేదు. నేఁడు నీవలనఁ గల్గినది. ఆమె కేదియో సహాయము చేయుతలంపులో నెవ్వరో యున్నారని యానాఁడు జరిగిన సంగతులఁబట్టి గ్రహింపవచ్చును. ఆమె తలిదండ్రులవిషయమై కూడ మనము ముఖ్యముగాఁ బరిశీలింప వలయును. ఆమె కెట్టియాపదయు రానీయకుండ మనము కనిపెట్టనగును.' అని వినయుఁ డుద్రేకపూరితుఁడై పల్కెను. భ్రమరయు సత్ప్రభావమునే కలిగి వానికి తోడ్పడ నిశ్చయించి 'వినయబాబూ! నేను నదియే యోచించుచుంటిని. ఎట్లైనఁగాని యామె "పుట్టుపూర్వోత్తరములు" మనము తెలిసికొనవలయును.

'కాని యామెగూర్చి నీకు తెలిసినవిషయములు మాత్రము నీవు నాకెఱుకపఱుపవలెను.'

'నాకేమి తెలియును.'

'నీకేమియుఁ దెలియదా?'

'లేదు. నేనెంత యెఱుఁగుదునో అది నీకుగూడ తెలియును. ఇందు నీకడ నేనేమియు నిగూఢ మొనరింపలేదు.'

'నీవు నిగూఢ మొనర్చుచుంటివని కాదు. మరేదైన నీకు దెలియు నేమో యని యడిగితిని. ఇది యొకపరిశోధనము వంటిది, అందుచే నట్టివిషయంబైన నుపయోగించును. నేను కొన్నిపరిశోధ కాఖ్యాయికలఁ బఠించితిని. కావున నట్లనుచుంటిని. నేనుకూడ నిందు బరిశోధన మొనరించి పర్యవసాన ముపలక్షింతును ఇది యంతయు నాయనాథస్త్రీని రక్షించుటకు నేనెందునకు నెనుదీయను. నీవు నాకు సహాయభూతివు కావలయును.'

'నేనందులకు సంసిద్ధురాలను.'

'సరే! కాని మనము ముందామెప్పట్టు పరిశీలింపవలయును!

'అందువలన మన కామెసంగతి యేమి తెలియును?'

'లేదు. మన కిప్పుడదియే ముఖ్యాధారము. ఆమె దైనిక చరిత్ర వ్రాయునలవాటు కల్గియున్నదా?'

'ఆఁ! ఆమె కది యలవాటే!'

'ఐన గెల్చితిమి. నిముసములో నంతయు గ్రహింతము.'

'వినయబాబూ! లాభము లేదు. ఆవత్సరమే—అనగానామె యెప్పుడు మమ్ము వీడినదో—యపుడే వ్రాయుచుండెడిది. అంతమాత్రమున మనకు లాభము లేదు.'

'ఏదియైనను చాలును!'

'అట్లైన సరే!'

'ఆపెట్టె నెపుడు తెరవనగును?'

'రేపు తీయుదము. ఇంతలో నేమి?'

'ఏమియు లేదు.'

వినయుడు లేచి మధురగదిలోనికి పోయెను. అతఁ డేదియో యాలోచింపుచు మెల్లన నడుగు లిడుచుఁ బోవుచుండెను. అన్యమనస్కుఁడై యున్న మధుర యాతనిరాక కనిపెట్టలేకపోయెను. ఆమె దేనినో యేకాగ్రమతియై తిలకించుచున్నట్లతఁడు గ్రహించి ఆమె వెనుకకుఁ బోయి మెల్లనఁ జూచెను. ఆతనిహృదయము జల్లనఁ బులకరించెను. ఆమెహస్తమునం దున్న దేమి? అతనిఛాయాచిత్రము. అతఁడు చకితుఁ డయ్యెను. మధుర వెనుదిరిగి సిగ్గుచే మోమువాంచెను.

'అది నీవెట్లు సంపాదించితివి?' అని వినయుఁడు మందహాసమొనరింపుచుఁ బ్రశ్నించెను.

'నేనే తీసితిని'

'ఆఛాయాపటమా?'

'ఔను!'

'ఎట్లు' అని వినయుఁ డత్యాశ్చర్యమును సూచించెను,

'నాయొద్ద నొకచేతికెమెరా యున్నది. దానితో నాల్గుదినములక్రిందట నాకస్మికచ్ఛాయాచిత్రముఁ దీసితిని.

వినయుఁడు మందహాసముఁ జేసెను. మధుర చిఱునవ్వు నవ్వెను. ఆహాసప్రపంచమున వారు లీనమై పోయిరి.

---

3

స్వర్గధామంబున స్వర్ణారుణవర్ణంబులు [illegible]లదరించి పోవుచున్నవి. నీనీలాంబరము వివిధవర్ణ తేజస్సమన్వితంబై పోవుచుండెను. కాని దిగంతములఁ గలయరుణారుణాంధతమస్సులు మెల్లమెల్లనభూమి

నంతయుఁగూడ నాక్రమింపఁదలఁచుచున్నట్లు మెల్లన ముందుకు సాగి వచ్చుచున్నవి.

సృష్టిసౌందర్యము నవలోకించుచు వినయుఁ డొక్కఁడును సముద్రతీరమునఁ బచారు చేయుచుండెను. అనేకాలోచనలతో నాతని యాత్మ కలఁతపడి యున్నది. తనకు భ్రమరకు జరిగినసంభాషణ మంతయు నాతఁ డాత్మసీధిని మరల నిర్మించుకొనుచుండెను. ఆ నిర్మాణములో మరల మధుర మధురస్వరూపము తేజోమయమై తటిల్లతవలె వానియెదుట మెఱసి పోవుచుండెను. ఆయనంతాలోచనాతరంగరంగంబులలో వానిహృదయకమలము నృత్యమాడ మొదలిడెను.

ప్రశాంతసంధ్యాకాలమున నాతని కేటికో చిత్తశాంతి లేకున్నది. 'అధవళాంబరి యెవ్వరు? ఆమెకు మధురాభ్రమరలతో నేమి సంబంధమున్నది? ఆమె యేటికి నాఁడకస్మాత్తుగా నిల్లు వీడి పాఱిపోయినది? ఇందేదియో పెద్దరహస్యము గుప్తమై యున్నది' అని యతఁడు భావింప మొదలిడెను. కాని యామెవిషయమై యాతఁ డెందుల కట్లు ప్రయత్నించుచుండెనో వానికి తెలియుట లేదు. అందాతని కేదియో యున్నట్లు గోచరించినది. ఆనాఁటిరాత్రి యామె యారాటమేయంతయుఁ దెలియఁబఱచుచున్నది. ఆమె కేదియేని విపత్తురానున్నది. ఆమె నెట్లయిన రక్షింపవలెనని యాతఁడు బద్ధకంకణుఁడయ్యెను.

నేఁడుకూడ నాధవళాంబరి యాదెస వచ్చునేమోయని యాత డూహించెను. అట్టిది సంభవించిన నామెంగూర్చి తెలిసికొన నవకాశములున్నవని యాతని యభిప్రాయము తమోరేఖ లావరించుచున్నవని యాతఁడు గృహాభిముఖుఁడై నడచుచుండెను. దూరదూరముల నున్న దీపస్తంభములకాంతి యంత బాగుగ లేనందున నాతనికి

రోడ్డుపై నడచుచున్న వారెవ్వరును కాన్పించుటలేదు. నిరాశాపూరి తుడై యాతడు నడవ మొదలిడెను. క్రిందటిదినమున నా ధవళాంబరి కాన్పించినకడ కత డేగెంచి యచ్చటనే యిటునటుఁ దిరుగుచు నుండెను. ఆమె వచ్చుననిమాత్ర మాతనికి నమ్మక మెంతమాత్ర మును లేదు.

ఒకపక్షి పార్శ్వవృక్షాగ్రమునుండి కూసి పాఱిపోయెను. అప్పుడే వానికి పదధ్వని వెనుక వినఁబడెను. ఒక భయంకరాకారుఁ డగు పురుషుఁడు వానిని దాఁటిపోయినట్లాతఁ డెఱిఁగెను. అతనిఁ జూచినంతనే వాని కనుమాన మంకురించినది. ఆనాఁ డాధవళాంబరిని వెన్నాడుచుఁ దనకు గన్పడినవారింగో నీతఁడొకఁడు కాఁడాయని యాతఁ డనుమానించెను. అతని కది యనుమాన మాత్రమే స్ఫురించినను, వాని కానాటిసంగతి యంతయు నొకమాఱుగ దలఁపునకువచ్చెను. అతఁడు నిర్విణ్ణుఁడై యచ్చటనే నిల్వఁబడెను.

ఆభీకర స్వరూపము వినయునిదృష్టిపథము దాటునంతవఱకు వాని కన్యాలోచన మేమియుఁబోలేదు. రెండు నిమేషములు దాటి నవి. ధవళాంబరి తప్పక యీయూరనే యున్నదని యాతఁడు నిశ్చ యించుకొనియెను. ఆమె నన్వేషింప నాతడు నిశ్చితాత్ముఁ డయ్యెను. అతఁడేదియో యనుకొనుచు ముందునకు దృష్టిసారించెను.

ఊహామాత్రములో నాతఁడు చకితుడయ్యెను. తన కన్నులనే యాతఁడు నమ్మలేకపోయెను. క్రైస్తవశ్మశానవాటి కాబహిర్ద్వారము నుండి యామెయో—తానెవ్వరికొఱకై యింత ప్రయాసపడుచుండెనో ఆధవళాంబరియే—త్వరితగమనయై యావెలుఁగుఁజీకటిలో బోవుచు విలీనమైపోయినది. అతఁడామె ముఖావలోకనము నొనర్పలేదు కాని యామె వస్త్రములే యాతనికి గుర్తుగా నున్నవి. అతఁ డామెను

వెన్నాడుటకైన నవకాశము లేకపోయినది. ఏమనను వెన్నాడుదమని యైన నాతఁడు తలఁచుకొనలేదు. అట్టిబుద్ధియే వానికి పుట్టలేదు.

ఎట్టకేల కాతడు శ్మశానవాటికలోనికి తడబడుచు నడుగు లిడుచు జనెను. ద్వారముఖమున మాత్రము రెండులాంతరులు కాంతిహీనములై వెలుగుచున్నవి లోపలఁ జాలవఱకు నంధకారమే యున్నది. పంచమీ చంద్రునిఁ జిన్నమేఘము మఱుగుపరుచుటచే నాకాశ మంధకారావృతం బాయెను.

ఆ పవిత్రస్థలమున బురాతనములు క్రొత్తలు నైనగోరీ లెన్నియోయున్నవి. ఆ నిర్జనప్రదేశమున స్థాపితమైన శరీరము లపవిత్రతాపవిత్రతలు మాత్రము లోకమునఁ జిరస్థాపితములై యున్నవి. కాని గోరీ ముఖంబునఁ దదీయనామము, చరిత్రము, మొదలగునవి రచింపఁబడియున్నవి. అందు స్వల్పజీవితమే రచింపఁబడి యుండును. అవి వారి యాత్మలకు శాంతికాపాదకము లెంతమాత్రము గానేరవు. అందు శాంతి స్థాయీభూతమైనట్లుండెను. ఆ స్థలమున నడుగిడుట తోడనే వినయుని యాత్మ యింతింతనరాని యావేగంబునఁ గొట్టుకొనుచుండెను

ఇంతలో నొక సేవకుఁ డచ్చటికే తెంచెను. అతనిని వినయుడు ఇచ్చటి కొక యువతి ఇప్పుడే వచ్చి పోయినది కాదా?' యని ప్రశ్నించెను.

'ఔను'

'ఆమె యేమి చేసినది?'

సేవకుఁడు సంకోచించుచు నూరకుండెను.

'నీకేమియు భయము లేదు.' అనుచు నాతఁ డొక నాల్గణాల నాణె మాతని కిచ్చెను. సేవకుఁడు సంతుష్టుఁ డయ్యెను.

'అదిగో యామె యచ్చటఁ గూర్చుండి పూజ నొనరించినది.'

వినయుఁ డటకు పోయెను. ఆగోరీ రమారమి పదిసంవత్సరము లక్రిందట నిర్మింపఁబడినది కాని యది చాల క్రొత్తగా నుండుట వాని కధికాశ్చర్యముఁ గల్గించెను.

'ఆమె యీగోరీ కెదురుగ నిల్వఁబడి పూజ గావించినదా?'

'ఔను'

'ఒకదీపముఁ దెచ్చెదవా?'

'అలాగే!' అని యాతఁడు వెడలిపోయెను. అదియే సమయ మని వినయుఁ డాకట్టడము నలంకరించియున్న యొకపుష్పమాలను తీసి తనవస్త్రాభ్యంతరమునఁ దాఁచివైచెను. ఆసేవకుఁ డది యెఱుంగ రాదని యాతని యభిప్రాయము.

సేవకుఁడు దీపికతో నింతలోఁ దిరిగివచ్చెను.

ఆదీపికతో వినయుఁ డందున్నవిషయముల జదివెను. అది యంతయుఁ జదువునరికి వాని కాశ్చర్యమాయెను. తత్క్షణమ యాతడు తన జేబులో నున్న కాగితము కలముఁ దీసి యాగోరిపై నున్నదంతయు వ్రాసికొనెను. సేవకున కిదియంతయు నగమ్యగోచరముగ నుండెను. వినయుడు పరిశీలనము జాలించి లేచెను. అతడు కొంతదూర మరిగెను. మరల నేదియో జ్ఞప్తికి వచ్చి 'ఓయ్' అని పిలిచెను.

'ఏమి బాబూ!'

'ఈలాగున రమ్ము నీ పే రేమి?'

'నాపేరు గోపాల్' అని యతడు బదులిడెను.

'సరే' యని వినయుడు గృహాభిముఖుఁడై పదముల వడివడి వేయుచు బోయెను. సేవకుడు గోపాల్ ఏమియు దెలియక యట్లె యొక్కనిముస మాగి తనదారిని పోయెను.

౮

'వినయబాబూ! నేఁడింత యాలస్యమైన దేమి?'

అచేతన డగు వినయుఁ డొక్కమారుగా గగనహార్మ్యమున గోకిలాప్రణయహాసకంఠము నాలించి విచలితుఁడయ్యెను.

'ఏమియు లేదు' అని యాతఁడు నైజముగ బ్రత్యుత్తర మొసంగెను.

'ఏమియును లేదా? అదా కారణము.' అని మధుర వినయుని జూచుచు హాసోన్మాదిని యైపోయెను.

వినయుఁడుకూడ మందహాసంబు నొసర్చుచు నామెకడకు బోయి యామెపార్శ్వముననే యాసీనుఁడయ్యెను. భ్రమర యచ్చోట లేనట్లాతఁడు, నలువంకల బరిశీలించి, గ్రహింపఁగల్గెను. ఆమెకు తా నెఱిగినవిశేషము తెలియఁగింపవలయునని యాతని యభిప్రాయము. ఒక నిముసము దాటిన తరువాత వినయుఁడు గదిలోనికి పోయి తాను పరిగ్రహించిన పుష్పమాలికను దాచి వచ్చెను.

మధుర నవ్వుచు 'భ్రమర నెచ్చట దాచితివి' అని ప్రశ్నించెను.

వినయుఁడు నిర్విణ్ణుఁడును, నీరవుఁడును నైపోయెను. ఆమె ప్రశ్న నాతఁడు గుర్తింపలేకపోయెను.

'భ్రమర యేదీ?'

'నాకేమి తెలియును'

'నీతోఁ రాలేదా?'

'లేదు!'

'[illegible]?'

'అమెయు నీతోడనే వచ్చినదని నేను భావించుచుంటిని.... ఏమి, ఆమెను వీధిలో నుంచితివా?'

'అయ్యో! లేదనిన నమ్మవుకద.'

'ఉండుము! పిల్చి చూచెదను.' అని మధుర నాలుగైదడుగులు ముందునకు వైచి గట్టిగా 'భ్రమరా!' యని పిల్చెను.

'ఓయి !!!'

వినయు డాశ్చర్యచకితు డయ్యెను.

'ఏమి! వినయబాబూ! అదిగో!'

'ఏమో! నాకు తెలియదు.'

ఇంతలో మధురయు నేతెంచి యచ్చో నాసీన యయ్యెను. భ్రమరకూడ నచ్చటనే యధివసించెను.

'భ్రమరా! నీవు వినయునితో బోలేదా?' అని మధుర యడిగెను.'

'లేదు.' అని భ్రమర చెప్పెను.

మధుర యప్పుడు వినయుడు చెప్పినది సత్యమే యని తెలిసికొని తానట్లు వానిని ప్రశ్నించుట తప్పని యెఱిగెను. వినయుడు మాత్ర మదియొకతప్పుగా దలపలేదు. ఆమె పాప మమాయిక! లోకము నైన నెఱుగదు. వినను ఆమె యది హాస్యపూర్వకముగా నన్నది. అంతియకాని మరియొక భావముతో గాదు.

భ్రమరాముఖావలోకనము జేసి యామెయు నేదియో సంగతి కనిపెట్టి యుండునని యాత డూహించెను. అతని యూహా సరియైనది కాకపోలే [illegible].

'[illegible] భోజనమునకు [illegible] ఎన్మిదిగంటలు కావచ్చి నది. ప్రతిది[illegible] [illegible] కొట్టువాడు [illegible] రమూ తాసరికి [illegible] [illegible] ఉడిది. వేగ[illegible] [illegible].'

అను మధుర హెచ్చరింపులు విని వారు సత్వరము భోజనమున కేగిరి. భోజనానంతరమున వారు మరల వచ్చి కూర్చుండిరి.

'వినయబాబూ! పని సానుకూలమైనదా?' అని భ్రమర ప్రశ్నించెను.

'ఆ! ఐనది.'

'ఆమె మరల కన్పించిన దనుకొందును.'

'అంతియ కాదు.'

'మరి యింకేమి కన్గొంటివి.'

'ఆమెచర్యలు.'

'అవి యేమి.'

'ఆమె నేడు క్రైస్తవశ్మశానవాటిక వెల్వడుచుండ కనుగొంటిని. అందామె యేమి చేయుచున్నదో పరిశీలింప నేనందులోనికి జనినాడను. అందున్న గోపాల్ అనుసేవకునితో బరిచయము కలుగఁ జేసికొంటిని. ఆమె యందుగల యొకానొకగోరిని పూజించి వెడలి నట్లు తెలిసికొంటిని.'

'అది యెవరిగోరి?'

'ఇదిగో! అందున్నది లిఖించితిని చూడుము.' అని వినయుఁడు భ్రమరచేతి కొక కాగితము నందిచ్చెను. అందిట్లు లిఖింపఁబడినది.

అమరేంద్రనాథుని సతీమణియగు

లీల

స్మారకచిహ్నము.

(..................)

'ఈమె మా మధురజనని.' అని భ్రమర ఆశ్చర్యముతో బలికెను.

'ఔను. నీవన్నట్లే భావించితివి. ఆమెగోరీ నాధవళాంబరి యేల పూజించుచుండెనో తెలిసికొనవలయును . .. కాని మఱచితిని. ఆమెచే నందుంపఁబడిన పుష్పమాలకూడ దెచ్చితిని.' అని వినయుడు దానిని తెచ్చి భ్రమరచేతి కందించెను దాని నామె యందుకొని 'వినయబాబూ! ఇది యేమి?' అని యాశ్చర్య సూచకస్వరమునఁ బల్కెను.

ఆ పుష్పమాలికలో నొక కాగితము—అందుపై నేదో లిఖింపఁబడియున్నది—వ్రేలాడుచుండుట వినయుఁడు సాశ్చర్యముగా దిలకించెను.

౫

ఆశ్చర్య సంభ్రమంబులు పెనుఁగొనుచుండ వారా పుష్ప మాలలో గ్రుచ్చబడియున్న పింతకాగితము బరిశీలించిరి. అందిట్లు లిఖింపఁబడి యున్నది—

జననీ!

అమృతమయంబులైన నీమధురవాక్యంబుల వినుటకాని, నీ చూపునీడల నిల్చుటకాని, ఇంక నీజీవికి దుర్లభంబులు. హా! ఇంతలోనే యీపాపికి నీపవిత్రస్మరణకుఁ జోటైన లేకుండ పైతలవులీ కలుషహృదయమునఁ బ్రవేశించుచున్నవి. వీని కింక నంతము లేదా!—తల్లీ!—నీదివ్యసమాధినైన నాకప్పుడప్పుడు చూచుటకొకింత బలమిమ్ము. నీచరణదాసి.

వారొక్కమారు చకితులైరి. ఆవిచిత్రలేఖఁ గనుఁగొన వారి కేమియుఁ దోఁచుటలేదు. వినయునకు మతిపోయినది.

'మీజననిలీలకు నీమెకు నేమి సంబంధము?'

'ఏమియు లేదు.'

'ఏమియు లేదా? అట్లయినసుమమీగృహమునవిడిచి వరకుంటకు గారణ మేమైయుండును?'

'లీల కరుణారసార్ద్రహృదయ! ఆమె హృదయముబోలునది మరెవ్వరికి లేదని నే భావింతును. సుమకు జననీజనకులు లేరని నే నూహింతును, సుమను లీల దయతో జూచుచుండెడిది. కాని మాతో నామె కెక్కువ పరిచయము లేదు. ఐనను సుమ యెల్వరితో మాట లాడుస్వభావముకలది కాదు.'

'ఇందేదో రహస్యము లీనమైయున్నదని నాకేటికో పెద్ద యనుమానముగా నున్నది.'

'ఇందు రహస్యమున కేమున్నది?'

'అది సుమకు సంబంధించి యుండుననుకొందును. ఈమె నెవ్వరో వెన్నాడుచున్నారు కదా! అం దేదో రహస్య ముండితీరును అన్నట్లు చెప్పుమరచితిని. నేనుగూడ నొకపురుషుని ఆనాడు నా కగపడిన నల్వురిలో నొకని — ఈనాడు నా కన్నులతో నేను చూచితి నని చెప్పగలను.'

'ఐన నేడామె కేదో క్రొత్తవిపత్తు సంభవించునన్నమాట!'

'ఏమో? ఎవ్వరేమి చెప్పగలరు. నాటినుండి నేటివరకామె వారిచేత బడలేదు. నేఁ డేమగునో?'

భ్రమర రెండుమూఁడు నిముసము లూరకుండి

'వినయా! నేఁ డామె నెట్లయిన నీవు రక్షింపవలయును.' అనియెను.

'ఎట్లు?'

'———'

'ఆమెను నే నెట్లు రక్షింతును? ఆమె యెచ్చో నున్నదో తెలియదుకదా! నే నామె కెట్లు సహాయము జేయఁగలను?'

'నాకది తెలియును.'

'ఆఁ' అని వినయు డాశ్చర్యాన్వితుఁడయ్యెను.

'ని వాశ్చర్య మందఁ బనిలేదు. నీవలెనే నేనును సుమ నన్వేషించుచుండఁగా నామె శ్మశానవాటినుండి తిరిగి వచ్చుటకు కనుఁగొంటిని. నే నామెను వెన్నాడితిని. కాని యామె యది యెరుఁగదు. కళాశాలలో బూర్వ ముపాధ్యాయుడుగా నున్న సుధాకరుని యింటిలోని కామె పోయినది. ఆమె యచ్చోటనే యీరాత్రికి నిలచి యుండునని యూహించెను . మఱియొక విశేషము, ఆమె వెన్వెంట నొకభీకరాకారుడగు పురుషుడొకడుకూడ నాగృహముకడకు బోయి మరలివచ్చెను. అత డాగృహము గుర్తుగా జూచుకొని పోయినాడని నానిశ్చయము. తప్పక వారామె నీరాత్రి యేమైన జేతురు. కావున నీవామెను రక్షింప బ్రయత్నింపుము.''

'ఆమెతో నీకుఁగలియుంతయు దెలిపిన——'

'వలదు. దుర్మార్గుల బట్టుకొనవలెను.'

'నాకు సహాయము?'

'తుపాకిని తీసికొనిపోవుటకు మనకడ లేదు. ఒకకత్తిమాత్ర మున్నది. అది ధరించిపొమ్ము.'

'పదిగంటలకు పోయెదను.'

'సుధాకరునింటి కెదురుగ నొకపాడుగృహ మున్నది. ఉత్తరముగా నూరుకోన నతనిగృహ మున్నది. ఆగృహమునకు దారి తరువాత జెప్పెదను...నీ వాపాడుగృహములో గూర్చుండి వారియిల్లు చూడ నవకాశము కలదు. ఆగృహంబున నీవు రెండుగంటలు వినువరకు నుండుము. అటుతరువాత గృహమునకు రావచ్చును. ఏమి జరుగునో చూతము. ఆమె నెట్లయిన రక్షింపుము.'

భోజనానంతరమున వినయుడు రాత్రి జరుగబోవు సంగతుల నిర్మింప మొదలిడినాడు. ఆభీకరస్వరూపులు వానినేత్రములముందు నాట్యమొనర్చుచున్నట్లతడు భావించి తృప్తిపడుచుండి మరల చిరునవ్వు నవ్వుకొనుచు మరలమరల నూహాపథంబులలో నాగులాడి పోవుచుండెను.

భ్రమర వానికడ కేతెంచి పదిగంటలవరకు మాటలాడెను. అంత నాతడు ఖడ్గధారియై బయల్వెడలెను. వినయుడు తనగదిలోనికి బోయి నల్లనివస్త్రమొండు తెచ్చుకొనుచుండ ద్వారముఖంబున మధుర వానికెదురైనది.

'వినయబాబూ! . . . '

'ఏమి?'

'ప్రాణములపై నాశ లేదా?'

'మధురా! భయములేదు' అని ఉత్సాహముతో నతడుపల్కి నడువసాగెను. తనరెండుచేతుల వినయునిహస్తము బట్టి మధుర—

'వినయా! వలదు సాహసింప' కనియెను.

వినయునిచేతిపై వెచ్చని కన్నీటిబొట్లు రెండు పడినవి.

అతి డెట్టకేల కామెను సమాధానపరచి బయలువెడలినాడు.

సుధాకరునిగృహమున కెదురుగనున్నగృహములో నాతడు కూర్చుండునరికి పదునొకండుగంటలు కొట్టిరి.

అంతటను చీకటి. ఆచీకటిలో నింకను ఆగంటలశబ్ద మంతరింపలేదు.

ఎవ్వరో ఆసాధుగృహము ప్రవేశించిరి.

ఆత డెవరగు? అని చిన్న గుండు సన్నేరపడెను.

నినీలాంబరమునుండి యశనిపాతము వడినట్లుల వినయుఁడు భావించెను. ఆవచ్చినవాఁ డెవ్వఁడు? అతఁ డేటి కచ్చోటి కేగుదెంచెను? ఈ రహస్యమునం దావచ్చినవారికి గూడ నేదైనఁ బ్రవేశమున్నదా? అను ప్రశ్నాపరంపర వినయుని హృదయాంతరాళమున నొక్కపరి మెరసిపోయినది. అతఁ డూపిరియైన విడుచుటకు సాహసింపఁజాలకపోయెను. పిడికిటఁ బ్రాణముల బిగబట్టి యాతఁడు నిముస మొక యుగముగ గడపెను. కాని తన హృదయాందోళన మణచుకొని యేదియైన గానిమ్మని యాతఁడు వేగమే స్వస్థుఁ డయ్యెను.

అత్యావేశపూరితుఁడై యాతఁ డట్లే కూర్చుండియుండెను. ఆరెండవవాఁ డెవ్వఁడో అనుగుడనా యని యాతఁ డనుకొనియెను. కాని యుచ్చరింప సాహసింపలేకపోయినాడు. ఆవ్యక్తియు సీతని జూచినట్లు లేదు. కావున భయములేదని యాతఁ డూరకుండెను.

వినయుఁ డాలోచనాయాత్రారతి నుండగనే టంగున నొంటిగంట కొట్టిరి. అతఁడు మరియు సావధానుఁడై సుధాకరుని గృహము వంకనే చూచుచుండెను.

రెండుగంటలు కొట్టిరి. ఇంకను ప్రతిధ్వని యాఁగనేలేదు. పదధ్వనియైనది. వినయుని గుండె లొక్కమారాగిపోయినట్లయినవి. అతఁడు నిశ్చలుఁడై శూన్యతామసలోకమున దృష్టులఁబరచెను. ఒక విగ్రహము నిడవలె సుధాకరుని గృహద్వారముకడ వేచియుండెను. పదినిముసములలో మరియొక్కఁ డాద్వారము దెరచెను. వాఁడు గోడపై నుండి లోనికి దుమికి యాతలుపు తీసియుండునని యతఁడు తలఁచెను.

ఇంతలో నీపాటుగృహమున దాగిన వ్యక్తి లేచి నడచి [illegible] అతఁడును [illegible] భయముంబునఁ జూచుచుండెను. అంతయు నగమ్యగోచరముగా నుండెను. కాని యెందుచే

దొంగలే కానవచ్చుచున్నారు పాడింటినుండి పోయినవాఁడు కన్పడ లేదు. వినయున కంతయు చిత్రముగానే యున్నది. ఏమి యగునో చూతమని యాతఁడచ్చట కనిపెట్టుకొని యుండెను. కనుఱెప్ప వేయుట కూడ నాతఁడు మానినాఁడు. తమోవకుంఠనముఁ జీల్చుకొని యతని నిశితదృష్టులు నిరాటంకముగ నద్దెసలఁ దిలకించుచుండెను. చీఁకటిలోఁ గూరుచుండుటచేఁ జీఁకటిలోఁ జూచుట కాతనికి దుస్సాధ్యము కాలేదు. కాని మనుజులు నీడలవలె వానికిఁ గన్పించుచుండిరి. ఇంతలో నొకఁ డాయింటిలోనికిఁ జల్లగాఁ బోయెను.

మూఁడునిమిషములలో నాతఁడు భుజముపై నేదియో వేసి కొని వచ్చెను. అది యొక యచేతనవిగ్రహము, అని వినయుఁడు గ్రహించెను. ఆమె తెల్లనిబట్టలు చీఁకటిలోఁ గనఁబడుచుండెను. అతఁ డాయచేతనవ్యక్తిని మోసికొని బయల్వెడలుటయు, రెండవవాఁడు లోనికేగి తలుపువేయుటయు నొక్కమారు జరిగినవి. అదేసమయ మున వినయుఁడు తనస్థలము విడచి వానివెనుకఁ బోయెను.

ఒక పెద్దయార్తనాద మింతలో వినఁబడినది. అదేసమయ మున నెవ్వరో పరుగిడుచున్న యడుగుచప్పుడు వినవచ్చినది. అక్షణమె వినయుఁడు తనముందున్న చోరునిపై లంఘించెను. నిమిషమాత్ర మునఁ జోరుఁ డాయచేతనవ్యక్తిని నేలఁబడవైచి వినయునిపైఁ దల పడెను. వినయుఁడు, యువకుఁడు, ఉత్సాహపూరితుఁడు, అంతియ కాని సత్తువకలవాఁడు కాడు అట్లయ్యు నాతఁడు ధైర్యసాహసములతో దన శక్తి నిడుక ప్రతిపక్షి [illegible]. భయంకరరాక్షసుఁడగు వాఁ వినయునిపై నొకపెద్ద[illegible] విసరివేసె[illegible]. గట్టిగాఁ బట్టుకొని [illegible] డెను. వినయుఁడు నిమిషములో [illegible] సంధించె [illegible] సమయమున నొకస్త్రీ కరవాలము చోప [illegible] దూసికొనిపో[illegible]

ఇరువురు నాతనిపైఁ దలపడిరి. వాఁడు పలాయనమంత్రపఠన మొనర్చెను.

వినయుని ప్రాణములు కుదుటఁబడినవి. తనకు సహాయమొనర్చినయాతఁ డెవ్వఁడో కనుఁగొన నతఁ డిచ్ఛగించెను.

'అయ్యా! తమ రెవరు? ఈనిశీథమున నాకు తోడ్పడి నన్నా నృశంసుని కరకుకరవాలమునుండి రక్షించితిరి.'

'నాపేరు ప్రేమచంద్రుఁడు! తమనామధేయమేమో నేనెఱుంగనగునా?'

'నాపేరు వినయుఁడు!.. .....కాని ఆరెండవదొంగ యేమైనాఁడు?'

'వాఁడును పారిపోయినాఁడు. వాఁడు లోన గడియనైచి గోడ దిగుచుండఁగ వానికి శిక్షఁ జేసితిని కాని పాపమామె యెట్లున్నదో?'

వినయుఁ డాశ్చర్యచకితుఁ డయ్యెను.

'ఆమెను మీ రెఱుఁగుదురా?'

'చిత్తము తర్వాత చెప్పెదను.'

వా రాయచేతనస్త్రీకడకుఁ బోయి యామె కింకను తెల్వి రాలేదని తెలిసికొనిరి. ప్రేమచంద్రుఁడు జేబునుండి అగ్నిపేటికఁ దీసి వెలిగించెను.

'ఈమె యెవరు?' అను నాశ్చర్యసూచకవాక్యములే యిరువురు నుడివిరి ఆమె ఇర్వదిరెండు వత్సరములయీడుగలది. అంతచక్కనిది కాకున్నను కురూపికాదు. శ్యామలవర్ణమయం బగు నామెదేహమునఁ దెల్లని బట్టలు సొంపు నింపుచుండెను. ఆయింటివారిబిడ్డ యైయుం డునని వారు నిశ్చయించుకొనిరి. వెంటనే వా రాతలుపులతో వారిని లేపి లోనికొని చూచిరి. వృద్ధుఁడగు సుబ్బరాయుఁడు, వాని భార్య, మరియొక యువకుఁడు గోలుగోలుమనిరి కాని వారి నూరడించి

యామెకు వారు పరిచర్య లొనర్చిరి. ఆమెకు కొంచెము తెల్వివచ్చినది. క్లోరోఫారముచే నట్లయినదని వారు స్థిరపరచుకొనిరి. తమ బిడ్డను రక్షించినందుల కావృద్ధదంపతులు ప్రేమచంద్రవినయుల వేనోళ్ళఁ బొగడిరి. కాని వారేటి కష్టతలస్థపడిరో యెవ్వరు నడుగ లేదు.

ఏడుగంట లైనది. ప్రేమచంద్రవినయులు వారికడ సెలవుఁ దీసికొని గృహాభిముఖులైరి. వారప్పు డిట్లు సంభాషించిరి.

వినయుఁడు—మీ రాపాడుగృహమున దాఁగితిరా?

ప్రేమ—ఔను. మీరు నచ్చుటనే దాఁగితిరాయేమి?

విన—నేను మీకన్నముందు వచ్చిదాఁగితిని. మీరు దాగుట చూచితిని. కాని మీరు ముందుగ లేచిపోయి గోడవాకనుండి రెండవవానిని శిక్షించినారు. కాని మీకాసంగతి యెట్లు తెలిసినదో యడుగవచ్చునా?

ప్రేమ—వినయా! మీరెట్లు తెలిసికొనిరోగాని— నేనుమాత్ర మనుమానమువలన వచ్చితిని.

విన—నేనును అనుమానించియే వచ్చితిని. కాని మీరెట్లను మానించితిరి?

ప్రేమ—నేను సుమకు పరిచితుఁడను.

వినయుఁ డాశ్చర్యముఁ జూపుచు, 'అట్లయిన మీసహాయ మామె కోరినదా' యనెను.

'లేదు. దుర్మార్గులుకొందరామెను వెన్నాడుచుంట నేను కనుఁగొంటిని. నేఁడీయింట నామె యున్నదని వారు తెలిసికొన్నారు, అది నే కన్పెట్టితిని అందుచే నిట్లు వచ్చితిని.'

వినయు డాత్రముతో—

'ఏన సుమ యేమైనది?' అని ప్రశ్నించెను.

'బహుశః ఆమె రాత్రి పదెన్మిదిగంటలకే యిల్లు విడచిపోయి యుండవచ్చును.'

'ఆమె మీ కెట్లు పరిచిత.'

'క్షమించవలెను.'

'సుధాకరు డామెకు బంధువా?'

'కాడు. కాని, మిత్రుడు.'

'సుమవిషయమై మీ కేమైన దెలియునా?'

'అది నాకును తెలియదు. ఆవిషయమై మిమ్ము నడుగుటకు నే నూహించుచుండ మీరే యది యడిగినారు. కాని మీకు సుమ యెట్లు పరిచిత?'

'నా కామె పరిచితయైనను. నే నామె కపరిచితుడను.'

'అ దెట్లు?'

'మరియొకరివలన నే నామెగూర్చి తెలిసికొంటిని.'

'ఆమె నిప్పుడు కొందరు పాపచిత్తులు వెన్నాడుచున్నట్లు మీరు తెలిసికొంటిరా?'

'అగును.'

'మరల మన మెప్పుడైన గలసికొని మాట్లాడుకొందము' అనుచు ప్రేమచంద్రుడు ప్రక్కసందులోనికి మరలిపోయెను.

ఆసమయమునకు భ్రమర వినయుని కెదురుగా వచ్చుచు నతని గాంచి మందహాసము చేసెను.

---

౨

'వినయబాబూ! ని న్నిట్లు చూతునని నే ననుకొనలేదు సుమా' యని వచించుచు భ్రమర వినయునితో నడువ మొదలిడెను.

'ఏమి, ఎందుల కనుగొంటివి?'

'నీ విప్పటివఱకు రాకుండుటచేతనే! కాని నేమైనది? సత్వరము చెప్పుము. నా కాందోళనముగా నున్నది.'

'ఏమియును లేదు. వృథాయాసమైనది.'

'ఆదుష్టులు రాలేదా?'

'వచ్చిరి. కాని సుమ అగ్రహామునుండి యేడెన్మిదిగంటలకే దాటిపోయినది.'

'వారి కది తెలియదుకదా?'

'ఔను. తెలియదు. కాని సుధాకరునిపుత్త్రికను వారు దొంగిలించుకొనిపోవఁ బ్రయత్నించిరి. వారి కది తెలియదు.'

'వా రెంతమంది?'

'ఇద్దరు. కావుననే బ్రతికితిని.' అని వినయుడు రాత్రి జరిగిన సంగతులన్నియు నామె కెరుకపరచెను. భ్రమర నివ్వెరగంది 'అల్లయిన ప్రేమచంద్రుని మూలమున నేమైన లాభ ముందునా?

'ఆతఁడేమియు జెప్పకుండెను. మరల నెప్పుడైన నాతనితో మాటలాడిన దెలియవచ్చును.'

'అతని గృహ మెక్కడ?'

'అయ్యో! అతడు మాటలాడుటకే సంశయించుచుండెడి వాఁడు. మరలఁ గలయుదమని యాసందులోనుండి పోయినాడు.'

భ్రమర కేమియు దోఁచలేదు. మరియొకమా రెట్టులైన నాతనితో మాటలాడుటకుఁ బ్రయత్నింపుమని యామె వినయున కుపదేశించెను.

'మీ రాదొంగలఁ బట్టుకొనవలసినది.'

'వారు పారిపోయిన మరి యెట్లుపట్టుకొందుము? మేము వారిని వెన్నంటినఁ దొలుత జారిపోయినవాడు వచ్చి యాస్త్రీ నేమిచేయునో యని మాభయము.'

'ఔనది నిజమే. కాని యీసంగతి పోలీసువారికి తెలియఁ బరచినారా?'

'లేదు. ప్రేమచంద్రునకుకూడ నందుల కిచ్ఛఁ జూపలేదు. ఏమనిన మాసాక్ష్య మవసరమగును. దానివలన మాకు చిక్కులు కలుగవచ్చును'

'ఔను. అది నిజమే. పోలీసుగోల యెందుకు, కాని బాగుగా నైనది. దుష్టులకన్నులలో దుమ్ముజిమ్మి యామె పోయినది. కాని యెప్పటికైన వారామెను విడువరు. అది నిశ్చయము.'

ఇట్లు సంభాషించుకొనుచుండఁగా వారిభవనము సమీపించిరి భ్రమర, వినయుని మెల్లగా నడువుమనినది. అతఁడట్లే చేసెను. వినయు నొకప్రక్కగదిలో దాచి యామె గట్టిగా మధురా! మధురా!' యని పిలచెను.

తత్తరముతో మధుర ప్రవేశించి 'ఏమి!—ఏమైనది?' అని రుద్ధకంఠస్వరంబున వచించెను.

వచ్చుచున్న నవ్వును బలవంతముగా నామె యాపుకొని భీతిల్లినదానివలె నటించుచు 'వినయు డెక్కడను లేడు' అనియెను.

'నే నతనిఁగూర్చి కనుఁగొనవలె' నని యామె మేడమీఁదికి చరచర బోయెను.

మధుర కనుఁగొలుకుల నుండి బాష్పములు కారదొడంగెను. ఒక పెద్దనిట్టూర్పు మిడచెను. ఆమె యిక నిల్వలేకుండెను. వినయుఁ డొక్కయుదుటునవచ్చి యామెను పట్టుకొనియెను. సంభ్రమాశ్చర్యంబు లామె హృదయంబునఁ బెనఁగొనెను.

'ఆమెవాక్కు లెల్ల నమ్మితివి!' అనుచు నాతఁడామె కన్నీరు చేరుమాలుతో నొత్తెను.

మధురావినయులు మేడపైకేఁగుసరికి భ్రమర హాసతరంగములలో నూఁగులాడిపోవుచుండెను. ఆనందతరళోత్ఫుల్ల నయనయై మధుర యామెను జూచుచు మందహాసిని యయ్యెను. వినయుఁడు కూడ నొక యమృతహాస మొనర్చెను. ఆసుస్మేరశీకరంబులలోఁ బ్రణయార్ద్రప్రభావము ప్రస్ఫుటంబుగఁ బ్రస్ఫురించుచుండెను. అందు బ్రణయానంద మందహాసములు, సౌందర్యానందచకితలోచనంబులు పులకించుచుండెను.

ఉదయమంతయు వారేవో కబురులఁ జెప్పుకొనుచు గడిపిరి. రాత్రి జరిగిన సంగతు లాలించి మధుర చాల భీతచిత్త యయ్యెను. ఆమె వినయునికూడ నిక నెన్నడు రాత్రివేళ నొంటిగ బోవలదని హెచ్చరించెను. భ్రమరమాత్ర మామె వాక్కుల సరకుసేయలేదు.

"మధురా! నీవింకను లోకము నెఱుఁగవు. సుమనుగూర్చిన రహస్యము—అం దేదియో గుప్తమైయున్నదని నాయనుమానము—మనము ముఖ్యముగా నెఱుఁగవలయును' అని భ్రమర యామెను మందలించెను మధుర మరేమియు మాటలాడలేదు.

నాఁడు మధ్యాహ్నసమయంబున భ్రమరావినయులు క్రిందటి దినమున గనుకొనినట్టల సుమపేటికఁ దెరువఁ బ్రయత్నించిరి. అది తెరచుట కొంతవరకు దుస్సాధ్యంబుగా నుండెను. కాని యెట్టులైన నది తీయవలెనని ప్రయత్నించుటచే నది వారు తెరువఁగలిగిరి.

అం దేమి యున్నవి?

పెట్టెనిండ [illegible]లుండునని పాఠకు[illegible]ము. కాని యొకటి రెండు గుడ్డలుతప్ప మరేమియు నందు లేవు. ఒక గానుపంటికూడ నందు కలదు.

వారిద్దరుఁ జెల్లపోయిరి. తప్పకుండ సందేశమైన నుత్తరము లుండునని వారు ఆశతో నాగుడ్డలఁ దీసివిచ్చి చూచిరి అందు రెండు కవరులు దొరికినవి కాని యవి చింపఁబడలేదు. వారు దాని కింతకన్నను చకితులైరి. ఆకవరులు రెంటిపై విలాసముజూడ నొకటి మధురకు నొకటి భ్రమరకు వ్రాయఁబడి యున్నవి.

భ్రమర దానినిఁ జూచి 'ఇది ఏమి?' అని ప్రశ్నించెను.

'ఏమి తెలియలేదా? ఆమె వెడలిపోవునప్పుడు మీకీ యుత్తరములు వ్రాసి పడవైచినది. మీరీ పెట్టె విరుగగొట్టి తీతురని యామె యభిప్రాయము.'

''అట్లు కాదు ఆమె పెట్టెతాళము చూచా మరునాడే దొరికినదికాని మేమది పారవేసితిమి . . . దాని కేమి పోని మిప్పుడైన నీయుత్తరములయందేమైన మనకుఁ గావలసిన వింశలు దొరకు నేమో చూతము''

తత్క్షణము వారా యుత్తరములఁ దీసి చూచిరి. ఆరెండును ఒకేవిధమున లిఖింపఁబడి యున్నవి. అందొకటి చదివిన రెండవది చదువ నవసరము లేదు. అందిట్లు లిఖింపఁబడియున్నది.

ప్రియసోదరీ!

ఇన్ని దినములనుండి మీయన్నముఁ దిని మీయింట నుండి కడకు మీతోఁ జెప్పకుండ వెడలితినని తలంపకుఁడు. అది తెల్పుటకే యిది లిఖింపఁబడినది. కారణాంతరములచే నేను మిమ్ము విడువవలసివచ్చినందుల కెంతయుఁ జింతిల్లుచున్నాను. నన్నుఁ గూర్చి మీరలు తెలిసికొనుటకుఁ బ్రయత్నింపెదరేమో! కాని నేనిఁక మీకు గనఁబడనని యూహ. ఒకచో మీరెప్పుడైన నన్నుఁ జూచి నాసంగతి మీరు తెలిసికొనుటకు ప్రయత్నింపవలదు. మీకు నిష్కారణముగా నింత నొప్పించినదాన నైతిని — సుమ.

మరలమరల వారాలేఖ బఠించిరి. వినయుడు చీకాకుతో 'ఈలేఖ మరింత చిక్కుపెట్టుచున్నది. దీనివలన నేమియు లాభము లేదు' అని గద్గదస్వరంబున వచించెను.

'దీనివలన నేమియు లాభములేదా?' అని భ్రమరపల్కెను.

'ఏమున్నది?'

'ఉన్నది. ఇం దేదియో గూఢరహస్య మున్నది. 'నన్ను గూర్చి మీరలు తెలిసికొనుటకు బ్రయత్నించెద రేమో!' అనికదా వ్రాసినది. దానివలన నామెగూర్చినరహస్య మున్నదని తెలియదా?'

'మన మది ఇదివఱ కనుకొన్నదేకదా!'

'ఇప్పు డది స్పష్టమైనది.'

'ఔను.'

భ్రమర 'మధురా!' యని పిల్చినది. మధుర యాత్రముతో నేతెంచి 'ఏమి' అని ప్రశ్నించెను.

'నీకుత్తరము వచ్చినది.'

'ఎక్కడనుండి?'

'సుమ వ్రాసినది.'

'బాగుగనే యున్నది!'

'లేదు నిజమే' యని యాలేఖ నామె మధురకిచ్చెను. మధుర దానిని పఠించి,

'దీనియర్థ మేమి? నీ కిది యెచ్చట వచ్చినది?' అని ఆశ్చర్య స్వరంబున నడిగెను.

'ఆమెపెట్టెలో బడవైచినది. అది యిప్పుడు మనము చూడ గలిగితిమి?'

'అదియా!'

మధుర మరల దనగదిలోనికి బోయెను.

'భ్రమరా! ఈసుమ మీాయింట నేటికుండెడిదో నీకు కొంత వైన దెలిసికొనవలెనని యప్పు డభిలాష లేకపోయినదా?'

'లేదు. మాకావిషయ మేమియు లేదు. కాని లీల మరణిం చుటకు బూర్వము ప్రత్యేకముగ నామెను పిల్చి యేమియో మాట లాడినది. మాతోగూడ మాటలాడినది. ఆమె మాతో చెప్పిన దేమనిన, ముఖ్యముగ సుమ విషయమే!......

'ఏమి వచించినది?'

'సుమను సోదరివలె జూచుకొండని. ఆమె గృహమందుండు నన్నిదినములు నాటంకము జేయవద్దని. అంతకుదప్ప మరేమియు లేదు'

'భ్రమరా! నిన్నొక్క ప్రశ్న మడుగవలెను.'

'నా కది తెలియును. లీల పరమపతివ్రతాశిరోమణి. ఆమె నొక్కపరి తలచిన పుణ్యమబ్బును. ఆమె అమరేంద్రనాథవిరోగ మునసే కృశించి స్వర్గము జేరినది. ఆమెవంటివారు లోకమం దుండుటరిది.'

'ఐన నాకు మరేమియు దోచుటలేదు. ఎట్టులైన మున్ముం దామెగూర్చి తెలియగలదు.'

'అది మనప్రయత్నములో నుండును.'

'తప్పక ప్రయత్నింతును.'

'ఆ ప్రేమచంద్రు నెట్లయిన బట్టుకొనుటకు బ్రయత్నింపుము. అతనివలన మనకు కొన్ని విశేషములు తెలియవచ్చు ననుకొందును.'

'అది నిజమే. ఈమా రెవ్వడైనం గన్పడిన నతనికి తెలిసిన సంగతులన్నియు గ్రహింతును......ఉం ఇంక నవి పెట్టెలోం బడ వేయు'మని వినయుండు లేచెను.

భ్రమరి యవి తీసి గట్టిగాం దులుపుటయు నందుండి యొక కాగితము పడెను.

అని చెప్పిన భ్రమర యందికొని లోనఁ దిలకించెను.

అందున్న అక్షరము లెవ్వరివి?

స్వర్గధామంబున నిజనాథునితోఁ బసిఁడి తూగుటుయ్యెలల నూగుచున్న లీలవి.

---

౯

భ్రమర చదువుచున్న లేఖయం దేమి యున్నదో. అదియెవరు వ్రాసిరో, తెలిసికొనుటకు వినయుఁడు చేసినయూహాలు సరియైనవి కాకపోయినవి. ఆయక్షరములు లీలవని గ్రహించినంతనే భ్రమర యదిచదివి ముగించినది. వినయు డాసక్తితో సాభిప్రాయముగ నామెను జూచి, 'అందేమి యున్నది? అది ఎవరు వ్రాసినది?' అని ప్రశ్నించినాఁడు.

'ఇది లీల వ్రాసినది.'

'లీలయా?'

'ఔను.'

'ఎవరికి?'

'మరి యెవరికి! సుమకు.'

'అందేమి యున్నది.'

భ్రమర తెల్పుటకు సందేహించెను. కాని వినయుడంతటితో నూరకుండక యదేప్రశ్న వేసినాడు. కాని యామె మిన్నకుండెను.

'నే నది చూడరాదా?'

'లేదు. దానిని నీ విప్పుడే పరిశీలింపుము.' అని భ్రమర వినయునిచేతి కాలేఖ నందించెను.

దాని నాతడిట్లు పఠించెను.

ప్రియకుమారీ! సుమా!

నాకు దైవసముఁ డగు శ్రీనానాథుఁ డీలోకమును వీడి యనంతాలయము నెప్పుడు చేరెనో అప్పటినుండి నా రుగ్ణత దిన దినవర్ధమాన మగుచున్నది. నా ప్రాణవాయువు లెప్పు డాయానందమూర్తి పరిశుభ్రజీవవాసనలలోఁ గలయునో! — దైవాధీనము. నా ప్రస్తుతస్థితి బట్టి నే నింక నెన్నియోదినములు జీవింపనని తోఁచుచున్నది. నా ప్రేమకు సమపాత్రులగు నిన్ను మధురా భ్రమరలను నేను చూతునో లేదో? నేను త్వరలో నచ్చటికి వచ్చెదను. అట్లు గాకున్నను, నీవు సర్వకాలము నచ్చటనే యుండవచ్చును. ఆవిషయమై నిన్ను ప్రశ్నించువా రుండరు.

ఈ నా అంత్యవాయువులు మీదీవెనలతోడను, ఈనా అంత్యదృష్టులు మీరూపములతోడను నిండునని ఆశింతును.

నేను ముఖ్యముగ వ్రాయవలసినది ప్రమాదవశమునఁ గాని మరియొట్లైనఁ గాని నీ కెఱుకయైన విషయములు లోకమున కెఱుక పఱచవలదు. ఇది నా అంత్యసమయమున నీకు నే నిడెడి అనుల్లంఘనీయమగు నాజ్ఞ. నీ కింతకుమించి వ్రాయనవసరము లేదు. గ్రహింపుము.

నీప్రియకాంత, లీల.

వినయుఁడు పదేపదే యాలేఖను మనసులోఁ బదిమార్లైన జదివినాఁడు. అవన్నియు ప్రేమమయవాక్కులు. నిర్మలతాస్వరూపములు, స్వచ్ఛతాసంపూరితములు.

వాని కేమియుఁ దోఁచినదికాదు. అతఁ డేదియో యనుకొనినాఁడు. దానిని ఖండించినాఁడు. మరల మరియొకటి. దానికి ఖండనము. ఇట్లే యనేకాపూర్వాలోచనములు. అతనిని వింతగా భ్రమర చూడ మొదలిడినది.

'వినయ బాబూ! ఏమి అంతతీక్ష్ణముగా నాలోచించుచున్న వాఁడవు. నీ కేమి తోఁచినది.'

'ఏమియు లేదు.'

'ఏమియును లేదా?'

'ఆ! ఏమియును లేదు సర్వశూన్యము. అంతకంత కీరహస్యం బతిగంభీర మగుచున్నదియే కాని మరేమియు లేదు. ఈరహస్య సముద్రమున నా కేదియుం దటము కానరాకున్నది.'

పాపము భ్రమరకుఁగూడ సంశయ సగమ్యగోచరమే యై యున్నది. ఆమె కేమియుఁ బాలుపోకుండెను.

'కాని వినయ బాబూ! ఈలేఖఁ జూచిన నెన్నియో అనుమానములకుఁ గారణమగును.

'అది నిజమే'

'కాని నాకెంతమాత్ర మది లేదు. నీకుఁగూడ నట్టి దుండరాదని నేను మరియొకమారు నొక్కి చెప్పుచున్నాను. మామధురజననీ జనకులయందు మన కెట్టియనుమాన ముండరాదని నాయభిప్రాయము. అది ముమ్మాటికి నిశ్చయము. అట్టిసచ్చరితుల నే ననుమానింప జాలను. నామన సందుల కొప్పదు.'

అట్లు భ్రమర వచించుటయు వినయుఁడు మాటలాడఁజాలక పోయెను. అతఁడు నీరవృత్తి యుండెను. గంభీరాంధకార మందున్న వాఁ డెట్లుండునో యాతఁడు నట్లె యుండెను. అతఁడొక్కమారు జరిగినసంగతుల జ్ఞప్తికిఁ దెచ్చుకొనెను సుమ లీలను జననీయని సంబోధించుట,—లీల సుమకు వ్రాసిన యుత్తరమందు గలుగు వింతసంగతులు,—ఆమెకు తెలిసినవిషయముల దాచియుంచుమని యామె వ్రాయుట—ఇవన్నియు ప్రబలనిదర్శనములు కావా! అట్లనుమానింపవచ్చునా?—కాని యెవ్వరికి దెలియకుండ సుమ గృహముపీడి

యేగుట యేమి!—ఆమెయెల్లప్పుడు సంపూర్ణధవళవస్త్రంబులు ధవళావకుంఠనము ధరించుట యేమి!—ఆమెను వెన్నాడుచు నెవ్వరో తిరుగుటేమి? — ఇదియంతయు నాకగాని కింకొకటి పొందకున్నదే. ఇందుగలసంగతు లేమియు గ్రాహ్యంబులు కాకున్నవే? అని యాతడు తలపోయజొచ్చెను.

భ్రమరయు నాతనివలెనే యేవేవో యూహాపోహలలో దిరుగాడుచు గడ కేమియు దెలియక యూరక నలుదెసల దిలకించుచు గూరుచుండెను.

వినయుడు కడకు దలయెత్తి 'యొకలా' గొనగించినవో, ననెను.

'ఎట్లు?'

'ఇప్పుడు సుధాకరునియింటి కేగి యామెవిషయమై కనుగొందును.'

'అది నిజమే.'

'అట్లయిన నిప్పుడే పోయెద'నని వినయుడు లేచి వస్త్రధారణం బొనర్చి యాక్షణమ సుధాకరునింటి కేగెను.

వినయు డేగుసరికి సుధాకరుడు వాకిట గూరుచుండెను. వినయుని జూచినంతనే యతడు లేచి 'దయచేయవలెను.' తమ కృపచే నాకూతుప్రాణములు నిల్వబడినవి. మీరు మాపాల దైవములు. మీఋణ మెన్నటికి దీరదు.'అని యతని నాసీనుజేసెను.

వినయుడు కొంతవరకు మాటలాడి తన కార్యము సాధింపనెంచి యిట్లు ప్రస్తావించెను.

'మి మ్మొకవిషయ మడుగవలయును.'

'ఏవిషయము? అభ్యంతర మేమియు లేదు. అడుగుడు.'

'సుమను గూర్చి'

సుధాకరు డదరిపడెను.

'మీ రేమియు నదరిపడ నవసరములేదు. కాని నే చెప్పవలసిన సంగతియొకటి. ఆమెకొరకే నిన్నరాత్రి చోరులు మీయింటికేతెంచిరి. ఆమె లేదని వారెఱుగరు. అందుచే నెఱుగక మీకూతు దీసికొనిపోవుట తటస్థించినది. నే నామెశ్రేయ స్సభిలషించువాడను. ఆమెగూర్చి మీ కేమి తెలియునో చెప్పుడు.'

'నాయనా! నాకేమియు తెలియదు. మాయింటి కామెవచ్చి యప్పుడప్పుడు తలదాచుకొనును. తన్నుగూర్చి యెవ్వ రడిగినను చెప్పవలదని యామె చెప్పినది. తమరుకావున జెప్పితిని. నాకేమియు దెలియదు.'

'పోనిండు. ఆమె కీసంగతి తమరుగూడ దెలియనీయకుడని నాప్రార్థనము. కాని యామె నెవ్వరో దురాత్ములు వధింపనున్నారనిమాత్రము చెప్పుడు' అని వినయుడు గృహోన్ముఖు డయ్యెను.

వినయు డిల్లు వెడలిపోవుచుండగా నాప్రక్కనే యొకపూరుషుడు రహస్యముగ నిల్వబడియుంట చూచెను.

'అత డెవ్వడు!'

ఆచోరులలో నొకడు కాడుకద యని యత డనుకొనుచు మెల్లన బోయెను.

---

౧౦

ప్రశాంతయామినీరమణీమణి శుభ్రజ్యోత్స్నల వెల్వరించుచుండెను. ఆర్ద్రములగు సైకతస్థలంబులలో నావెన్నెల వెలుగులనంతకల్యాణరాగంబుల గురియించుచున్నట్లుండెను. సెలయేటి యలలయూయెలలో నూగులాడుచు జంద్రిక సుధావాసిని యైపో

వుచు నానందంబున దాండవించుచుండెను, నునుమబ్బుతునకలో లొక్కొక్కటి పక్షులవలె నాకాశయాన మొనర్చుచుండెను. ఆకుసుమములనుండి సుధామధురమూర్తి గ్రోవ జేసికొని నేలను చుంబించుచుండెను అనంతాకాశయానమున గలసి యవి యొక్క మారుగ నేమబ్బుకొననో జలుగురంగుల నీనుచుండెను. గలగలని చెట్లయాకులు గాలివీచినపుడెల్ల శబ్దమొనర్చుచు దమలో నన్యశబ్దంబుల నైక్యము జేసికొనుచుండెను.

తీవగమిచే నల్లబడిన యొకతూగుటుయ్యెలలో నానందహాసినియై యొకమధురస్వరూపిణి యూగులాడుచుండెను. ఆమె లేతయధరమునుండి విరహగీతము లెన్నియో వెల్వడుచున్నవి. ఆగీతానినాదములో బ్రకృతియే చెవివిచ్చి తలయూపుచు నైక్యమైపోయినది.

ఆమె ఎవ్వరు?

అది యతనికి తెలియదు. ఆమె కెలుక లేకుండ నాత డాహరిణీవిలోచన నేకాగ్రదృష్టితో దిలకించుచుండెను. ఆతనినేత్రములు సహజలజ్జాంకితంబులయ్యు నాత డవి మాయజాలనియట్టు లామెను నిశ్చలములై తమలో గలిపివేయ బ్రయత్నించుచుండెను. తటిల్లతవలె నామె యాతూగుటూయెలలో మెలగుచుండెను.

ఆమె యెవ్వరు? అని యతడు తన్నుదా బ్రశ్నించుకొన్నాడు. అతనికి సమాధానము లేకపోయినది. తన్నుతానే మఱచినప్పు డితని కన్యమెల్ల తెలియగలదు?

తః వితీర నాత డామెను కన్నులపండువుగ జూడనారంభించెను. ఆనయనసౌందర్యము వాని నాకర్షించినది. ఆచెక్కుటద్దముల గులాబీరంగు వాని నున్మాదు జేసినది. ఆహాసోత్ఫుల్లముఖారవిందము వానికానందదాయక మయ్యెను. ఆమెయుపుకదలిక లతని భ్రమపుచ్చినవి. నీరవుడై యాత డమ్మనోజ్ఞమాధురీమూర్తి సౌం

దర్యరసము గన్నుదోయితో గ్రోలుచుండెను. అత డిక నచ్చో నిల్వ లేకపోయినాడు. మెల్లమెల్లన దప్పటడుగులిడుచు నాత డాకుసుమకోమలిని జేరుటకై వెడలెను.

హాసోత్ఫుల్లనయనములతో నాతని నామెచూచి చకితదృక్కులతో నాతనికి స్వాగతంబొసగెను. ఈయద్భుతప్రణాళిక దిలకించుచున్న యొకకోకిల మదోన్మత్తయై కూయన నారంభించెను.

అత డల్లే తెంచినంతనే యామె చప్పున దూగుటుయ్యెలడిగ్గి మెల్లన నతని డగ్గఱి—

'ఓఆనందమూర్తీ! నీవెవరు? ఇచ్చటి కేల్లువచ్చితివి?

అతడు మాటలాడలేకపోయెను.

'ఏమి? మాటలాడుము.'

అత డూరకుండెను.

'న న్నప్పుడే మఱచితివా?'

అతడు విస్మితుడై,

'లేదు. మఱవలేదు' అనియెను.

ఆమె వానిచేతి నవలంబముగఁ జేసికొని నడువనారంభించెను. ఆచేతినుండె ఆమె స్నేమిఁచేయుచుండినఁ దాను నల్లే కావింపుచు నామె యడుగులలో నడుగులువేయుచు నాతఁ డామె వెన్నంటెను.

అదేసమయమునఁ గోయిల యొకచక్కనిపాట పాడినది. దానిభావ మాలించి వారు సిగ్గుజెందిరి.

'పుష్పమా! లతామండపమునఁ గూరుచుండి సుఖమనుభవించు నీకు ప్రణయపరీమళ మెట్లలవడినది? దానిచే జగత్తునంతయు వశీకరించుకొనుచుంటివి. తుమ్మెదభ్రమ్మరీనితోఁగూడి లోకము నే మఱతువా?'

వా రాపాట ప్రతిధ్వనించుచుండఁగ నచ్చోనిల్చి యాలించి నారు. ఆమెబుగ్గలకు రోజారంగులెక్కెను.

'ఆపాట లెవరు దానికి నేర్పిరి?'

'స్వతస్సిద్ధము.'

'కాదు. మదము. ఎంతకొంటెపక్షి.'

ఆమె మరియేమియు ననలేదు.

'అబ్బ. ఏమి యీప్రకృతిమాధుర్యము.

'చిత్రకారుఁడవగునీవు కుంచెపట్టుకొని యంతకుమించిన చిత్రములు వేయలేవా?'

'ఎన్నఁడు నే నట్లు చేయఁజాలను. నాకు ప్రకృతియనినఁ బ్రేమ. నేనం దానందతన్మయుఁడ నయ్యెదను.'

ఏమి నన్ను ప్రేమింపవా?

'హృదయపూర్వకముగఁ బ్రేమింతును.'

'ప్రకృతికన్నను?'

అతఁడు మరి మాటలాడలేకపోయెను.

'ఏమి. చెప్పవా?'

'నేను చెప్పలేను.'

'చెప్పవలెను?'

'వచనామృతము నాకు చాలదు. నేను నిన్ను ప్రేమింతును. అందఱికన్న మించి—ప్రకృతికన్న—ప్రేమింతును. నీలో నంతకన్న నందము గ్రహింతును. ఆసౌందర్యమువలె నీసౌదర్యమును నాలో నొకనూతనోత్సాహము పుట్టించుచున్నది.'

అతఁ డామెముఖముపై నసహజప్రేమావలోకనములఁ బఱపి, ద్యూరామోలేఁ జెక్కుల గీయుచు హర్షతన్మయుఁ డయ్యెను. మేనఁ బులకరిత్త నామె వానిసమున్నతవక్షఃప్రదేశంబున దనశిర మానుకొనియెను.

కోకిల మరియొకగీత మాలపించెను.

"ఆపట్పదునికౌఁగిట నున్నంతనే యంతముదమందఁ బనిలేదు ఒకపెనుగాలి వీచి నితావిని, సీతేనను దొంగిలించినంత నాతఁ డెట కోపోవును. పుష్పమా! గర్వింపకు."

భీతినయనంబులతో నామె సల్వంకలఁ బరికించెను.

పాట యాఁగిపోయినది.

ఆమెగుండెదడ వానికి, వానిగుండెదడ యామెకు విస్పష్టముగా వినఁబడుచుండెను.

అంతయు నొక్కమా రంధకారబంధుర మయ్యెను. గట్టిగా నొకరినొకరుపట్టుకొని వార ట్లే నిల్వఁబడిరి. చంద్రునిపైఁ బెద్దమేఘ మొండు యానమొనర్చుచుండెను.

దూరమున వారికి పదశబ్దము వినవచ్చెను. ఒకభీకరమూర్తి యావంకకు వచ్చుచున్నట్లుండెను.

'అతఁ డెవ్వఁడు.'

'నాకు భయమువేయుచున్నది. నన్నాభీకరరాక్షసునినుండి రక్షింపుము. హృదయాధినాథా! అతఁడు నన్ను గొనిపోవుట కట్లే తెంచుచున్నాడు. నీవే నాకు సర్వము. రక్షకుఁడవు' అనుచు నామె వానికంఠమునఁ దనచేతులు పెనవైచి యాక్రోశించెను.

కన్నీటివరద లామెసమున్నతవక్షమునుండి పాఱుచుండెను. అతఁ డామెకటిప్రదేశముపైఁ జేయివైచి యామెను పట్టుకొనెను. వివశమైయున్న పుష్పమువలె నామెముఖ మంతలోనే వాడి కళాహీనమై పోయినది. అందాయమృతమాధుర్యము మరి గోచరింపకుండ మలినీకృతమై యామెముఖముండెను.

అంతకంత కాభయంకరస్వరూపము వారిం జేరుచుండెను. వారి భయము నంతకంత కధికముకాఁజొచ్చెను.

ప్రణయాధినాథా! ఇఁక నాకు దిక్కెవ్వరు? అకర్కశహస్త

మున నేఁ బడవలసిన దేనా . . హా! దైవమా! నీవైన నన్ను రక్షింపవా!' అని యామె యెలుఁగెత్తి యేడ్చుచుండెను.

అతఁ డామె నూరడించుచుండెనేగాని యాతనిహృదయం బధికాందోళన కావాలంబయ్యెను.

'ఈపుష్ప మాయినుపచేతులలో నలగవలయునా! ఇక నెన్నటికైన దానికి విముక్తి యుండునా, జీవితమంతయు నష్టి యంతమగునా! హృదయాధినాథా! ఇదే నన్ను మీకప్పగించి వేయుచుంటిని. నా కిఁక నేమికో అంతే? ఈహృదయ మెప్పటికైన మీదే.' అని యామె విలాపించుచు నాతనికాళ్ళకడ వివశయై పడిపోయెను.

అతఁ డేమియుఁ జేయఁజాలక యట్లె తిలకించుచుండఁగా నామె గట్టిగాఁ వినయా! వినయా! యనిపిలిచెను.

వినయుఁడు త్రుళ్ళిపడి లేచెను. ఇంతవఱ కాతఁడు స్వప్నముఁ గాంచుచుండెను. అతఁడు కళ్ళువిప్పునరికి కట్టెదుట మధుర నిల్వఁబడియుండెను. ఆమె యాస్వప్నసుందరియే. మధురయే తన్ను నిద్రనుండి లేపినదని యాతఁడు తలఁచెను.

చంద్రుఁడు వెన్నెల వెల్లివిరియుచుండెను.

'వినయబాబూ! ఇంకను నిచ్చటనే కూరుచుంటివేమి? నిద్ర పోవుచుంటివా?'

'నిద్రవచ్చినది. లోనికి పోదమనుకొంటినిగాని మరి కదలలేదు. కాని యిపు డెన్నిగంటలైనది?'

'పండ్రెండు దాఁటినది.'

వినయుఁ డేమియు మాటలాడలేదు. స్వప్నవృత్తాంతంబుల నాతఁ డాలోచింపఁదొడఁగెను.

'ఏమి యాలోచించుచుంటివి?'

'ఏమియు లే' దని యాతఁ డూరకుండెను.

'మధురా!'

మధుర యాతనిప్రక్కనే దగ్గరగా నిల్వఁబడియెను.

ఆమె హస్తము నాతఁడు మెల్లన దనచేతఁ బట్టెను. ఆమె ముఖము వంచి యూరకుండెను.

ఆమె కరమునెత్తి యాతఁడు ముద్దిడుకొనెను. ఆప్రణయ ప్రపంచములో వారు లోకమే మఱచిరి.

——

౧౧

నెలదినములు కాలప్రవాహములోఁ గలసిపోయినవి. కాని భ్రమరావినయు లెంతప్రయత్నించినను సుమనుగూర్చిన సంగతు లేమియుఁ దెలియరాలేదు. ఒక్కపరిమాత్రము వినయుఁడు ప్రేమ చంద్రుని గలసికొని యాతనితో మాటలాడెను. అప్పుడు సముద్ర తీరమున నాతఁడు త్వరితగమనుఁడై పోవుచుండెను. గప్పున వినయుఁ డతనికడకుఁ బోయి యాతనిఁ బల్కరించెను. ప్రేమచంద్రుఁడు వినయుని తీక్ష్ణముగఁ జూచి మరియేమియుఁ బల్కలేదు. వినయుఁడు రిచ్చవడెను. అతఁడు తన్నెందు కట్లు చూచెనో యాతఁడు తెలిసికొన లేక పోయినాఁడు. కాని యాతని దృష్టులఁబట్టి యాతఁడు తనతో మాటలాడుట కిచ్చగింపన ట్లతఁడు గ్రహింపఁగలిగెను. ఎట్లయినను వానితో మాటలాడుటకు వినయుఁ డూహించినాఁడు.

"ప్రేమచంద్రా! మీతో మాటలాడుదమని చాలదినముల నుండి యూహించుచుంటిని. కాని సమయము దొరకలేదు. నేఁడు భవద్దర్శనలాభ మగుటఁజేసి యడుగసాహసింతును."

'ఏమి యడుగుదురు' అని ప్రేమచంద్రుఁ డించుక కఠినస్వరం

బున బల్కెను అతఁ డేటికో కోపముతో నున్నట్లు వినయుఁడు సులువుగ గ్రహింపఁ గల్గెను కాని మాటలాడక తప్పినది కాదు.

'అధవళాంబరిని గూర్చి . . . ..సుమనుగూర్చి'

'మీ రన్నియు నెఱిఁగి నాకడకు రావలసిన ప్రయోజన మేమి యున్నదో యెఱుఁగకున్నాఁడను.'

'నా కేమి తెలియును.'

'నిజముగఁ దెలియరాదా?'

'నిశ్చయముగఁ జెప్పుచుంటిని. నా కామె గూర్చి యేమియుఁ దెలియదు. నామాట నమ్ముఁడు '

'అలాగునవా! . . మీరానాఁడు సుధాకరుని యింటికి పోవుచుంట నేను తిలకించితిని. అతనితో నేమి మాటలాడిరి.'

'ఏమియు లేదు. సుమనుగూర్చియే. కాని యతఁ డేమియుఁ జెప్పలేకపోయినాఁడు.'

"నాకుఁగూడ నేమియుఁ దెలియదు. కాని నేను మీపై నను మానించితిని. ఆమె యిప్పు డీయూరు రామానినది. ఆదురాత్ము లేమైన నామెకు హానిఁ జేసియుందురు. మీరును నేనునుకూడ నామెను రక్షింపలేకపోయితిమి."

"నే నామె నెట్లయిన రక్షించెదను. కాని మీ కామెవిషయమై యేమి తెలియునో నాతో వచింపుఁడు. నేను కేవలము నామెను రక్షింపవలయునను నూహతో నీమాట లడుగుచుంటిని."

ప్రేమచంద్రుఁ డున్మాదుడువోలె నేమియు వచింపక యటు నిటూ తిరుగులాడ మొదలిడెను.

'మీ రనుమానింపఁ బనిలేదు' అని వినయుఁ డాతనిని కూర్చుండ బెట్టి తానును కూర్చుండెను.

ప్రేమచంద్రుఁడు నల్వంకలఁ దిలకించి మెల్లన వినయునితో

నిట్లు చెప్పసాగెను. వినయుఁడు సర్వము జాగ్రత్తగా నాలించు చుండెను.

"నేనియూరి విద్యాభ్యాస మొనర్చుచున్నప్పుడు నాకు సుమ తోఁ బ్రథమపరిచయము కల్గినది. ఆమెయు నేను నొకేతరగతిలోఁ జదువుచుండెడివారము. కాని రెండుసంవత్సరములుమాత్రమే యామె బడిలో జదివినది. అటుపై నామె సుధాకరునిగృహామునకు బోయి చదువుచుండెడిది. ఆమె సాధారణముగ నెరితోడను మాటాడు స్వభావముకలదికాదు. కాని నాతోడ నప్పుడప్పుడు మాటలాడెడిది. ఆమె సుధాకరునింటికి పోవునప్పుడు నే నామెకొరకెదురుచూచి యామెతో మాటలాడెడివాడను. ఇట్లుండగా నామె యొకనాడు నా కగపడలేదు. ఆమరునాడే నాకొకయుత్తర మందినది. అది యామె వ్రాసినలేఖయే. అం దేమియు లేదుకాని తన్నిక నేనెప్పుడు జూడలేనని మాత్రము వ్రాసినది. నాకది పిడుగువోలె నైనది.'

ప్రేమచంద్రుడు పాప మొకవేడినిట్టూర్పు విడిచినాడు. ఒక నిముస మూగి యాతడు మరల నిట్లు చెప్పజూచినాడు.

'నే న నాటినుండియు నామెకడనుండి లేఖ చూచుటలేదు. ఇట్టే రెండున్నరసంవత్సరములు దాటిపోయినవి. మరల నొకనాటి సాయాహ్నమున చీకటివేళ నామె నా కగపడినది. ఆమెతో నెట్లయిన మాటలాడ బ్రయత్నించితిని, కాని యామె నన్ను చూచి ప్రేమచంద్రా! ఈయభాగినితో నీవిక మాటలాడరాదు. నేను నీ పవిత్రసన్నిధిని నిల్వదగను' అని చెప్పుచు బోయినది. ఆమెమాట లకు నాకింకను అర్థము తెలియకున్నది. అటుపై మరల నొకవత్సర మామెను చూడలేకుంటిని. మరల నాలుగునెలలనుండి యామెను చూచుచుంటిని. కాని నేనామెతో మాటలాడ సాహసింపలేకపోతిని.'

మరియొకనిముస మూగి ప్రేమచంద్రుడు తనకథ వినయున కిట్లు విన్పించినాడు.

'వినయబాబూ! మొన్న నామెను రక్షించుటకు నేచేసిన ప్రయత్న మీ వెరుగవు. నే నొకతుపాకిగూడ దెచ్చితిని ఎందరినైన గాల్చివేసి చంపివేయ నెంచితిని. కాని నాడామెయే వారినుండితప్పించుకొని పారిపోయినది. ఆమెకూడ వారిసంగతి యెరిగియుండునను కొందును. అయ్యయ్యో! ఇక నీజన్మములో నామెతో మాటలాడ జాలననుకొందును.'

అని యాత శోకదీర్ఘనిశ్వాసము విడచి శీతలసముద్రవాయువులలోగూడ వేడిమి గల్పించినాడు.

వినయుడు సులువుగా నాతనిహృదయ వేదన గ్రహించినాడు. ప్రేమచంద్రుడు పాపము! సుమను ప్రేమించుచున్నాడ యాతడు తెలిసికొని యుండు. ఆహా! ప్రణయమహిమ మెట్టిది! పాప మాత డామెకొర కెంత వేగుచున్నాడో! ఆతేతహృదయములో నెంతటి భావసంకుల మొదవినదో! వినయుడు కథనంతయు నాలించి ప్రేమచంద్రు డేటికి సుమను రక్షించుటకు ప్రయత్నించుచున్నాడో, తొలుత దన్నే యాతడెందులకనుమానించెనో యెరిగెను. అంతయు గూడ బాప మొకవిషాదగాథవలె వానికి గన్పట్టినది. ఆవిషాదల హరిలో ప్రేమచంద్రు డిట్లు కొట్టుకొనుచున్నాడో కదా!

'వినయబాబూ! ఆమెకూడ నన్ను హృదయపూర్వకముగ ప్రేమించెడిది. కాని యిప్పు డామెయ ట్లుండుటకు గారణము నాకు తెలియదు.'

అని ప్రేమచంద్రుడు తనగృహమునకు బోదునని లేచినాడు. వినయుడుకూడ లేచెను. అంత ప్రేమచంద్రుడు 'వినయబాబూ! నీవామెను రక్షింపబూనినాడవు గావున నీ కీసంగతుల జెప్పినాడను.

నీవుమాత్ర మీవిషయ మొరులకు దెలియజేయరాదు' అని త్వరిత గమనుడయ్యెను.

'పాపము! ఎంతటియున్మాదమునకు లోనైనాడు' అని వినయుడు హృదయాంతరాళమున శోకవియోగబాష్పము విడచినాడు.

అంతకుమించి సుమనుగూర్చి తెలియరాలేదు. అదియైన భ్రమరామధురలకు వినయుఁడు తాను, హేమచంద్రున కొసఁగినవాగ్దత్తముప్రకారము తెలియఁజేయలేదు. వారంతటితో నావిషయమె తలఁపమానిరి. అట్లే దినములు గడచినవి.

ఒకనాఁడు వినయుఁ డేకతమ కూర్చుండియుండగా భ్రమర యతనికడ కేతెంచి "వినయబాబూ! నాయంతన మగుచున్నది మి తోఁటపోదమురమ్ము" అని పిలచెను.

"మధురను పిలువుము " అని యేదోవినయుఁ డనుచుండ భ్రమర "వలదు! నీతో మాటలాడవలయును." అని చెప్పెను.

వారిర్వురు నొకచోటునకేఁగి కూరుచుండిరి. భ్రమర తొలుత సంభాషింపనారంభించెను.

"వినయబాబూ! నేఁడు నేను నీతో నిట్లు మాటలాడుచుంటి నని నీ వేమియు నాపైఁ గినియకుము. నీ వట్టివాడవుకూడ కావని నేనెరుఁగుదును. నీవు రెండునెలలనుండి యిచ్చట నుంటివి. నీసౌజన్యమును, సౌశీల్యమును మరియొకరి కుండవని నేను దృఢముగాఁ జెప్పగలను. నీభావిభాగ్యోదయమునకు నీసుగుణములే నీకుఁ దోడ్పడును."

ఇట్లు భ్రమర పల్కుట వినయుఁడు చెప్పుడును విన లేఁడు. తన తన్ను పొగడుటచే సిగ్గుచే వానిముఖము క్రిందికి వాలినది. అతనిబుగ్గలు ఎఱ్ఱవారినవి. అతఁడేమియు ననలేకపోయినాఁడు.

"వినయా! నేనిట్లు వింతగా నేఁ డనుచుంటినని నీవు వింత పడుచుంటివని నే నెఱుఁగుదును. దాని కేమిగాని నేను నీతో నిప్పు డొకముఖ్యవిషయమై చెప్పఁబోవుచుంటిని. అది నీవు విని యందుఁ గల నిజము గ్రహింపుము. నీవంటిసుగుణఖనికి నేను చెప్పనక్కఱలేదుగాని చెప్పుచుంటిని."

వినయుఁ డేమియు తెలిసికొనలేదు. ఆమె యేటి కిట్లు చెప్పుచున్నదో యతఁడు కనిపెట్టలేక పోయినాఁడు. అతఁ డాందోళనముపడినాఁడు. అతనిహృదయము కొట్టుకొనినది.

"వినయబాబూ! మధురకు వివాహము నిశ్చయమైన దను సంగతి నీ కింకను తెలియదు. నీవుకూడ నామెవివాహమునకు రాఁగలవు కాని యిప్పట్టున నేఁ జెప్పునది వినుము. నీవు మధురను ప్రేమించుచుంటివని నే ననుమానించుచుంటిని. నీవిఁక నాభావము వినుము. మఱిపదిరోజులలో నీవు వచ్చి మూఁడునెల లగును. అప్పుడు నీసదుపాయముఁ జూచుకొని నీవు మీగృహమున కేఁగఁదగును. నేనిట్లు చెప్పితినని మఱియొకరీతి భావింపవలదు."

భ్రమర యిట్లు వచించినంత వినయున కమాంతముగాఁ బిడుగుపడినట్లయ్యెను.

అటుపై వారు గృహాభిముఖులై పోవుచుండఁగ మధుర వారి కెదురుగా వచ్చినది. మామూలుగ నామె మందహాసమొనర్చుచుండెను. వినయుఁడు చిఱునవ్వు నవ్వెనేకాని యది విషాదరేఖాంకితమై యుండెను.

౧౨

నాఁటి నుండి వినయుఁడు తనగృహమునకుఁ బోవనిశ్చయించుకొనినాఁడు. అనాఁడు భ్రమర చెప్పినవిషయము యతఁడింకను [illegible] వారికిఁ జెప్పి [illegible] యతఁడు [illegible] తెలియు-

గనే చింతాక్రాంతమైనట్లు స్పష్టముగ భ్రమర గ్రహించెను. వినయుఁడు మధురతో సాధారణముగ మాటలాడకుండుటకే ప్రయత్నంబులు చేసెడివాఁడు. భ్రమరి మాత్ర మన్యయత్నములలో మునిగితేలుచున్నదని వినయుఁ డూహించెను. బహుశః అవి మధురవివాహ ప్రయత్నములని యతఁ డనుకొనెను.

మధ్యాహ్నమే తాను వెడలుటకు సమయమని తలఁచుకొనునప్పుడెల్ల వినయుఁడు తెలియరాని వేదనకు లోనగుచుండెను, అతని హృదయము దడదడలాడదొడఁగెను, అతనికరము లల్లాడజొచ్చెను. తా నెందుల కట్టివిషాదమునకు లోనయ్యెనో యాతఁ డెరుఁగఁడు. అతఁ డట్లే కుర్చీపై జేరగిలబడి యాలోచింపవొడగెను.

భ్రమర యేటికోగాని యొకయుత్తరము వచ్చినంతనే యానాడు తొందరగా దాను పండ్రెండుగంటలవరకు గృహమునకు రానని వెడలిపోయినది. మధుర తనగదిలోఁ గూర్చుండియుండెను. ఇంతకుముందామె రెండుబొమ్మల వ్రాసెగాని యవి వినయునకు జూపింపనామె యిచ్చగింపలేదు. అతడు నూరకుండెను.

పదిగంటలు టంగుటంగున గొట్టెరి. వినయు డూహాపరికల్పితలోకములో విషాదవిహార మొనర్చుచుండెను. మధుర దివ్యస్వరూపమే యందు వానికి గోచరించుచుండెను. మధుర తనగదిలో నెద్దియో సరదుచుండెను. ఆమెతో మాటలాడిన! . . . . అతనికి ధైర్యము లేకపోయినది. ఆమె యిక పరాధీన కానున్నది. . . అబ్బ!.....ఆ తలఁపే వానికి హృదయదళనముగ నుండెను. ఇఁక నామెతో మాటలాడరాదా? . . . . .అతని కేమియుఁ దోఁచుటలేదు. తా నిఁక మధ్యాహ్నమే బయల్వెడలును కదా! అప్పు డామెతోఁ దాను వెడలుచుంటినని చెప్పఁబోవుదునుకదా!—అనిమునసమున నామెను మనసార జూడవచ్చును. ఇంకను ఏమేమో భావము లాతనిహృదయ

రంగంబునఁ బ్రళయనర్తన మొనర్చినవి. అతఁ డొకదీర్ఘనిశ్వాసము విడచినాఁడు. ఆనిశ్వాసముందే వానివల పిమిడిపోయిన ట్లయినది. అట్లాకుర్చీలోఁ గూరుచుండుటయే వానికిఁ గష్టమయ్యెను. పూర్వపుదినము లన్నియు వానితలఁపునకు వచ్చెను . . . . ఎంతమధురములగు దినములు—మధురతో సంభాషించినదినములు—ఆమెదరినే కూర్చున్న దినములు. అన్నియు స్వప్నప్రాయములేనా? అన్నియు మెరపువోలె చంచలములేనా! ఆభావమైన నిఁక వానిలో నిలువఁబడియుండదా! అంతయుఁగూడ శూన్యంబును, తెలియరానిది యగు నొక యంధకార పరివృతమందిరమా!

అతఁ డట్లు భావమయమార్గముల విహరించుచుండ నచ్చటకు మెల్లన మధుర యేతెంచెను. అతఁ డామెతో నాలుగైదు దినములనుండి కేవలము మాటలాడుట లేదని చెప్పవచ్చును. మధుర దరికి వచ్చినంతనే యతఁ డామెముఖము చూడ లేకపోయినాడు. ఆమె వానిప్రక్కనున్న కుర్చీలోఁ గూరుచుండి తదేకధ్యానతత్పరయై వాని నుపలక్షింపుచుండెను. ఆమెముఖము వాడిపోయియుండెను, పూర్వపు మందహాసచిహ్న మందు లేదు, ఆమెకన్నులు బాష్పములచే నార్ద్రింబులైన ట్లుండెను.

'వినయా! నేఁడే నీవు వెడలెదవా?'యని గద్గదస్వరంబున నామె ప్రశ్నించెను. వినయుఁడు కరఁగిపోయినాఁడు. అతని నొక విషాదరేఖ యావరించినది.

"ఔను! నేఁడే వెడలుటకు నిశ్చయించితిని. మాజనని కుత్తరము వ్రాసితిని. సోదరియు జననియు నాకొఱ కెదురు చూచుచుందురు."

'వినయా! మాజనని నీకోర్కె లన్నియుఁ దీర్చునా!"

"నాజనని పరమపవిత్రురాలు. నా కేమియు లోటు రానీయదు. ఆమె యాశీర్వాదము ఫలించునుగాక!"

మధుర మరి మాటలాడలేకుండెను. అయ్యో! తన జనని! స్వర్గమున నున్న తన జనని! బ్రతికియున్నఁ దన కోర్కెలు ఫలించి యుండెడివే. ఆమె కనులనుండి వర్షబిందువులవలె రెండు కన్నీటిబొట్లు రాలినవి.

"మధురా!—ఏమది?" అని వినయుఁడు చకితుఁడై గద్గద స్వరంబునఁ దత్తరముతో నామె నడిగెను.

'నాజనని.... ఆమెయే యుండిన!' మరి యామె చెప్పలేక పోయెను.

"నిన్నామె స్వర్గమునుండి యాశీర్వదించు చుండును. నీ కోర్కెలు ఫలింపఁజేయ నామె నీ కాశీస్సు లిచ్చును.

నిరవుగా వారట్లే యూరకుండిరి. కాని మధుర చప్పున నేదియో జ్ఞప్తికివచ్చినదానివోలె—

'వినయా! నన్ను నీవు మరచెదవా?'

'నేను నిన్ను మరువఁజాలను.'

మధుర తనగదిలోనికిఁ బోయినది. పదినిముసములలో నామె తిరిగివచ్చినది. ఆమె హస్తమున నొక పొత్తమును రెండుమూడు త్రివర్ణచిత్రములు నున్నవి. కాని యాచిత్రములు కానరాకుండ నామె కాకితములఁ జుట్టినెచినది. అయ్యవి వినయునిచేతఁ బెట్టి మధుర యిట్లనెను.

"వినయబాబూ! నే నొసఁగు నీవస్తువులు నీవు నాకొరకు పుచ్చుకొనుము. నే నెన్నఁడైన నీకు మరపువచ్చిన నియ్యవియైన నన్ను నీకు జ్ఞప్తికి దెచ్చుచుండును."

అతఁ డయ్యవి యందుకొనెను. మధుర వానిహస్తముఁ బట్టి "వినయా! పదిదినములవరకు నివి నీవు చూడరాదు. అటుపైఁ జూడుము. నన్ను మరువకుము." అనుచు నామె రుద్ధస్వరయయ్యెను.

ఆమె కన్నుగొలకులనుండి బొటబొట కన్నీరు కారఁదొడఁగెను. ఆమె యిఁక నట నిల్వలేక తనగదిలోనికిఁ బోయెను. వినయుఁ డామె వెనుకనే పటములఁ దాఁచుటకై పోయెను. మధుర చేలాంచలము చాటుజేసికొని వెక్కి వెక్కి యేడ్చుచుండెను.

"మధురా! మధురా! నన్ను నిల్వనీయవా! నాకు దుఃఖము కల్పింతువా?" యనుచు నాతఁ డామెకడ కేఁగి బాష్పముల నొత్తుచు 'నీవు దుఃఖించి నన్ను వెఱ్ఱివానిని జేయకుము' అనియెను. మధుర దుఃఖము ద్విగుణీకృత మగుచుండెను.

'వినయా! ఈజన్మమున సౌఖ్యము నానుదుట వ్రాసిలేదా?'

'అన్నిటికిని దేవుఁ డున్నాఁడు'

వారిరువురు దుఃఖముచే మాటలాడలేకపోయిరి.

పండ్రెండుగంటలకు భ్రమర యేతెంచినది. ఆమె చాల సామానులు కొనితెచ్చినది. అవి యన్నియు గదులలోఁ జేర్పించి యామె వినయునితోఁ మాటలాడుచుఁ గూర్చుండెను. వినయుఁడు మూడుగంట లైనంతనే బయల్వెడలుటకు నిశ్చయించినాడు. అట్లయిన రాత్రిపదిగంటలకే గృహమునకు బోవచ్చును. కాని యాతడు నడచి వెడలక బండిపై బోవుటకు నిశ్చయించినాడు. తనపెట్టెమొద లగునవి తీసికొనిపోవుట కది వీలుగ నుండును. ఇటుకైన త్వరగా బోవుననియు, సుఖముగ నుండుననియు నద్దె యెక్కువయైనను దానినే కుదిర్చికొనినాడు. సాయాహ్నమున ఫలాహారము చేయవచ్చునని యాతడు ఫలముల గొన్ని తెప్పించి జాగ్రత్తపఱచినాడు.

మూడుగంటలు కొట్టినంతనే యాతడు బండివాడు వచ్చునని యనుకొనుచు సన్నాహమొనర్చుకొని కూర్చుండియుండెను. బండివాడు వచ్చినంతనే యాతడు సామానంతయు బండిలో బెట్టించి వచ్చును. భ్రమరతో నాతడు వెడలెదనని చెప్పెను.

'మధుర నీకు గురుదక్షిణ యొసంగునట. ఆమె నీకొఱకే వేచి యున్నది.' అని భ్రమర పల్కుటయు నతడు మధుర గదిలోనికి బోయెను. మధుర యన్యాలోచనలలో మునిగియుంటచే నాతని రాక తొలుత ఎఱుగలేకపోయెను. కాని త్వరలోనే వాని జూచి లేచెను.

'వినయబాబూ! నీ కింతకన్న మించినకట్న మిచ్చినను నీ ఋణము తీరదు' అనుచు నామె యాతనిచేతి కొకబంగారుపతక మందించెను. అత డది యందుకొనుచుండగా నామె—'ఇంతకు మించిన కట్నము నే నీయజాలనైతిని. వినయా! అది పునర్జన్మమున నిత్తును. ఇప్పుడైనను ఈ నాహృదయమునీది. మున్ముందికినినీయది.' అని పల్కి యామె వానిహస్తమును తీసి తనకన్నుల దరి జేర్చి ప్రక్కనేయున్న కుర్చీపై జేరగిలబడెను. ఇక నత డచ్చో నిల్వలేక పోయెను. సాభిలాషముగ నామెను చూచుచు నాతడు దిగువకు వెడలిపోయెను. భ్రమర యాతడు మేడదిగినంతనే మేడమీాదికి వెడలనుంకించెను. కాని యెవ్వరో యాభవనద్వారమునుండి వచ్చుట చూచెను. వినయుండును తనకెదురైనవానిని గోపాలపుర వు జమీాందారునిగా గ్రహించెను . ఏమి! మధురను వీనికా పెండ్లి చేతురు. అనుకొనుచు నాతడు బండిలో నెక్కిపోయెను. బండి వెడలుచుండగా నామేడపై వానిదృష్టిపడినది. మధుర నిశ్చలనయనంబుల తో నతనివంకనే తిలకింపుచుండెను.

---

# మధుర

## తృతీయ ఖండము

### (ప్రవాసి)

౧

నాగేంద్రనాథుడు మధురను వివాహమాడుటకు నిశ్చయించుకొనినాడు. వారివివాహము కొలదిరోజులకు బూర్వమే నిశ్చితమైనది. అదియంతయు నుత్తరములమూలముననే జరిగినది. మధుర వివాహము తాను గతించులోపల జేయవలెనని సురేంద్రనాథుని యూహ. నాగేంద్రనాథుడు జమీందారు డగుటచే నాతని కిచ్చిన మధుర కేమియు లోటుండదనియు, నామెతండ్రియాస్తి కూడ నామెకు సుఖదాయక మగుననియు, నాత డూహించెను. నాగేంద్రనాథుని గూర్చి యెవ్వరికి నేమియు దెలియదు. నాగేంద్రుని జనకు డగు గిరీంద్రనాథుడు పాపము! చిన్నతనముననే భార్యను గోల్పోయెను. అప్పటి కాతనికి కొడు కొక్కడుమాత్ర ముండెడివాడు. అతనిని పెంచి పెద్దవానిని జేయుచు నాతడు గోపాలపురము వీడి కలకత్తా నగరమునకు బోయెను. పదునైదువత్సరము లాత డక్కడే యుండెను. ఇంతలో నాతడు మృతు డగుటయు నాతనిపుత్త్రు డగు నాగేంద్రనాథుడు గోపాలపురమునకు వచ్చి తండ్రియాస్తి తనవశమునకు దెచ్చుకొని యుండెను. అది యంతయు జరిగి యిప్పటికి నాలుగైదు వత్సరంబులు దాటినది. కాని నాగేంద్రుడు క్రూరస్వభావము కలవాడని యనుకొనుచుండిరి. అప్పిసంగతు లేవియు ప్రమదామధురలకు తెలియుటలేదు కాని, యుత్తరము చూచినంత యతడు దట్టివాడని

యెల్లరు సుఖముగ గ్రహింతురు. భ్రమర నాగేంద్రుని తొలుత నదియే చూచుట — సగౌరవముగ నతని నామె లోనికి దీసికొని పోయెను. మధుర తనగదిలోనికి బోయి వారు మేడమీదికి రాక మున్నే, కూర్చుండి యుండెను. ఆమెభావము లనేకవిధముల బరుగు లిడుచుండెను. వాని నాపుటకేని యామెకు శక్తి లేకుండెను. ఆమె యట్లాలోచనా నిమగ్నయై యుండగా హాలులో భ్రమరానాగేంద్రు లాసీనులైరి, యది యామె గ్రహించెను. కాని యచటనుండి యామె కదలుటకైన నిచ్ఛగింపలేదు ఆమె వారిసంభాషణము మాత్ర మాలించుచుండెను.

భ్రమర సగౌరవముగా నాగేంద్రు నాసీనుఁ జేసి తా నాతని కెదురుగ నున్నయొక యాసనమందుఁ గూర్చుండెను. మధుర యప్పుడచ్చోటికి రావలయునని యామెయభిలాషము, కాని యిప్పు డామె వచ్చిన, దుఃఖపూర్ణ మగునామెముఖముఁ జూచి నాగేంద్రుఁ డేమి యైన ననుమానించునేమో యని యామె యత్యంతము చింతించెను. మధురమాత్ర మచ్చోటకు రాలేదు. నాగేంద్రనాథునిదృష్టుల బట్టి యాతఁడు మధురను చూచుట కిచ్ఛగించుచుండెనని యామె యెఱుఁగ జాలెనే కాని, యామెను పిల్చుటకుమాత్రము సాహసింపలేకపోయెను.

భ్రమర వానితో సంభాషణమొనర్చి కాలము గడపనెంచెను. కాని యామె యేమి మాటలాడుటో యెఱుఁగలేకుండెను. కాని తొలుత నాగేంద్రనాథుడే మాటలాడుటకు ప్రారంభించెను.

'ఇక్కడ చల్లగనే గాలివేయుచున్నది...'

'ఔను. సముద్రపుటొడ్డునగల భవనములకే కాకుండ వెనుక నున్న గృహములకును గాలి తగులును. వేసగియైనను ఇచ్చటచాల చల్లగా నుండును. గోపాలపురమున నెట్లుండును?'

'అచ్చటను కూడుగనే యుండును. మాభవనము చాల ఎత్తుగా నున్నది. అందువలన నెల్లప్పుడును గాలి వేయుచుండును.'

'కాని యింత సౌఖ్యకరముగ నుండదనుకొనెదను.'

'ఎట్లుండును?'

అని మాటలను కర్కశముగ జేరగిలంబడి యిటునటు చూడ దొడంగెను. అతని భావమును భ్రమర గ్రహింపగల్గెను.

'మధురా!' యని యామె పిల్చెను. మధుర 'ఆఁ' యని పల్కెనే కాని వెంటనే యచ్చటికి రాకుండెను. భ్రమర నిశ్చయముగా నొండొకసము చూపెను. మరల నామె మధురా! యని పిల్చుటయు, మధుర యింక వెడలక విధి లేదని లేచి యచ్చటి కేతెంచెను.

విషాదరేఖాంకిత మయ్యు నామె సహజసుందరస్వరూప మతి లోకమోహనంబుగా నుండెను. ఆకన్నుదమ్ములలో తళుకులు తరళములై యాడని నాట్యమించినవి. కాని యామె చూపులలో దుఃఖరేఖలు లీనమై యున్నవి.

నిశ్చలముగ తన్ను చూచుచున్న నాగేంద్రనాథునివంక మధుర యొక్క సూక్ష్మమాత్రము తన దృష్టులఁ ద్రిప్పెను. ఆపాటిరూపము, ఆకన్నులలోని క్రౌర్యము, ఆ బొమ్మమీసములు, ఆ ముఖమున్నట్టి దాండవమాడు భయంకరమైనకళ, అవన్నియు నామెకు భయోత్పాదకము లయ్యెను. ఆమె పువ్వుటెడదలో నాభయంకరభావము లుదయించినంతనే యామె మరి మాటలాడనేరక కూరుచుండెను. ఆమె యొకపరిమైన వానిని కన్నులెత్తి చూడలేకపోయెను.

భ్రమర యిదియంతయుఁ గనిపెట్టెను. ఆమె కండ్లలో మార్పు ఆమె భావప్రకటన మొనరించుచుండెను. ఆకంపితాధర మే యామె హృదయవ్యాకులత తెలియఁబరచుచుండెను. కాని భ్రమర నేమియుఁ జేయఁజాలకపోయినది. నాగేంద్రనాథుఁ డేమి యను

కొనునో యని యామె భయమందెను. కాని యాతఁ డామనోహర రూపముఁ జూచి ముగ్ధుఁడైనవాఁడువోలె నిశ్చలుఁడై యుండెను. అది మాత్ర మామె యెఱుఁగఁగల్గెను. ఆమె యేవేవో మాటలనాడెను. కాని నాగేంద్రుఁడు ప్రత్యుత్తరములఁ దిన్నగ నీయనైన నీయలేదు.

ఆమెను చూచుటయందే యాతఁడు సర్వంబునుగూడ మరచి పోయినాఁడు.

అప్పుడు సేవకుఁడు తెచ్చిన స్వల్పాహారంబుల వారు భుజించిరి. అంతయు జరుగుసరి కైదుగంటలు కావచ్చెను.

'సైరు పోదమా?' యని భ్రమర పల్కెను.

'ఇప్పు డవసరము లేదు. ఈరోజునఁ బ్రయాణ మొనర్చుటచే నాకు చీకాకుగా నున్నది.'

భ్రమర యేదియో పనిమీఁద దిగువకు పోయెను. మధుర యచ్చో నిల్వఁబడక యామె వెనుకనే తానును పోయెను. ఇది చూచి భ్రమర యాశ్చర్యచకిత యయ్యెను.

'మధురా! ఏమిది?'

'ఏమి?'

భ్రమర కేమియుఁ దోఁచుట లేదు. ఇది యెట్లు పరిణమించునో యని యామె యప్పుడే శంకించెను.

'అతనిని వీడి వచ్చితివేమి?'

'నే నక్కడ కూర్చుండలేను.'

ఏమియు నిఁక భ్రమర పల్కుటకు నోరు రాలేదు.

'ఇఁకనైన నక్కడకుఁ బోయి కూర్చుండుము.'

'నే నచ్చట నొక్కనిమిసమైన నిల్వలేను.'

'మధురా! దీనివలన మున్ముం దెట్టి సంఘటనములు కలుగ నున్నవో యెఱుఁగకుంటివి. నే చెప్పినదానికర్థము నీకు తెలియు చున్నదా?'

"నాకు తెలియనవసరము లేదు."

అట్టిసమయమున మెల్లన నడుగులిడుచు నాగేంద్రనాథుఁడు మేడదిగుచుండుట వారుచూచిరి. అతనిచెవిని వీరిమాటలలో గొన్ని కాని పడియుండవుగదా? . . .

"ఏమి దిగిపోవుచుంటిరి"

"ఏమియు లేదు. నేనును షైరు వచ్చెదను."

అతఁడు నడచుచుండ భ్రమర వానిప్రక్కనుండి పోవఁదొడఁగెను. కాని మధుర——

"నాకు తలనొప్పిగా నున్నది. నేను రాఁజాలను." అని పల్కుచుఁ దనగదిలోనికి పోయెను.

భ్రమర యామెమాటల నాలించి హృదయంబునఁ జాల నాందోళనముపడెను.

౨

మధురయభిప్రాయముల సులువుగ భ్రమర గ్రహింపఁ గలిగెను. నాగేంద్రనాథునియెడ నెంతమాత్రము నామె గౌరవము కనఁబరచుటలేదు. అతనితో మాటలాడుటచే మధుర కసహ్యముగ నుండెనని భ్రమర గ్రహింపకపోలేదు. కాని యామె యేమి చేయఁగలదు? అతనితోఁ బరిచయము బాగుగఁ గల్గినంత మధుర పూర్వపు భావములన్నియు విడుచునని యామె యూహించెను. ప్రథమమున నాలుగైదు దినములవరకు షైరు వెడలుటకైన మధుర రాననినది కాని భ్రమర బలవంతమున నట్లామెకు చేయవలెనైనది. ఎట్టులైన నేమి యప్పుడప్పుడాతనితో మాటలాడుట షైరు వెడలుట మధురకు తప్పినది కాదు. భ్రమర దానికే ముదమందుచుండెను.

ఒకనాడు మువ్వురు నైదుగంటలకుపూర్వమే షికారుపోవుటకు బయలుదేరిరి. కొంతదూరము పోయినతరువాత భ్రమర వెనుకనే నిలిచిపోయి,

"నాకుఁ గొలదిగ పనియున్నది. మీరు నడచుచుండుఁడు. నేను మరల వచ్చెదను." అనియెను. నిజముగ నామె కేమియుఁ బని లేదు. కాని వారిరువుర నేకతను విడుచుటే యామెయభిలాష. అందువలన మధురహృదయంబులో మార్పు కలుగవచ్చునని యామెయూహ.

మధుర పాపము! కళవళపడసాగెను. ఆమె కేమియుఁ దోఁచదాయెను. అతనితో నుండుట యామె కిష్టము లేదు, కాని యామె యేమియుఁ బల్కలేకపోయెను. భ్రమర గృహాభిముఖయై వెడలిపోయెను. మధుర శోకయగాధసముద్రమునఁ బడిపోయినట్లు తలచుకొనెను.

నాగేంద్రనాథుఁడుకూడ మధురతో నేదియో సంభాషింప నూహించెను. భ్రమర యుండగా వాఁడు ధైర్యముఁ జిక్కఁబట్ట లేకపోయెను. మధుర తన్నసహ్యించుకొనుచున్నదని యాతఁడెరుఁగును. అయినను తద్భావప్రకటనము నణుమాత్ర మాతఁడు కావింపలేదు. మధురతో సంభాషింప నవకాశము చిక్కినందుల కాతఁడు సంతసించెను.

"మధురా!" యని యాతఁడు సంభాషణమున కుపక్రమించెను. "ఆపిలుపులో నెంతటికర్కశస్వభావ మిమిడియున్నది!" అని మధుర భావించెను. కాని యామె వానికి జవాబిడలేదు.

"నీ వెన్నియో చక్కని బొమ్మలు వ్రాసితివని భ్రమర చెప్పినది. నా కవి చూపింపలేదేమి?"

మధుర జవాబిడుట కనుమానించెను. కాని యేదియేని పల్కకున్న బాగుగనుండదని తలఁచెను.

"అగోడలపై నమర్చఁబడి యున్నవే!... భ్రమర యవి యన్నియు నిదివరకే చూపినవి కదా!"

"క్రొత్తగా వ్రాసిన వింకను చాల కలవఁట."

"మరి లేవు. ఒకటిరెండుమాత్ర మున్నవి."

వారు మ రేమియు సంభాషింపలేదు. మధుర మాటిమాటికి భ్రమర వచ్చుచుండెనేమోయని వెనుదిరిగి చూచుచుండెడిది కాని భ్రమర తిరిగి రానిశ్చయించుకొనలేదని యామె యెఱుఁగదు.

సంధ్యారోచిస్సులు సముద్రమధ్యమునఁ దూఁగుటుయ్యెల లూఁగుచుండెను. మధుర యానాయూహ్నసౌందర్య మరయునుఁ దానట్టి వేళల వినయునితోఁ గడపుట జ్ఞప్తికి తెచ్చుకొనుచుండెను ఆ రెఁడుమూఁడు నిముసములైన నామె భావనాప్రపంచమున వినయుని కడ నుండకుండ నాగేంద్రనాధుని కర్కశస్వర మామెను కలంచెను.

"మధురా! చిత్రరచనము నీ వెవ్వరికడ నభ్యసించితివి."

"నాకు చిన్నతనమునుండియుఁ జిత్రరచనమం దభిలాష మెండు. నాయంతట నేనే నేర్చితిని."

"నీ వెవ్వరికడ నభ్యసింపనే లేదా?"

వినయునిగూర్చి వానితో మాటలాడుట కామె కిష్టము లేకున్నను చెప్పక విధిలేకపోయినది.

"మూఁడునెలలనుండి యొకరికడ నేర్చుచుంటిని. ఇప్పు డది కూడ మానివైచితిని."

"ఎవ్వరివద్ద నేర్చుచుండెడిదానవు."

"అతఁ డీయూరివాఁడు కాఁడు."

"మరి యేయూరు."

"గోపాలపురము."

"ఆఁ! మాయూరేనా! అతఁ డెవ్వఁడు."

"అతడు మీకడ బనికూడ జేసియున్నాడు."

"ఏమో! నాకు బాగుగ జ్ఞాపకము లేకపోయియుండవచ్చును. వానినామధేయ మేమి?"

"నిన్న మీరు వచ్చుచుండగా వెడలిపోవుచున్నాడే! యొక యువకుడు. అతడే!"

"ఔను. అతనిని జూచినట్లు జ్ఞాపక మున్నది. అతని నామధేయము .    "

"వినయుడు" అని మధుర పూరించెను. కాని నాగేంద్రుడు వినయు నెరుగకపోలేదు. ఆతనినిగూర్చి మాధురి నేమనునో విన వలయునని యతఁ డట్లనెను. మధుర మేడపై నిల్వఁబడి వెడలిపోవుచున్న వినయుని తదేకదృష్టితోఁ జూచుచుండుటకూడ నాతఁడు కని పెట్టెను. వినయుని నసామాన్యాభావమున నాతఁ డప్పుడే హృదయాంత రాళమునఁ దిట్టుకొనెను. కాని యిది యేమియు నాతఁడు పైకి తెలియనీయ లేదు.

నాగేంద్రనాథుఁడు సంభాషణము విడలేదు.

'ఔను! వినయుఁడు. ఇప్పుడు బాగుగ జ్ఞప్తికి వచ్చినది. అతఁడు నాకడ నెలదినములుమాత్రమే పనిచేసినాఁడు.. కాని ..'

'ఏమి? మంచివాఁడు కాఁడా?'

'నెలదినములు పనిచేసినను వానిగుణము కన్పెట్టితిని. అతఁడు చాల మంచివాఁడు. అట్టి నడవడి నే నెక్కడను జూడలేదు.'

'ఔను. అంత మంచివాఁడు మరి యుండఁడు' అని మధుర తన యుద్వేగముకొలఁది పల్కెను. ఆమె పల్కులలో నున్న భావము నాగేంద్రుఁడు గ్రహింపకపోలేదు.

'అతఁడు నాఁడే వెడలిపోవుచుండె నేమి?'

'ఏమో! తెలియదు.'

'మీ రుందు మన లేదా!'

'మే మెంత చెప్పినను వాఁడు విన లేదు.'

'నేనా నాఁడు వచ్చెదనని యాతఁ డెరుఁగునా?'

'తెలియ దనుకొందును.'

నాగేంద్రనాథుఁడు కావలసినసంగతు లేమియు మరి యామె వలన నెరుఁగలేకపోయినను మధుర వినయులు పరస్పరము ప్రేమించుకొనియుందురేమో యని యనుమానించెను.

సంధ్యావసానమున నరుణారుణాంధరాగంబు లుర్వీవలయంబు నాక్రమించుకొనుచుండఁ బక్షులు కలకలారావంబు లొనర్చుచుఁ దమ కులాయంబులఁ జేరుటకై మింట నెగురుచుండెను. వాయుసేవన మొనర్చుటకై వచ్చినవారందరు గృహాభిముఖు లగుచుండిరి.

'మనముకూడఁ బోదము' అని మధుర లేవఁబోయెను.

'మధురా! ఇట్టిసమయంబున పిచ్చో విహరించుట యెంత ప్రమోదదాయకము మరి రెండు నిమిషము లుందము.'

'వలదు. చీఁకటి పడును' అనుచు మధుర యాతని వాక్యముల లక్ష్యమునం దుంచక లేచిపోయెను. అతఁడును ఆమె ననుసరించి వెడలెను. మధ్య నాతఁ డేవియో ప్రశ్నముల నడిగెనే కాని వానికి సరియైన జవాబులు పడయలేకపోయెను

వారు గృహములకు వెడలునరికి భ్రమర వారికి గృహద్వారముకడఁ గన్పట్టెను. మధుర యామెను తీక్ష్ణముగఁ జూచి కొలఁదిగ కోపముతో నిట్లనియెను. 'భ్రమరా! ఇప్పుడే వచ్చెదనని చెప్పిపోయితివి. ఇదియేనా వచ్చుట. రానని చెప్పిన నేమాయె.' అని యామె చెప్పుచు త్వరగ నడుగులిడుచు మేడమీఁదికి పోయెను.

భ్రమర నాగేంద్రనాథునితో మాటలాడుచుండఁగ మరల వినయుని యుబుసు వచ్చినది.

'వినయుని మించినవారు చిత్రరచనానిపుణు లుండఁగా నాతనినే మీర లెన్నుకొన నేల?'

'అతఁ డందరిని మించి వ్రాయునని మధుర చెప్పుచుండును. అతఁడు బహుమానములఁ గూడఁ బొందినాఁడు. అయినను మరియొక కారణ మున్నది . . . '

'ఏమది?' అని నాగేంద్రనాథుఁ డాత్రమునఁ బ్రశ్నించెను.

'యోగ్యతాపత్ర మాతఁడు మీకడనుండి తెచ్చినాడు కావున'

'అది మరియు బాగుగనున్నది. అట్టివారి కెందరికో మావంటివారు యోగ్యతాపత్రము లిడుచుందురు దానికేమిగాని నన్ను గూర్చి యాత డేమైన జెప్పెడివాడా!'

'లేదు. నేనొకమా రాతని నడిగితిని గాని యాతడు తాను మిమ్ము బాగుగా నెరుగనని చెప్పినాడు.'

'సరే!'

'మీకడ నాత డెన్నిదినములు పని చేసినాడు?'

'నెలదినములు చేసినాఁడు. కాని యతడు చాకచక్యముగల వాడు కాడని మాన్పించితిని.'

ఈసంభాషణమంతయు మధుర యాలించినది. తనతో జెప్పినదానికి విరుద్ధముగా జెప్ప నేల? '

భ్రమర కీసంభాషణ మెంతమాత్రము నిష్టము లేకుండెను. ఎట్టులో యామె మరియొకవిషయమునకు సంభాషణము మార్చివైచెను.

---

3

మధుర యొంటిగా దనగదిలో గూర్చుండి యాలోచనా పరంపరలలో దేలిపోవుచుండ నాగేంద్రనాథుఁ డందుప్రవేశించెను. భ్రమర గృహమునలేదు. బజారునకు పనిమీద బోయియుండెను.

అతఁడదే మధురతో మాటలాడుటకు తగినసమయమని యట్లామె గదిలోని కేగెను. మధుర యాతనిజూచి మోము వాంచి యూరకుండెను. అతఁడామెప్రక్కనే యాసీనుఁడయ్యెను. ఆమె కందుకొంతమాత్రము నిచ్ఛ లేకుండెను.

'మధురా!' యనుచు నాతఁడామెహస్తము బట్టుకొనబోయెను. కాని యామె తనహస్తము వెనుకకు దీసెను.

'నీ వేమి చేయుచుంటివో యెఱుఁగుదువా?' యని యించుక కఠినస్వరంబున నతఁడనియెను.

'నేనేమి చేయుచుంటిని.'

'నన్ను నీ వేవగించుకొనుచుంటివి, నన్నసహ్యించుకొనుచుంటివి, హృదయములో నిందించుచుంటివి.'

మధుర మాటలాడలేకపోయెను. అతఁడు తన్నేమిచేయునో యని యామె భయంబుగూడఁ జెందెను.

'మధురా! నేను నిన్ను మనసార ప్రేమించుచుంటిని, కాని దానికి ప్రతిఫలము లేకున్నది.'

మధుర నీరవస్థయై యుండెను.

'నేను నిన్నెంత ప్రేమించుచుంటినో నీవెరుగవు. కాని నేనన్న నీ కంతటియసహ్య మెందులకు?'

మధుర జవాబీయ లేదు.

''మనవివాహ మైనతరువాతగూడ మన మిట్లు యుండవలయునా? నీ వేమిచేయుచుంటివో తెలియునా?''

అతఁడేమి చెప్పినను మధుర పెడచెవిని పెట్టెను. అట్టిమాటలాతని మఱింత దుఃఖభాజని నొనర్చెను.

''నీహృదయవంన సంతోష ముండవలసినది. అట్టిది నేటివరకు నీవు దుఃఖసమన్వితవయి యుంటివి. అందువలన నీభవిష్య

జీవనమున నెట్టిసంఘటనములు కలుగునో తెలియునా! నాకు ప్రతి ద్వంద్విగా నిలుచువా డెవ్వడు?”

మధుర రోషకంపిత యయ్యెను ఆమెకంఠము రుద్ధమైపోయెను. ఆమెకు మాటలాడుటకైన శక్తి లేకపోయెను. కాని తీక్ష్ణదృష్టు లేయవి చెప్పక చెప్పుచుండెను.

“మధురా! నే చెప్పినవన్నియు వింటివా?”

“వింటిని—”

“నీయభిప్రాయముల నికనైన మార్చుకొనెదవా?”

“నాహృదయము మరియొకవిధముగ నడువదు.”

“నిశ్చయమేనా!”

“ఔను”

నాగేంద్రనాథుడు నిశ్చేష్టు డాయెను. తనయెదుట నామె యట్లు ధైర్యముగ వచించునని యాతడు కలనైన దలపలేదు.

“మున్ముం దెన్నిచిక్కులు కలుగునో తెలియునా?”

“కలిగిన కలుగును గాక”

“మధురా! నేను నిన్ను ప్రేమించుచుంటిని. నీవు నాదాన వగుదు వనుకొనుటలోనే నేను సంతోషము పొందుచుంటిని.” అనుచు నాత డామెదరికి బోయెను. తత్క్షణము యామె భీతహరిణి రీతి గది వీడి వెడలిపోయెను. క్రుద్ధవ్యాఘ్రమువలె నాగేంద్రనాథు డచ్చటనే నిల్చిపోయెను.

నాటిసాయాహ్నమున వారు మరి షికారైన బోలేదు. ఆరు గంటలు కాకమున్నే భ్రమర యిల్లు చేరుకొనెను. నాగేంద్రనాథు డొంటిగా నుంట యామె చూచెను.

“భ్రమరా! నే నీయూరు వచ్చి యెన్నిదినములైనది.”

“పదునైదు దినములైనది.”

"అట్లయిన నిక మనమందరము గోపాలపురము రేపే వెడల వలయును."

"ఒక నాల్గుదినములు కానిండు."

"మరి వీలులేదు. చాలవ్యవహారములు సరిచేసికొనవలెను. తప్పక రేపే పోవలయును."

"అట్లయిన మీయిష్టమే."

"రేపు ప్రయాణము నిశ్చయము."

"మాజనకునిసంరక్షణకు నే నింటికడనే యుండవలయును."

"వలదు. నేను వారి నడిగి నిన్ను పంపుట కంగీకారము వడ యుదును. నీవు తప్పక రావలయును ఇప్పుడే యచటికి బో దును" అని యాతడు చరచర సురేంద్రనాథునికడకు పోయెను. భ్రమర మేడమీాదకు పోయెను. మధుర యచ్చో నొకకుర్చీపై గూరు చుండుటనామె తిలకించెను. ఆమెకన్నులార్ద్రములై యుండుట భ్రమర కనిపెట్టెను. ఆమె యేదియో దీర్ఘాలోచన జేయుచు భ్రమర వచ్చి నదని తెలిసికొనలేకపోయెను.

"మధురా!"

'ఆమె త్రుళ్ళిపడి లేచెను.'

'ఏమి చేయుచుంటివి?'

'ఏమియు లేదు.'

'మధురా! నీలో నేదియో మార్పు కన్పట్టుచున్నది....నేను చెప్పునది వినుము. వినయుని మరచిపొమ్ము...'

'భ్రమరా!' యని యేదియో పల్కనెంచి మధుర మరియే మియు జెప్పనేరకపోయెను. ఆమెకంఠము గద్గదికపోయెను. ఆమె నయనయుగళము లశ్రుపూర్ణము లయ్యెను.

ఇంతలో మేడమీాదికి నాగేంద్రుడు డేతెంచెను.

'భ్రమరా! మీనాయనగారి యనుమతి వడసితిని. నీవులేనిది మధుర యుండలేదనికూడ నాయన చెప్పినారు. కావున మనము మువ్వురము పోవలయును '

అమరునాడు నారాయణస్వామియు వారుముగ్గురు గోపాలపురమునకు బండిపై వెడలిరి.

---

౪

విజయుడు ప్రతిదినము వినయునిగృహంబునకు వెడలి సుగుణాప్రమదల క్షేమ మరయుచుండెను. వినయుడు పైయూర నివసించుచుండుటచే, వారిరువురు విజయుని ప్రేమతో జూచుచుండెడివారు. అప్పుడప్పుడు బజారుపనికి విజయుడుపోయి వారికి వలయువస్తువుల దెచ్చుచుండెడివాడు. అందుచే వినయుడు లేకున్నను వారి కంతకష్టముగ నుండెడిది కాదు.

వినయుడు వెడలిన మూడుమాసములకే యాతనిక్షేమసమాచారము లేఖమూలమున విజయుని కందెను. అత డాలేఖాంశముల నప్పుడె సుగుణ కెరుకపరచెను. ప్రమద యాత్రముతో 'ఏదీ యుత్తరము' అని ప్రశ్నించెను. అత డామెచేతి కది యందించెను. ఆమె రెండునిముసములలో లేఖ పఠించి యాతనికి తిరిగి యొసంగెను. ఆమె చదువనేర్చినదని విజయు డెరుగడు.

'నీవు చదువగలవా?'

ప్రమద సిగ్గుచే ముఖము వాంచి యూరకుండెను. ప్రమదే పంద్రెండేండ్ల యీడుగలచక్కని బాలిక. ఆమెకన్నులు విశాలములును తరళములునై సమ్మోహనాస్త్రంబులవలె నుండును. ఆమె లేతబుగ్గలమీద సిగ్గుచే గులాబిరంగు లప్పుడప్పుడు చిందువారుచుం

డును. సూర్యోదయావనవికాస మా మెమోమున బరిస్ఫుటముగ మంద హాసలీల నప్పుడప్పుడు వెల్లివిరియుచుండును. అప్రయత్నముగ నామె కన్ను లప్పుడప్పుడు నిమీలితమ్ములై నూత్న రేఖలతో జెలువము నింపుచుండును.

విజయుని ప్రశ్నమునకు తల్లియే జవాబిచ్చెను.

'అప్పుడప్పుడు వినయుఁడు చదువు నేర్పెడివాడు. తాను వెడలి పోవునప్పుడు, చదువుకొనుచుండుమని చెప్పి మరి పోయినాడు.'

అది విని విజయుడు చాల సంతోషముతో నామెవంక చూచెను. ఆమె వాల్చినముఖ మెత్తలేదు. మరి నాల్గురోజులలో మరియొక లేఖ వినయునికడనుండి వచ్చెను. అందులో ప్రమదకు వీలగు నపుడు చదువు చెప్పుచుండుమని విజయుని కోరినాడు. దానితోడనే సోదరికికూడ విజయునికడ జదువుకొనుచుండుమని వ్రాసి పంపినాడు. విజయు డాలేఖ పట్టుకొని ప్రమదకడకు బోయి దానిని చూపినాడు. ప్రమద హర్షపులకిత యయ్యెను

'అట్లయిన నాకు చదువు చెప్పెదవా?' అని యామె విజయుని మెల్లగ బ్రశ్నించెను.

'నీవు చదువుకొనెదవా?'

'ఆలాగుననే. నాకడ నెన్నియో పుస్తకము లున్నవి. అవి యన్నియు నిదివరకే చదివితిని. మరల నవియే చదువుమని అన్న చెప్పినాడు.'

విజయు డామరుచటిదినమునుండియు బ్రమదకు చదువుచెప్పు నిమిత్తము వారియింటికి పోవుచుండెను. ఒకనాడు విజయుడు వారి గృహమున కేగుసరికి ప్రమద యొక కాగితముపై నేదియో కాని వ్రాయుచుండెను. విజయు డామెకు తెలియకుండనే యావంక చూచెను. తన పేరే యామె వ్రాయుచుండుట నాతడు చూచెను.

'ప్రమదా! నేమి వ్రాయుచుంటివి?' యని యాతడు వచ్చుచున్న నవ్వు దొంతరలు పై పల్కెను.

'ఏమియు లేదు' అనుచు నామె యాకాగితము మడతలుగా మడిచి పట్టుకొనెను.

'నేను చూడరానిదా యేమి?'

'ఏదయో యుబుసుపోక వ్రాయుచుంటిని'

'ఏమో చెప్పరాదా!'

'ఏమియును లేదు.' అని యామె చిరునవ్వు నవ్వుచు నించుక ముఖము వాంచి 'అన్న త్వరలో వచ్చెదనని వ్రాసినాడు కదా! ఎపుడు వచ్చును!' అని ప్రశ్నించెను.

వినయుడు నాడే వచ్చెదనని లేఖ వ్రాసినాడు అది తెలియజేయుటకే విజయుడు వారి గృహమునకే వెడలెను. కాని మాటలలో నది మఱచెను. అతని ప్రేమమయభావంబులు ప్రమద సహజలావణ్యాతిరేక నయనచకచ్చకలలో లీనమై యంతరించిపోయెను. ముగ్ధయగు ప్రమదకూడ విజయుని హృదయాంతరాళమున లిఖించుకొనుచుండును. ఆమె మాటలలో నొక ఎంత తీయదనము, ఆమె చూపులలో నొక సహజమాధుర్యము, ఆమె సౌందర్యములో నొక యమృతస్వచ్ఛభావము, ఆమె లక్షణములలో నొక యానందోత్సవము, పొంగిపొరలి వాని కపూర్వామోదము కల్గించుచుండెను. అట్టిచో నాతడు తన్ను దానే మరచినా డనిన నతిశయోక్తి యేమి?

ప్రమదప్రశ్నమున నాతడు తా నెందులకు వచ్చినది యెఱిగినాడు. తన మరపునకు తానే నవ్వుకొనినాడు. కాని యాతడది పైకి తెలియనీయకుండ మాటలు ప్రారంభించినాడు.

'ఏమో! ఎప్పుడు వచ్చునో నా కేమి తెలియును?' అని యామె ప్రశ్నమునకు జవాబిడెను.

'తిరిగి యుత్తరము వ్రాయుదునని ఇదివరకు వ్రాసినాడే. ఈ నాటి కాలేఖకూడ నీకందునని యడిగితిని.'

'అట్లయిన నేడే వచ్చును.'

కాని యామె వానిమాటలు నమ్మలేదు. తనతో నతడు హాస్యము బల్కుచుండెనని యామె తలచెను.

'ఇదిగో యుత్తరము' అని యామెచేతికి వినయుడు వ్రాసిన లేఖ నందించెను. అది పఠించి ప్రమద హర్షాతిరేకమున వేగమున జనని కవ్వార్త నెరిగించెను.

వినయుడు నాడే గృహమునకు వచ్చునని వినినంతనే జనని సంతోషమునకు మేర లేకపోయెను. పుత్రిక డనిన నామె కమితమగు ప్రేమ. విజయుని సుగుణ యనేక ప్రశ్నముల నడిగినది. వానికన్నిటి కాతడు జవాబులిడి మరలవచ్చెదనని వెడల నుద్యుక్తుడయ్యెను. ప్రమద యంతలో నచ్చెంతకు వచ్చి,

'మరల త్వరలో వత్తువా?' యనెను.

'రాత్రి యెనిమిదిగంటలకు వచ్చెదను. అప్పటికే వినయుడు రాగలడు. మరి యీదినము చదువవలదు' అని చెప్పి యతడు వెడలిపోయెను. ప్రమద ప్రేమావలోకనముల వానివంకకు మరల్చి తదేకదృష్టితో నాతడు దృష్టిపథము దాటువరకు చూచుచుండెను.

ప్రమదతో చెప్పినట్లు రాత్రి యెనిమిదిగంటలకే విజయుడు వారిగృహమున కేతెంచెను. సుగుణాప్రమద లతనికొఱకే యెదురు చూచుచునుండిరి. అతనిని చూచినంతనే ప్రమద లేచి వానికి తన యాసన మొసగి తాను మరియొకచో గూర్చుండెను.

'విజయా! వినయు డెప్పటికివచ్చును.' అని సుగుణయడిగెను.'

'మరియొకగంటలో దప్పక రాగలడు. అచ్చట నాల్గుగంటలకు ముందు బయల్వెడలెదనని వ్రాసినాడు.'

'ఇప్పు డెన్నిది కొట్టిరా?'

'ఆ! ఇప్పుడే కొట్టినారు.'

అంతటితో సంభాషణ మాగినది. బండిచప్పు డేదియైనను విజయు డేతెంచుచున్నాడేమో యని వారు చూచుచుండిరి.

'ప్రమదా! భోజన మైనదా?'

'లేదు.'

'ఎందులకు మానినావు?'

'అన్నతో భోజనము చేయుదును . . . నీవు భోజనము చేసి నాడవా యేమి!' అని తిరిగి వాసనే ప్రశ్నించెను.

'ఏమి!'

'ఏమియును లేదు. చేసితివా లేదా?'

'చేసిన?'

ప్రమద మరి పల్కలేదు

'చేయకున్న?'

'నీవు భోజనము చేయ లేదా?'

'లేదు.'

'అట్లయిన ....... '

'చెప్పుడు.'

'మాయింట భోజన మొనర్పుము.'

'అంగులకా! అట్లయిన భోజనము చేసితిని.'

ప్రమద కుపితయైన ట్లతనిపై పౌకనిశితకటాక్షము బరపెను. విజయుడు నవ్వుచు, 'ప్రమదా! మీయింటనే భోజనమున[illegible] తెమ్ము. మరియొకమాటు చేయరాదా యేమి!

ప్రమదకోప మంతటితోనే తీరిపోయినది. విజయు డనినమాట లామె కధికానందము కల్గినది.

'మరి తప్పరాదు.'

'అల్లా తప్పను.'

'నాచేతిలో జేయివేసి చెప్పినకాని నేను నమ్మను.'

'అల్లా' యని యాత డామెచేతిలో జేయునైచి చెప్పెను. ఆహస్తస్పర్శమున నాతనియొడలు పులకించెను. ఇదివర కెన్నిమారు లాత డామెతో మాటలాడలేదు! మసలలేదు! కాని నేడుమాత్ర మందు నూతనత్వము వానికి పొడకట్టినది. అతడు దక్షిణహస్తముతో నామె హస్తమును స్పృశించినప్పుడే వారు భవిష్యద్దంపతులు కాగలరని యత డూహించెను. ఇంకను వేనవేలుభావములు వానిలో బొడసూపినవి. అట్లాత డూహాపరంపరలలో నూగిపోవుచుండగా వినయుడు బండి దిగి లోన బ్రవేశించెను.

వినయుని జూచి యందరు హాసనయనములతో నాతని నుపలక్షించి క్షేమసమాచారము దెలిసికొనిరి. అప్పుడది యొకయానందరంగ మైనది. ఆనాలుగైదు నిమిషములమాత్రము వినయుడు సర్వము——తనమధురనుకూడ—— మరచినాడు. అతనికన్నులలో నానందము, చిరునవ్వులలో నానందము, వెల్లివిరిసిపోవుచుండెను. అతడు శకటముపై నున్నంతసేపును మధురయెడనే దృష్టి. అతడు దూరమగుచుండినకొలది ప్రేమానుబంధము దగ్గరపడినది. అతడు గృహమున బ్రవేశించువరకు ప్రియమిత్రుని, జననిని, సోదరిని చూచునంతవరకు నాతనిహృదయమున మధురనిర్మలస్వరూపమే కలదు, ఆమె తీయనివాక్యములే యాతనిచెవులలో గలవు, ఆమెమనోజ్ఞకటాక్షములే వానిచూపులలో గలవు. జననిని చూచినంతనే యతడు భక్తిభావమున బలికినాడు. సోదరిని ప్రేమతో దగ్గరచేరినాడు. మిత్రుని హస్తములలో దనహస్త మిడి సంపూర్ణప్రేమతో వానికుశలసమాచారము నడిగినాడు. పరస్పరక్షేమవార్తలు తెల్పుకొనుట యైనంతనే వారు భోజనాదికముల నిర్వర్తించుకొనిరి.

వినయు డానాడు ప్రక్కపై వ్రాలినాడే కాని యతనికన్నులకు నిద్దుర రాకుండెను. వానికన్నులయెదుట మధుర నిర్మలమనోహరస్వరూపమే మాటిమాటికి కనబడుచుండెను. ఆమెవాక్యములు వానిహృదయకుహరాంతరమున ప్రతిధ్వనించుచుండెను. అతడు మరచిపోదమని యెన్నిమార్గములు ప్రయత్నించినను అట్లు చేయలేకపోయెను. కన్నులు మూసినను దన్మనోజ్ఞమందహాసనమంచిత ముఖారవిందము. కన్నులు తెరచినను తదీయమధురస్వరూపవిభ్రమము. అతడెంత ప్రయత్నించినను నిద్దుర రాదాయెను. అట్టులే యాతడాలోచనా పరంపరలలో దూగుచు నామెనే తలచుకొనుచు బండుకొనెను. అతడునిద్రించెను. కాని యానిద్రలోగూడ నామె చక్కని ప్రతిబింబమె స్వప్నవీధులలో వానికి దోచుచుండెను.

మరునాడు తొమ్మిదిగంటలకే విజయుడు వినయునిగృహంబునకేతెంచెను. సాధారణముగ ప్రమదకు చదువుచెప్పుట కతడట్లు ప్రతిదినము వచ్చుచుండెడివాడు. అందుచే ప్రమద పొత్తముదీసికొని వినయునితో మాటలాడుచున్న విజయునికడ కేతెంచెను.

'ప్రమదా! నేటినుండి మీయన్నయే చెప్పును.'

'ఏమీ? నీవెందులకు చెప్పవు'

'మీయన్న యుండగ నే నేటికి?'

'వలదు! నీవె చెప్పుము.'

'దాని కేమికాని, నే నొకటి యడిగెదను చెప్పెదవా?'

'చెప్పెదను.'

'నేను బాగుగఁ జెప్పెదనా? లేక వినయుఁడా?'

ప్రమద యూరకుండెను.

'చెప్పుము.'

ఆమె మోమువాంచి యూరకుండెను.

'ప్రమదా! చెప్పుము?' అని వినయుఁడు హెచ్చరించెను.

ప్రమద యొక్కొక్క యక్షరమే మెల్లన నుచ్చరింపుచు 'విజయుఁడే' యని వచించెను.

'వినయుఁడు బాగుగఁ జెప్పలేఁడా?'

'చెప్పును. కాని నీ వంతకన్న బాగుగఁ జెప్పెదవు.'

అమాయిక యగు ప్రమదమాటల కిర్వురును నవ్వుకొనిరి. ప్రమద తన ముఖము వాంచి విజయునిఁ జూచెను.

'ప్రమదా! రేపటినుండి చెప్పెదను లెమ్ము. నేఁటికి మరి వలదు.'

'రేపటినుండి తప్పక చెప్పవలయునుసుమా?' యని పలుకుచుఁ బ్రమద గృహములోనికి పోయెను.

మిత్రు లిర్వురును హాయిగ మాటలాడుకొనుచుండిరి. అప్పుడు విజయుఁ డొక పుస్తకము దీసి వినయున కిచ్చెను. అది యొక చక్కని నవల. సాంఘికమని మీఁద నే ముద్రింపఁబడి యుండెను. దాని నెవరు వ్రాసిరో యని వినయుఁడు పరీక్షించెను. గ్రంథకర్త విజయుఁడు. వినయుఁ డాశ్చర్యభరితుఁ డాయెను విజయుఁడు కవి యని యాతఁ డిదివర కెరుఁగడు. అతని ప్రథమరచన మిదియే యని వినయుఁడు తెలిసికొనెను.

విజయుఁడు వాఙ్మయపరిశీలన జేసినాఁడు ఆంగ్లాంధ్రములలో నాతనికి ప్రవేశము కలదుగాని యాతఁ డట్టివాఁ డని యిదివర కెవ్వరు నెరుగరు. సాంఘికపరిణామములలో నాతని కాసక్తి మెండు. అట్టికథ నొకం డతఁ డిప్పుడు నవలారూపమున బ్రచురించినాఁడు, అదియైన నిదివర కెవ్వరికి దెలియఁజేయలేదు ప్రప్రథమమున నది వినయుని చేతికే యిచ్చెను. వినయుఁడు కూడ నవలలఁ జదువుటయం దాసక్తి కలవాఁడు. అతడు సాధారణముగ నవల దొరకిన చదువువాఁడు కాఁడు.

అందునను మిత్రుఁడగు విజయుడు వ్రాసినది చదువుట కాతడు ప్రమోదభరితుఁడాయెను.

పుట త్రిప్పి వినయుఁ డాగ్రంథము తనకే యంకితమీయ బడుట చూచెను. సంతోషాతిరేకమున నతడేమియు జెప్పలేదు

పదిదినములు దాటినవి. వినయు డిప్పు డొక చిత్రరచనమందు కాలము బుచ్చుచుండెను అది యొక చిత్రశాస్త్రపద్ధతి ననుసరించి రచింపబడుచుండెను.

పది దినములు దాటుటచే మధుర యొసగిన చిత్రపటము లతడు విలోకింపనెంచెను. అతడు కంపితహస్తములతో వానిని తీసెను. పొత్తముపై ననేకములగు చిత్రము లుండెను. అవి త్రివర్ణచిత్రములు కావు. అప్పుడతడు త్రివర్ణచిత్రముల దీసెను.

అందొకటి యానాటి స్వప్నచిత్రమువలె నుండెను. అందు ప్రకృతిరామణీయకము గుంభితమై యుండెను. పరస్పరముగాఢావలోకనముల యువతీయువకు లిద్దరు నెదురెదురై యుండిరి. దూరమునుండి యొక భయంకరస్వరూప మొకటి విలోకించుచుండెను

రెండవది యొక స్త్రీపటము. ఆమె సాశ్రునయనంబుల కేలు ఘోడ్చి యుండెను.

ఆరెండిటిమీదను ప్రేమపూర్వకముగా మధుర యని లిఖింపబడియుండెను. ఆచిత్రముల జూచుచు నాతడు కనులవెంబడి దుఃఖాశ్రుకణముల జార్చినాడు.

---

౫

రాత్రి పదిగంటలు కొట్టిరి. ఊరంతయు మాటుమణగియున్నది. ఏదివాంధమో కర్ణములు భీతితో వినునట్లు గట్టిగా నరచుచుండెను. ఆయుఃలోకధ్వానము ప్రశాంతశర్వరీతమోవిలీననిశ్చలతా

భావమును గలంచి వేయుచుండెను. మిన్నున గ్రమ్మిన కారుమబ్బుల వెనుకనుండి లేనెల మందహాసమొనర్చుచుండెనే కాని మానుసక వెన్నెల విషాదరేఖాంకితమై యుండెను. అప్పుడప్పుడు మొగిళుల కదలికచే చంద్రరేఖ కప్పబడి మరి వెన్నెల లేకుండెను. అప్పటికి బాగుగ జనసంచారము తగ్గెను. చోరులో జారులో తప్ప నితరులు వీథులలో దిరుగాడువారెవ్వరు? అందు ముఖ్యముగా నాకాళరాత్రి యందరకు భయానకముగా నుండితీరును.

అర్ధరాత్రి గోపాలపుర వీథుల వెంబడి నొకవ్యక్తి గబగబ పరుగులిడి పోవుచుండెను. ఆవ్యక్తి యాచీకటిలో నెవ్వరికిని గానరాదు. ఎవ్వరైన దన్ను వెన్నాడుచున్నారేమోయని భయమభినయించుచు నావ్యక్తి రాజవీథిలో బోవుచుండెను. అదేసమయమున జగచరి నొకగుఱ్ఱపుబండి యాదారిని వెడలిపోవుచుండెను.

ఆగుఱ్ఱపుబండిలోనున్నవారు నాగేంద్రుడు భ్రమర, మధుర. ఊరువీథు లెట్లున్నవియోయని మధురాభ్రమరలు క్రొత్తవారగుటకతన పైకి చూచుచుండిరి. నాగేంద్రనాథుడు మూరకే చూచుచుండెను. బండికి దగిలింపబడియున్న దీపపుకాంతి మిణుకించుచు రోడ్డుపై బడుచుండెను. ఆరోడ్డుపై నెడలుచున్నవ్యక్తి వారికన్నులయెదుటనుండి యాగకుండపోయి ప్రక్క సందులోనికి మరలెను. మువ్వురు జకితులైరి. నాగేంద్రనాథుడు విస్తబ్ధుడై యావెడలుచున్న ధవళాంబరినే చూచుచు బెదవివిరిచెను. భ్రమర యిదియంతయు గనిపెట్టెను. ఆత డెందుల కామెను చూచి చకితుడయ్యెనో యామె యెరుగ లేకపోయెను. ఆమె యెందుల కాయర్ధరాత్రమున బరుగిడిపోవుచుండవలయును! అతనికి ఆమెకు గలసంబంధమేమి! ఆమెను వెన్నంటు దురాత్ము లీతనిచే నియమింపబడినవారా! అట్లయిన నితడామె నెందులకు హింసించుట? ఇందుగల రహస్యమేమి! యని భ్రమర

తనలో దానే ప్రశ్నముల నేచుకొనఁ దొడగెను. నాగేంద్రనాథు డంతలోనే—యామెను చూచుచు తలోనే—పెదవివిరుచుట, కోపముతో నామె వెడలిన దెసకే చూచుట యన్నియు నామె కనుమానాస్పదము లయ్యెను నాగేంద్రునిచూపులు నిశితములును కఠినములు నై యున్నవి అతనిముఖమున నిప్పటికిని కోపచిహ్నములు కానవచ్చుచుండెను పీఁడకాని తన్ను కనిపెట్టెరేమో యని యతడనుమానించెను అనుమానవివృత్తికి భ్రమర నొకమారు మధుర నొకమారు తిలకించెను. అతి చెందులకు తమ్ము జూచినాఁడో భ్రమర గ్రహించి యూన్యముని తానెరుగనట్లు ప్రశ్నలు వేయ మొదలిడెను.

'ఇంత రాత్రివేళ పరుగులిడుచున్న దెవరు?'

'ఎవ్వతెయో వెఱ్ఱిది'

'వెఱ్ఱిదా! పాపము దాని నెవ రేమిచేయుచున్నారో?'

'ఎవ్వరేమి చేయుదురు. ఈయూర పిచ్చియాసుపత్రి కలదు. బహుశః దానినుండి యిట్లు వెడలివచ్చుచుండెనేమో?'

ఆమెకు పిచ్చియా! భ్రమర యామాటల నమ్మలేకపోయెను కాని యామె నేమియు నెరుగనట్లు యూరకుండెను. ఊరకున్నను ఆమె ధ్యానములు మాత్రము పరిపరివిధముల బరువులిడుచుండెను. ఇట్లుండ వారు నాగేంద్రనాథుని భవనము ప్రవేశించిరి. వారలు బండిడిగి లోనికి పోయిరి. భవనము వెనుక నేదియో కలకలము వారికి వినవచ్చెను. కాని యది వారు విచ్చించుకొనకనే మేడ మీఁదికి వెడలిరి. మధురాభ్రమరలకు వేఱెయొకగది సామానుల నుంచుటకు జూపబడినది అంత నాగేంద్రనాథు డిప్పుడే వచ్చెదనని దిగువకు వెడలెను. మధుర భ్రమరకు దగ్గరగా వచ్చి,

'ఆమె సుమ కాదా' యని ప్రశ్నించెను.

'ఔను. కాని నీవాయుబు నేమియు మాటలాడకుము' అని

భ్రమర జవాబిడి దిగువ నాగేంద్రు డెవ్వరితోడనో మాటాడుచుండె నని గ్రహించి, వెలుపలకు వచ్చి నిల్వబడెను.

నాగేంద్రనాథుడు దిగువ నెవరితోడనో మాటలాడుచుండెను. మే మిప్పుడే యీసంగతి కనుగొంటిమి

నాగేం—మీకు బుద్ధులు లేవు .. నేనుచూచితిని— క్షమించ వలయును.

వా రెవ్వరో యింకను మాటలాడుకొనిరి. కాని యవి యామెకు వినబడలేదు. త్వరనే యతడు మేడమెట్లెక్కుచుండెను. అంతట వారు భోజనమొనర్చి చాలరాత్రి యగుటచే బండుకొనిరి.

రాత్రి భ్రమరకు రెండుమూడుసారులు తెలివివచ్చెను. ఆమె కేదియో యొకశబ్దము వినబడుచుండెడిది. అది యేమియో ఆమెకే తెలియకపోయెను. ఎవ్వరో కొందరుమనుజులధ్వని యని మాత్ర మామె తెలిసికొనెను.

---

౬

ప్రశాంతచంద్రబింబముపై మబ్బుతునుక నిల్చినది, అమృతమాధురీసుమనస్సుకుమారిపై వేడిగాలిదొంతరలు వీచినవి, మధురముఖ మంధకారైకపటావృతమాయెను, మధురదేహము శుష్కపత్రమువలె మాఱిపోయినది. తదీయహృదయాంబునిధి యుచ్ఛలిత మాయెను. తదేకాలోచనలలో దన్నుదానే యామె మఱచుచుండెను. అప్పుడప్పుడు దినమొకయుగముగా నామెకు దోచుచుండెను. అంతయును నామె కంధకారబంధురముగా నుండెను. రాత్రులు నామెకు సరిగ నిద్రపట్టకుండెను. ఏమియో విచిత్రధ్వనులామెను నాడునాఁ

టికి కలఁచుచుండెను. ఆధ్వనులు తనకే వినఁబడుచుండె నని యామె యూహించుచుండెను కాని, భ్రమరకు నట్టిసవ్వడి తొలినాఁటినుండి యు వినఁబడు చుండెను. పగటిసమయమునగూడ నాధ్వను లామెకు వినవచ్చుచుండెను. కాని శబ్దసమన్విత మగుపగటపూట నవి తెలియవు. నాగేంద్రనాథుఁ డనిన భ్రమరకుఁగూడ నొకవిధమగు సస హ్యమంకురించెను. కాని యది యెవ్వరికి తెలియనీయక యామె ప్రవర్తించుచుండెను. నాగేంద్రనాథునియెదుట నామె నిలుచుట కనుమానించెడిది. అతని క్రూరములగుదృష్టు లెవ్వరికి భయానకములు కావు? రాత్రులయం దతఁ డెప్పుడెటకో వెడలుచుండెడివాఁడు. అది భ్రమర కెన్నట్టును కాని యాతఁ డెటకుపోవుచుండెనో యామె యెఱుఁగ లేకుండెను.

ఒకనాఁడు భ్రమర రాత్రుల వినిపించుశబ్దములఁ గూర్చి నాగేంద్రనాథు నడుగ నిశ్చయించుకొనినది

"రాత్రుల నేవియో భయంకరములగుధ్వను లీచుట్టుప్రక్కల నుండి వినవచ్చుచుండును. అవి యేమి?"

"మీ కవి భయముఁ గల్పించుచున్నవా?" అని నాగేంద్ర నాథుఁ డొకవికటమందహాస మొనర్చుచుఁ బల్కెను.

"చాల భయంకరముగ నున్నవి. నాకు నిద్రకూడ రామాని నది. నేను త్రుళ్ళిపడి లేచి యవి యేమియని యాలోచించినను నా కేమియుఁ దెలియదాయెను. అంత కఠోరకంఠము నే నెప్పుడును విన లేదు."

"మనభవనము వెనుకనే యొక పిచ్చియాసుపత్రి కలదు. దానిలో నున్న వెఱ్ఱివాం డ్రట్టిగోల చేయుచుందురు."

"ఏమి, మనము వచ్చుచుండఁగఁ జూచినయామె పిచ్చిదియేనా యేమి? అట్లు పరుగిడుచున్నది."

"ఔను" అని నాగేంద్రనాథుఁ డాసంభాషణము మరి పొడుగింప నిష్టము లేక వెడలిపోయెను.

అంతయు నాలించినతరువాత భ్రమర "నిజముగా సుమకు వెఱ్ఱియా యేమి!" యని మాటిమాటికి తన్ను దానే ప్రశ్నించుకొనుచు నిదివరకు జరిగినసంగతులతో దీనిఁగూర్చి యాలోచింపఁ దొడగెను. అట్లయిన వెఱ్ఱిలోనే యామె లీలసమాధిపై నట్టిలేఖ యుంచుట యెట్లు తటస్థించును?

మధుర భ్రమరతోడ నైనను మాటలాడుట లేదు. ఎప్పుడో వారు ఏకతము నున్నప్పుడే మాటలాడుకొనుచుండిరి. అట్టియేకాంత సమయములు వారికరుదుకావు. ఐనను మధుర దుఃఖపరివృతయైనట్లు మాటలాడుట అరుదుగా నుండెను. భ్రమరహృదయమున నిప్పుడు శూలములతోఁ బొడిచిన ట్లగుచుండెను. మధురముఖమున మందహాసము గల్పించుట కామె యెట్టిపనియైన జేయుటకు నిశ్చయించుకొనెను. అట్లయ్యు నామె హృదయము దాచు నేర్పు కలది, మధుర యట్లు కాదు. అందుచే నామె యప్పుడప్పుడు మధురను మందలించుచుండెను. మధురమాత్రము యథారీతినే యుండెను. నాగేంద్రనాథుని తోడ నామె మాటలాడుటయే మానినది. భోజనసమయమున మాత్రము మువ్వురు గలియుచుండిరి. ఒకనాడు నాగేంద్రనాథు డామె చేతి కొకలేఖ నందిచ్చి ఎవ్వరో నీకు వ్రాసిరి యని చెప్పెను. మధుర తన కెవ్వరు లేఖ వ్రాయుదురో యెరుగలేకపోయెను. ఆకవరుపై శ్రీలాసము మధుర, నాగేంద్రనాథుని భవనము గోపాలపురము. అని లిఖింపఁబడియుండెను. ఆవ్రాత యామెకు పరిచితము కాదు. ఎవ్వరది వ్రాసిరో యామె గ్రహింపనేరకపోయెను. ఏకాంతమున నామె యా యుత్తరము దీసి చూచెను. అం దిట్లు లిఖింపబడియున్నది.

'రేపటి రాత్రి పదునొకండు గంటలకు, చెరువుప్రక్క నున్న మఱ్ఱిచెట్టుకడకు రమ్ము. రహస్యవిషయముల గూర్చి నీతో మాటలాడవలెను. నే నెవరో ముందు నీకు తెలియగలదు. అనుమానము వదలుము—                    నీ క్షేమము గోరు—'

దురంతచింతాకులితయగు మధుర యాలేఖ జూచి వణకిపోయెను. అది యేమియో యామె యెరుగలేకుండెను. నాక్షేమము గోరువా రొక రివిశ్వాసుం దున్నారా? . . . ఎవ్వరు?. . . . విజయుడా? . . . . . అతని వ్రాతయేనా యిది? . . . . కాదే? మరెవ్వరిది వ్రాసియుందురు? నాకు తెలిసినవా రీయూర మరెవ్వరున్నారు? అని యామె తనలో నేదియో యనుకొనుచుండెను. కాని యామెకు చెరు వెచ్చట నున్నదో తెలియదు. కావున మున్ముందు చెరు వెచ్చట నున్నదియో కనుగొననెంచెను. ఆయూరు వచ్చినది మొదలు భ్రమరకాని మధురకాని షికారు వెడలుట లేదు. నేడు మధుర షికారు వెడల నిశ్చయించుకొనెను. నాగేంద్రనాథునితో నామె యిందులకే మాటలాడెను.

'ఈదినమున నెచ్చటికైన షికారుపోవలెనని యున్నది?'

నాగేంద్రనాథు డామాటలకు పరమానందము జెందెను. ఆమె తన్నెప్పుడైన ప్రేమించునని యాత డుప్పొంగెను. 'అలాగుననే. ఎచటికి పోదము.'

'ఈయూర చెరు వున్నదా?'

'ఉన్నది.'

'అట్లయిన చెరువుగట్టునకు పోదము.'

'మీయూరు సముద్రపుగట్టునకు బదులు మాయూరు చెరువుగట్టా. బాగుగ నున్నదని' యాతడు మందహాస మొనరించెను.

ఆ మందహాస మెప్పటివలె వికటమే! ఆమందహాసము మధురకు భయోత్పాతము. కాని యాత డది యెరుగడు. ఆమె కానాడు తనపై దయకలిగినదని యతడు భావించెను. సాయంతన మూరుగంటలకు వారు బండిపై చెరువుగట్టునకు పోయిరి. చెరువు వారి భవనమునకు మూడు ఫర్లాంగుల దూరమున నుండెను. చెరువు పడమటితటమున పెద్దమఱ్ఱిచెట్టు కలదు. ఆమఱ్ఱిచెట్టుకడకే తానా మరునాటి రాత్రి వెడలవలయుగదా యని యామె భావించెను. మధురహృదయమున నట్టిభావములు పొడచూపుచున్నవో భ్రమర యెరుగదు. ఆమె నాడు సంతోషముగ నున్నదనియే యామె తలపు. కాని మధురయో? ఆమె భావము లన్యుల కెరుగరానివి మెల్లన నామె యన్నివంకల దిలకించి మఱ్ఱిచెట్టును చూచెను. అది చాల పెద్దది. రాత్రి సమయముల నచ్చోట కేగుట చాల కష్టము. సాయాహ్నముననే యది యంతభయంకరముగ గన్పట్టుచుండెను. నిశాసమయమున, మహాంధకారమున, నింకెంత భయంకరముగ నది యుండునో కదా! అట్టిభావములతోడనే నాడు మధురహృదయము కలగిపోయెను. సంధ్యారోచులు కరగిపోయినవి మునిమాపు సువర్ణము మాసిపోయినది. అట్టిసమయమున వారు గృహోన్ముఖులైరి. మధుర ప్రక్కనే భ్రమర నడచుచుండెను. ఆమె భుజముపై జేయినిడి మధురమదగమనంబున నడచుచుండెను. రాజవీధిలో నక్కడక్కడ దీపములు వెలుగుచుండెను. ఆదీపముల కాంతిలో విస్పష్టముగ, విజయుడు మరి రొక యువకునితో గలసిపోవుచు, మధుర కన్నుల బడెను. వినయుడు క్కడ నామెను తిలకించెను. వారి నయనము లొక్కమారు కలసినవి. అంతలోనే వా రొకరిప్రక్కనుండి మరియొకరు వెడలిరి. అప్పట్టున వారి వస్త్రములు ముద్దులాడుకొనినవి. మధుర కొక మారొడలు జలదరించెను. ఎప్పుడైన వినయుడు తనకు రక్షకుడు కాగ

లము. వానిరూపులో నాభావ మున్నది. అని యామె భావించెను. మరల నెన్నిదినములకు వానిని చూచుట యబ్బినది.

మధుర దారిలో వినయుని చూచుటకాని, వారిచూపు లొక్కమారుగా గలయుటకాని యన్యు లెరుగరు. ఆకలయికలో నెన్నినీరదసందేశములు వెడలినవో వారికే తెలియవలెను. మధుర కానాటి రాత్రి యవేతలపులు. వినయునితో దా బుచ్చినదినములు — అవి యెంతమధురములగు దినములు—మధురతలపులలో బ్రవేశించినవి. ఆభావములలో నామె నైక్యమైపోవుచుండెను. తదీయహృదయకమలమున వానిరూపము శాశ్వతముగ బ్రతిష్ఠింపబడినది. వానిరూపమామె హృదయాంతరాళమున నొరుల కెరుగరానిచోట దాగినది. అటనుండి యిక నారూపము తొలగనేరదు. స్థాయీభావము బొందిన వినయునిరూపము మధురకన్నులకు సర్వకాలసర్వావస్థలయందును గోచరించుచుండెను. ఆరూపమే యామె కప్పుడప్పుడు హృదయశాంతి నొసఁగుచుండెను.

ఆనా డెట్లో యామె గడపెను రాత్రి తొమ్మిదిగంటలైనది. మరియొకరెండుగంటలకు తా నచ్చటికి పోవలయును. 'అచ్చటికి వెడలుటా?' అని తనహృదయము నామెప్రశ్నించెను. దానికి జవాబేమి? ఆమె కేమియుఁ దోఁచుటలేదు. ప్రక్కపై మేను వ్రాల్చి యాలోచింపఁగడఁగెను. 'మధురా! వెడలుము' అని యామెయంతరాత్మ బోధించెను. 'అట్లే వెడలెదను' అని యామె నిశ్చయించుకొనెను. ఆలోచనాధీనయై యామె యుండగా నామెకు తెలియకమునుపే యామెకు నిద్రవచ్చినది. ఆనిద్రలోఁ దాను చెరువుగట్టుపైనున్న మఱ్ఱిచెట్టుకడకు వెడలినట్లు కలవచ్చినది. అవకుంఠసమాచ్ఛాదిత వ్యక్తి యొండచట గోచరించెను.

'మధురా!'

ఆమె పల్కెను. ఆవ్యక్తి ముసుఁగుతీసెను.

వినయా! యనుచునామె లేచెను. అంతయు శూన్యము. అంధకారబంధురము. గదిలో దీప మారిపోయియున్నది. ఎన్నిగంటలైనదో యని యామె తలఁచెను. దీపము లేదే యెట్లు తెలియును. టంగుమని గడియారము గంటకొట్టెను. పదిగంటల ముప్పదినిముసములా?. . . . ఎంత? ఆమె యాలోచించుచుండఁగనే మరల గడియారము రెండుగంటలు కొట్టెను.

ఎంతపని యైనది? యని యామె విచారించెను.

---

౨

నాలుగైదుదినములవరకు మధుర కేమియుఁ దోఁచకుండెను. తా నారాత్రి మఱ్ఱిచెట్టుకడకు వెడలిన నేమియైయుండునో యామె సరిగ నూహింపలేకుండెను. తన క్షేమముఁ గోరువారిని చూడలేనైతినికదా యని యామె చింతావహించెను. ఆమె దుఃఖభారమునఁ గ్రుంగిక్రుంగి యణఁగిపోవుచుండెను. మధుర యానాఁ డుబుసుపోకకునై పత్రికనొకండు తీసి చూచుచుండెను. అందేవి చదివినను ఆమెకు మరికొంత చీకాకుగ నుండెను. అట్లే కాగితములఁ దిరుగవేయుచు నామె బొమ్మలఁ జూడ నారంభించెను. గోపాలపురము వచ్చిననాటి నుండియు నామె కుంచెపై జేయి వేయలేదు. అందుచే నామె యాసక్తితో బొమ్మలఁ దిలకించుచుండెను. ఒక్కబొమ్మ యామె నాకర్షించెను. అది విరహిణీపటము. ఆపటము సజీవ మన్నట్టు లుండెను. ఆకన్నులలోఁ దళతళ, చాంచల్యము. . . . . అంతయుఁ దన్నే పోలియున్నట్లు గ్రహించెను. దానిపై నిట్లున్నది.

## విశ్వకళాప్రదర్శనము.

### ప్రథమ బహుమానము వేయిరూప్యములు.

### వినయుఁడు.

(గోపాలపురము)

(వినయునిచే రచింపఁబడిన త్రిపర్ణపటమునుండి తీసిన యేకవర్ణచిత్ర మిది.)

వినయుఁడు విశ్వకళాప్రదర్శనమునఁ బ్రథమబహుమానము బడసెనని దెలియుటచే మధుర కొకయపూర్వమోదము ఘటిల్లెను. ఆయామోదములో నామె విపులవిశ్వము నే మరచిపోయెను. వినయు డెంతటియదృష్టవంతుఁడు. ఈజయమున కాతఁ డెంతసంతోషించునో యని యామె యనుకొనెను. కాని యాబహుమానముకన్న తా నొసఁగినచిత్రపటములు—ప్రేమపూర్వకముగాఁ దా నిడిన చిత్రములు వానికి వేయిరెట్లు ప్రియములు, అని యామె మరచెను. తదేకదీక్షతో నామె యాచిత్రపటముదెస చూచుచుండెను, లేదా వినయుడు అను నక్షరములదెస చూచుచుండెను. ఆయక్షరములలో వానిస్వరూపము మధురకు గోచరింపఁదొడఁగెను. ఆచిత్రపటమున వానిరూపమె కన్పించెను. ఆమె పెదవులమీఁదుగ వేడివేడినిట్టూర్పుగాడ్పులు వెడలెను. వానినే తలఁచుకొనుచు నామె కుర్చీలోఁ గూరుచుండెను. ఆనాఁటి సాయంతనమునఁ ద న్నాతఁడు చూచుట, వారిదృష్టు లేకమగుట, అందులో నీరవప్రణయసందేశము లిమిడిపోయియుండుట అన్నియు నొక్కమారుగ నామె తలపునకు వచ్చెను. గిఱ్ఱుమని శరవేగమున స్వప్నమువలె నన్నిసంగతులు నామెయెదుట తిరిగినవి. ఆమె యా పత్త్రికను గుండియలపైఁ బడవైచికొని శూన్యదృక్కుల నల్వంకలఁ బరచుచు వినయునే తిలకించుచుండెను.

ఇంతలో నొక సేవకుఁడే తెంచి యామెచేతి కొకలేఖ నందించెను. ఆలేఖ యెవరు వ్రాసినది? ఇదివరకు వచ్చినయుత్తరము వ్రాసినవారి వ్రాఁతయే యది యని యామె గ్రహించెను. సేవకుండు వెడలినంతనే యామె యాలేఖను కంపితహస్తములఁ దీసి చదివెను.

అభాగినీ! మధురా!

భవదీయ భవిష్యజ్జీవననౌక యగాధ సముద్రమధ్యమున, కష్టతరంగసంకులితమై ప్రళయఝంఝామరుద్ధతిచే నెప్పుడు బోర్లపడునో యూహించుకొంటివా? ఈదినముననైన నీవు సరిగాఁ బదునొకండుగంటలకు చెఱువుగట్టుపై మఱ్ఱిచెట్టుకడకు రమ్ము. ఒకచో నేను నీకీదినమునఁ గానరాకున్నచో రేపటిదినమునఁ గూడ తప్పక రమ్ము. అట్లు రాకున్నచో మరి నీవు నన్ను చూడలేవు. నే నేటికిట్లు వ్రాయుచుంటినో నీవు మున్ముందు తెలిసికొందువు. స్వర్గస్థురాలగు నీజననీ సందేశముగాఁ నిది నీవు నమ్ముము— నీక్షేమము గోరు—

ఆయుత్తరము చదివినవెంటనే యామె యది యొకపెట్టెలోఁ బడవైచి యొరులకు తెలియకుండ దాచెను. ఆలేఖ వ్రాసినవా రెవ్వరో యామెకు త్వరలో దెలిసికొనవలెనని యభిలాషము పొడమినది. అప్పుడు సాయాహ్న మగుచుండెను. నాగేంద్రనాథుఁ డచ్చటికేతెంచెను. భ్రమరకూడ నచ్చటికి వచ్చెను.

నాగేంద్రనాథుఁ డిదియు నదియు గొంతవరకు మాటలాడి నిలిచి 'మధురా! నీకీ రోజున నేదియో లేఖ వచ్చెనట!'

మధుర కాయుబుసు మాటలాడుట కిష్టములేదు. కాని జవా బిడక విధిలేకపోయెను. 'ఔను.'

'ఎవ్వరు వ్రాసిరి?'

'నా స్నేహితురాలు.'

'మీయూరేనా?'

'ఔను.'

నాగేంద్రుఁడు మరేమియు నడుగలేదు. భ్రమర వారి సంభాషణమంతయు విస్మయవిస్ఫారితనయనములతో నాలించుచుండెను.

'ఈదినమున పైరుపోదమా!'

'నేను రాజాలను.' అని మధుర యనినంతనే నాగేంద్రనాథుడు లేచి 'నాకించుక పనియున్నది' యని చెప్పి వెడలిపోయెను. అతని వంకనే మధుర కోపదృష్టులు పోయెను. భ్రమర కీసంభావణ మేమియుగూఢ నర్థము కాలేదు. ఏలయనిన నామె మధుర కెవ్వరికడ నుండియో లేఖవచ్చినదనియే యెరుగదు. ఆవిషయముగూర్చి యామె మధురను కనుగొన నెంచెను.

'మధురా! లేఖ నేమి?'

'ఏమియును లేదు——' సోదరికికూడ మధుర యాలేఖాంశములలో నొక్కటియు జెప్పదలచుకొనలేదు.

మధుర తనకడ నేదియు దాచదని భ్రమర తలచెను. కాని నేడట్లు జరిగకునికి భ్రమర చకితయయ్యెను. 'మధురా నాకడ నీకు దాచుటా!'

'భ్రమరా! క్షమింపుము. ఆ లేఖలగూర్చి నీకు రెండుమూడు దినములలో దెలియబరతును. అంతవరకు నీ వోర్చుకొనవలెను.'

'ఒక లేఖ కాదా?'

'కాదు. ఇదివర కొండు వచ్చినది.'

భ్రమర కింతయు రహస్యమయముగా గానవచ్చెను. కాని యామె యేమియు జెప్పలేకుండెను. మధురను ప్రశ్నింపలేకుండెను, ఆరెండుదినములు దాటినతరువాత జెప్పునుకదా యని యూరకుండెను, ఆనాటిరాత్రి మధుర తనగదిలో కూరుచుండి యెప్పుడు పదునొకండు గంటలు కొట్టెదరు. అని యాలోచించుచుండెను. పండుకొనిన నిద్ర

వచ్చునని యామె కూరుచుండెను. సరిగా రాత్రి పదిగంటలైనది. నాగేంద్రనాథుడు తనగది వెల్వడి వచ్చి మధురను చూచి, 'ఇంకను మేల్కొని యుంటివేమి?' అని ప్రశ్నించెను.

'నిద్ర వచ్చుటలేదు.' అని యామె పండుకొనుట కభినయించెను. పదునొకండు గంటలకు పది నిమిషము లుండెననగ నాగేంద్రనాథుఁడు మేడమీఁద తన గదిలోఁ బండుకొనఁబోయెను. పదునొకండు కొట్టిరి మధుర చప్పున లేచి యడుగులచప్పు డెవ్వరికిని వినఁబడనట్టులు మెల్లన నడుగులిడుచు మేడ దిగెను. భవనద్వారముకడ నొక చిన్నదీప మున్నది. అదిదాఁటి యామె బయల్వెడలెను. ఆమె కా చీఁకటిలో కన్నులు కనఁబడవాయెను. కాని దూరదూరమున నున్న దీపములు చిరుకాంతిలో నామె మెల్లనఁ జెరువుగట్టు దెసఁ బోవుచుండెను అప్పు డామెకు మార్గమున మనుజుల సవ్వడి వినవచ్చెను. ఆదెస కామె చూచెను. నల్గురైదుగురు మనుష్యులు చరచర నేదియో యచేతనపదార్థ మొండు తీసికొనిపోవుచున్నట్లామె యూహించెను. ఆయూహకే యామెగుండెలు దడదడ కొట్టుకొనసాగెను. ఇఁక నడచుట కామెకు మరి పాదములు సాగలేదు గృహమునకు మరలుదమా? వలదు పర్యవసానము బరిశీలింతము. ఏమైనను కానిమ్ము. అని యామె దృఢనిశ్చయ మొనర్చుకొనెను. ఎన్నియాపదలువచ్చినను ఆవ్యక్తితో నెట్లయిన మాటలాడవలయును. అని యామె నిశ్చితయై మెల్లనఁ బదముల ముందునకిడుచుఁ బోయెను. ఆకారుచీఁకటిలో మఱ్ఱిచెట్టొక భయంకరపిశాచమువలె గన్పించెను. మధుర యాదృశ్యముఁ గన్నుల నిల్పలేకపోయెను. ఎట్టకేల కామె యాచెట్టును డగ్గరెను. ఆమెభుజమున కేదియో తగులుటయు నామె ప్రక్కకు తొలఁగి భయముతో నటు చూచెను. అది

యొకయూడ. దానికే భయమందితిఁగదాయని యామె నెమ్మది వహించెను.

అచ్చో నొకయరగంటవరకు మధుర నిల్వఁబడెను. ఆకుల లిన చప్పుడుకూడ నామెను కలఁచుచుండెను. కాని యావ్యక్తి యాగమనమే లేదు. మధుర యాచీఁకటిలో నిక నిల్వలేకపోయెను. ఆమె మెల్లన గృహోన్ముఖ యయ్యెను. భవనములోని కామె వెడలి మేడ మెల్లన నెక్కెను. అచ్చో నామెకు నాగేంద్రనాథుఁడు ప్రత్యక్షమయ్యెను. ఆమెపైఁ బెద్ద పిడుగుపడినట్లయ్యెను. అతఁ డేమి ప్రశ్నించునో? ఛీ! వానికి తా నేటికి వెరచుట. ఆమె యనుకొనినట్లు నాగేంద్రుఁ డామెను చూచి యాశ్చర్యమున నిట్లనెను.

'మధురా! ఇంతరాత్రివేళ నేకతమ యెటు పోతివి.'

'ఎచ్చటకును లేదు.'

'ఏమి? నాతో నసత్యమా! ఛీ! నేనుచెప్పెదను.'

మధుర మౌనమూనెను.

'వినయునికడకు......నీమనను హరించినవానికడకు . సిగ్గు లేదా! నాకంటఁబడుటకు.'

'నే నంతనీచపుఁబని చేయను......కాని నే నెచ్చటికి పోతినో మాత్రము నీ కెరుఁగఁజేయును' అని చెప్పుచు నామె తనగదిలోనికి పోయెను. అప్పుడే పండ్రెండుకొట్టిరి.

భ్రమర వారిసంభాషణమంతయు నాలించి యాశ్చర్యముచే నేమియు నెరుఁగకాయెను......అ లేఖలు వినయుఁడు కాని వ్రాయలేదుకద యని యామె యనుకొనెను.

ప్రియమిత్రుఁడగువిజయునిగృహంబున వినయుఁడు నాఁటి రాత్రి కూర్చుండి సంభాషించుచుండెను. రాత్రి తొమ్మిది దాఁటిపోయినను వారు మాటలాడుకొనుచునే యుండిరి. వారిప్పుడమందానంద మనుభవించుచుండిరి. చిత్రకళాప్రదర్శనమున వినయుఁడు ప్రథమబహుమానము వడయుటచే విజయున కాతఁడనిన మరియుఁ బ్రేమగనుండెను. విజయుఁడు సాధారణముగ వినయునిగృహమున నతఁడు బొమ్మలువ్రాయుచుండఁ జూచుచుండును. విజయుఁడు మరియొకగ్రంథమును రచించి యది చిత్రపటశోభితముగ బ్రకటింపనెంచెను. వినయుడు కథనంతయు చదివి, బొమ్మల గొన్ని వ్రాయుచుండెను. ఆనాటిరాత్రి వారు పుస్తకప్రకటనముగూర్చి యాలోచించుచుండిరి.

'విజయా! త్రివర్ణచిత్రములు ప్రకటించుటకు చాలసొమ్ము కావలసియుండును.'

'ఐన నేమి? బొమ్మలుకూడ వేరుగ నమ్మిన సొమ్మురావచ్చును.' విజయునకు సొమ్మునిన లక్ష్యములేదు. అందునను పుస్తకప్రకటనమున వెనుదీయఁడు. ఇట్లు వారు మాటలాడుకొనుచుండగ బదిగంటలు కొట్టిరి. వినయుఁడది విని లేచెను.

'నే నిక గృహమునకు పోవలయును. చాల నాలస్యమైపోయినది.'

'చీకటిగ నుండును. పోగలవా!'

'భయము లేదు.' అని వినయుఁడు బయలువెడలెను.

వినయుఁడు గుమ్మముదిగునరికి నాప్రక్కనే వానికి చీకటిలో నొకమనుజుఁడు గోచరించెను. కాని యాత డెవ్వడైన వానికేమి? అత డాదెస చూడకయే తనదారిని వెడలెను. ఆవ్యక్తి వాని వెనుకనే

నడచుచు బోవుచుండెను. వీధియంతయు నంధకారబంధురమై యుండెను. అం దెవ్వరును నడచుటలేదు. విజయుడు మాత్రము,—తన్నెవ్వరో వెన్నాడుచున్నా డనుసంగతి మరచియో—నడచుచుండెను అట్లు నడచుచు నాత డిదివరకొకమారు రట్టచీకటిలో నడచుట, ఒక పాడుగృహమున దాగియుండుట, మొదలగుసంగతు లన్నియు తలచుచుండెను. ఆనాడు తా నొనర్చినసాహసము తలచిన వానికే నమ్మకములేకుండెను. ఇప్పు డెవ్వరైన దన్నడ్డగించిన? అట్టి వెఱ్ఱియూహ ఇంకొకటి యుండదని తలచెను. కాని తన్నొకడు వెన్నాడుచుండెనని యెఱుగడు. త న్నాత డొకవేళ నేమైనచేయునని యైన వాడెఱుగడు. అట్లు తన్నొకడు వెన్నంటివచ్చుచుండెనని తెలిసిన వినయు డేమిచేయును? కాని వినయున కాతలపే లేదు. ఎట్లయిన నాత డనుమానించినవాడుకాడని యావ్యక్తి యెఱిగి యట్లే వాని వెన్నంటి వచ్చుచుండెను. కాని వినయున కాచీకటిలో గొంచెము కొంచెముగ డెందమున భీతి యంకురించుచుండెను. .. .....ఏమది. తన్నెవ్వరో వెన్నాడుచుండిరా? అతడు జాగ్రత్తగ వినెను. నిశ్చయంబుగ ద న్నెవ్వరో వెన్నంటివచ్చుచుండిరని యతడు తెలిసికొనెను. వినయు డొక్కొక్కమా రడుగుల మెల్లన నిడుచుండెను. అప్పు డావ్యక్తియు మెల్లన నడచుచుండెను. వినయుడు త్వరితగమనుడై వెడలుచుండ నావ్యక్తియు దనయడుగుల జరచరనిడుచుండెను. ఇంతలో వినయుడు తనగృహము సమీపించెను. తా నింటిలోనికి వెడలిన నావ్యక్తి తనగృహము దెలిసికొనును. దానివలన నేదియో యాపద సంభవించును. అని యతడాలోచించి తన యింటిపైపైన దిరుగక నడచుచుండెను. ఆవ్యక్తియు వాని వెనుకనే యుండెను,

వినయున కేమియుం దోచకుండెను. అతడే పనిమీదనో పోవుచున్నవాడై యుండకూడదా? వినయుడు టక్కున నొకవో

నాగెను ఆవ్యక్తియు నాగెను. వినయుఁ డిఁక నోర్వలేక శరవేగమున ప్రక్కసందులోనికి పోయెను. ఆతఁ డామె యొక్క గృహము చీడీలోనికి వెడలి, గోడవార నిల్వఁబడెను. ఆవ్యక్తి యాసందులోనికి వచ్చెను. కాని వినయుఁ డతనికి కన్పడలేదు. అతఁ డిటునిటు తిరుగుచు నుండెను. వినయుఁ డూపిరైన విడువ సాహసింపలేదు. ఇంతలో నా యింటిద్వారము తెరువఁబడెను. వినయుఁ డట్లే చూచుచునుండెను. అతని వెన్నంటివచ్చిన వ్యక్తి ప్రక్కకు పోయెను. ఆగృహమునుండి వినయునకు చిరపరిచితయగు నాధనళాంబకి వెల్వడివచ్చెను. ఆమె గృహమిదియా?

సుమ వెల్వడినయంతనే ద్వారము మూయఁబడెను. ఎవ్వరో లోన నుందురని యతఁడు తలఁచెను.

ఏమి యీవింత?

సుమ వీధివెంబడి పోవుచుండ వినయుని వెన్నంటిన వ్యక్తి యామె వెనుకనే పోవదొడగెను. ఏమి యీ రహస్యము?

వినయుఁడు బసలుదేరి నాఁడు గృహమునకు వెడలుసరికి పదునొకండు గంటలు కొట్టెరి. 'ఇంతరాత్రివరకు ఏక నెప్పుడు నిల్లు విడిచి యుండకుము.' అని జనని యతనిని మందలించెను. అతఁడుకూడ నిఁక నట్లుచేయరాదని తలఁచెను.

— —

౯

మధుర కానాఁడు నిద్ర లేదు. నాగేంద్రనాథుఁడు తన్నట్లు ప్రశ్నించినాఁడు! 'వినయునికడకు పోయితివి!' అని తానట్లొనర్చుట తప్పని యామె యెఱుఁగదా! తన్నట్లతఁ డడుగుట యెంత హైన్యము. అని యామె భావించెను. 'నే నెప్పటికిని వాని స్వాధీనమున నుండను.

అతఁడు దుర్మార్గుఁడు వానిచరిత్ర మెవ్వరికిని తెలియదు. అట్టివానిని నే వివాహమాడను.' అని యామె నిశ్చయించుకొనెను. తెల్లవారు వఱకు నవే భావములు.

ఉదయముననే భ్రమర సోదరికడ కరుదెంచి కూర్చుండెను. నాగేంద్రనాథుఁ డెటకు వెడలెనో కాని వారికాపూట యూతఁ డగపడలేదు. తొలినాఁటి రాత్రిసంగతులు భ్రమరహృదయమున నాటుకొని యుండెను.

'మధూ! మధూ! నీవు నాహృదయమున సహకారణముగ నగ్ని రవ్వలొల్కుచుంటివి నీ నెట్టి రహస్యములైన నాకడ దాపకుండ చెప్పుము.'

మధుర మౌనముద్ర వహించెను

'నేనొకటి యడిగెదను కోపింపవుకద.'

'అడుగుము.'

'నిన్నటిరాత్రి మీసంభాషణము నేనాలించితిని.'

'ఏమి!'

'ఔను. నాకప్పుడే మెలకువ కలిగెను. అతనిమాటలు నీకఠినములగు జవాబులు వినియుంటిని.'

'నావి కఠినములగు జవాబులా? ఆమాట లాతఁ డెట్లనెనో! ఎంతటి గౌరవహీన వాక్యములు?'

'ఔను! కాని నీవలనఁ దప్పున్నది.'

'నావలన! . ఎట్లు?'

'నీవెచ్చటికి వెడలితివి?'

'అది నేనిప్పు డెవ్వరికిని తెలియఁబఱుపనిశ్చయించుకొనలేదు. అదితప్పుగా భావించుచుండిన నేనేమి చేయఁగలను? మున్ముందంతయుఁ దేటతెల్లము కాఁగలదు.'

'నాతోఁడఁగూడఁ జెప్పవా?'

'లేదు. రేపటిదినమున నీతో నంతయుఁ జెప్పెదను. అటుపై మనము మనయూరు వెడలుదము.'

'ఏమి!'

'ఈవివాహ మెన్నఁటికి జరగనేరదు.'

'మధురా! నాకు నదేభావము పుట్టుచున్నది. ఈతనిప్రవర్తన మంతయు బాగుగ లేదు.'

'మన కెన్ని చిక్కులు వచ్చునో!'

'రానిమ్ము. ఎన్నఁటికి దేవుఁడే కలఁడు. ఆతఁడు మనల రక్షింపఁగలఁడు. మరియొకటి. అవసరమైన మనము వినయునికడ సహాయము నపేక్షింపవచ్చును.'

వినయునిపేరు వినినంతనే మధురభావములలోఁ బరివర్తనము కలిగినది. ఆమెభావ మంతయు నతనిమీఁదికే పోయినది. 'భ్రమరా! వినయుఁడు విశ్వాసశౌర్యప్రదర్శనఁ బ్రథమబహుమానము నడసెను సుమా!' అనియెను.

'నీకెట్లు తెలిసినది?'

'ఇదిగో పత్రికలోఁ బ్రకటింపఁబడెను.'

ఆదిన మంతయు నేదియోసంభాషణములోఁ గడచెను. నాగేంద్రనాథుఁడు మధ్యాహ్నము మూఁడుగంటలకు గృహమునకే తెంచెను. కొంతవఱకు మధురాభ్రమరలతో మాటలాడి వెడలెను. ఆనాటిరాత్రి మధుర పదునొకొండుకొట్టుటకుపూర్వమే యావ్యక్తిని కలియవలెనని బయల్వెడలెను. ఆమె లేచుట భ్రమర కనిపెట్టియేయుండెను. మధుర మేడ దిగెను. భ్రమర యామెను వెన్నంట నిశ్చయించెను. భ్రమర వెన్నంటెను.

మధురకు తెలియకుండ నాగేంద్రనాథుఁడు, అతనికి తెలియకుండ భ్రమర. నడచుచుండిరి. ఆచీఁకటిలో మధుర గుండెదడదడ తోవెడలుచుండెను. భవనద్వారమున దీపముకూడ లేదు. భ్రమర కేమియుఁదోఁచుటలేదు. ఆమె నడచుచుండెనే కాని యొడలు తెలియలేదు.

మధుర మఱ్ఱిచెట్టు సమీపించెను. అక్కడ నెవ్వరును లేరు. ఆమె కేమియుఁ దోఁచుట లేదు. ఇంతలో నామెకు పదధ్వని వినవచ్చెను.

'అయ్యో! ఎవ్వరో ఆమెను పట్టుకొనిరి. హా' యని కేకవైచి యామె యచేతనయై నేల కొరగెను.

భ్రమర యాదృశ్యముఁ జూచి యాపాదమస్తకము వణకినది నాగేంద్రనాథునిగొంతుక ఆమెకు విన్పించెను.

'. . . . పడవేయుఁడు.'

ఇంకను మాటలు జరిగినవి—

దురాత్ముఁ డెంతపని చేసినాఁడు, తానేమిచేయుట? ఆమెకొక యపూర్వాలోచన కలిగెను. ధైర్యముతో నామె తనగదిలోఁ బండుకొన నిశ్చయించెను. పరుఁగున బోయి యట్లొనర్చెను.

పదినిముసములలో నాగేంద్రనాథుఁడు మేడ నెక్కెను. భ్రమరగదిలోఁ జూచెను. ఆమె గాఢనిద్రాపరవశయై యున్నదని తలఁచెను.

— —

౧౧

మధురా! మధురా! అయ్యయ్యో! ఎంతటిఘోరము. తలఁచుకొనిన గుండియలవియుచుండెను. అబ్బ! నాగేంద్రనాథుఁడు — పాపి వానినామము నుచ్చరింపరాదు — ఇట్టిపని నెట్లాచరించెను. పాపి

చేతు లెట్లాడెను. తాను మధురను ప్రేమించుచుంటినని చెప్పెడి వాఁడే! ఇదియా వాని ప్రేమ' అని భ్రమర తలఁచుకొనుచుండెను. తెల్లవారిన తరువాతఁ దానెట్లుండవలెనో యని యామె తన్నుదానే ప్రశ్నించుకొనుచుండెను. కడకీకపటనాటకమునఁ దన పాత్రముఁ దాను నిర్వహింపఁగలనో లేనో యని సంశయించెను. అన్నిఁటికి దైవము పై నామె భారము నైచెను.

ఉదయరాగిణి ప్రాక్పర్వతశిఖరమున నృత్యకేళీవిలాసము నెరపుచుఁ దన మందహాసరోచిస్సులు గొన్ని భ్రమరపైఁ బ్రసరింపజేసెను. ప్రాభాతికమందవాయులీలాగీతికలతో సర్వము మఱచి సుఖస్వప్నములఁ గాంచుచున్న భ్రమర యాకాంతిగని మేల్కనెను. ఆమె యింతవఱకు మధురతో సంభాషించుచు నున్నట్లు కలగాంచుచుండెను. కాని యిప్పుడో—మధురసంగతి తలఁచుకొనిన నామె దుఃఖమునకు మేర లేకుండెను.

నాగేంద్రనాథుఁ డప్పుడే మేడదిగి వెడలెను. అది భ్రమర కనుఁగొనెను. అతఁడెట్లు ప్రవర్తించునో చూడవలెనని యామెనిశ్చయించుకొనెను. అతఁడు సాధారణముగఁ బ్రతిదినము నిశీధమున నెప్పటికి వెడలుచుండును? అతఁడేదియోని క్రూరకార్యము జేయునా? అని యామె యనుకొనుచుండెను. నాగేంద్రనాథు డెప్పుడు గృహమునకు వచ్చునో యని యామె తనగదిలోనే వేచియుండెను. రమారమి యెనిమిదిగంటలకతడు భవనద్వారమున నెవ్వరితోడనో మాటలాడుచుండెనని యతనిమాటలసవ్వడి విని యామెగ్రహించెను. వారు ప్రతిదినము నెనిమిదిగంటలకే కాఫీ పుచ్చుకొందురు. కావున భ్రమర [illegible] అవ్వే [illegible] త్వరగా [illegible] [illegible] ఫలాహారములు [illegible] [illegible] [illegible] [illegible] తానే [illegible] నెరు

గనట్లు ముప్పూర కమర్పజేసెనే! దీనిపర్యవసాన మెట్టులు ఫలించునో కదా!

భ్రమరభోజనశాలలో నాసీనమైనపదినిముషములలో నాగేంద్రనాథుడుకూడ నచ్చటికి తెంచెను. అత డారాత్రి యంతయు మేల్కొని యుండెనని వానికన్నులే చెప్పుచుండెను. వాని మోమున గోపభావము ప్రస్ఫురించుచుండెను. కన్ను లెఱ్ఱగా నగ్నికణములవలె జూపరకుభయంకరములుగ నుండెను, ఆవులింతలు వచ్చుచుండెను. దానినిబట్టియైన రాత్రి యాతడు నిద్రింపలేదని యెఱుగవచ్చును. వికారవికటహాసము నేడు వానిముఖమున గనబడలేదు. అతడు తన యాసనమున నాసీనుడై రెండుమూడు నిమేషములవఱకు నిటునటు చూచుచు నూరకుండెను. అత డెవ్వరికొఱకో నిరీక్షించుచున్నట్లుండెను. భ్రమర వానిభావముల గనిపెట్టెను.

'మధుర యింకను రాలేదేమి?'

భ్రమర వానియంతరంగమున నున్నమలినభావంబుల నెఱుగలేకపోలేదు. తానేమియు నెఱుగనట్లతడు నటించుచుండెను. కావున దానుకూడ నేమియు నెఱుగనట్లు నటింపవలెను. అని భ్రమరయనుకొనెను.

'షైరుపోయినదా?'

'ఏమో నాకెఱుకలేదు. నేనుదయముననే షైరుపోయితిని. ఆమె కుదయము షైరువెడలు నలవాటు లేదే!'

'మీతో వచ్చినదేమో యనుకొనుచుంటిని.'

'లేదు. నాతోడ రాలేదు.'

'అట్లయిన దాను వెడలెనేమో, ఇక రావచ్చును.'

పదినిముసములు వారొకరితో నొకరు మాటలాడకుండ నచ్చ

టనేకూరుచుండిరి. వారాలోచనాసముద్రమున గొట్టుకొనుచుండిరి. భ్రమర యేమియు నెఱుగదనియే నాగేంద్రుడు తలచుచుండెను.

'ఏమిది? కాఫీ చల్లబడుచున్నది. తొలుత మనము త్రాగుదము. ఆమె వచ్చినతరువాత నామెయొక్క తేయు ద్రావును'

ఈసంభాషణమంతయు దానేమియు నెఱుగననుటకే చేయబడుచున్నదని భ్రమర యూహింపకపోలేదు.

నాగేంద్రనాథుడు కాఫీ త్రాగుట ముగించి. 'నేనీదినమున బనిమీద పోవలయును. మధ్యాహ్నము రెండుగంటలవఱకు రావీలు లేదు. మధుర వచ్చిన నిట్లని చెప్పుము.' అని గుమ్మమువరకు పోయి మరలివచ్చి 'వివాహముహూర్తము నిశ్చయము చేయించితిని.' అనెను.

'ఎప్పుడు?'

'ఈదినముననే నిశ్చితమయ్యెను. ఆదివారమునాడు వివాహము.'

'సరే' యని భ్రమర లోలోన కోప మణచుకొనెను.

నాగేంద్రనాథుడు మరిరెండు నిముషములలో శకటముపై నెక్కి యెటోపోవుచుండెను.

భ్రమర యేకాకినియై తనగదిలోఁ గూరుచుండెను. ఆమె కెందుమీఁదను దృష్టిపోకుండెను. ఎట్లీ విపరీతమహాసముద్రమునుండి గట్టునకు చేరుటో ఆమెకు తెలియకుండెను. మధ్యాహ్నము రెండు గంటలవరకు నాగేంద్రనాథుఁడు రాడు కావున నీలోపున నేమి చేయుట. మధుర పెట్టెలో నాయుత్తరముల దాచియుండునా? ఇప్పు డెవ్వరును తన్ను పరిశీలించువారు లేరు.

తత్క్షణము యామె మధురగదిలోనికేగెను. అదృష్టవశమున పేటికతాళము లచ్చోటనే దొరకెను. ఆమె మెల్లగఁ బెట్టె తీసి

మూలమూలలఁ గూడ బరిశోధించెను. రెండు లేఖలుతప్ప మరి యేమియు నందుఁ గన్పట్టలేదు.

అందెట్టి విషయములఁ జూడవలసివచ్చునో యని యామె తల్లడిలుచు లేఖల విప్పి చదివెను ఎవ్వరా వ్రాసినవారు? అది వినయుని వ్రాఁతకాదుగద! అట్టి యక్షరముల నిదివఱ కామె చూచి యుండెను. కాని యెవ్వరిది? ఆమె కేమియుఁ దెలియలేదు ఒకచో నాగేంద్రనాథుఁడే యట్లు వ్రాయించియుండఁడుగద! ఆ దురాత్ముడే యింతటి పాపపుబని చేయువాఁడు అందుకు నాతఁడే కారకుఁడు. ఆతఁ డెదురుగ నుండిన వానిని మ్రింగివేయవలయునని యంతకోపము భ్రమరకు వచ్చినది. కాని శాంతించెను.

రెండు గంటలకు సరిగ నాగేంద్రుఁ డేతెంచెను. అప్పటికి భ్రమర తన గదిలో నుండెను. 'మధుర రాలేదు.' అని యామె యాత్రముతో వాని కెరుకపరచెను. అతఁడు రెండడుగులు వెనుకకు జరిగి,

'ఏమి? రాలేదా!' యని ప్రశ్నించెను.

'దురాత్ముఁడు, అంతయు మాయ,' యని భ్రమర తనలో ననుకొని యేమియు నెఱుఁగనట్లు 'రాలేదు. నాకు భయము వేయుచున్నది.' అనియెను.

నాగేంద్రనాథుఁ డొకనిమిష మూరకుండి, 'నాకొక యనుమానమున్నది' యనెను.

'ఏమది?'

'మొన్నటి నిశీథమున మధుర యెచ్చటికో వెడలివచ్చుచుండగ నేను చూచితిని. . . . . .'

'అసంభవము. ఆమె యట్లు వెడలఁగలదా!'

'కాని వెడలినది. నేనామె నప్పుడు ప్రశ్నించిన నామె యేమియుఁ జెప్పకుండనే తనగదిలోనికి పోయెను.' నిన్నటిదినమునఁ గూడ నట్లు వెడలియుండవచ్చును. అప్పు డెవ్వరిచేతనో పడవచ్చును.'

'ఆమె నిజ నీవాడ లేనా?' అని భ్రమర రుద్ధస్వరమునఁ బలికెను.

'భ్రమరా! నేను ప్రయత్నపూర్వకముగ నామెను గూర్చి కనుఁగొందును. నీవు నిస్పృహ వహింపకుము.'

భ్రమర తన గదిలోనికి పోయెను. 'మహాత్మా! నీపాపమునకు మేర లేదా నేమి? ఎన్ని యసత్యములు' అనుకొనెను.

౧౧

వినయుఁడు సుమ గృహము నన్వేషించుచు నుదయముననే బయలువెడలెను. తొలినాఁటిరాత్రి తాఁజూచినగృహముకడ కేతెంచి మెల్లన గదినికి తిలకించెను, అది సామాన్యగృహమువలెఁ గన్పించెను. అతఁడు మెల్లగఁ దలుపు త్రోసెను. లోన గడియ లేదు, తత్క్షణమే యాతఁడు లోనఁ బ్రవేశించెను. ఆగృహము పలిభాగ మంతయు మూఁడుగదులు. అందొకగదిలో శయ్యపై నొకయువతి నిద్రించుచుండెను. వినయుఁడు ధైర్యముతో నాగదిచెంత కేఁగి యామెను తిలకించెను. ఆమె నిచటనో యాతఁ డిదివఱకు చూచినట్లు జ్ఞప్తికి వచ్చెను. ఆమె యెవ్వరు!

ఒకనాఁటిరాత్రి నాగేంద్రనాథుని భవనమునఁ దాసీమెనే చూచియుండెను. వారిసంభాషణముఁ గూడ నాలించి యుండెను. అతఁడామె నిప్పు డిట్లు మేల్కొల్పుట యని యెంచెను. తిన్నగ

నతఁడు వీథిద్వారముకడ కేఁగి గడియ వేసెను. ఆశబ్దమున నామెకు మెలఁకువ వచ్చెను.

'ఎవరది?'

అతఁడు జవాబీయ లేదు

సుమా! '

ఆమె కంఠస్వరము హీనముగ నుండెను. ఆమె రోగార్తయై యున్నట్లు వినయుఁడు గ్రహించెను. అతఁడు మెల్లగ నామెకడ కేఁగి చెంతనే యున్న యాసనముపై నాసీనుఁడాయెను. ఆమె యాశ్చర్యమునకు మితి లేదు. 'నీ వెవరు?' అతిహీనస్వరముననే యామె యడిగెను.

'అమ్మా! నేను నీతోఁ గొన్ని విషయములఁ గూర్చి మాటలాడవలెనని వచ్చితిని.'

'నాతోడనా?'

'ఔను. నీ వేమియు నాశ్చర్యము నొందవలదు. నీవొకమారు నాగేంద్రనాథుని భవనమున నిశీథమున నతనితో సంభాషింప నెంచియుంటివి. అప్పుడు నిన్నతఁడు ప్రహరింపఁబోవుట యెఱుగుదువు. అట్లు చేయకుండ నొకఁడు వానిని [illegible].'

'ఔను. నేనాతని కెంతయుఁ గృతజ్ఞురాలను.'

'అతఁడే నేను.'

ఆమె వినయుని సాభిలాషముగఁ దిలకించెను. ఆచూపులలో [illegible]న్యభావము కనుపట్టుచుండెను. ఆమె యొకమారు మందహాస మొనర్పఁ బ్రయత్నించెను కాని యది యామె శుష్కవదనమునఁ [illegible].

'[illegible] నిన్ను [illegible]!'

ఒకక్షణమున [illegible] వినయుఁడు 'నీతనయుఁడు [illegible]

విడిచి యెటకేగుదు? నీవిట్లు శుష్కశరీరమున నెట్లుండఁగలవు?' అని ప్రశ్నించెను

'నీవు నాతనయ నెరుఁగుదువా?'

'సుమను నే నెరుగుదును. ఆమెకూడ నాగేంద్రనాథునివలన నిడుమలు పడుచుండెనా?'

'అయ్యయ్యో! ఆసురాత్ముఁ డామెనుపట్టి యెంతటి వేదన పాలుచేయుచుండెనో కదా! అది విధాతకే యెరుక.'

'ఆపాషండుని నీతనయ వివాహమాడుటకు కారణమేమి?'

'నన్నాప్రశ్న యడుగవలదు నాయంతట నేను, ఈపాపిష్టి చేతులతో నామెకంఠమున కలిత్రాడు తగిల్చితిని. ఆ యురిత్రాడు నాగేంద్రరూపమున నామెను బాధించుచుండెను.'—పాపము! ఆమె కనులవెంబడి నీరు జొటజొట కారదొడగెను. వినయునకు గుండె నీరయ్యెను 'జీవితేశ్వరి యనిన నాతని కేటికి కోపము?' అని వినయు డడిగెను.

'అది నాతనయ మందదృష్టము.'

'నాగేంద్రుడనిన సుమకు ప్రేమము కలదా?'

'ఆమె పతిభక్తపరాయణ. అత డేమి యనినను నాతనయ సహించును. మరి తిరుగుమాట పల్కుట లేదు. అతని నామె ప్రేమించును. కాని యాతని దుష్టచరిత్రము విని మండిపడును. వాని చర్యలన్ని నామె కేమియు నిష్టము లేదు. అతనియెడల నెంతభక్తి కలదో యతనిదుష్టకార్యములయం దంతతిరస్కృతి యామెకు కలదు, అతడనిన నామెయెంతప్రేమ జూపునో, వానిచరిత్ర మనిన నంత కోపము జూపును.'

'అత డందులకా నీతనయను చెరసాలలో నుంచుటకు ప్రయ

త్నించుచుండును. కేవల మాకోపముచేతనా నీతనయ నాత డట్లు వేదనలపాలొనర్చుట?'

'అదియే కామ . . నేనొకపొరపాటుపని యొనర్చితిని, వానిరహస్యచరిత్రము సుమ కెరిగించితిని. అందొక గభీరరహస్య మిమిడియున్నది. ఆమె కది తెలియుటచే నాత డామెను బాధించును'

'నీవారహస్యము బైటబెట్టిన?'

'నేనది తెలియజేయలేను . . . వలదు. ఆసంభాషణము వలదు. . . . కాని నాయనా! నీవు మాత్ర మీసంగతి యొరుల కెరిగింపరాదు . . . తెలిసినదా!'

'నేనట్లెన్నటికి చేయను.' అని యాతడు రెండుమూడు నిముసము లూరకుండి 'అమ్మా! నేనిప్పు డొకముఖ్యవిషయముం గూర్చి నీతో మాటలాడ నెంచితిని.' అనెను.

'నాయనా! చెప్పుము.'

'సుమ వివాహ మెవరొనర్చిరి.'

'ఈయూరనే క్రైస్తవమతాధికారి చేసినాడు'

'అత డది దైవసమ్ముఖమున నొనర్చెనా?'

'అట్లే చేసెను! కాని యన్యు లెరుగరు.'

'అత డావివాహము గూర్చి లిఖించెనా?'

'లిఖించెను. కాని లాభము లేదు.'

'ఏమి?'

'నేనేమియు జెప్పలేను. వానినే నీవడుగుము.'

'మరియొకమారు నీతో సంభాషింపవలెనని యున్నది' అని చెప్పుచు నతడు వీధిలోనికి వెడలి 'ఈమె కీదినమున నెవ్వరు భోజనము వెట్టెదరు.' అని యాలోచించి, కొన్నిఫలముల గొని తిరిగి

వచ్చి 'అమ్మా! ఈఫలముల స్వీకరింపుము. సుమవచ్చిన తరువాత భోజన మిడుదును.' అని యిచ్చెను.

'నాయనా! మంచిది. మరిరెండుమూడు దినములవరకు నామె రాదని తలతును.' అని మరల గన్నులు మూసెను.

వినయుడు వీధిలో నడుగుపెట్టినంతనే యతని కెదురుగ బ్రేమ చంద్రుడుంట చూచి యాశ్చర్యచకితు డయ్యెను.

'ప్రేమచంద్రా! ఈయూ రెప్పుడు వచ్చితివి?'

ఉన్మత్తునివలె వినయుని జూచి, ప్రేమచంద్రుడు మారుపల్క లేదు.

'ప్రేమచంద్రా! ఎప్పుడు వచ్చితివి?'

'నీకెందులకు?'

వినయుం డప్రతిభుండయ్యెను.

'సుమగృహములోనికి నీవెందులకు వెడలితివి? అయ్యో! నాసుమ! నీవామెను బాధించువారిలో నొకడవా?'

అతనికి సుమగృహ మెట్లు తెలిసెనో యని వినయుం డాశ్చర్య సమన్వితుడయ్యెను. 'నీకామెగృహ మెట్లు తెలియును?' అని యడి గెను.

'నాకన్నియుం దెలియును. ఆమె వెనుకనే వచ్చినం దెలిసినది. నాకు తెలియని దీవిశ్వమున లేదు. లేదు. ఎందు కుండవలయునో నీకు తెలియునా! తెలియదు. నీవెవడవు నేనెవండను.' అనుచుం బ్రేమ చంద్రుండు చరచర వెడలెను.

'ఈతం డున్మత్తుడైనాండు.' అనుకొనుచు వినయుండు గృహో న్ముఖుం డయ్యెను.

---

లోక మంతయు గాఢధ్వాంతయవనికావిలుప్తమై యుండెను. నిశాసమయమున నట్టిచో నెవ్వరు మేల్కని యుందురు? మధుర మాత్రము దుఃఖభారమునఁ గన్నులెత్త లేకున్నను, నిద్రావిహీనయై యుండెను. ఎవ్వరెట్లు తన్నాగదిలోఁ బడవైచిరో యామె యెఱుఁగదు. ఆ లేఖల వ్రాసినపాపి యెవరు! అదే యామె తలఁపు. ఆమె కెల్లప్పుడును భయముగనే యుండెను. ఎవరో యచ్చో నెచ్చటినుండియో యరచుచున్న ట్లామెకు విన్పించుచుండెను. ఆమె యెల్లప్పుడుఁ గన్నులు తెఱచియే యుండును కాని యాచీఁకటిలో నంతయు శూన్యము. ఏమియుఁ గానరాదు. ఆమె కానాఁ డాహారము లేదు. అట్టిచో నెట్లు జీవించుటో? ఛీ! ఈ బ్రతుకుటకన్న మృత్యుదేవతాదృఢపరిష్వంగమున శాశ్వతసుషుప్తి నొందుటయే మేలు.

'అయ్యయో! ఆలేఖల నే నేటికి నమ్మవలయును. అందులకే యిట్టియిక్కట్టులు ప్రాప్తించినవి. నాగేంద్రనాథుని కుతంత్రమా యేమిది? అతఁడే యట్లు లేఖల వ్రాసెనా? . .....ఏమి! ఎందునకు కాఁగూడదు. ఆదుర్మార్గుఁ డెంతటికార్యమున కొడికట్టెనో యెవ్వరెఱుఁగుదురు . .....హా జననీ! స్వర్గలోకములో ననంతసౌఖ్యము ననుభవించుజననీ! ఈ యభాగినికి, నీతనయకు, నీ వై దీవనలొసఁగవలయును. ఇంక నాకన్నులకు పగలనుమాట లేదా! ఇట్లే నేనిచ్చో వశింపవలెనా! ........ఏమది. ఎవ్వరిదాపదధ్వని? ఆనచ్చువారెవ్వరు? నన్ను వారు రక్షింతురా?' అని మధుర పరిపరివిధమున విలపించుచుండెను. ఆమెకన్నుల నంతతశోకధారాపాతములై బాష్పబిందువులు దొరలిపోవుచుండెను.

ఆమె యనుమానించినట్లే యెవ్వరో యాచీఁకటిలోఁ దలుపు తెఱచిరి. ఆ తెఱచినవాఁ డొకస్థూలకాయుఁడు. వాని చేతనొక చిన్న

దీపముమాత్ర మున్నది. అది గాలిలో నెప్పు డారిపోవునో యన్నట్లు లుండెను. ఆమెలోలుతఁ దనతలుపు తెఱచి యుండరని యూరకుండెను. కాని యాచిరుదీపపుకాంతియే యామె కఖండజ్యోతి యయ్యెను. ఆమెకన్నులు తొలుత మిఱుమిట్లుగొల్పెను. ఆమె కనులెత్తి మెల్లనద్వారముప్రక్కకు చూచెను.

'ఇట్లురమ్ము' అని యాస్థూలకాయుఁ డామెహస్తము బట్టి లేవదీసి చెప్పెను. అతఁ డేమిచేయునో యని భయమందుచు నామె వానివెనుకనే వెడలెను.

తడబడుచు నామె యడుగు లిడుచుండెను. ఆమె కాదారి యెత్తుపల్లములుగా నుండుటచే దూలిపోవుచుండెను. ఇరువదిగజముల దూరము నడచుసరికి కచ్చో నొకయాసనముపై నెవడో కూర్చుండి యుండుట నామె తిలకించెను. వానిముందే యామె నతడు నిల్వ బెట్టెను. అతడు 'మధురా! నీవు నేచెప్పినది వినవలయును' అనెను. అది నాగేంద్రనాథుని కంఠస్వరము. 'ఛీ! ఆదురాత్ముడే' యని మధుర తనహృదయాంతరమునఁదలఁచి 'వినకవిధిలేదా!' అనియెను.

'నేచెప్పినరీతి నీవు నడువవలయును.'

'ఎట్లు?'

'నీవు నేచెప్పినచొప్పున నడచుట కంగీకరించిన యెడల నది తెలియబరతును.'

'అంతవఱకు చెప్పవా?'

'చెప్పదలఁచుకొనలేదు.'

'అట్లయిన మానుము.'

అంతటినిబ్బరముగా నామె జవాబొసఁగునని నాగేంద్రుడు కలలోగూడ తలఁపలేదు. 'నీప్రాణములపై నాశలేదా!' అని కోపముతోఁ బల్కెను.

'ఎవరి ప్రాణములు వారికి తీపి కాదా ?'

'నీ ప్రాణములు నీకు కావలసిన, నీవొకమారు ప్రపంచకములో నిలువఁదలఁచిన, నేను చెప్పినట్లొనర్చుట కంగీకరింపుము'

'నీవు చెప్పినట్లు చేయుటకన్న మృత్యుముఖమునఁ బడుటయే వేయిరెట్లుత్తమము.'

'అట్లయినఁ బ్రాణములు వదలుకొనుటకు సిద్ధముగ నుండుము.

'ఎప్పుడు నేను నీచేతఁ బడితినో యానాఁడే నా ప్రాణములపై నాశ వదలితిని.'

'నీవెవరితో మాటలాడుచుంటివో తెలియునా!'

'తెలియకేమి? పాపాత్ముఁడగు నొకహంతకునితో మాటలాడు చుంటినని నాకు తెలియును.'

'నీవు త్వరలో దీనికి తగినశిక్ష ననుభవించెదవు. అయినను చెప్పుచుంటిని వినుము . నీవు నన్ను వివాహమాడుట కంగీకరింపవలయును, ఇప్పుడు జరిగినసంగతులు పైవారి కెఱుకపఱుపరాదు. అట్లైన నీ ప్రాణములు నీవి, లేకున్న నీవి కావు.'

'నేనంగీకరింపను.'

'హుఁ. రేపటివఱకు గడువొసఁగితిని. ఆలోచించుకొమ్ము. లేనిచో నీకే తెలియును .....ఓరీ. ఈమెను మరలఁ గొట్టులో పెట్టి రమ్ము.. త్వరలో రమ్ము.'

సేవకుఁ డొకచోఁ గూర్చుండి నిద్రపోవుచుండెను. నాగేంద్రుఁడు వానిని తన్ని లేపి 'దుష్టా! ఒడలు తెలియక చరింపకుము.' అని హెచ్చరించెను. సేవకుఁడు మరల నామెను దీసికొని వెడలెను. అతఁ డామెగదిని సమీపించుసరికి గాలిచే వానిచేతిదీప మారెను. నాగేంద్రునిపైఁ గల కోపము గాలివలన వానికి ద్విగుణీకృత మాయెను. అతఁడు విసుఁగుకొనుచు నిద్రామత్తతతో గదితలుపు

త్రోసెను. కాని యది రాలేదు. చీకాకుతో నాతఁ డొక తన్ను దన్నెను. వెంటనే తలుపులు విడెను. అతఁ డామె నందులోనికి నెట్టి తలుపువేసి వెడలెను. పదినిముసములు గాఁచెను.

'ఎవ్వరిది?' మధుర యాప్రశ్నమునకు చకితయై 'నీవెవ్వరు.' అని తిరుగఁ బ్రశ్నించెను.

'అభాగినీ! మధురా! నీవేనా!'

'నా పేరు నీకెట్లు తెలియును'

'నేనెవరో యెఱుఁగుదువా?'

'కన్నులు కానరాకున్నవి!'

'అయ్యయ్యో! నీజనని నాకమూలు తెలుసుకొనుము. అపవిత్ర శక్తి నీకు తోడ్పడఁగలదు.'

మధుర నిర్మలధ్యానతత్పరయై కన్నుల నీరు గార్చుచు భక్తి పూర్వకముగా నంజలి యొనర్చెను

---

౧3

'భ్రమరా!'—

'భ్రమరా! అత్యంతావశ్యకమగు పని!'

బంగరుస్వప్నలకోనలలోఁ దేలిపోవుచున్న భ్రమర నాకర్కశ కంఠస్వరము మేల్కొల్పెను.

'భ్రమరా! భ్రమరా!'

అది నాగేంద్రనాథుని కంఠస్వరము. ఆ యర్ధరాత్రిసమయమున నతఁడేల తన్ను మేల్కొల్పుచుండెనో యామె యెఱుఁగదు. కాని యామె గాఢనిద్ర నభినయించెను మరల నాగేంద్రుఁడు పిలుచు వని యామె తలచెనే కాని యుట్లు కాలేదు. అతఁడు మెల్లగ మధుర

గదిలోఁ బ్రవేశించినట్లు పదధ్వనివలన భ్రమర యెఱింగెను. ఆమె గదిలో వాని కేమిపని యున్నదియో భ్రమర తెలిసికొనలేకుండెను. అత డేమి చేయునో యాతని యామె తలచె గాని యడ్డగించుటకు సాహసింప లేకపోయెను. శ్వాసబిగబట్టి యామె వాఁడొనర్చుచున్న దంతయు గాకున్నను, కొంతయైన గ్రహించుచుండెను. మఘుర పేటికయు తెఱవబడెను రెండుమూడు నిమేషములలో మరల మూయబడెను. ఆమె పేటికలో వస్త్రములు తక్క మరియేమియు లేవని భ్రమర యెఱుగును ఏమనినఁ, దానన్నియు నిదివఱకే సంగ్రహించెను. పదినిముసములవఱకు గదియు నిశ్శబ్దముగ నుండెను. అతడు వెడలిపోయెనని భ్రమర యూహించుచుండఁగ పదధ్వని మరల వినవచ్చెను గదిలో దీపము లేకుండుటచే నామె కేమియు గన్పట్టలేదు. కాని యాతఁడు తన చెంతకే వచ్చియున్నట్లామె తెలిసికొనెను. వానిచేత చిన్నకరదీపిక యుండెను. ఆమె కన్నులు మూసికొని యున్నను, దానికాంతి యామె కించుక తెలియుచుండెను.

భ్రమర కిప్పుడు గట్టిచిక్కు వచ్చెను. ఆమె యిపుడు గాఢసుషుప్తి నెట్లభినయింపవలెనో యెఱుఁగకుండెను. కాని ప్రయత్నించి యభినయింపఁగడఁగెను. సహజముగా నట్టియెడ మనశ్చాంచల్యము నొక్కవోఁ గట్టిపెట్టియుంచుట కష్టతరము. భ్రమర కపటసుషుప్తిలో నుండఁగా నామె నాసికారంధ్రములకడ నేదియో పదార్థ ముంపఁబడినట్లామె గ్రహించెను. ఆవిషవాయువు లోనఁ బ్రవేశించినఁ దన కేమియాపద ఘటిల్లునో యని యామె నిమిషమాత్రమున . . . కాదు. . . .ఊహామాత్రమున నూపిరి విడుచుటమాని తెలివితప్పినట్లుండెను. రెండునిమిషంబు లట్లోర్చియుండుట యామె కతికష్టతరమయ్యెను. అప్పుడే యాపదార్థ మామె నాసికదగ్గఱనుండి తీసివేయఁబడెను. ఆమె నిశ్చయముగా నవసన్నయైన ట్లభినయించెను. నాగేం

ద్రనాథుఁ డామెముఖము బరిశీలించి, యాపేటికఁ దెఱచి యందుఁగ లవస్తువులఁ దీయఁగడగెను.

అదృష్టవశమున నాపేటికలోఁ దాను మధుర పేటికనుండి తీసి న లేఖలఁ బెట్టలేదని భ్రమర సంతసించెను. వాని నామె తనవస్త్రా భ్యంతరమున దాఁచియుంచెను కావున భయము లేదని తలఁచెను. భ్రమరక పుడొకయూహతోఁచెను. అట్లొనర్చుటకై యామెతత్క్షణము నిశ్చయించుకొనెను. 'అయ్యో! దొంగలు!! దొంగలు!!! దొంగలు! దొంగలు!!' అనియామెగట్టిగా నఱచెను. కన్నులనుమాత్రము తెఱవనేలేదు.

నిముషములోఁబదధ్వనియయ్యెను. 'ఏరీదొంగలు?' అని—ఆకంఠస్వరము నాగేంద్రనాథునిది—ఇంతలోఁ గొందఱుసేవకులు కూడమేడపైకేతెంచిరి. ఆస్థల మంతయు కాంతిమయ మయ్యెను.

'భ్రమరా! దొంగలా!'

నాగేంద్రనాథుఁడే యిట్లు ప్రశ్నించు టెటికో యామె యెఱుఁగకపోలేదు. కాని యామె యది కప్పిపుచ్చి, భీతనయనముల నిటు నటుత్రిప్పుచు వణకుచున్నకంఠస్వరముతో 'పాఱిపోయెనేమో' యనెను. నాగేంద్రనాథుని సేవకులు గది పరిశీలించి నిజముగా దొంగలందుప్రవేశించియుండిరనినిశ్చయించుకొనిరి. కొందఱుసేవకులు భవన మంతయు వెదకిరి. కాని నాగేంద్రుఁడే యాదొంగ యని యెవ్వ రెఱుఁగుదురు.? నాగేంద్రుఁడు తానేమియు నెఱుఁగనట్లు నటించెను. వానిచాకచక్యమునకు భ్రమర వెఱగందెను. నాగేంద్రుఁడు తనకోప మంతయు సేవకులపైఁ గనబఱచుచు 'వీరికేమియు నొడలు తెలియకున్నది. జాగ్రత్త. మఱియొకమారిట్టిపని జరుగనిందు! మిమ్ముందఱఁ దొలఁగించెదను. ఛీ! నాముందు మీరుండక పొండు. భవన మంతయుఁ బరిశీలింపుడు.' అని గద్దించెను.

సేవకులు మాఱుమాట లేక వెడలనుద్యమించుచుండ మరల నాతఁడు 'నేటినుండి భవనమునకు ప్రతిదినము గావలికాచుటకు సిద్ధముకండు. లేకున్న నెన్నియత్యాచారములు జరుగునో!' అనియెను. వారటనుండి మెల్లగ నతఁడేమి చేయునో యనుభయంబున, నొండొరులముఖముల జూచుకొనుచు మేడ దిగిపోయిరి.

ఈవిచిత్రనాటక మంతయు దిలకించుచున్నభ్రమర, నాగేంద్ర నాథునిసాహసమున కచ్చెరువందెను. అంతటికపటి యీలోకమున నికజన్మింప డని యామె తలచెను. అట్టివానికి తగినంతకపటముగ దాగూడ నటింపవలెనని యామె యూహించెను.

భ్రమరా! ఇల్లు జరుగట శోచనీయముగ నున్నదినుమా!'

'ఆసంగతి తలచుకొనిన నాకు భయమగుచుండును. ఆదుర్మార్గు డెవ్వఁడో యుండునో కదా!'

'అత డేమి దొంగిలించెను.'

'ఏమియును లేదు. నాపెట్టె దెరచినట్లు చప్పుడైనంత నాకు మెలవి వచ్చినది. తత్క్షణము కేకలిడితిని.'

ఒకరినొకర నుమానింపలేదని యిర్వురును హృదయములలో జాలసంతసించిరి.

'భ్రమరా! దీనినిబట్టి యొకటి యనుమానింపనగును.'

'ఏమి?'

నీయెడను, మధురయెడను, ఎవ్వరో యత్యాచారము దలచుచున్నారని,—కాదా?'

'ఔను. అది నిశ్చయమై యుండవచ్చును.'

'మీకు శత్రువులెవ్వరైన నున్నారా?'

'లేరు' అని యామె జవాబిడెనే కాని 'నీవే శత్రుఁడ' వని హృదయములో ననుకొనెను.

నాలుగైదు నిమేషములు సంభాషణము జరిగెను. తరువాత నాగేంద్రుడు తనగదిలోనికి వెడలుటకు లేచి 'నీకిచ్చోసహాయమవసరమా?' అనియెను. భ్రమర వలదనియెను. నిజముగ దొంగ యున్న యెడ భయపడవచ్చును. కాని యాతడే దొంగయగునప్పు డేమి చేయుట! — మరల వారు స్వప్నరాజ్యములలో సుఖవిహారము నొనర్చిరి.

---

౧౪

'జననీ! లీలా! భవదీయపవిత్రనామామృతపరనమున సర్వపాతక నాశన మగును. ఈశుష్కజీవిదేహమున ప్రాణవాయువులు నిలిచి యున్నంతవఱకు నిన్నెన్నడు దలచుకొననిమ్ము. జననీ! జననీ! ఏమి? నన్ను రమ్మనిపిలుచుచుంటివా? ఏదీ! ఆమోము? అయ్యో! నాకిక గన్పడదా! . . . ఈయెడదయెపుడాగునోకదా. భవదీయపదారవిందములచెంత నాశిరము వాంచి, వేడివేడికన్నీరువిడిచి, నాహృదయ దుఃఖము నీకెఱుక పఱచుటకు సమయ మిక నేతెంచును. నాకిపు డెంతసంతోషముగ నున్నది. జననీ! వేగముగ రమ్ము, నన్ను నీయొడిలో జేర్చుకొనుము. అప్పుడు శాశ్వతనుసుప్తిలో నడ్డేయుందును. నాచిన్నతనమున నీయొడిలో దలయుంచి నిద్రించితినేమో! అది యంతయు నజ్ఞానావస్థ.'

అంతయు గాఢాంధకారము. చీకటినే యంతట నావరించి యుండుటచే నొకరిమొగ మింకొకరి కగపడలేదు.

'మధురా! మధురా!'

ఆస్థూలకాయుని కంఠస్వరముకాదు. మరి యెవ్వరిది? నాగేంద్రనాధుని కర్కశస్వరము.

'మధురా! మధురా!'

'ఈనాఅంత్యసమయమునగూడ నన్నిట్లు పిలుచువా రెవ్వరు? నన్నిక నెవ్వరును రక్షింపలేరు'

'నేను నిన్న చెప్పినసంగతు లేమిచేసితివి?'

'నేనిక జీవింపలేను . . ..అయ్యయ్యో! ఈసమయమున గూడ నన్నేకాంతముగ విడువరా? .. శరీర మవసన్నమై పోవుచున్నది. ఇంక నేనెంతయోకాలము జీవింపను . ఛీ! నీవు నాతో నిప్పు డేమియు వచింపకుము. నాశ్రవణముల నీవాక్యములతో మలినము లొనర్పకుము. నన్ను ముట్టకుము.'

'మధురా! ఏమిది. ఇంతలో నింత ముంచుకొనివచ్చెను. వైద్యుని పిలిపించెదను .....'

అతనిస్వరము వికృతమును భీతము నై యుండెను.

'వలదు......ఉస్సు.'

'ఏమది .....'

'వలదు. నేనింక జీవింపను నాకు జీవితముపై నాసలేదు. ఇక నెంతప్రయత్నించినను నేను జీవింపను .. నేను జీవించి యేమి ఫలము . . . అయ్యో!.... ఈ ప్రాణవాయువు లెగిరిపోవుటకింక నెంతయోకాలము లేదు... ..జననీ! లీలా! లీలా!!

'మధురా! నిస్పృహ యేటికి?'

వానిహృదయ మొకించుక మెత్తవడినట్లయినది.

'నాకు జీవితాశ లేదు.'

'అతం డేమియు ననలేకపోయెను.

'జననీ! లీలా! ఏదీ చూమందహాసము. ఆకాంతిలో నే నద్భుతంబుగ లీనమై యంతమయ్యెదను .. ....జననీ!.... ..'

వానికర్కశహృదయమున దయాలేశ మూరెను.

'మధురా! ఎంతలో నెంతమార్పు!'

'నాతో నాయుబుసు చెప్పవలదు .....నాకోర్కెలఁ గొన్ని నెరవేర్చెదవా?'

'చెప్పుము. మధురా! నీవేమి చెప్పినను చేసెదను.'

'నేనిఁక మరణించెదను. భ్రమరకు తప్ప నది యొరుల కెఱుఁగ జేయవలదు. ఆమెను నాముఖము చూడనిమ్ము.....నాజననియగు లీల సమాధిప్రక్కనే నాసమాధి నిర్మింపుము . . . అదియ నేఁజెప్ప వలసినది......ఉన్ను.'

'మధురా!..... '

'జననీ! ఇదే! నన్ను రమ్మనుచుంటివా? వచ్చుచుంటిని! జననీ! లీలా! ఇదే వచ్చుచుంటిని. ఆఁగుమాఁగుము.... . ...జననీ! నీచేయూత నొసగుము . . ఇదిగో! లేచివచ్చెదను ! కరుణామయీ! . . ..నీపాదము లంటనిమ్ము . . ..జననీ . .ఈ మలిన హస్తములతో వాని స్పృశించి . . కన్నీటితోఁ గడిగినైతును. జననీ! . . .ఆవిమాన మేమి?..... నీవెచ్చో నుంటివి? . ఏమిది?......ఎచ్చటఁ జూచినను నిరూపమే! . .జననీ. . లీలా! ఇదే వచ్చుచుంటిని . . జ న . .నీ!— — — — —

తదీయ ప్రాణవాయువులు మహానంద తేజోమయస్వర్గీయసమీరమారికలలోఁ దేలిపోయెను.

---

*

*

# మాధుర

## చతుర్థఖండము

(సాఫల్యము)

౧

"ప్రమదా! ప్రమదా!"

కలకల నవ్వుచుఁ బ్రమద వచ్చి విజయునిచెంగట నిలువఁబడెను.

'వినయుఁ డేఁడీ!'

'ఏమో! ఎటో వెడలినాఁడు. మీగృహమునకే వచ్చియుండునని నేననుకొనుచుంటిని. రాలేదా?'

'లేదు.'

'నీకెదురు కాలేదా?'

'లేదు. ఎచ్చటికేఁగెనో?'

'అంతతొందరపని యేమి?'

'ఏమియును లేదు.'

'ఏమియు లేదా!' అని ప్రమద నవ్వెను. ఆమందహాసములో వెన్నెల వెల్లివిరిసిపోయినది. ఆమధురహాసతరంగంబులలో విజయుడు తేలిపోయి యనంతానందలీలావినోదమున నొడలు మఱచి 'ప్రమదా నీగ్రంథముఁ బూర్తియొనర్చితివా?' అనియెను.

విజయుఁడు ప్రమదకు భావయుం దభిరుచి కల్పించెను. వాని చేయూతఁ గొని యామె పుస్తకములఁ గొన్ని పఠించి వానిసారము గ్రహింపఁగల్గెను. ఆలేతహృదయములో నూత్నభావములు మొల

కెత్తుచుండ నామె యొకచిన్నగ్రంథము రచించెను. తొలుత నది రచించుచున్న ట్లామె యెవ్వరికిఁ దెలియఁజేయలేదు, కాని యొక నాఁడు విజయుఁ డదికని పెట్టెను.

'నేఁడే పూర్తియైనది.'

'నాకొకపరి చూపెదవా?'

వెంటనే ప్రమద యాచిన్నగ్రంథముఁ దెచ్చెను. స్త్రీవిద్యాభివృద్ధి వలన దేశమునకు లాభ మున్నదని చెప్పు నొకచక్కని చిన్నిగాథ యందిమిడి యున్నది. కథ యందుకొఱకే కల్పింపఁబడినది. ప్రమదగ్రంథముఁ దెచ్చియు నతని కది యొసఁగుట మానెను.

'ఇటు లిమ్ము.'

'కాని నీయనుమతి లేకుండ నేనొకటి యొనర్చితిని.'

'ఏమి చేసితివి?'

'విజయా!.. ..ఈగ్రంథము......'

'చెప్పుము.'

'ఈగ్రంథము నీకంకితమిచ్చితిని.'

విజయుని యానందమునకు మేర లేకపోయెను. అత డామెను తనహస్తముల బట్టి గాఢమగుప్రేమతో గ్రుచ్చి కౌగిలించుకొనెను. ఆమె సిగ్గున మోమువాంచెను.

'ప్రమదా! దానికా యనుమతి?'

ఆమె యేమియు మాటలాడక వానిచేతిలో బొత్త ముంచెను. ముత్యములవంటి యక్షరములతో నందిట్లు లిఖింపబడియుండెను.

శ్రీవిజయునకు

ఈనాప్రథమ ప్రయత్నమును

ప్రేమతో

సమర్పించుచుంటిని.

——

ఆయక్షరముల శతసహస్రసమయములు చదివినను వానికి తృప్తి లేకుండెను.

'ప్రమదా! నీవు నన్ను ప్రేమించుచుంటివా?'

'నీవు నన్ను ప్రేమింపలేదా?'

ఆ శ్వేతహృదయములో నున్న ప్రేమరసము తొట్రిలుటకు నాడే ప్రథమము. ఆమె ప్రేమయనిన నేమో నిరూపింపగలదా!

'నేను నిన్ను ప్రేమింతును. ప్రమదా! నేను నిన్ను ప్రేమింతును. ప్రమదా! నన్నట్లు చూచుచుంటివేమి.'

'నీకన్నులలో నానీడ చూచుచుంటిని.'

కవితాశక్తిని మించి యామె హృదయము నవ్యవీణానినాదమ్మున నెంత చక్కని, మెత్తని, తీయని, లేతపల్కులు పల్కుచున్నది! వానిని తదేకదీక్షతోఁ జూచుచు నామె మందహాస మొనర్చెను. మధుర స్మేరాంకురంబులు తరగలై పొంగి పొరలినవి. అతడు కూడ హాసము నొనర్చుచు నామె ముంగురుల సవరించుచుండెను. ఆమె చెక్కులపై జేయిడుచుండెను. నిశ్చలుడై యాయమాయిక సౌందర్యమునకు తనలో దానే యాంత డానందించుచుండెను. ఆమె సన్నని శరీరము తీగవలె నల్లలాడుచుండెను. గులాబీపువ్వులవలె నామె చెక్కుల వన్నెలు పూయుచుండెను. ఆమె పెదవిపై లేఁజిఱు నవ్వు నాట్య మొనర్చుచుండెను.

వేయి రేకులతోడ విరియు తమ్మిపూవువలె వాని హృదయము ప్రేమపూర్ణమై విరిసిపోవుచుండెను. నవవికాసముతో వాని హృదయము నిండిపోయెను. ప్రశాంతయామినీసమయంబున సుధాధారల జిల్లులజేయు చంద్రుని జూచి పొంగిపోవు వార్ధివలె వానిమనస్సనేక భావభంగములతో బొంగెను. మరందభారమున మోము వాంచు నలరుగన్నెవలె నావ్రీడావతి త్రపాభరమున మోమువర వాంచు

చుండ నాతఁడామె చెక్కిట జేయిఁవైచి యామె మోమెత్తి చుంబిం చెను. వారి నెమ్మేనుల బులకలమొలకలు మొత్తములై పూచెను. అపూర్వానందములో వారన్యము మఱచి యొండొరుల జూచు కొనుచు నట్లే రెండుమూడు నిమేషములు ప్రతిమలై యుండిరి.

మలయమారుతకిశోరుఁడు లతావనితల కౌగిలింతల గదియించి రహస్యగీతముల బ్రణయసందేశము లంపెను. పుష్పకన్య బంభర కుమారకుని తొలిముద్దులో గన్నరమోడ్చెను. దూరమున గల కోకిల యొండు. కొసరికొసరి ప్రణయరహస్యముల బలుకుచుండెను. కొండ వెనుక నున్న మబ్బులలో నాగానమునకు ప్రతిధ్వని వినవచ్చు చుండెను. ప్రమదావిజయు లొకరినొకరు చూచుకొనుచు నానంద హాసము లొనర్చుకొనిరి

'ప్రమదా! నేను నీకే మొసగగలను.'

'ఎందులకు!'

'నీప్రేమకు . . . నీకేమి కావలయును.

ప్రమద మాటాడలేదు.

'చెప్పవేల త్రపావతీ!'

ప్రమద కింకనుమానమే.

'ఇదిగో! హృదయకుసుమము. చెలీ! నీకిది యొసగెదను. నీ చిఱునవ్వు వెన్నెలలో దాని కానందము కలుగుగాక.'

———

౭

వినయుఁ డాలోచనాధీనుఁడై యన్యము మఱచినాడు. కేవ లము జంత్రపుబొమ్మవలె నాతఁడు పనిచేయ మొదలిడినాడు. వాని హృదయకుసుమము వానికేదియో బోధించుచున్నట్లుండెను. అబోధప్రకార మాతఁడు నడచుచుండెను. హృదయము [illegible]విధముల బరుగు

లిడుచుండెను. ప్రేమచంద్రుడు సుమ నెంతగాఢముగ ప్రేమించు చున్నాడు, అత డున్మత్తుడై నాడే, అయ్యయో ప్రేమ! ప్రేమ యెంత మధురము . . . మధురా! నీవన్యాధీనవు . . ఆమె వివాహామింకను కాలేదుకదా . లేదు. నాకిక సౌఖ్యమేది? . . నాసోదరిని విజయుని కిచ్చి వివాహ మొనరించి నేను వారిసంతోషమే నాదిగా దలచుచు గాలము పుచ్చెదను . . నాగేంద్రనాధుడు! . . వానిరహస్య మెఱుగ రాదా తప్పక యెరుగవలెను . . సుమ జనని యది యెఱుక పఱచును ఆమెకడకే పోవలెను' వినయు డిట్లాలోచించి సుమ గృహమునకై బయల్వెడలెను, వినయు డావీధిలో ప్రవేశించుసరికి ప్రేమచంద్రుడు వాని కెదురయ్యెను. అత డింకను సుమ యెప్పుడే తెంచునో యని వేచియున్నవాడని వినయుడు గ్రహించెను.

'నాసుమ! . . ఏమైనది?'

వినయునిదృష్టులెట్లో గరుణ పొంగి పొరలినది. ప్రేమచంద్రుడు శూన్యదృక్కుల నిటునటు త్రిప్పి తీక్ష్ణముగా వినయుని తిలకించి 'నాసుమ నేమిచేసితివి? లేదు . . ఆమె దేవతామూర్తి. ఆమె మాయమైనది . . . నీకామె కనబడినదా?' అనియెను.

వినయుడు నిరవుడయ్యెను.

'నీకామె కనబడలేదా?'

ఏమిచేయవలయునో వినయునకు తోచినదికాదు, 'లేదు' అనిమాత్రడు బదులిడెను.

'నీవు సుమ కొఱకై యీయూరు వచ్చితివా?'

'లేదు......'

'ఇది మాయూరు.'

'అట్లయిన సుమ గృహమున కెందులకు పోదువు.'

'ఏమియును లేదు.'

'సుమ యెచ్చో నున్నది?'

'నాకు తెలియదు ?'

'అగ్రహారములోన నెవ్వరున్నారు?'

'నాకు తెలియదు?'

'నీకు తెలియదా? అంతయు నసత్యము. నాకెఱుగ జేయ నీ కిష్టములేదు. పోనిమ్ము......' అనుచు నతడు వెడలెను.

వినయుడు వాని వెనుకనే. తనచూపుల బంపెను. ప్రేమ చంద్రుడు మరియొకదిక్కునకు పోయి మరివాని కగపడలేదు.

వినయుడు గమ్యస్థానము జేరి, లోని కేగెను. రోగిశయ్యా తలంబున నిద్రావస్థలో నుండెను. ఆశుష్కవదనముపై నేటికో యొక చిఱునవ్వు ఓష్ఠమొనర్చి మాయమైనది. నిశ్చలుడై యతడు శయ్యాపార్శ్వమున నిశ్శబ్దముగనిల్వబడెను. పదినిముసములు దాటిన తరువాత నామె మెల్లగగనురెప్ప లెత్తెను.

'అమ్మా! నీశరీరమున నెట్లున్నది?'

'నాయనా! నేనిక జీవింపను. అయ్యో! నాసుమను చూడ లేనా యిక? ఆమె యెప్పుడే తెంచునో? అంతవఱకు నేనుజీవింతునా?'

'అధైర్యపడి ప్రాణములు పోగొట్టుకొందువా?'

'అయ్యయ్యో! నేను జీవింపను! నాకధైర్య మేల! నాకు స్వర్గమువచ్చుచుండగా నాకెంత యానందము!'

'అమ్మా యేమి యీమాటలు. నీసుమకొఱకైన జీవింప వా!......ఆమె నిను చూచుటకు వేడుకపడదా?'

'అయ్యయ్యో! నేను పాపాత్మురాలను. ఆమెదుఃఖమునకు నేనే కారకురాలను. కాని యామె నన్నెట్లు నిందింపదు. ఆమె నా గర్భమున నేల జనించినది? అపవిత్రమూర్తి యిక నాపాపపుగన్నుల కగపడదు.'

'జననీ! భవదీయహృదయతంత్రులు జీర్ణములై యున్నవి. ఇప్పుడు వగవకుము. ధైర్య మవలంబింపుము.'

'నాయనా! నీవు స్వర్గదూతవా?'

'జననీ! నేనొక మానవమాత్రుడను. అధముడను. పవిత్రుల గని యానందింతును.'

'నాయనా! నీవాక్యములలో నమృత మున్నది. నీచూపులలో నమృత మున్నది, నీవమృతమయమాధురీమూర్తివి; నీవలననే నాకు జీవములు నిల్చియున్నవి—'నాయనా! నాయవసానసమయమున నాకడ నెవ్వరుందురు? నీవేకదా! నేను నునునే పుత్త్రునిగ జూచుచుంటిని. నీవొకపుత్త్రుడవు కమ్ము! నీపవిత్రహస్తములు నా హస్తముల బెట్టుము.'

అతఁ డట్లే యొనర్చెను.

'నాయనా! నాప్రక్కనే యాసీనుడవు కమ్ము!'

అతఁడట్లు చేసెను.

'నాయనా!' ఈలోకములో నాకును సుమకును బందుగులు లేరనుకొరంత నీవలనఁ దీరినది. నీవామె కిఁకముందు రక్షకుండవు కమ్ము. ఏమి యట్లు చేసెదవా?'

'అమ్మా! నీయాజ్ఞ పరిపాలింతును.'

'ఆమెకు నేనేమియుఁ జెప్పనవసరము లేదు. ఆమెప్రవర్తనము నాకే యాశ్చర్యము కల్గించును. తదీయవిచారమయవీథులలో నామరణము నిర్ఘాతపాతసదృశము కాగలదు. అప్పటున నీవే యామె నూఱడింపుము.'

ఆమె యొకదీర్ఘనిశ్వాసము విడిచెను.

'నాయనా! నాపలుకులు సావధానుఁడవై వినుము.'

'జననీ! చెప్పుము.'

ఒకనిముస మామెకన్నులు మూసికొనెను. చిన్నినిట్టూర్పు విడిచెను. మరలఁ గనులు విప్పెను.

'నేనఁక జీవింపనని యెఱుఁగుదును, నాసుమ యేమైనదో నాకు తెలియకున్నది. నాచరిత్ర మామెకుఁ గూడఁ దెలియదు కాని యామెయది గ్రహించినది. నాఅంత్యసమయమున నేనొనర్చినపాపములఁ దెలిపెదను. నీవే యవి యెఱుఁగుటకు తగుదువు. అవి నీహృదయములోఁ దాచియుంచుము. తెలిసినదా!'

జననీ! అవగతమైనది.'

ఆమె మరియొకదీర్ఘనిశ్వాసము విడిచి మరల నిట్లు వచించెను ఆమె లేనిబలముఁ దెచ్చుకొని మాటలాడుచుండె నని వినయుఁడు సుళువుగ నెఱిఁగెను.

'నాయనా! నాజీవితచరిత్ర మెఱిగిన నీవు నన్ను నిందించెద వేమో? కాని నీవట్టివాడవు కావు. నేను కళంకిని నని భావింపకుము. అది దేవుడే తీర్పు చేయగలడు . —— . నేనిప్పు డెంత వికృతముగ నుంటినో చిన్నతనమున నంత చక్కగ నుండెడిదానను. నేనెవ్వరి యింటనో కాలము బుచ్చుచుండెడిదానను. నాచిన్నతనముననే నా జననీజనకుల గోలుపోయితిని. కావున నాకు జీవము పుచ్చుటకు ధనము లేకుండెను. ఎవ్వరో దయకలవారు నాకు ధన మొసగెడివారు. నా బాల్యమంతయు నట్లే గడచినది. నేనంతటి హీనదశలో నుండగా గోపాలపురపు బూర్వపుజమీందారునికడ బనిలోఁ బ్రవేశించితిని. అతడే నన్ను పోషించుచుండెడివాడు. వానికొమరుని పెంచుటకు నేను నియమింపబడితిని. జమీందారుని భార్య ప్రసవించినకొలది దినములలోనే మరణించెను. అతడును విరక్తిచే మరల వివాహ మాడుట లేదు. అతడు దయకలవాడు. సరళహృదయుడు. కుమారు డగు నాగేంద్రనాథుని పెంచునప్పుడు నేను జాగ్రత్తగా బనిచేయుచుండెడి

దానను. అప్పటినుండియు నతడు నాకెన్నోవిధముల దోడ్పడి నాహీన స్థితినుండి నన్ను రక్షించెను. అతనికి కృతజ్ఞతాపూర్వకవందనముల కంటె నేనేమొసగగలను. అతడు నన్ను సోదరీప్రేమతో నాదరించెడి వాడు. నన్నే యననేమి, సర్వసేవకులు నాతనికి తుల్యులుగనే చూచు చుండెడివాడు. అత డెన్నియో ధర్మకార్యము లాదరించెను. అట్టి సమయమున నాతనికడకు, ఆనందపురవాసియగు నమరేంద్రుడు, అతిథిగా నేతెంచెను. వారిద్దరకును పరమమైత్రి. రమారమి రెండు మాసములవఱకు నమరేంద్రు డీయూరనే యుండెను. అతడు చక్కని వాడు అతనిని నాకన్ను లెప్పుడు చూచినవో కాని యప్పుడే నాహృద యము వానిపైకి పోయెను. అతడును నన్ను ప్రేమించెను.

ఆమె మరల నొక నిట్టూర్పు విడిచెను. కొంచెము మంచి నీరము లొసగు మని వినయునకు సంజ్ఞాసూచకముగ దెలియజేయ నత డట్లాచరించెను.

'ఆదినము లెట్లు గడచెనో నాకెఱుకలేదు నేనొక సేవకు రాలను. అత డొక యున్నతవంశసంభూతుడు. అట్టివాని నభిలషించుట యెట్లు. కాని యతడును నన్ను ప్రేమించుటచే నాకమితమగు నానందముకల్గినది. అతడు నన్ను ప్రేమించుచుండె నని యతని దృష్టులే నాకు చెప్పుచుండెడివి.'

ఆమె మరి చెప్పలేకపోయెను. ఐదునిముసములవఱకామె కన్నులరమోడ్చి యుండెను కాని వినయు డామె చెప్పబోవున దంతయు నూహించుచుండెను. జ్ఞప్తికివచ్చినదానివలె నామె కన్నుల దెఱచి 'నాయనా! .....అతనితో మాటలాడుటకైన నాకు భయ ముగా నుండెడిది. అప్పుడప్పుడతడే నాతో సంభాషించెడివాడు. ఒక నాడు మాహృదయరహస్యముల నొకరికొకర మెఱుకపఱచుకొంటిమి. అప్పటి నాయానందమునకు మేరలేదు. ఆరెండు నెలలు గడచినవి.

అత డీయూరు విడిచి వెడలిపోయెను. నాహృదయ మాతనితోడనే పోయినది . ......వత్సరము రమారమి గడచెను. నేనప్పుడు సుమను కంటిని.

ఆమె మరల నిట్టూర్చెను.

వినయు డాశ్చర్యముతో నంతయు నాలించుచుండెను. మరల నామె చెప్పుట మొదలిడెను. 'నేనీసంగతి యాతని కొక లేఖమూలమున దెలియబఱచితిని. నేనప్పటికిని జమీందారునికడ సేవ యొనర్పుచుంటిని. అత డొసగు జీతముతోడనే జీవించుచుంటిని. ఒకనెల దినములలో నమరేంద్రుడు నాకొక యిర్వదిరూప్యము లంపెను. దానితో మరియొక లేఖగాని మరియేమియు లేదు. అట్లే ప్రతిమాసము నాతడు నాకు ధనమంపుచునుండువాడు.'

ఆమెకన్నులలో నశ్రువు లూరెను. వానిని మెల్లన దుడుచుకొని యామె గద్గదస్వరముతో నిట్లు చెప్పదొడగెను.

'ఇట్టు లుండగా జమీందారుడు కలకత్తానగరమున వాసమొనర్చుటకు బయలువెడలెను. వాని కీపురమున నుండుట కిచ్ఛలేక పోయినది. నాగేంద్రుడు నాకడ నుండుట కలవాటుపడినవా డగుటచే జమీందారు డెక్కువజీతమిచ్చి నన్నుకూడ రమ్మనెను. నాకు గూడ వెడలుదమని బుద్ధి వొడమెను. సుమ నొకరి కప్పగించి నేను వెడలితిని. ఇదియంతయు నరేంద్రు డెఱిగెను. అత డప్పటికి వివాహమాడి యుండెను. కాని యతనిభార్య యుత్తమగుణాఢ్య. వారే సుమను తీసికొని వెడలి రని నాకు తెలియవచ్చెను.'

మరియొకరెండునిముసము లామె యూరకుండెను. మరి యామె చెప్పవలసిన దేమియు లేదని వినయుడు భావించెను. కాని మరల నామె యిట్లు చెప్పెను.

'అమరేంద్రుడును వాని సతీమణియగు లీలయు నాకూతు

ననురాగముతోఁ జూచిరి. వారామెను ప్రేమించిరి. ఆమె శ్రేయము నభిలషించిరి. వారిపవిత్రాత్మలకు శాంతి యగుగాక!......నేనీతరు వాత—అనఁగా లీలామహేంద్రులు గతించినతరువాత—నాకూఁతు నీ నాగేంద్రుని కొసఁగితిని.'

ఆమెకంఠమున గద్గదిక, పెదవులఁ గంపముఁదోఁచెను. ఆవృత్త మంతయుఁ దలఁచుకొని యామె దుఃఖించుచున్నదని వినయుఁడు తలఁచెను. ఆమెకన్నులలో గిఱ్ఱున నీరుతిరిగెను.

'నాయనా! ఈనామాటల నీహృదయము మూలమూలల దాఁచికొని మరచిపొమ్ము.

'జననీ! నీయిష్టము.'

'నాయనా! నీకు మరియొకరహస్య మెఱుఁగఁజేసెదను. అది సుమ కూడ నెఱుఁగును. నీవామెకడ కేఁగునప్పు డాయుబునుమాత్ర ము తేవలదు. ఆమె కదియన్న నిష్టములేదు.'

'అట్లే ఆచరింతును.'

'నాయనా! నేనట్లెందుకు చెప్పితినో తరువాత తెలియఁబఱ చెదను. సావధానుఁడ వగుము.'

ఆమెగొంతు హీనముగ నైనది. వినయుఁడు జాగ్రత్తగ నామె పలుకు లన్నియు నాలించుచుండెను.

'నాయనా! ఇదియొకరహస్యము. జాగ్రత్తగ వినుము. నేను చనిపోవుచుం దది నాహృదయమునుండి పంపివైచెదను. అదియొరుల కెఱుకపఱచుదాఁక నాహృదయభారము పోదు...... .....నాయ నా!... ..అది యెట్లాచరించితినో నాకే తెలియదు. ఆరహస్యము నాహృదయాంతరాళములో నెట్లు, ఇన్నిదినములు దాచియుంచితినో నాకే యాశ్చర్యముగా నున్నది. నాయనా!....... తెల్పుచుంటిని. వినుము,

అలయికచే నామె యొక్క నిమున మూరకుండి సేదదేరి మరల వినాయునితో నిట్లనియెను.

'నేను జమీందారునితోఁ గలకత్తా వెడలియుంటి నని నీకిది వఱకే యెఱుకపఱచితిని. జమీందారుని యనుమతిఁగొని నేను ప్రతి సంవత్సరము నీయూరే తెంచి, ఒకటిరెండువారము లిటనుండి వెడలి పోవుచుండెడిదానను. అట్టిసమయములందు నుమను చూచుట కవ కాశము కలుగుచుండెడిది ...జమీందారుఁడు వృద్ధుఁడైనకొలఁది వానివిరక్తియుఁ గొడుకుచంచలగుణములు నధికములు కాఁజొచ్చెను. వత్సరముపై వత్సరము పదివత్సరములు కావచ్చెను. కాని జమీందారుడు తన గృహము, ఊరు, ఉబుసేలేదు. అతడు, కొమరుని, నీవు వ్యవహారముల జూచుకొనుచుండుమని చెప్పుచుండెడివాడే కాని యా యభాగ్యు డాతనిపలుకుల జెవిని పెట్టుటమానినాడు.'

ఆమె మరియొక పెద్దనిట్టూర్పు పుచ్చి మంచినీరముల ద్రావి యిట్లు చెప్పుట కారంభించెను.

'నాయనా!... కాల మంతయు కొక్కరీతిని జనదు. కష్టము లందఱకుఁ బ్రాప్తించుచుండును. ఒకనాఁడు జమీందారుడు దివం గతుడయ్యెను. అప్పటికి నేనొకర్తనే వారికడ బనిచేయుచుండెడి దానను. ఈయూరు సేవకు లిదివఱకే వచ్చుట కంగీకరింప మానుటచే నాయూరు సేవకులనే నియమించిరి. అతడు మరణించినక్షణము వా రతనిని వీడిరి. అప్పుడు జమీందారుని కుమారుడు నేనును నీయూరు రావలయు నని తలచితిమి. కాని చంచలు డగు నాత డాయూరున దురభ్యాసములకు లోనైనాడు. కావున నాయూ రాతడు విడువ నంగీకరింపలేదు.'

ఆమె గట్టిగా నిట్టూర్చెను.

నాయనా! తక్కుంగల సంగతులు వినిన నీకే యాశ్చర్యము

కలుగగలదు . . . అట్టిచో వాని స్నేహితులు ప్రతిదినము వానికడ కేతెంచి హాయిగా గాలము బుచ్చుచుండెడివారు. ఇట్లుండగా నొక నాడు, దురాత్ముడొకడు జమీందారుని కుమారుని హత్య చేసెను. . .'

వినయు డుద్విగ్నహృదయుడై విస్మయవిస్ఫారితనయనంబు లతో నది యాలించుచుండెను.

'అతడు హత్యచేయుచుండ నేను చూచియుంటిని. తత్క్షణము నాప్రాణములుకూడ బోయియుండును. కాని వానిని నేను ప్రాణభిక్ష వేడితిని . . .అదిగో ఆదురాత్ముడే యిప్పటి జమీందారుడు అప్పటి నుండి యతడే నాగేంద్రుడను పేరితో గోపాలపురము నేలుచున్నాడు.'

వినయుని ఆశ్చర్యమునకు మేర లేకుండెను.

'అప్పుడు నేనును, అతడును ఈయూరు వచ్చితిమి. నా సుము సుఖపడుటకు వాని కప్పగించితిని నాయనా! అదియే రహస్యము. ఆ రహస్య మూలరువాత నును తెలుగ జేసి . అప్పుడు నీకెఱుగ జేసితిని.'

వినయుని హృదయము గద్గదమై గొణిగికొనెను.

'నాయనా! నాయూహాప్రకారమున గమ్యము నీ కాలస్యమగును.'

అప్పటికి చంద్రభానుడు ప్రకాశమానముగ వెలుగు చుండుటచే బంగ్రొందు గంటలు గానవచ్చినదని యులికిపడి బయలుదేరెను.

---

3

ప్రాంచ నీముఖావలోకనమున గాన తరంగములు మిన్ను ముట్టుచుండ, విజయుడు ఉత్సాహమున మొలపర్చుచుండెను. ముగ్ధాపిలోకనంబులతో ప్రమద యెనెదుట నిలువబడెను.

'ప్రమదా! నిలువబడియుంటివేమి!'

'నేను కూర్చుండను.' అని యామె యేదియో జ్ఞప్తికివచ్చిన దానివలె వెనుకకు పోయి మోము వాంచి క్రేగంట నతనిని చూడ మొదలిడెను.

'ఇంతలోఁ గోప మేమి?'

ప్రమద మౌనముద్రాధారిణి యయ్యెను.

'మాటలాడ వేల?'

'నీ వన్నియు నసత్యములఁ బల్కెదవు.'

'నే నే మబద్ధ మాడితిని?'

ఆమె నీరవయై యుండెను.

'నేను నీతో నసత్య మాడినానా?'

'నీకు తెలియ దేమి?'

'కోపింపక చెప్పుము?'

'నాకు కోప మెందుకు! నా కొకపుస్తకముఁ దెచ్చెదనని నిన్న చెప్పి యప్పుడే యామాట మఱచితివి. అందువలన నాకు నీపైఁ గోపమో నీకు నాపైఁ గోపమో తెలియఁగలదు.'

'నేను తేలే దని నీ కెవ్వరు చెప్పిరి?'

'మఱి పొత్త మేదీ?'

'ఇదిగో' అని విజయుఁడు వస్త్రాభ్యంతరమునుండి పొత్తముఁ దీసి యామెకు కనఁబఱచెను.

ప్రమద గబ్బున వచ్చి పుస్తక మందుకొనఁబోయెను. విజయుఁడు కరము మీఁది కెత్తెను. పొత్త మామె కందలేదు.

'పోనిమ్ము, దాచుకొనుము.' అని కుపితయై ప్రమద దూరముగఁ బోయెను. విజయుదెస చూడ మానెను.

వినయుఁ డిది యంతయుఁ దిలకించుచుండెను. వారిమాట

లలో వాని కానందము కలిగినది. తన్మయుఁడై యాతఁడట్లే యుండెను.

ప్రమద కవితస్వాంతమైన దని విజయుఁడు గ్రహించెను. 'ఇదిగో తీసికొనుము.' అనెను.

ఆమెయు విననియట్లు నటించెను.

'పాత్ర మింద'

ఆమె వాని నోరఁగఁ జూచెను.

'ఇదిగో'

ఈకోప మెంతరోకాల ముండ దని యాతఁ డెఱుఁగును. ఆమెకడ కేగి పాత్రము కామెకరిములయం దుంచి, విజయుడు విన యునికడ కేతెంచి యిట్లు సంభాషించెను.

'వినయా! నాలుగైదుదినములనుండి కనఁబడుట లేదు. ఏమి ? విశేషంబు లేమియు లేవుకద!'

'నీకు తెలియని వేమి కలవు'

'నే నేమి దైవజ్ఞుడనా?'

'కవివి'

విజయుడు చిఱునవ్వు నవ్వెను.

'నీబహుమాన మందినదా! వినయా!'

'బహుమాన మందుకొనుటకు వారు నన్నాహ్వానించిరి కాని నాకు వీలులే దని వ్రాసితిని. బహుమాన మీదినముననే యందినది.

' అట్లయిన నది యేమి చేతువు.'

'నల్వురకు పంచెదను.'

'నిజమే చెప్పుచుంటిని. అందు సగము చిత్రకళాశాలాస్థాపనార్థ మొసఁగితిని. నాల్గవవంతు ననాథబాలికాశరణాలయమున కొసగితిని. తక్కుఁగలధనము బీదల కొసఁగుటకు నిశ్చయించితిని.'

వినయునివితరణాబుద్ధికి విజయుఁ డధికసంతోషము వెలిబుచ్చెను అట్టివారివలననే దేశరక్షణము కలుగుచుండునని యాతనియూహము

'వినయా! నేను నీదివ్యమార్గము నికముందనుసరింపఁ బ్రయత్నింతును. ప్రయత్నించు టేమి. అనుసరింతును.'

'ఏమి! ఎట్లు'

'నాపాత్రములవలన నాకధికలాభము కలుగుచున్నది. అది యంతయు బాలికావిద్యాభ్యాసమునిమిత్తము పయోగింపనూహించితిని'

'సఫలమగుఁ గాత!'

'వినయా! ఆమాట కేమి? నిన్నొకవిషయమై ప్రశ్నింపవలెనని యెన్నియో దినములనుండి యూహించుచుంటిని.'

'ఏమియో ప్రశ్నింపుము.'

'నీ వీయూరు వచ్చిన దాది వింతగా నుంటివి.'

'కావచ్చును.'

నీలో నేదియో పరివర్తన ముదయించిన దని నే తలఁచుచుంటిని.'

'ఐన!'

'నీయం దొక దుఃఖ ముదయించినది. దానిమూలమున నీవు కృశించిపోవుచుంటివి. అది మనస్తాపము కాదుకద!'

'విజయా! నీమాటలు వింతగా నున్నవి.'

'జననియుఁ బ్రమదయుఁ గూడ నట్లే చెప్పుచున్నారు.'

'ప్రమద చిన్నపిల్ల! ఆమె కేమి తెలియును.'

'జననియో!'

'మాతృప్రేమ యట్లనిపించును.'

'నేను మిత్రుఁడను. అంతియ! ఏమి మాటలు! నీలోఁ బెద్ద మార్పు కలిగినట్లు నాకు స్పష్టముగఁ గనఁబడుచున్నది.'

'కనఁబడిన నే నేమి చేయఁగలను.'

'నీదుఃఖముఁగూర్చి నాకెఱుఁగఁజేయుము.'

'దానివలనలాభము లేదు.'

విజయుఁడు మఱేమియుఁ బ్రశ్నింపలేకపోయెను.

వినయుఁడు నాసంభాషణము మరిసాగింపలేదు.

నాల్గుగంటలగు సరిగ వినయుఁడు లేచి 'విజయా! నాకు పని యున్నది. మరల నాలుగంటలకే వెంచెదను.'

'వినయా! పనియేమి'

'సాయాహ్నమున నీ కది యంతయుఁ దెలియఁబఱిచెదను.'

'ఏమి తెలియఁబఱుతువు'

'నాగేంద్రునిఁగూర్చి అనాఁటిసంగతి!'

విజయుఁడు విస్మయ, డయ్యెను.

వినయుఁడు తత్క్షణము బయల్వెడలి మఠాధికారిగృహము నకేగెను. మఠాధికారి యప్పటికి గృహమున నేకలఁడు. ప్రార్థనామందిరమున కెదురుగనే యాతని గృహ ముండుటచే నాతడు సాధారణముగ గృహముననే యుండును. వినయుని లోనికి రావించి యాసీను జేసి యత డిట్లు ప్రశ్నించెను 'నాయనా! నీకి యూరేనా?'

'ఔను.'

'నీనామధేయ మేమి?'

'వినయుడు.'

'వినయా! నీవేటికి నాకడ కరుదెంచితివో చెప్పెదవా!'

'తెలియజేతును. మీరు దానివిషయ మెఱుగజేసిన గృతజ్ఞుడ నగుదును.'

'మతవిషయమా?'

'కాదు; ఒక స్త్రీవిషయము.'

'ఏమి .....'

'ఔను. ఒక అనాథ స్త్రీ విషయము.'

'నేనెఱిగినది. యథార్థముగ జెప్పెదను.'

'చిత్తము. మీరు సుమ నెఱుగుదురా?'

'ఎఱుగుదును.'

'ఆమె వివాహము మీ సముఖమున జరిగినది.'

'.... . ..'

'అది నాకడ రహస్యముగ నుంప నవసరము లేదు. ఆమె విషయమైన నాకంతయు దెలియును. ఆమె శ్రేయముకొఱకు పాటుపడు వారిలో నే నొకడ నని యెఱుగుడు.'

'. .... .'

'ఆమె వివాహ మామె యెందులకు దాచ బ్రయత్నించుచు నున్నదో యెఱుగవలయునని నే నిట్లు వచ్చితిని.'

'.... .'

'నేనా విషయ మొరుల కెఱుగ జేయను. మరణించుచున్న యామె జనని యాదేశమువలన నేను మీకడ కేతెంచితిని. మీ వలననే యాసంగతి యెఱుగగల నని యామెయే వచించినది. మీరు చెప్పినచో నది నాహృదయములో దాచెదను.'

'నాయనా! నీకది యెఱుగ జేయుటకు నా కేమియు ననుమానము లేదు. నీ వనిన ట్లది దాచవలయును.'

'అట్లే యొనర్చెదను.'

'ఆమె యెవరిని వివాహమాడెనో యెఱుగుదురా?'

'నాగేంద్రనాథుని.'

'అతనిని సుమ పెండ్లియాడుటకు పాపమామె జననియే కారణము.'

'ఔను.'

'సుమ వివాహము నేనే జరిపితిని వారిలో వారికి ప్రేమ లేక పోలేదు. సుమ యాతనిని ప్రేమముగ జూచెడిది. కాని వానిగుణముల కసహ్యించుకొనుచుండెడిది, ఏవగించుకొనెడిది.'

'అదియును తెలియును '

'ఇంక నీకేమి కావలయును.'

'తన వివాహము నామె యొరుల కెందుల కెఱుఁగనీయదు!'

'ఆమె కావివాహమే యిష్టము లేదు. ముఖ్యముగా వానిఁ జిక్కులు పెట్టుట యిష్టములేదు. అందువలన నొరుల కెఱుఁగఁ జేయదు '

'అతఁ డెఱుగఁ జేయఁడా?'

'ఆమె యనినవాని కపరిమిత మగు కోపము.'

'అంతకుమించి మీకు మఱియేమియుఁ దెలియదా?' అని విన యుఁడు ప్రశ్నించుసరికి ఐదుగంటలు కొట్టెరి

'నాయనా!' నా కిఁకఁ బనియున్నది. నాగేంద్రుడు నాకడ కెందులకో యీనాడిప్పు డేగుదెంతునని కబురంపినాడు. అతడే తెంచు వేళ యైనది.'

'అత డేటి కేతెంచును.'

'నాకు తెలియదు.'

'అతడు మరల వివాహమాడ నెంచియున్నాడు. అందులకు మీయనుమతి పొందుటకునై యుండును.'

'అ ట్లెన్నటికిని జరుగ నేరదు. అతడు మరల వివాహమాడ వీలు లేదు. వాని నీసంగతి కనుగొందును.'

'అంతయు నిశ్చితమైనది.'

'ఎన్నిదినము లైనది.'

'నెలదినము లగును.'

'వధువు దేయూరు?'

'ఆనందపురము. కీర్తిశేషు డగు నమరేంద్రునితనయ.'

'అపసదా! . . . ఈవివాహము కానేరదు. నేను కానీయను. ఆదురాత్మునకు మరల వివాహమా?'

'నేను సెలవుతీసికొందును.'

'అని వినయు డతనికి నమస్కరించి వీధిద్వారము దాటుసరికి నాగేంద్రు డతనికి గన్పించెను. ఒకరి నొకరు చూడకుండ నెవరి దారిని వారు వెడలిరి వినయుడు ఫలముల గొన్ని కొని రోగికడకు వెడలెను.

రోగి మరణశయ్యపై నున్నది. వినయుడు కనుగొని తత్తరముతో శయ్యాపార్శ్వమున నిల్వబడెను.

'నాయనా! సమయమునకు వచ్చితివి . . . నా ప్రాణము లుపోవు...చు . న్న . వి . నా సు మ జా...గ్ర.. త్త... గ...కా...పా . డు . భార . ము—ని .'

ప్రతినిమిషము నామె ప్రాణవాయువు లనంతవాయుసమ్మేళనము గాంచి యెటో యెగిరిపోవుచున్నవి.

వినయు డాదృశ్యము చూడలేక వెంటనే యటనుండి మరలెను,

* * * * *

సాయాహ్నమున వినయుడు మఠాధికారిగృహములోని కేగెను. అత డట లేడు. ప్రార్థనామందిరమున నత డొంటరిగ కూరుచుండియుండెను.

'వినయా! నీ పని యిట్లయినది.'

'ఏమి?'

'తాను వివాహ మాడుదు ననియు సుమవివాహము రద్దు పఱుపవలయు ననియు జెప్పినాడు.'

'తరువాత.'

'నే నది నీలుగా దంటిని. ఎవరు నిన్ను వివాహ మాడెద రని నేను వానిని ప్రశ్నించితిని. ఎవరో నిశ్చయము కాలే దనినాడు.'

'అంతయు నబద్ధము.'

'ఆనందపురపు అమరేంద్రునితనయను వివాహ మాడుటకు నిశ్చయించుకొంటి వేమో యని నే నంటిని.'

'లేదనినాడా?'

'కాదు ఆమె మరణించినదట.'

వినీలాంబరమునుండి పిడుగువడిన ట్లయ్యెను.

విహ్వలనయనుడై యతడు వేగముగ బోయెను.

---

## ౪

వినయునకు లోకమంతయు నంధకారబంధురముగఁ గన్పట్టెను. నిర్ఘాతపాతసదృశ మగు మధుర మరణవార్త విని నంతనే యాతఁడు పాతాళములోనికి క్రుంగిపోయినాఁడు. 'పుష్పకుమారి ధూళిలోఁ గలసిపోయినది. మకరందము పాతాళలోకమున ఇంకిపోయినది. సౌరభము గాలిలో లీనమైపోయినది.' అని యతఁ డున్మత్తచిత్తమునఁ జింతించెను. కపటుఁ డగు నాగేంద్రనాథునినుండి మధురను రక్షింపఁ గలనని యతఁ డూహించెనే కాని, యా కట్టినమేడ లన్నియు నొక్కమాఱుగ నేలఁ గూలినవి. లోకమే లేనియట్లాతఁడు భావింపఁ గడఁగెను.

వినయుఁ డానాఁడు భోజనమైనఁ జేయలేదు. అప్పే రాత్రి యెనిమిదిగంటలకు విజయుని గృహమునకు వినయుఁడు వెడల నిశ్చ

ఖించుకొనెను. విజయునితో నీసంగతు లన్నియుఁ జెప్పుటకై యాతఁడు కృతనిశ్చయుఁ డయ్యెను.

విజయుఁడు సుఖమయకల్పనలలోఁ దూగులాడుచుండెను. తదీయభావవిహంగము ప్రేమమయవీధులలో నెగురుచుండెను. విజయునిఁ జూచి యాతడు చప్పున నతనిచెంత కేతెంచెను.

'నీకొఱకు సాయంతన మూఁడుగంటల కేగుదెంచి యుంటిని. కాని నీవు గృహమున లేవు.' అని విజయు డుపక్రమించెను.

'ఔను. అప్పటికి నేను గృహోన్ముఖుడ గాలేదు ఒక్క యరగంటపూర్వమే వచ్చితిని.'

'భోజనమైనదా?'

'ఐనది.' అని వినయుఁ డసత్య మాడెను. లేదనినయెడ మిత్రుడు కారణ మడుగు నని యత డట్లు చెప్పెను.

'వినయా? సాయాహ్నమున నాయువతిగూర్చి యెఱుగజేసెద నని చెప్పితివి. చెప్పెదవా?'

'విజయా! అందులకే ముఖ్యముగా నిప్పుడు వచ్చియుంటిని. నాహృదయమున నది దాచుకొనలేను.'

'వినయా? నీమాట లాశ్చర్యకరములు.'

'ఎందులకు?'

'నీమాటలలోఁ బూర్వపువిధము లేదు. క్రొత్తవానివలె నుంటివి. ఆ రహస్యము నెఱుగజేసిన భయమేమి?'

'కాని నీ వది యన్యుల కెఱుగనీయకుము.'

'అందులకా యనుమానము!'

'అనుమాన మేమి కాని మరణోన్ముఖ యగు నాయువతి వాక్యముల ననుసరించి యట్లుంటిని.'

'ఆమె మరణించినదా!' యని విజయు డాశ్చర్యసూచకస్వరంబున బ్రశ్నించెను.

'ఔను. నేడే సాయాహ్నా మూడుగంటలకు మరణించెను.

అంతట వినయుడు సుమను తా నానందపురమున కేగుచుండ జూచుటయు, నామె విమలసుత యనియు, నాగేంద్రనాథునకు సుమకు వివాహమగుటయు ప్రస్తుత నాగేంద్రుడు కపటుడనియు, మిత్రున కెఱిగింప. నతని యాశ్చర్యమునకు మేర లేకపోయెను. వినయు డంతయు నెఱుగజేసెనే కాని, మధురనుగూర్చి, తానామెను ప్రేమించుట గూర్చి, ఆమెను నాగేంద్రనాథునికి వివాహమొనర్ప జరిగిన ప్రయత్నముల గూర్చి, ఆమె మరణము గూర్చి, చెప్పుట మాని నాడు. కాని మఱియొకవిధమున నది వచించెను.

'నాగేంద్రుడు మరల వివాహమాడుటకై ప్రయత్నించి సఫలీకృతు డాయెను '

'మరల వివాహమైనదా?'

'లేదు. నిశ్చయమైనది......'

'వివాహ మెప్పు డగును?'

'ఇక గానేరదు.'

'అదేమి.'

'వధువు మరణించినది.' అని యత శ్శోకదీర్ఘనిశ్వాసము వీడి నిమీలితనేత్రములతో బరుండెను.

'పాపము! ఆమె మరణించినది' అని మరల నతడు స్మృతికిదెచ్చి హృదయాంతరాళములో 'మరణించినది.' అనుకొనెను.

'ఆమెను నీవెఱుగుదువా?' అని విజయు డడిగెను కాని, యూహాలోకములో దిరుగాడుచున్న వినయు డది యాలింపలేదు.

'వినయా!'

'ఆ'

'నీ వామె నెఱుగుదువా?'

'ఇంచుక'

'ఆమె యెవరు?'

'ఆమె యానందపుర నివాసిని.'

విజయుడు మతియేమియు బ్రశ్నింపలేదు. ప్రశ్నించినను వినయుడు చెప్పదలచుకొనలేదు.

అప్పుడే పండ్రెండుగంటలు కొట్టిరి.

వినయుడు లేచి 'నే నిక నింటి కేగవలయును.'

విజయు డతనితోడనే ద్వారముకడ కేతెంచెను. సమముగా నదే సమయమున వీధిలో నొకడు పోవుచునున్నట్లు వారు కనుగొనిరి.

'అత డెవ్వడో తెలియునా విజయా!'

'చెప్పలేను.'

'అతడు నాగేంద్రుడు. అతడు మరేదియో ఘోరకార్యము జేయదలచినట్లు తలతును. నేను వానిని వెన్నాడెదను.'

'నేను కూడ వచ్చెదను.'

నిశ్శబ్దపదములతో వారు వాని నిరువదిగజములదూరమునుండి వెన్నాడిరి.

తాను వెన్నాడబడుచున్నాడని యెఱుగకయే నాగేంద్రనాథుడు నడచుచుండెను. అతడు ప్రార్థనామందిరమున కెందులకు పోవుచుండెనో వారెఱుగ లేకుండిరి. వినయునిభావముమాత్రము పరిపరివిధముల బోవుచుండెను.

నాగేంద్రుడు ప్రార్థనామందిరముదెస తిలకించెను. మరల మతాధికారిగృహమువంక చూచెను. లోకము నిద్రావస్థలో నున్నట్లాతడు గ్రహించెను. చుట్టుప్రక్కల జూచెను. కాని యాచీకటిలో జెట్టుచాటున నున్న వినయ విజయు లతని కన్నుల బడలేదు.

మఠాధికారిగృహముతో గలసియొక చిన్నగృహముకలదు. ఆగృహము చిన్నదియయ్యు రమణీయముగ నున్నది. నాగేంద్రు డచ్చటికి వెడలెను. అత డెందుల కట కేగెనో వారెఱుగజాలిరి. అందు, సర్వస్వము నుండును. మఠాధికారి యున్న కాగితముల నచ్చటనే బీరువాలలో నుంచును. అందుగల తనవివాహ శాసనము దీసి వేయుటకై యత డట్లు చేయుచుండె నని వా రూహించిరి.

నాగేంద్రు డెట్లో తలుపు తెఱవగల్గెను అతడు లోని కేగి దీపము వెలిగించినట్లు వా రూహించిరి.

'వినయా! ఒకపని చేసెదను.' అని విజయుఁడు మెల్లన నడుగు లిడుచు గృహద్వారము కడ కేగెను

అత డేమిచేయునో యని వినయుడు విస్ఫారితనయనములతోఁ జూచుచుండెను.

లోపల నేదియో విఱుగబడినట్లు శబ్దమయ్యెను.

విజయుడు తిరిగివచ్చెను.

'ఏమి యొనర్చితివి.'

'వెలుపల గొళ్లెము దవిలించితిని.'

'వానికి తెలియలేదా?'

'అప్పుడే యేదో శబ్దమైనది. . . . .'

'అదేమి! . . . '

ఇర్వురు నా గృహమువంక తిలకించిరి. దానినుండి ధూమము గప్పుగప్పున వెల్వడుచుండెను.

ఇంతలో ద్వారము లాగిన చప్పుడు!

అఘోరదవానలములో నాతడు మండిపోవలసినదే! ఆద్వారమెట్లు తెఱవబడును!

ఒక్కమాఱుగ గృహము దగ్ధమగుచుండెను. అగ్ని జ్వాలలు

మింటికెగయుచుండెను. పదినిముషములలో నా ప్రదేశము జనసంకుల మయ్యెను దగ్ధగృహమునుండి యొక పెద్దకేక వెల్వడెను.

వినయుడున్మత్తునివలె, కీలికాపరివృత మగు ద్వారముపై నొక్కతన్ను తన్నెను. ద్వారము తెఱవబడెను. అచేతన మగు నాగేంద్రుని శరీరము వినయుని పదముల ముందుపడెను. దానితో నాతడు శరవేగమున బరుగిడి వెల్వడెను.

ఈ వెఱ్ఱిసాహసమున కందఱు నచ్చెరువందిరి. కాని నాగేంద్రు డెందుల కాగృహములో నుండెనో, వినయు డది యెట్లెఱుగ గల్గెనో వారు ప్రశ్నించుకొన లేదు.

నాగేంద్రుడు తన కడసారిచూపు, రక్షకునిదెస బఱపి, యిహలోకమును వీడి చనెను. కరుణాహృదయములతో దుఃఖాశ్రుకణము విడిచినవా రొక్కరు నందు లేరు.

* * * *

సంధ్యారోచులు నేలకు జాఱిపోవుచున్నవి. అరుణారుణాంధతమస్సులు తూర్పుదిక్కునుండి క్రమ్ముకొని వచ్చుచున్నవి. షికారు వెడలినవా రందఱు గృహములఁ జేరిరి. పక్షులు కులాయములఁ జేరుకొనెను.

ఆ సాంధ్యసమయము, హృదయములోఁ గల్గు ప్రేమభావము నిస్పృహా స్ఫురింపఁజేయుచుండెను. కోకిల విరహాకంఠము యువజనహృదయాకర్షముగా నుండెను. కొండపై మబ్బులలో నానాదము ప్రతిధ్వనించుచుండెను. వినీలాంబరంబు విచలితచిత్తముతో ప్రళయమేఘాంధకారబంధుర మయ్యెను.

ఆనందపురక్రైస్తవ శ్మశానవాటికలో వినయుడు, విషణ్ణహృదయంబుతో, వికృతవదనముతో, విషాదసంసిక్తభావంబుతో,

నిస్పృహతో నిల్చియుండెను. తదీయహస్తములు ముకుళీకృతములై యుండెను వానికన్నులు నిమీలితములై యుండెను.

వినయునకు జీవితముపై వైరాగ్యత జనించినది. మిత్రుని కెఱుగ జేయకుండనే యాతఁ డానందపురమున కేతెంచెను. అచ్చట ప్రాణములు విడిచివేయవలె నని యాతఁడు నిశ్చయించుకొనెను.

అమరేంద్రుని సతీమణి యగు లీలసమాధి కెదురుగ నిల్వఁబడి యాతఁ డిట్లు ప్రార్థించెను.

'జననీ! భవదీయగుణగణాకర్ణనమున నా శ్రవణేంద్రియములు ముక్తిఁ బొందినవి. నేఁడు నీసమాధి దర్శించుటచే నాకన్నులనుండి కలుషము తొలఁగుఁగాక! నిన్ను ప్రార్థించుటకైన నేను తగను. భవదీయ తనయ నీకడ నిప్పుడు సుఖ మనుభవించుచుండె ననుకొందును.'

నిమీలితాక్షుఁడై యుండి, లేచి యతఁ డా ప్రక్కనే నిర్మింపఁబడిన యొక క్రొత్తసమాధి కెదురుగ నిల్వఁబడియుండెను. అదియెవ్వరి సమాధియో ఫలకముపై లిఖింపఁబడియుండలేదు. కాని యది మధుర దని యాతఁ డిదివఱకే తెలిసికొనెను.

'మధురా! .. మధురా! . ... మధురా! . .. అబ్బ! . . తలఁచుకొనినప్పు డెల్ల గుండె నీరగుచున్నది .... నీకొఱకే నే నిదివఱకు జీవించితిని . నీకొఱకే మరణింతును . . . ఈ మరణ మెంత సుఖ మొసఁగును . మధురా! . . . .శాశ్వతానందమూర్తి! ఈ దీనుఁడు నీచిఱునవ్వుదొంతరలలో . . . తొట్రిలుచున్న నీయానందరేఖలలో . . ఎంతహాయి . . . ఎంతసుఖము. . . . .ఎంత యానందము, . అనుభవించినాఁడో! . . . .! ఇప్పుడు . . . .మరణించుచు . . నిన్ను చూచుచు నను తలఁపుతోఁ గూడ . . . .నిలువునఁ బులకించుచు నట్టిమహానందమే కల్పించుకొనుచున్నాఁడు.

'మధురా! ... స్వర్గీయానందమాలికాగ్రనాట్యసుందరీ! ... అమృత సమాధుర్యమూర్తీ! .....చేయూత నిమ్మా'

అతని వాక్యములు ముగిసెను.

సుదీర్ఘమును, సునిశితమును, అగు నొకకఱుకరవాలము వాని కరమున నిప్పుడు మెఱయుచుండెను. అతం డదివక్షస్థలమున కెదురుగ నత్తి సుదృఢముగ బట్టియుండెను.

మధురా!... ..మధురా!!.. మధురా!!!

ఊహామాత్రములోననే, వానిగుండియలలో గ్రుచ్చుకొనుటకై కత్తిపట్టుకొని యున్నహస్తము నెవ్వరోపట్టుకొనిరి.

అచ్చెరువుతో నాతడు వెనుకకు తిరిగెను.

ఆధవళాంబరి వానికరము బట్టియుండెను. ఆమెప్రక్కనే భ్రమర నిలువబడియుండెను.

'సుమా!' యని యత డనియెను.

ఆమె తనయవకుంఠనము దొలగించెను.

మందహాసరేఖాంకితవదనయు, మోహనమూర్తియు, తరళోత్ఫుల్లనయనయు నగు 'మధుర' వాని కట్టెదుట గన్పట్టెను.

విస్మయవిస్ఫారితవిలోలవిలోకనంబులతో, నాత డానందాశ్రుపూరము లూరుచుండ నావిచిత్రదృశ్యము గనుగొనెను వారిహాసరేఖ లైక్యమయ్యెను, వారిసంతోషబాష్పములు కలసెను.

ఇద్దరు నొక్కమాఱు దానిని నమ్మలేకుండిరి. ఇరువురు, లీలాసమాధికడ నిల్చి నమస్కరించిరి.

చెట్టుమీదనుండి పువ్వులవాన పడెను!

——

౫

మధురకథనము:—

గోపాలపురములో నుండగా నాకొకలేఖ వచ్చినది. రాత్రి పదునొకండు గంటలకు చెఱువుగట్టుకడ కేకాంతముగ రమ్మని యందు లిఖింపబడి యుండెను. నే నట్టిరాత్రి యాస్థలమున కేకాకినై వెడల లేకపోయితిని. మఱునాడుకూడ నాకట్టి లేఖయే వచ్చినది. ధైర్య ముతో నానాడట కేగితిని. కాని నాకెవ్వరు నట నగపడలేదు. నేను గృహమున కేతెంచునరికి నాగేంద్రుడు మేల్కొనియుండి నన్నన రాని మాటలాడెను. వానికి జవాబైన నే నిడమానితిని. మఱునా డదేసమయంబున మరల నచ్చటి కేగితిని. ఎవ్వరో దురాత్ములువచ్చి నన్ను బంధించి యెటనో పడవైచిరి. నాకు తెలివి వచ్చి నేను చూడగా నొక చీకటిగదిలో బంధింపబడియున్నట్లు గ్రహించితిని. ఆ చీకటికోణములో గడియ యొక యుగముగా గడపితిని.

ఒకనాటిరాత్రి నన్నొక స్థూలకాయుడు నాగేంద్రునికడకు తీసికొనిపోయెను. అప్పు డతడే నన్ను బంధించె నని యెఱుగగలిగితిని. అత డెన్నియో యసందర్భప్రలాపము లాడెను. నేను వానికి కఠిన ముగ జవాబిడితిని. అట్లయిన నాప్రాణములు దక్కవని యతడు భయపెట్టెను. సేవకుడు మరల నన్ను బంధించుటకు గదిలోనికి దీసి కొనిపోయెను. కాని ప్రమాదమున నాత డా చీకటిలో మఱియొక గదిలో నన్ను బంధించెను.

ఆగదిలోనే మఱియొక యువతి బంధింపబడియుండెను. ఆమె నన్నెఱిగినట్లు మాటలాడదొడగెను. తొలుదొల్త నేనామె కంఠ స్వరము గుర్తింపలేనైతిని. ఆమె తన్ను నా కెఱుగజేసెను. నే నప్రతి భురాలనైతిని. ఆమె సుమ యని యెఱిగి నేను సంతసించితిని.

సుమ సీగససముగా నుండెను. ఆమె తన వివాహము గూర్చి చెప్పెను. తన జన్మరహస్య మెఱిగించెను. ఆమె నాకు సోదరి యని తెలిసినంత నాకు పట్టరాని దుఃఖము వచ్చెను. ఆమె సరళహృదయము నప్పుడే నేను గ్రహింపగలిగితిని. ఆమె నాగేంద్రుని పూర్వవృత్త మంతయు నెఱిగించినంత నా యాశ్చర్య మసమానమైనది.

అప్పు డామె తన భర్త యగు నాగేంద్రుని రహస్యము నా హృదయంబులో దాచు మని చెప్పినది. ఆమె పతిభక్తి వర్ణనాతీతము. తన పతిచర్య లెంతగర్హ్యములైనను తా నతనికి దాసి ననియే యామె వచించినది. ఆతనియం దామెకు భక్తియు గౌరవము కలవు.

ఆమె కృశించియున్నది. దుఃఖభారముచే నట్లున్నదని నే నూహించితిని. కాని యామెకు దేహమున నేదియో రోగముద్భవించెను. అట్లయ్యు నామె నాకు ధైర్యము చెప్పినది. తానే నాకా లేఖల వ్రాసితినని యామె చెప్పినది. అందులకు కారణము నాతో రహస్యముల జెప్పుట కే. కాని తొలినాడే నాగేంద్రు డామెను బంధించెనట.

ఆమె ధైర్యవచనములే నన్ను కొంతవఱకు నెమ్మదిపఱచెను. అప్పు డామె తన దుస్తుల నా కిచ్చెను. నాదుస్తు లామెయు, నామె దుస్తులు నేనును ధరించితిమి. ఆమె నావలెనే యుండుటకు కారణ మెఱిగినదే!

ఆమె గదితాళము తలుపున కమర్పబడియున్నది. కావున బ్రాళము లోనుండి తీయవచ్చునని యామె చెప్పెను. వెంటనే యట్లాచరించితిమి. ఆమె నాగదిలోనికి వెడలెను. నేను పాఱివచ్చితిని.

నన్నామె, మఠాధికారిగృహమునకు పొమ్మనినది. సుమా న స్థానమునే యచ్చట మెలగు మనినది. నే నట్లే యొనర్చితిని. భ్రమ

రకు సేవకు డొకనిచే లేఖ నంపితిని. అందువలన నది మఱియొకరి చేత బడ దని నాయభిప్రాయము. దైవవశమున నట్లే జరిగెను.

నిన్నరాత్రి నాగేంద్రుడు భయంకరాగ్నికీలికాసంహాతులలో బడి మరణించినవార్త యీదినముననే మాకెఱుగవచ్చెను.

సుమ మరణించిన దని తెలిసి విచారించితిని.

* * * * *

భ్రమర కథనము —

మధురను నాగేంద్రుడే బంధించె నని, యీనాడు వానిని నేను వెన్నాడియుండుటచే గ్రహించితిని. కాని నేనేమియు నెఱుగని యట్లే వానియెదుట బ్రవర్తించితిని. ఒకనాటిరాత్రి మూడుగంటలు దాటియుండును, నాగేంద్రుడు నన్ను మేల్కొల్పెను. 'ఎందులకు' అని నేను ప్రశ్నించితిని. 'మధుర కనబడినది' యని యాతడు బదులిడెను. ఆమెబంధనములు విడె నని నేనానందించితిని. 'ఏదీ?' యని మరల బ్రశ్నించితిని. అతనివదనము విషాదరేఖాంకితమై యుండెను. కాని యాతడు మఱేమియు జెప్పుట మాని నన్ను గన్నుని సంజ్ఞ యొనర్చెను. అతడు నన్నుకూడ బంధించుట కీపన్నుగడ పన్నియుండడుకదా యని నే ననుమానించితిని. కాని మధురను చూడవలయు నని యాత్రముతో బోతిని. మేడదిగువగదిలోని కేగితిమి.

'భ్రమరా! మధుర .

'ఏమి' యని నేను భయముతో బ్రశ్నించితిని. 'మరణించి నది.' అని యతడు పూర్తి యొనర్చి నాశిరమున నిర్ఘాతమును విడిచెను. నాకు కాలుకదలలేదు. కాని ధైర్యము జేసి కన్నీ రద్దుకొని లోనికి పోతిని.

ఆగదిలోనున్న శరీరము సుమ దని నే ననుకొనలేదు. అచ్చముగ మధురవలెనే యామె కనబడెను. ఆమెవక్షము బాష్పధారలతో నార్ద్రమొనరించితిని. 'ఆమె జనని సమాధిప్రక్కనే తనసమాధి నిర్మింపు డని యామె కోరినది.' అత డట్లు చెప్పినంత నాదుఃఖము ద్విగుణీకృత మయ్యెను. 'పరుల కెఱుగరానియ్యరాదట.' నే నేమియు మాటలాడలేదు. అప్పుడే యా దేహ మిటకు గొనిదేబడినది. నేనురాత్ర మచ్చోటనే యుంటిని. ఉదయ మెన్మిది గంటలకే మధుర యగ్ని మందినది. అందామె జాగ్రత్తకొఱకై తననామము వ్రాయలేదు. నేను మఠాధికారిగృహమున కేగి మధురను చూచియు, సుమ యని యే భ్రమించితిని. ఏకాంతస్థలమున నామె యంతయు జెప్పెను.

*        *        *        *        *

సేవకుడు, రామ్ కథనము:—

మధుర మరణించె నని తెలుపుటకు నాగేంద్రుడు సురేంద్రుని కడ కొకనాడుదయమున నెనిమిదిగంటల కేతెంచెను. ఆవాక్యములు వినిసురేంద్రుడు మూర్ఛిల్లెను. ఒకగంటవఱకుపచారము లొనర్చితిమి గాని తెలివిరాలేదు. అట్లగుటకు కారణము, తొలినాడే మధురకు వివాహము కానున్నదని యత డీవార్త నంపెను. నాగేంద్రుడు తత్క్షణము వెడలెను. మధ్యాహ్నమునకు సురేంద్రుడు యథాస్థితికి వచ్చెను. సమాధి నాల్గుదినములలోనే కట్టుటకై ప్రయత్నములు జరిగినవి. మరి ఏవార్తయు రాలేదు. తర్వాత భ్రమరయు మధురయు వచ్చిరి. మధుర యని తొలుదొల్త మే మెఱుగమైతిమి.

——

# ఉపసంహారము

మధురావినయులకు, ప్రమదావిజయులకు, మహోన్నతముగా నుద్వాహము జరిగినది.

భ్రమర వివాహమాడుట మాని సోదరితోడను తండ్రితోడను సుఖకాలక్షేపము చేయదొడగెను.

సుగుణకుమారుని కన్నులపండువుగ గాంచుచుండెను.

వారందఱు నానందపురమునందే కలసియుండిరి.

*　　*　　*　　*　　*

ఐదుసంవత్సరములు గడచెను. వినయున కొకకుమారుడు నొకకొమరితయు గల్గిరి.

విజయునకు ముద్దుకొడుకు నేసులలో జెలువునింపుచుండెను. సాయాహ్నమున వారందఱు సముద్రతీరమున గూర్చుండి యుండిరి. అప్పు డచ్చటికి ఉన్మత్తు డగు ప్రేమచంద్రు డేతెంచెను.

ప్రేమచంద్రుడు వినయునికుమారుని చూచి 'నీ పేరేమి?' యనెను.

'నాపే రమరేంద్రుడు' అని యతడు వచించెను.

అతనితో నాడుచున్న ప్రమదకుమారుని చూచి యదేప్రశ్న నాత డడిగెను.

పసిబాలు డగు నాతడు వానిని నవ్వుచు జూచెను.

'సుగుణచంద్రుడు' అని విజయుడు పల్కెను.

వినయుడు తన కూతును ముద్దాడుచుండెను.

'ఆమె నీబిడ్డయా?'

'ఔను!'

'ఆమె పేరేమి?'

'సుమ!'

ప్రేమచంద్రుడు శరవేగమున నచ్చటనుండి పోయెను.

సంధ్యారోచిస్సులలో వారి మందహాసరుచు లైక్యమై పోయెను.

సంపూర్ణము